॥ ఓం శ్రీపరమాత్మనే నమః ॥

# అథ ఏకాదశోఽ ధ్యాయః - విశ్వరూపదర్శనయోగః
# (పదకొండవ అధ్యాయము - విశ్వరూపదర్శనయోగము)

భగవద్గీతలో యోగం అంటే విషయం లేదా అంశం. ఒక్కొక్క అధ్యాయంలో ఒక్కొక్క విషయాన్ని వివరించుకొస్తున్నాడు కృష్ణపరమాత్మ. ఈ అధ్యాయం పేరు విశ్వరూపదర్శనయోగం. అంటే విశ్వరూపం అనే అంశాన్ని వివరిస్తున్నాడు. విశ్వరూపం అంటే భగవంతునియొక్క రూపాన్ని విశ్వంగా దర్శించటం విశ్వరూప ఈశ్వరదర్శనం.

విశ్వరూపం అంటే ఏమిటి? రూపం అంటే ఆకారం; విశ్వం అంటే జగత్తు. అందువల్ల విశ్వరూపం అంటే జగత్తునే తన ఆకారంగా ధరించిన భగవంతుడు.

**విశ్వ ఏవ రూపమ్ ఆకారః యస్య విశ్వరూపః**

జగత్తునే ఆకారంగా ధరించిన భగవంతుణ్ణి దర్శనం చేసుకోవటం ఎలా?

**జగత్ రూపే స్థితస్య ఈశ్వరస్య దర్శనం కథం సంభవతి?**

మామూలుగా భక్తుడు భగవంతునియొక్క దర్శనం చేసుకోవాలంటే భగవంతుణ్ణి ఏదో ఒక రూపంలో కొలుస్తాడు. రాముడు, కృష్ణుడు, దేవి, లక్ష్మి, అలా ఏదో ఒక సాకారం ఎన్నుకుంటే ఆ దేవునియొక్క దర్శనం అవటానికి మన శాస్త్రం సాధనలను ఇస్తుంది. అలా భగవద్దర్శనం కలగటాన్ని **దైవసాక్షాత్కారం** అంటారు. అది రామదర్శనం కావచ్చు, కృష్ణదర్శనం కావచ్చు. మన పురాణాలు తపస్సు చేయమంటాయి. తపస్సు అంటే ఏకాగ్రతతో ధ్యానం చేయటం.

అందువల్ల భక్తుడు ముందు ఏ దేవుని దర్శనం కావాలనుకుంటున్నాడో నిర్ణయించుకోవాలి. ఆ దేవునియొక్క ధ్యానశ్లోకాలు పఠించి, ఆ రూపంమీద ధ్యానం చేయాలి.

**మేఘశ్యామం పీతకౌశేయవాసం శ్రీవత్సాంకం కౌస్తుభోద్భాసితాంగం**
**పుణ్యోపేతం పుండరీకాయతాక్షం విష్ణుం వందే సర్వలోకైకనాథమ్** – ధ్యానశ్లోకం 4

ఆ రూపాన్ని మనస్సులో దర్శించుకోవాలి భక్తుడు. అదికాక దానికి తగ్గ మంత్రం కూడా ఉంటుంది. ఆ మంత్రాన్ని పునశ్చరణం చేయాలి. పునశ్చరణం అంటే ఆ మంత్రాన్ని అక్షరలక్షలు లేదా అక్షరకోటి చేయాలి. అంటే మీరు చేసే నామంలో ఎన్ని అక్షరాలు ఉంటే, వాటిని లక్షతో హెచ్చవేసి అన్ని లక్షలు చేయాలి. అంటే ఎనిమిది అక్షరాలు ఉంటే ఎనిమిది లక్షలు, పన్నెందు అక్షరాలు ఉంటే పన్నెందు లక్షలు, ఇరవైనాలుగు అక్షరాలుంటే ఇరవైనాలుగు లక్షలు చేయాలి. ఇంకా ఫలితం ఎక్కువగా కావాలంటే అన్ని కోట్లసార్లు చేయాలి. అంటే ఎనిమిది

కోట్లసార్లు, పన్నెండుకోట్లసార్లు, ఇరవైనాలుగు కోట్లసార్లు జపం చేయాలి. అప్పుడు భగవత్సాక్షాత్కారం అవుతుంది. మనస్సులో కాదు, భగవంతుడు సాక్షాత్తూ దర్శనం ఇస్తాడు. అలా దేవతా సాక్షాత్కారం పొందిన కథలెన్నో చదివాము పురాణాలలో.

ఇప్పుడు సమస్య ఏమిటంటే, భగవంతుని దర్శనం జగత్తు రూపంలో అవ్వాలంటే ఏం చేయాలి? రాముడు రాముని రూపంలో దర్శనం ఇచ్చినట్టుగా, విశ్వరూప ఈశ్వరదర్శనంలో భగవంతుడు జగత్తురూపంలో ప్రత్యక్షమవుతాడా? భగవంతుడు జగత్తురూపంలో ప్రత్యక్షం అవాలి అని అంటేనే భగవంతుణ్ణి సరిగ్గా అర్థం చేసుకోలేదని అర్థం. భగవంతుణ్ణి జగత్తురూపంలో రమ్మని ప్రార్థించలేము. ఎందుకు? ఆయన జగత్తురూపంలో వచ్చి ఉన్నాడు. ఎప్పుడు? మనం పుట్టకముందే.

**తస్మాద్వా ఏతస్మాదాత్మనః ఆకాశస్సంభూతః**
**ఆకాశాద్వాయుః వాయోరగ్నిః అగ్నేరాపః అద్భ్యః పృథివీ** – తైత్తిరీయం

అందువల్ల జగత్తురూపంలో భగవంతుడు ముందే వెలిశాడు. అయితే విశ్వరూప ఈశ్వరదర్శనం ఎలా అవుతుంది?

ఇక్కడ ఒక విషయం అర్థం చేసుకోవాలి. ఏ అనుభవం తీసుకున్నా కూడా, దానికి రెండు అంశాలు ఉంటాయి. ఒకటి నేను అనుభవించాలనుకున్న వస్తువు నా ఎదురుగా ఉండాలి. వస్తువు ఉండగానే సరిపోదు, దాన్ని అనుభవించే నేను కూడా సిద్ధంగా ఉండాలి. అంటే ముందు నా మనస్సును నేను సంసిద్ధం చేసుకోవాలి. ఉదాహరణకు కర్ణాటక సంగీతాన్ని ఎంతో రమణీయంగా పాడే సంగీత విద్వాంసుడు ఉన్నాడు. ఆయన పాట కచేరీ ఏర్పాటు చేశారు ఎవరో. ఆయన ఎన్నో కష్టమైన రాగాల్లో, ఎన్నో సంగతులు వేసిపాడాడు. కాని నాకు సంగీతం అంటే ఏమిటో తెలియదు; రాగం అంటే ఏమిటో, శ్రుతి అంటే ఏమిటో తెలియదు. అప్పుడు ఆయన ఎంత బాగా పాడినా, దాన్ని నేను పూర్తిగా ఆస్వాదించలేను. అంటే అక్కడ ఆబ్జెక్టు ఉంది, కాని సబ్జెక్టు అయిన నేను అందుకోవటానికి సిద్ధంగా లేను.

మనం ఎంతసేపూ ఆబ్జెక్టు గురించే మాట్లాడతాము కాని సబ్జెక్టు గురించి పట్టించుకోము. ఈ సూత్రం మామూలు, లౌకిక అనుభవాలకే కాదు ఈశ్వరదర్శనానికి కూడా వర్తిస్తుంది. రాముడు శబరికి, తక్కిన భక్తులకు దర్శనం ఇచ్చినప్పుడు వారెంతో పొంగిపోయారు, మైమరచిపోయారు. త్యాగరాజులవారు శబరిభాగ్యాన్ని కీర్తిస్తూ కీర్తన కూడా పాడారు.

కాని ముందే చెప్పినట్టుగా ఇక్కడ ఒక విషయాన్ని గమనించాలి. రాముని దర్శనం చూసి వారు మైమరచి పోయారు అంటే వారి పాత్ర కూడా ఉంది అందులో. వారు రాముని దర్శనంకోసం కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూశారు.

అలా ఎలా చెప్పగలరు? దానికి రావణుడే ఉదాహరణ. రాముడు, రావణాసురునికి కూడా దర్శనం ఇచ్చాడు. అతను మైమరచిపోయాడా? యుద్ధం మర్చిపోయాడా? ఏమీ లేదు. రావణాసురునికి మనస్సు

ప్రక్షాళన కాలేదు; మనస్సు సిద్ధంగా లేదు. అందువల్ల రాముడు, 'ఇవాళ పోయి, రేపు రా,' అని అతనికి ఆలోచించుకోవటానికి సమయాన్ని ఇచ్చినా కూడా అతను దాన్ని వినియోగించుకోలేదు. పరస్త్రీని అపహరించి తీసుకురావటం పెద్దనేరం అని అతను అప్పుడు కూడా బాధపడలేదు.

'ఇవాళ పోయి, రేపు రా,' అంటే ఆ రేపు వచ్చి యుద్ధం చేశాడు. అంటే ఏమిటి? రామదర్శనం అయినా అతనిలో మార్పు రాలేదంటే, అతని మనస్సుయొక్క సంసిద్ధత కూడా అవసరం. అలా అతను సంసిద్ధుడు కాకపోతే, భగవంతుడు కూడా ఏమీ చేయలేడు. రావణుణ్ణి సంహరించక తప్పలేదు.

కంసుని విషయం తీసుకున్నా అంతే. కంసునికి కృష్ణదర్శనం అయింది, కాని అతను తన అధర్మాన్ని వదులుకోలేదు. అనేకమంది రాక్షసులు తపస్సు చేసి దేవతా సాక్షాత్కారం పొందారు. రాక్షసులకు ఈశ్వరదర్శనం అయిన కథలు ఎన్నో ఉన్నాయి. ఈశ్వరదర్శనం అయితే వారు మారారా? లేదు. మారకపోగా, ఈశ్వరుణ్ణి కోరరాని కోరికలు కోరారు. ప్రపంచాన్ని నాశనం చేయాలని కోరారు. భస్మాసురుడు ఏమని కోరాడు? ఎవరి నెత్తిన చేయి పెడితే వారు భస్మమయిపోవాలి అన్నాడు. పైగా అది పని చేస్తోందో లేదో, చూడటానికి ఈశ్వరునిమీదే ప్రయోగించటానికి కూడా వెనుకాడలేదు. అంటే ఈశ్వరదర్శనాన్ని ప్రతికూల విషయానికి వాడుకున్నారు కొందరు.

ఈ విషయాలనుంచి ఒక అంశాన్ని గ్రహించాలి. ఈశ్వరదర్శనం ఈశ్వరదర్శనంగా ఉండాలంటే, నేను నా మనస్సును ఎంతో సిద్ధం చేసుకోవాలి. నేను సిద్ధంగా లేకపోతే ఈశ్వరుడు వచ్చి నా కళ్ళముందు నిలుచున్నా, నేను గ్రహించలేను. అందువల్లనే జగత్తురూపంలో భగవంతుడు నాకన్నా ముందే వచ్చి ఉన్నా, నాకు తెలియటం లేదు.

అలా అయితే, జగత్తురూపంలో ఉన్న భగవంతుని దర్శనం పొందటానికి నేనేం చేయాలి? దీనికి ఒక్కటే జవాబు ఉంది; దాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. విశ్వరూప ఈశ్వరదర్శనం కావాలంటే, ఒక్కటే మార్గముంది. అది జగత్తును భగవంతునియొక్క ప్రకటితరూపంగా అర్థం చేసుకోవాలి.

**జగత్తును సరిగ్గా అర్థం చేసుకుంటే జగత్తే ఈశ్వరుడు లేదా బ్రహ్మ**

జగత్తును ఈశ్వరునిగా చూడాలి. అందువల్లనే విష్ణుసహస్రనామం విష్ణువుతో మొదలవదు, విశ్వంతో మొదలవుతుంది.

**విశ్వం విష్ణుర్వషట్కారో భూతభవ్యభవత్ప్రభుః**

అంటుంది. అందువల్ల ఉన్న మార్గం ఒకటే – నా మనస్సుకు నేను శిక్షణను ఇచ్చుకోవాలి. జగత్తు భగవంతునియొక్క వ్యక్తరూపం అని గ్రహించాలి.

ఇటువంటి శిక్షణను ఎలా ఇవ్వాలి? దానికి కూడా ఒక్కటే మార్గముంది. ఏమిటది? బోధను స్పష్టంగా అర్థం చేసుకుని దానిని జీర్ణించుకోవాలి. ఏమిటా బోధ? భగవంతుడే జగత్తురూపంగా వ్యక్తమవుతున్నాడు అనే బోధ. భగవంతుడు తానే జగత్తు అయ్యాడు.

**బహుస్యాం ప్రజాయేయేతి**

సాంకేతిక పరిభాషలో చెప్పాలంటే, భగవంతుడే జగత్తుయొక్క ఉపాదానకారణం. ఉపాదానకారణం కార్యం అంతటా ఉంటుంది. ఒక్క బంగారమే అనేక ఆభరణాలుగా భాసిల్లుతోంది; అలాగే ఒక్క ఈశ్వరుడే అనేక నామరూపాలున్న జగత్తుగా భాసిల్లుతున్నాడు.

ఈ బోధను సరిగ్గా అర్థం చేసుకోవటమే కాదు, జీర్ణించుకోవాలి కూడా. అలా జీర్ణించుకోగలిగితేనే, నా దృక్పథం మారుతుంది. ఇలా మారిన దృక్పథాన్ని దివ్యచక్షువు లేదా జ్ఞానచక్షువు అంటారు. అంటే జ్ఞానం పొందిన కన్ను. దాన్నే జ్ఞాననేత్రం తెరుచుకుంది అంటారు. ఈ అధ్యాయంలో మనం దేవుని లీలల గురించో, నిగూఢ విషయాల గురించో మాట్లాడటం లేదు. ఇది కేవలం కృష్ణపరమాత్మ ఏడవ అధ్యాయంలో మొదలు పెట్టిన బోధను అర్థం చేసుకున్నాక ఏర్పరచుకున్న కొత్త దృక్పథం అంతే.

7, 9, 10 అధ్యాయాలలో కృష్ణపరమాత్మ విశ్వరూపదర్శనం చేయించాడు. ఎవరైనా మీకొక లడ్డు ఇచ్చారనుకోండి, దాన్ని వెంటనే నోట్లో వేసుకుంటారు. అదే, ఒకవేళ ఆ ఇచ్చినవారు, ఇది మామూలు లడ్డు కాదు, తిరుపతి వేంకటేశ్వరస్వామి ప్రసాదం అంటే ఏం చేస్తారు? వెంటనే దాన్ని భక్తిగా కళ్ళకు అద్దుకుంటారు తినేముందు. అంటే ఇక్కడేమయింది? వస్తువు ఒకటే. బాహ్యంగా ఆ వస్తువులో ఏమీ మార్పులేదు. కాని మీరు చూసే దృక్పథంలో మార్పు వచ్చింది. ఆ మార్పు మీ జ్ఞాననేత్రం తెచ్చింది. ఎప్పుడైతే మీ జ్ఞాననేత్రం మీకీ భావన తెచ్చిందో, మీరు ఈ లడ్డూని మామూలు లడ్డూగా కాకుండా, ప్రసాదంగా స్వీకరిస్తారు. ప్రసాదం అనేసరికి సరాసరి నోటిలోకి వెళ్ళిపోదు, ముందు కళ్ళ దగ్గరికి వెళుతుంది.

ఈ మార్పు ఎలా వచ్చింది? రసాయనికంగా వచ్చిందా? ఏదైనా ల్యాబ్‌లో మామూలు లడ్డూని, ప్రసాదం లడ్డూని పరీక్షలు చేయిస్తే, ఈ రెండింటిలోనూ వస్తుపరంగా ఏమీ భేదం ఉండదు. ఆ మార్పు అదృష్టం అంటే కంటికి కనపడదు. అది మీ భావనలో వచ్చిన మార్పు. ఆ భావన లడ్డూకొక దివ్యత్వాన్ని ఆపాదించింది. ఈ మార్పు మీరు వస్తువును అర్థం చేసుకోవటంవల్ల వస్తుంది.

నాస్తికుడు ప్రపంచాన్ని చూస్తే అతనికి ప్రపంచం ఒక న్యూట్రాన్లు, ప్రోటాన్లులాంటివి ఉన్న ఒక మామూలు ప్రపంచం అంతే. కాని అదే ప్రపంచాన్ని కృష్ణపరమాత్మ బోధను అర్థం చేసుకుని చూస్తే, అది కేవలం అనేక వస్తువుల సముదాయం కాదు, అది ఒక అద్భుతమైన సృష్టి. ప్రతి చిన్నదానిలోనూ భగవంతుని సృజనాత్మకత వెల్లివిరుస్తుంది.

అందువల్ల కృష్ణపరమాత్మ ఈ పదకొండవ అధ్యాయంలో చెప్పదలుచుకున్న అంశం ఏమిటంటే – ఈ బోధను గనుక మీరు అర్థం చేసుకుంటే, మీ దృక్పథంలో మార్పు వస్తుంది. ఎటువంటి మార్పు? ఈ ప్రపంచానికి కొత్తగా ఒక అంశం కలుస్తుంది, అది భౌతికంగా కనబడే మార్పు కాదు; దానికొక దైవత్వం ఆపాదించబడుతుంది. జగత్తును సరిగ్గా అర్థం చేసుకుంటే అది బ్రహ్మ అని చాలాసార్లు చూశాము.

ఎప్పుడైతే జగత్తు బ్రహ్మ అనుకుంటామో, అప్పుడే భగవద్దర్శనం ఎప్పుడూ అవుతున్న పవిత్రభావన కలుగుతుంది. భగవద్దర్శనంకోసం మనం ప్రత్యేకించి తపస్సు చేయనవసరం లేదు. పురాణాల్లో అనేక కథల్లో చదువుతాము.

శివభక్తుడు శివుని సాక్షాత్కారంకోసం ఘోరతపస్సు చేస్తాడు. అప్పుడు శివుడు ప్రత్యక్షమయి, 'భక్తా! నీ భక్తికి మెచ్చితిని. నీకు ఏ వరం కావాలో కోరుకొనుము,' అంటాడు. అప్పుడు ఆ భక్తుడు తనకు మరణం లేకుండా చేయమంటాడు. దానికి పరమాత్మ అది తప్ప ఏదైనా కోరుకో అంటే వీరివల్ల మరణం రాకూడదు, వారివల్ల మరణం రాకూడదు అంటా ఏవేవో కోరతాడు. భగవంతుడు, 'తథాస్తు,' అని చెప్పేసి అంతర్ధానమవుతాడు. అంటే భగవంతుడు ప్రత్యక్షమవుతాడు, అంతర్ధానమవుతాడు. ఒక విషయం గుర్తుంచుకోండి. ఇలా ప్రత్యక్షమయి, అంతర్థానం అవటాన్ని విమర్శించటం లేదు. కాని నిత్యమూ భగవద్దర్శనం అవటం గొప్ప విషయంకాదా?

**రసోఽహమప్సు కౌంతేయ ప్రభాస్మి శశిసూర్యయోః** – 7.8

నీటిలో రసాన్ని, సూర్యచంద్రులలో కాంతిని నేనే అన్నాడు కృష్ణపరమాత్మ. అంటే నీరు తాగితే దైవదర్శనం అవుతుంది. సూర్యకాంతిని చూసినా, చంద్రుని వెన్నెలను అనుభవించినా భగవద్దర్శనం అవుతుంది. ఏం చేసినా, ఎక్కడికి వెళ్ళినా నిత్యం ఈశ్వర సంబంధం ఏర్పడుతుంది. అంటే ఏమిటి? నిత్య ఈశ్వర సంబంధంకోసం లేదా ప్రత్యక్ష ఈశ్వర సంబంధంకోసం సంవత్సరాల తరబడి తపస్సు చేయనవసరం లేదు. ఈశ్వరుణ్ణి అర్థం చేసుకుంటే చాలు. మీ దృక్పథంలో చిన్న మార్పు తెచ్చుకుంటే గొప్ప అనుభవం పొందుతారు.

విశ్వరూపదర్శనం అంటే రాముడు, కృష్ణుడులాగా ఇది కూడా భగవంతునియొక్క ఇంకొక రూపం అని పొరపాటు పడకండి. రెండు నిముషాల పాటు ప్రత్యక్షమయి, మాయమయిపోయే దర్శనం కాదిది. ఇరవైనాలుగు గంటలూ మీ కళ్ళముందు, ప్రతి చెట్టులో, నీటిలో, పక్షిలో అన్నింటిలోనూ ఉన్నాడు. భగవంతుణ్ణి అన్నింటిలో చూడండి. ఈ అధ్యాయంయొక్క సారాంశం ఇదీ. ఈ నేపథ్యంతో మనం పదకొండవ అధ్యాయంలోకి అడుగు పెడదాము.

**అర్జున ఉవాచ**

శ్లో. 1 **మదనుగ్రహాయ పరమం గుహ్యమధ్యాత్మసంజ్ఞితమ్ ।**
**యత్త్వయోక్తం వచస్తేన మోహోఽయం విగతో మమ ॥**
మదనుగ్రహాయ, పరమమ్, గుహ్యమ్, అధ్యాత్మసంజ్ఞితమ్,
యత్, త్వయా, ఉక్తమ్, వచః, తేన, మోహః, అయమ్, విగతః, మమ ॥

| | | | |
|---|---|---|---|
| మదనుగ్రహాయ | = నన్ను అనుగ్రహించడంకోసం | ఉక్తమ్ | = చెప్పబడినవో |
| పరమమ్ | = మిక్కిలి శ్రేష్ఠమైనవియు | తేన | = ఆ వచనములవల్ల |
| గుహ్యమ్ | = గోప్యమైనవియు | మమ | = నా |
| అధ్యాత్మ సంజ్ఞితమ్ | = అధ్యాత్మ విషయమైనవియు | అయమ్ | = ఈ |
| యత్, వచః | = ఏ వచనములు | మోహః | = మోహము |
| త్వయా | = నీచేత | విగతః | = తొలగినది |

**అర్జున ఉవాచ**
**త్వయా మత్ అనుగ్రహాయ అధ్యాత్మ-సంజ్ఞితమ్ యత్ పరమమ్**
**గుహ్యమ్ వచః ఉక్తమ్, తేన మమ అయమ్ మోహః విగతః ।**

తా: నన్ను అనుగ్రహించటంకోసం మిక్కిలి శ్రేష్ఠమైనవియు, గోప్యమైనవియు, అధ్యాత్మ విషయమైనవియు ఏ వచనములు నీచేత చెప్పబడినవో ఆ వచనములవల్ల నా ఈ మోహము తొలగినది.

## 1. ఉపోద్ఘాతం: శ్లోకాలు 1-8

మొదటి ఎనిమిది శ్లోకాల్లో విశ్వరూపదర్శనం అనే ఈ విషయానికి ఉపోద్ఘాతాన్ని చూస్తాము. అర్జునుడు తను ఇంతవరకూ ఏం నేర్చుకున్నాడో చెప్పటంతో మొదలవుతుంది ఈ అధ్యాయం. అంటే మొదటి రెండు శ్లోకాల్లో పది అధ్యాయాల సారమూ చెబుతాడు. మొదటి శ్లోకంలో మొదటి ఆరు అధ్యాయాలను, ఇంకా సరిగ్గా చెప్పాలంటే రెండవ అధ్యాయంనుంచి ఆరవ అధ్యాయం వరకూ తను నేర్చుకున్నదాని సారాంశం చెబుతాడు. మొదటి అధ్యాయంలో బోధ అవలేదు అని మనకూ తెలుసు.

ఈ ఐదు అధ్యాయాల సారం ఏమిటి? జీవస్వరూపవర్ణన. జీవుడు శరీరం కాదు.

**వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోఽపరాణి** - 2.22

ఈ స్థూలశరీరం, పుట్టుక సమయంలో మనం ధరించిన తాత్కాలిక వస్త్రంలాంటిది, దాన్ని మరణించినప్పుడు వదులుకోవాలి. అంటే శరీరం నేను కాదు.

అలాగే మనస్సు కూడా తాత్కాలికంగానే పనిచేస్తుంది. జాగ్రదావస్థలోనూ, స్వప్నావస్థలోనూ వాడతాను కాని సుషుప్తిలో దాన్ని వాడను. అందువల్ల నేను శరీరం కాదు, మనస్సు కాదు. నేను సాక్షిచైతన్యాన్ని. ఈ సందర్భంలో చైతన్యం గురించి మనం చూసిన ఐదు సూత్రాలు గుర్తు తెచ్చుకోవాలి. రెండవ అధ్యాయంలో 12-25 వరకూ ఆత్మ గురించి అద్భుతవర్ణనను చేశాడు కృష్ణపరమాత్మ. మళ్ళీ మూడవ అధ్యాయంలో కూడా చెప్పాడు.

**ఇంద్రియాణి పరాణ్యాహుః ఇంద్రియేభ్యః పరం మనః ।**
**మనసస్తు పరా బుద్ధిః యో బుద్ధేః పరతస్తు సః ॥** - 3.42

ఇదే విషయాన్ని 4, 5 అధ్యాయాల్లో కూడా చెప్పాడు.

ఇదంతా నాకు చాలా బాగా అర్థమయింది అన్నాడు అర్జునుడు. దానికి అతను కృతజ్ఞత చూపిస్తున్నాడు కూడా.

**మదనుగ్రహాయ త్వయా వచః ఉక్తమ్** - వచః అంటే జ్ఞానవచనాలు. నువ్వు నాకు జ్ఞానబోధ చేశావు. కేవలం నన్ను అనుగ్రహించటంకోసం చేశావు. నేను నా దుఃఖాన్ని అధిగమించటానికి చేశావు అంటున్నాడు అర్జునుడు.

మొదటి అధ్యాయం పేరు అర్జున విషాదయోగం. అక్కడ యోగం అంటే ఆధ్యాత్మికసాధన కాదు, దుఃఖం ఆధ్యాత్మిక సాధన అవదు. అందువల్ల అర్జున విషాదయోగం అంటే అర్జునుని విషాదం గురించిన ఒక విశ్లేషణ. ఆ విషాదన్నుంచి నేను బయటపడేలా నువ్వు బాగా బోధించావు.

**పరమం వచః** – అది కూడా ఎలాంటి బోధ? ఎంతో శ్రేష్ఠమైనది. ఆత్మ గురించి వచ్చింది కాబట్టి ఆ బోధ శ్రేష్ఠమైనది.

**గుహ్యమ్** – అంతేకాదు, అది రహస్యమైనది కూడా. ఆ విద్య ప్రపంచంలో అంత తేలికగా అందరికీ అందుబాటులో లేదు. అలాంటి బోధను జ్ఞానులు మాత్రమే చేయగలరు; ఈ ప్రపంచంలో అలాంటి జ్ఞానులు చాలా అరుదుగా ఉన్నారు. కృష్ణపరమాత్మే చెప్పాడు ఆ మాట.

> **మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే ।**
> **యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః ॥** – 7.3

జ్ఞానమార్గానికి రావటానికే చాలా తక్కువ మంది ఇష్టపడతారు; దీనికి వచ్చిన ఆ తక్కువమందిలో కూడా ఇంకా తక్కువమంది జ్ఞానం పొందుతారు. జ్ఞానులు తక్కువ, వారు చేసే బోధ తక్కువ కాబట్టి, ఈ విద్య రహస్యం అయింది.

**అధ్యాత్మసంజ్ఞితమ్** – ఆధ్యాత్మవిషయాల గురించి నువ్వు బోధ చేశావు అంటున్నాడు అర్జునుడు. ఆధ్యాత్మవిషయం అంటే ఆత్మ గురించిన విషయం. అంటే ఇది లౌకికవిద్య కాదు, ఆధ్యాత్మిక విద్య. ఈ బోధవల్ల కలిగిన ఫలం ఏమిటి?

**మమ అయం మోహః విగతః** – నా మోహం తొలగిపోయింది అంటున్నాడు అర్జునుడు. ఏ సందర్భంలో గీతాబోధ మొదలయిందో మర్చిపోకూడదు.

> **కార్పణ్యదోషోఽపహతస్వభావః పృచ్ఛామి త్వాం ధర్మసమ్మూఢచేతాః ।**
> **యచ్ఛ్రేయః స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్ ॥** – 2.7

అతని మనసు డోలాయమానంగా ఉంది. ఒకవైపు గురుహత్య మహాపాపం అంటోంది మనస్సు, ఇంకొక వైపు ధర్మరక్షణకోసం యుద్ధం చేయాలి అంటోంది. ఏం చేయాలో తోచని పరిస్థితిలో నాకు శ్రేయస్కరమైనదేమిటో నువ్వే చెప్పు అని శరణు వేడాడు. కృష్ణపరమాత్మ బోధ చేశాడు. దానితో నా మోహం తొలగిపోయింది అన్నాడు.

మోహం రెండు రకాలు – ధర్మాధర్మ మోహం, ఆత్మానాత్మ మోహం. అంటే ఏది ధర్మమో, ఏది అధర్మమో తెలుసుకోలేని మోహం; అలాగే ఏది ఆత్మో ఏది అనాత్మో తెలుసుకోలేని మోహం. భగవద్గీత ప్రత్యేకత ఏమిటంటే, అది ఈ రెండు మోహాలనూ తొలగిస్తుంది. మనిషి నేర్చుకోవాల్సిన అంశాలు రెండే. అవి – ధర్మం, బ్రహ్మ. వేదపూర్వభాగం ధర్మం గురించి బోధిస్తే, వేద అంతభాగం బ్రహ్మ గురించి బోధిస్తుంది. ఒక్క భగవద్గీతే ధర్మం,

బ్రహ్మ – రెండింటి గురించీ బోధిస్తుంది. అర్జునుడు నాకు ధర్మాధర్మల విషయంలో ఉన్న అయోమయాన్నీ, ఆత్మానాత్మల విషయంలో ఉన్న అయోమయాన్నీ తొలగించావు. నాకు మోహం తగ్గింది అంటున్నాడు.

మొదటి ఆరు అధ్యాయాల సారాంశం చెప్పాక, రెండవ శ్లోకంలో తక్కిన అధ్యాయాల సారాంశం చెప్పబోతున్నాడు అర్జునుడు.

శ్లో. 2 **భవాప్యయౌ హి భూతానాం శ్రుతౌ విస్తరశో మయా ।**
**త్వత్తః కమలపత్రాక్ష మాహాత్మ్యమపి చావ్యయమ్ ॥**
భవాప్యయౌ, హి, భూతానామ్, శ్రుతౌ, విస్తరశః, మయా,
త్వత్తః, కమలపత్రాక్ష, మాహాత్మ్యమ్, అపి, చ, అవ్యయమ్ ॥

| | | | |
|---|---|---|---|
| హి | = ఎందుకంటే | మయా | = నాచేత |
| కమలపత్రాక్ష! | = కమల పత్రములవంటి నేత్రములుగల ఓ కృష్ణా! | శ్రుతౌ | = వినబడినవి |
| | | చ | = ఇంకా నీ |
| త్వత్తః | = నీవల్ల | అవ్యయమ్ | = శాశ్వతమైన |
| భూతానామ్ | = ప్రాణులయొక్క | మాహాత్మ్యమ్ | = మాహాత్మ్యము |
| భవాప్యయౌ | = ఉత్పత్తి ప్రళయములు | అపి (శ్రుతమ్) | = గూడ (నాచే వినబడినది) |
| విస్తరశః | = వివరముగా | | |

**హే కమల-పత్ర-అక్ష! భూతానామ్ భవ అపి అయౌ మయా త్వత్తః**
**విస్తరశః శ్రుతౌ హి, అవ్యయమ్ మాహాత్మ్యమ్ అపి చ (శ్రుతం) ।**

తా: ఎందుకంటే, కమలపత్రములవంటి నేత్రములుగల ఓ కృష్ణా! నీవల్ల ప్రాణులయొక్క ఉత్పత్తి ప్రళయములు వివరముగా నాచేత వినబడినవి ఇంకా నీ శాశ్వతమైన మాహాత్మ్యము గూడ నాచే వినబడినది.

అంతకంతకూ కృష్ణపరమాత్మమీద ఆరాధనాభావన పెరుగుతూ వస్తున్నది అర్జునునికి. కృష్ణునితో అంతకు ముందు చాలా చనువుగా, సన్నిహితంగా తిరిగాడు. కాని ఇలా గురువుగా ఎన్నడూ చూడలేదు. ఇప్పుడు జగద్గురువుగా గుర్తించాడు కృష్ణపరమాత్మను. అందువల్ల తన సఖుడైన కృష్ణపరమాత్మను ప్రత్యేకంగా సంబోధిస్తున్నాడు.

**కమలపత్రాక్ష** – అక్ష అంటే కనులు; కమలపత్రాలవంటి కన్నులు కలవాడా అంటున్నాడు. కృష్ణపరమాత్మ బాహ్యసౌందర్యాన్ని వర్ణించటంద్వారా ఆయన ఆంతరసౌందర్యాన్ని గుర్తిస్తున్నాడు. కమలపత్రాలు అంటే కలువ పూరేకులు. అంతేకాని కలువ ఆకులు కాదు. కలువ ఆకులు చాలా పెద్దవిగా ఉంటాయి. అంత పెద్ద కన్నులు ఉంటే పారిపోతారు. కలువ పూరేకులు చాలా అందంగా ఉంటాయి. అందువల్ల కమలపత్రాక్ష అన్నాడు. ధ్యానశ్లోకాల్లో కూడా ఈ విషయాన్ని చూశాము.

**పుల్లారవిందాయతపత్రనేత్ర**

మొదటి షట్కంలో జీవస్వరూపం గురించి చెపితే, రెండవ షట్కంలో ఈశ్వరస్వరూపం గురించి చెబుతున్నాడు కృష్ణపరమాత్మ. ఈశ్వరస్వరూపాన్ని తటస్థకారణంగా అభివర్ణించాడు; అందులోనూ ఉపాదానకారణంగా వర్ణించాడు. తటస్థకారణం అంటే ఈశ్వరుడు జగత్కారణం అవుతాడు; ఉపాదానకారణం అంటే జగత్తుయొక్క సృష్టి, స్థితి, లయకారకుడు కూడా అవుతాడు. ఎలాగైతే సముద్రంలోని అలలు సముద్రంలోంచే పుట్టి, సముద్రంవల్లనే స్థితి పొంది, సముద్రంలోనే లయమవుతాయో, అదేవిధంగా ఈ జగత్తు ఈశ్వరుణ్ణుంచే పుట్టి, ఈశ్వరునివల్లనే స్థితి పొంది, ఈశ్వరునిలోనే లయమవుతుంది.

**భూతానాం త్వత్తః భవాప్యయౌ** – భవ అంటే ఉత్పత్తి, అంటే సృష్టి; అప్యయః అంటే లయం. భవాప్యయౌ అంటే సృష్టి, లయలు స్థితిని గురించి తరువాత శ్లోకంలో వస్తుంది. ఇక్కడ మనం వాటితో పాటు స్థితిని కూడా కలుపుకోవచ్చు. అందువల్ల నువ్వు సృష్టి, స్థితి, లయ కారణం అంటున్నాడు. దేనికి?

భూతానాం – చరాచరాత్మక జగత్తుకు;

త్వత్తః – జగత్తు నీనుంచే వచ్చింది. నువ్వే ఈ జగత్తుకు ఆధారం, ఆశ్రయం.

అలలు సముద్రంనుంచి పుట్టి, సముద్రంలోనే లయమవుతున్నాయి అంటే, దాని అర్థమేమిటి? అల అనే పేరు సముద్రానికి ఇచ్చిన మరో పేరు మాత్రమే. అలాగే ఈ సృష్టి మొత్తం భగవంతుడనే సముద్రంలో ఒక చిన్న అలలాంటిది. ఈ భావనను అద్భుతంగా వర్ణించారు శంకరులవారు ఆత్మబోధలో.

**ఉపాదానేఽఖిలాధారే జగన్తి పరమేశ్వరే**

**సర్గస్థితిలయాన్ యాంతి బుద్బుదానీవ వారిణి** – 8

ఎన్నో లక్షల నక్షత్రమండలాలు ఒక చిన్న బుడగలాంటివి. ఇన్ని బుడగలలాంటి నక్షత్ర మండలాలు దేన్నుంచి పుడుతున్నాయి? బుడగలు సముద్రానికి భిన్నంగా ఎలా లేవో, అలా భగవంతునికి భిన్నంగా జగత్తు లేదు. ఇంకో మాటలో చెప్పాలంటే భగవంతుడు జగత్తురూపంలో ఉన్నాడు.

**మయా శ్రుతౌ** – నేను చాలా స్పష్టంగా నేర్చుకున్నాను.

**విస్తరశః** – నువ్వు చాలా వివరంగా బోధ చేశావు.

ఉపనిషత్తులో సృష్టి గురించి అంత వివరంగా రాదు. కాని కృష్ణపరమాత్మ చాలా వివరంగా చెప్పాడు. అది అర్జునుడు కూడా గ్రహించాడు.

**మాహాత్మ్యమపి చావ్యయమ్** – అంతేకాదు, నీ మహిమలను కూడా వివరించావు అంటున్నాడు అర్జునుడు. పరమాత్మ పదవ అధ్యాయంలో జగత్తు అంతటా వ్యాపించిన తన మహిమలను గురించి విస్తారంగా చెప్పాడు.

పరమాత్ముని లీలలు కృష్ణుని రూపంలో చూడాలంటే భాగవతానికి వెళ్ళాలి. అందులో అతను రాక్షసులను ఎలా సంహరించాడో, గోవర్ధనగిరిని ఎలా ఎత్తాడో, కాళీయమర్దనం ఎలా చేశాడో చాలా వివరంగా వస్తుంది.

అలాగే భగవంతుణ్ణి రామావతారంలో కీర్తించాలంటే రామాయణం వినాలి. కాని విశ్వరూపదర్శనం చేయాలంటే ఏ గ్రంథం చదవాలి? ఏ గ్రంథమూ చదవనవసరం లేదు. కళ్ళు తెరిచి చుట్టూ చూస్తే చాలు, ఎటు చూసినా ఈశ్వరవిభూతి తెలుస్తుంది.

అందువల్ల ఈశ్వరవిభూతి అవ్యయం అంటున్నాడు. అవ్యయం అంటే అంతులేనిది. విశ్వరూపమహిమ అవ్యయం. ఆ విధంగా ఇంతవరకూ జీవస్వరూపం, ఈశ్వరస్వరూపం, ఈశ్వరమహిమల గురించి విస్తారంగా విన్నాడు. అతనికి బాగా అర్థమయింది కూడా. ఎలా తెలుసు? నా మోహం పోయింది అంటున్నాడు. కాని పూర్తిగా పోలేదు. పూర్తిగా పోయివుంటే భగవద్గీత అయిపోయి ఉండేది. ఓం తత్సత్ వచ్చి ఉండేది. కాని ఇంకా కొన్ని అధ్యాయాలు, దాని తర్వాత కూడా వచ్చాయి అంటే, చాలామటుకు మోహం పోయింది కాని ఇంకా కొంత మిగిలేవుంది. 18వ అధ్యాయంలో పూర్తిగా పోతుంది. అక్కడ అంటాడు –

**నష్టో మోహః స్మృతిర్లబ్ధా** – 18.73

విశ్వరూప ఈశ్వరుడు మన కళ్ళముందే ఉన్నాడు; అయినా మనకు తెలియటం లేదంటే, సమస్య విశ్వరూప ఈశ్వరునిలో లేదు. ఆయన మనం పుట్టకముందే వచ్చి సిద్ధంగా ఉన్నాడు. మనమే ఆయనను అందుకోవటానికి సిద్ధంగా లేము. ఎందుకు? మనలోని కామక్రోధలోభమోహమదమాత్సర్యాలు తగ్గటం లేదు. ఇవి శుక్లాలలాగా మన కంటిచూపుకు అడ్డు పడుతున్నాయి. ఈ శుక్లాలను తొలిగించుకోగలిగితే, భగవంతుడు మన ఎదురుగా రానవసరం లేదు, విశ్వమంతటా ఉన్న భగవంతుణ్ణి మనం గుర్తించగలుగుతాము.

అర్జునుడు కూడా రాగం, శోకం, మోహంలో పడిపోయాడని చూశాము. ఈ మోహంవల్ల అతడు ధర్మాధర్మవిచక్షణ చేయలేకపోయాడు. ఆ మోహం పోవటానికి జీవ, ఈశ్వరుల స్వరూపాలను వివరంగా చెప్తూకొచ్చాడు కృష్ణపరమాత్మ. 7, 9, 10 అధ్యాయాల్లో ఈశ్వరుడు జగత్కారణమనీ, ఆయనే జగత్తంతా ఉన్నాడని చెప్పాడు. బంగారం ఎలాగైతే ఆభరణమంతటా ఉంటుందో అలా ఈశ్వరుడు జగత్తంతా ఉంటాడు. నామరూపాత్మకమైన జగత్తు అంతటా ఈశ్వరుడు ఉన్నాడని అర్థమయింది అర్జునునికి. అందువల్ల మోహం పోయింది అన్నాడు. అతను తర్వాత అడగబోయే ప్రశ్న ఏమిటి?

శ్లో. 3 **ఏవమేతద్యథాత్థ త్వమ్ ఆత్మానం పరమేశ్వర ।**
**ద్రష్టుమిచ్ఛామి తే రూపమ్ ఐశ్వరం పురుషోత్తమ ॥**
ఏవమ్, ఏతత్, యథా, ఆత్థ, త్వమ్, ఆత్మానమ్, పరమేశ్వర,
ద్రష్టుమ్, ఇచ్ఛామి, తే, రూపమ్, ఐశ్వరమ్, పురుషోత్తమ ॥

పరమేశ్వర! = ఓ పరమేశ్వరా!
త్వమ్ = నీవు
ఆత్మానమ్ = నిన్ను గూర్చి
యథా = ఏవిధముగా
ఆత్థ = చెప్పియుంటివో

ఏతత్ = ఇది
ఏవమ్ (ఏవ) = అంతయు సత్యమే
పురుషోత్తమ! = ఓ పురుషోత్తమా!
తే = నీయొక్క

| | | | |
|---|---|---|---|
| ఐశ్వరమ్, రూపమ్ | = షడ్గుణైశ్వర్య సంపన్నమైన నీ దివ్యరూపమును | ద్రష్టుమ్ | = ప్రత్యక్షముగా చూచుటకు |
| | | ఇచ్ఛామి | = కుతూహల పడుచున్నాను |

**హే పరమేశ్వర! యథా ఏవమ్ త్వమ్ ఆత్మానం ఆత్థ, ఏతత్**
**హే పురుషోత్తమ! తే ఐశ్వరమ్ రూపమ్ ద్రష్టుమ్ ఇచ్ఛామి ।**

తా: ఓ పరమేశ్వరా! నీవు నిన్ను గూర్చి ఏ విధముగా చెప్పియుంటివో ఇది అంతయు సత్యమే. ఓ పురుషోత్తమా! నీయొక్క షడ్గుణైశ్వర్య సంపన్నమైన నీ దివ్యరూపమును ప్రత్యక్షముగా చూచుటకు కుతూహల పడుచున్నాను.

కృష్ణపరమాత్మ బోధతో జ్ఞానచక్షువు తెరుచుకుంటున్న అర్జునుడు కృష్ణపరమాత్మను స్తుతిస్తున్నాడు. ముందు శ్లోకంలో కమలపత్రాక్ష అన్నాడు. ఇక్కడ పరమేశ్వర, పురుషోత్తమ అంటున్నాడు.

**పరమేశ్వర** – పరమేశ్వర అంటే పరమ+ఈశ్వర. అంటే మొత్తం విశ్వానికి అధిపతి. విశ్వంలోని నియమాలను ఉల్లంఘించకుండా ఉండేలాగా చూసేవాడు. ఒక్కమాటలో చెప్పాలంటే స్థితికర్త. ముందు శ్లోకంలో సృష్టి, లయల కర్తా అన్నాడు. భవాప్యయౌ అన్నాడు. ఇప్పుడు స్థితికర్తా అంటున్నాడు.

**పురుషోత్తమ** – శ్రేష్ఠమైన భగవంతుడు. పురుషోత్తమ పదానికి వేదాంతపరమైన అర్థం కూడా ఉంది. సాక్షాత్తూ కృష్ణపరమాత్మే పురుషోత్తమ పదం వాడాడు. పదిహేనవ అధ్యాయాన్ని పురుషోత్తమయోగం అంటారు. అక్కడ కృష్ణపరమాత్మ, పురుషోత్తమ అంటే నిర్గుణబ్రహ్మ అని వివరిస్తాడు. ఇప్పుడు మనం ఆ వివరాలలోకి వెళ్ళనవసరం లేదు. ఇప్పుడు పురుషోత్తమ అంటే శ్రేష్ఠమైన భగవంతుడు అని అర్థం చేసుకుంటే చాలు.

తమాషా ఏమిటంటే, మన సాంప్రదాయంలో సాధారణంగా పరమేశ్వర పదాన్ని ఈశ్వరునికి వాడతారు; అలాగే పురుషోత్తమ పదాన్ని విష్ణుమూర్తికి వాడతారు. ఇక్కడ వ్యాసాచార్యులవారు ఈ రెండు పదాలనూ కలిపి వాడటంద్వారా శివుడు, విష్ణువుల మధ్య భేదం లేదని చెప్పకనే చెప్పినట్టయింది. ఆ భేదం ఏదన్నా ఉంటే మనం చూపిస్తున్నాము అంతే. వారిలో లేదు.

**ఏతత్ యథా త్వమ్ ఆత్థ ఏవమ్** – ఓ కృష్ణా, నువ్వు నాకు ఏదైతే బోధిస్తున్నావో అదంతా చక్కగా అర్థమయింది నాకు. నువ్వు ఎంత క్రమపద్ధతిలో చెప్పుకువచ్చావంటే, నాకు దాన్ని అర్థం చేసుకోవటంలో ఏమీ కష్టం కలగలేదు.

భగవంతుడు కారణం, జగత్తు కార్యం అంటే దాని అర్థం ఏమిటి? కార్యం కారణానికి భిన్నంగా ఉండలేదు కాబట్టి జగత్తు ఈశ్వరునికి భిన్నంగా ఉండలేదు. ఇది చాలా తార్కికంగా ఉంది. అందువల్ల జగత్తుకు చెందినవన్నీ భగవంతునికి చెందుతాయి. నిజమే. అది ఒప్పుకోవటంలో నాకేం సందేహం లేదు. ఏవం ఏవ అంటే సరే బాగానే ఉంది అని అర్థం వస్తుంది. కృష్ణపరమాత్మను బాగా చెప్పావని మెచ్చుకుంటున్నాడు కూడా. కృష్ణపరమాత్మ మనస్సులో నవ్వుకుని ఉంటాడు ఆ మాటకు.

**ఆత్మానం** – ఆత్మానం అంటే నీ గురించి. నువ్వు చెబుతున్నదంతా నీ గురించి, అది కూడా అర్థమయింది. కాని, కాని అంటే ఇంకా ఏదో బోధ కావాలి. ఎవరినైనా ఎలా ఉన్నావు అని అడిగితే, అంతా బాగానే ఉంది, కాని... అంటారు. అర్జునుడు కాని... అంటున్నంతవరకూ కృష్ణపరమాత్మ బోధ కొనసాగుతూనే ఉంటుంది.

ఇప్పుడు ఈ కానీ అర్థమేమిటి? కృష్ణపరమాత్మ చెప్పిన బోధను బుద్ధి, బుద్ధిగా అర్థం చేసుకుంది కాని మనస్సు మాట వినదు. బుద్ధి ఏం చెబుతుంది? ఈ ప్రపంచం అంతటా ఈశ్వరుడు ఉన్నాడు. అంతటా ఈశ్వరుడు ఉన్నాడంటే అర్థమేమిటి? మంచిలోనూ, చెడులోనూ ఉన్నాడు. అంతా పవిత్రమైనదే. ప్రతిదాన్నీ గౌరవించాలి, పూజించాలి. అలాంటప్పుడు కొన్ని వస్తువులు ప్రీతికరమైనవి, కొన్ని వస్తువులు ద్వేషపూరితమైనవి అవటానికి వీలులేదు. అంటే జగత్తును సమదృష్టితో చూడాలి.

కాని మనస్సు మాట వినదే. మనస్సు రాగద్వేషాలతో నిండిపోయివుంది. ఒక వస్తువును చూస్తే రాగంతో నిండిపోతుంది; ఇంకో వస్తువును చూస్తే ద్వేషం తన్నుకొస్తుంది. అంటే బుద్ధికి జగత్తును పవిత్రంగా చూడాలని తెలుసు; **కాని** రాగద్వేషాలతో నిండిన మనస్సు ఇవి మంచి, ఇవి చెడు అని రెండుగా చీలుస్తుంది జగత్తును.

అందువల్ల నేను నేర్చుకున్నదానికి, నేను ప్రవర్తించేతీరుకు చాలా వ్యత్యాసం ఉంది. ఒక గుడికి వెళితే ఎంత ఆనందం కలుగుతుందో, బాహ్యప్రపంచాన్ని చూసినా నాకంత ఆనందం కలగాలి. కాని అలా కలగటం లేదే! అలా బుద్ధికీ, మనస్సుకు మధ్య దూరాన్ని పూడ్చాలంటే, ఆ రెండింటినీ ఒక్కత్రాటిమీద నడపాలంటే నేనేం చేయాలి అంటున్నాడు అర్జునుడు.

**తే రూపమ్ ఐశ్వరం ద్రష్టుమిచ్ఛామి** – నీ విశ్వరూపదర్శనాన్ని చూడాలని ఉంది నాకు అంటున్నాడు అర్జునుడు.

మన సాంప్రదాయంలో ఆధ్యాత్మిక చింతన విడిగా లేదు అంటారు పూజ్యస్వామీజీ. మనం ఏంచేసినా దానిలో భగవద్ధ్యానం మిళితమై ఉంటుంది. దంతధావనం పూజ, స్నానం పూజ, భోజనం చేయటం పూజ. ఆ విధంగా ఏంచేసినా భగవంతునితో మమేకం చెందుతాము. కాని అది అంత తేలికగా వంటబట్టదు. అందువల్ల ఆ విశ్వరూపదర్శనం అయ్యేలా చేయమంటున్నాడు అర్జునుడు. విన్నంతవరకూ బాగానే ఉంది, కాని జగత్తును చూస్తే దాన్ని ప్రేమించే బదులు, రెట్టింపు ద్వేషం కలుగుతుంది జగత్తుమీద. అందువల్ల నాకు విశ్వరూపం చూపించు అంటున్నాడు అర్జునుడు. విశ్వరూపాన్ని ఐశ్వరరూపం అన్నాడు.

శ్లో. 4 **మన్యసే యది తచ్ఛక్యం మయా ద్రష్టుమితి ప్రభో ।**
**యోగేశ్వర తతో మే త్వం దర్శయాత్మానమవ్యయమ్ ॥**
మన్యసే, యది, తత్, శక్యమ్, మయా, ద్రష్టుమ్, ఇతి, ప్రభో,
యోగేశ్వర, తతః, మే, త్వమ్, దర్శయ, ఆత్మానమ్, అవ్యయమ్ ॥

| | | | |
|---|---|---|---|
| ప్రభో | = ఓ ప్రభూ! | ద్రష్టుమ్ | = చూచుటకు |
| మయా | = నాచేత | శక్యమ్, ఇతి | = సాధ్యమేనని |
| తత్ | = దానిని (నీ దివ్యరూపమును) | మన్యసే, యది | = నీవు భావించుచున్నచో |

| | | | |
|---|---|---|---|
| తతః | = అయితే | ఆత్మానమ్ | = నిన్ను (నీ రూపమును) |
| యోగేశ్వర! | = ఓ యోగేశ్వరా! | మే | = నాకు |
| త్వమ్ | = నీవు | దర్శయ | = చూపించుము |
| అవ్యయమ్ | = శాశ్వతమైన | | |

**హే యోగేశ్వర ప్రభో! మయా తత్ ద్రష్టుమ్ శక్యమ్ ఇతి త్వమ్**
**యది మన్యసే, తతః మే అవ్యయమ్ ఆత్మానమ్ దర్శయ ।**

తా: ఓ ప్రభూ! నాచేత నీ దివ్యరూపమును చూచుటకు సాధ్యమేనని నీవు భావించుచున్నచో అయితే ఓ యోగేశ్వరా! నీవు శాశ్వతమైన నీ రూపమును నాకు చూపించుము.

విశ్వరూపం జగత్తులో ఉందని తెలుసు, కాని భగవంతుణ్ణి అందులో దర్శించలేకపోతున్నాము అంటే ఏమిటి అర్థం? మనం ఇంకా సంసిద్ధంగా లేము. ఓ కృష్ణా, నేను విశ్వరూపదర్శనాన్ని చేయలేకుండా ఉన్నాను.

**తత్ ద్రష్టుమ్ శక్యం యది మన్యసే** – ఓ కృష్ణా! నీ దివ్యరూపాన్ని చూసే అర్హత నాకుందని నువ్వు భావిస్తే, అది నాకు చూపించు అంటున్నాడు అర్జునుడు. ఎందుకు? అర్హత అనేది రాత్రికి రాత్రి వచ్చేయదు. దానికి చాలా కర్మయోగం, ఉపాసనయోగం చేసివుండాలి. ఆ మార్పు విప్లవాత్మకం కాదు, పరిణామాత్మకం. అది క్రమేపీ రావాలి.

ఆ విషయం అర్జునునికి కూడా తెలుసు. అందువల్ల ఏదైనా తాత్కాలిక పద్ధతిద్వారా నేను విశ్వరూపదర్శనాన్ని చేయగలనా అంటున్నాడు. ఒకవేళ నేను చూడటానికి అర్హుడనైతే, నాకు చూపించు.

**యోగేశ్వర** – ఇక్కడ మళ్ళీ ఒక గుణాన్ని కీర్తిస్తున్నాడు. సందర్భానికి తగ్గ గుణాన్ని వాడుతున్నాడు. యోగీశ్వరుడు అంటే లీలలు చేయగలశక్తి ఉన్నవాడు. ఓ కృష్ణా! నీకున్న లీలను ఉపయోగించి, నా కళ్ళకు లేదా నా మనస్సుకు కప్పుకున్న పొరలను తాత్కాలికంగా తొలగించి, నాకు నీ విశ్వరూప ఈశ్వరదర్శనం చేయించు.

**తతః మే ఆత్మానం దర్శయ** – నువ్వు నాకు విశ్వరూపదర్శనం చేయించు. ఇక్కడ ఈ ప్రశ్నను సరిగ్గా అర్థం చేసుకోవాలి. విశ్వరూపదర్శనం అంటే మళ్ళీ రామదర్శనం లేదా కృష్ణదర్శనంలాంటిది కాదు. విశ్వరూపం మనముందే ఉంది. విశ్వరూపదర్శనం చేయించు అంటే, మనస్సుకు అడ్డుకొన్న పొరలను తాత్కాలికంగా తొలగించు అని అర్థం. ఆత్మానం అంటే నిన్ను చూడాలి. నిన్ను అంటే కృష్ణపరమాత్మను. ఎటువంటి నిన్ను?

**అవ్యయమ్** – అంతులేని రూపాన్ని. విశ్వరూపం అంటే ఏకరూపం కాదని చూశాము. విశ్వరూపం అంటే అనేకరూపం. అనేక రూపాలున్నాయి కాబట్టి అవ్యయం అన్నాడు అర్జునుడు.

### శ్లోకాలు 5–8: విశ్లేషణ

విశ్వరూపం మన కళ్ళముందే ఉన్నా, విశ్వరూపదర్శనం మనం చేసుకోవాలంటే సంసిద్ధమైన మనస్సు ఉండాలని చూశాము. దాన్ని దివ్యచక్షువు లేదా జ్ఞాననేత్రం అంటారని కూడా చూశాము. ఆ జ్ఞాననేత్రం

పొందటానికి చాలా శ్రమపడాల్సి ఉంటుంది. ధార్మికజీవనం గడపాలి; దైవచింతన ఉండాలి. అందువల్ల జ్ఞాననేత్రాన్ని పొందటానికి చాలా సమయం పడుతుంది.

కాని అర్జునుడు అదృష్టవంతుడు. ఎందుకు? సాక్షాత్తూ అవతార పురుషుడైన కృష్ణపరమాత్మే అతని ఎదురుగా ఉన్నాడు. అందువల్ల తన మనస్సును తాత్కాలికంగా శుద్ధిచేసి, ఆ విశ్వరూపదర్శనాన్ని చేయించమన్నాడు. అంటే తన లీల చూపించమని అంటున్నాడు. కాని ఇలాంటి తాత్కాలికమైన దానివల్ల కలిగే ఫలితం కూడా తాత్కాలికంగానే ఉంటుంది. మనిషికి బాహ్యంగా, ఆరోగ్యపరంగా చేసే సహాయాలు – వెంటిలేటరు – తాత్కాలిక ఉపశమనాన్నే ఇస్తాయి. శాశ్వతంగా ఇవ్వలేవు. ఇప్పుడు అర్జునుడు కూడా దైవసహాయంతో అలాంటి తాత్కాలిక లాభాన్ని పొందుతున్నాడు.

అంతేకాదు, ఈ చిత్తశుద్ధి బాహ్యంగా ఏర్పడితే అది సహజంగా వచ్చిన మార్పు కాదు. దాన్ని పూర్తిగా ఆస్వాదించలేము. అదే జరిగింది అర్జునునికి కూడా. విశ్వరూపదర్శనం చేసుకున్న అర్జునుడు మొదట్లో పొంగిపోయాడు, తర్వాత అతనికి ఆ ఆనందం లేకపోయింది. అందరూ అర్జునుడు ఎంత అదృష్టవంతుడు, భగవంతునియొక్క విశ్వరూపదర్శనం చేసుకున్నాడని అనుకుంటారు కాని నిజానికి అర్జునుడే తట్టుకోలేక పోతాడు. అందువల్ల అర్జునుడే, ఈ అధ్యాయం చివరికి వచ్చేసరికి, కృష్ణా, నీ విశ్వరూపదర్శనం బాగుంది, కాని నేను తట్టుకోలేక పోతున్నాను, శాంతించు అంటాడు.

అందువల్ల ఏ అనుభవమైనా సరే, కృత్రిమంగా కలిగితే దానిలో రెండు లోపాలు ఉంటాయి. ఆ అనుభవం తాత్కాలికంగానే ఉంటుంది, అది జీర్ణించుకోగలిగే అనుభవం కాదు. కష్టపడి, చిత్తశుద్ధి పెంపొందించుకుంటే, అప్పుడు ఆ విశ్వరూపదర్శనం శాశ్వతంగా నిలుస్తుంది; దాని అద్భుతాన్ని ఆస్వాదించగలుగుతాము కూడా.

అయినా, అర్జునుడు నోరు తెరిచి అడిగాడు కాబట్టి, కృష్ణపరమాత్మ దానికి అంగీకరిస్తాడు. నీకు విశ్వరూపదర్శనం చేయిస్తున్నాను. కాని దాన్ని మామూలు నేత్రాలతో చూడలేవు అంటున్నాడు.

త్రీడి సినిమాలు చూడటానికి ఎలాగైతే ప్రత్యేకమైన కళ్ళజోడును ఇస్తారో, అలా కృష్ణపరమాత్మ అర్జునునికి ప్రత్యేకమైన దృష్టిని ఇవ్వబోతున్నాడు. దాన్ని దివ్యచక్షువు అంటున్నాడు. ఆ మాటను ఎనిమిదవ శ్లోకంలో చూస్తాము.

**శ్రీభగవాన్ ఉవాచ**

శ్లో. 5 **పశ్య మే పార్థ రూపాణి శతశోఽథ సహస్రశః ।**
**నానావిధాని దివ్యాని నానావర్ణాకృతీని చ ॥**
పశ్య, మే, పార్థ, రూపాణి, శతశః, అథ, సహస్రశః,
నానావిధాని, దివ్యాని, నానావర్ణాకృతీని, చ ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ! | = ఓ పార్థా! | చ | = ఇంకా |
| అథ | = ఇప్పుడు | నానావర్ణాకృతీని | = నానావర్ణము (వన్నె)లతో, ఆకృతులతో ఉన్న |
| మే | = నాయొక్క | దివ్యాని | = అలౌకికములైన |
| శతశః, సహస్రశ | = వందలు, వేలకొలదిగల (అసంఖ్యాకములైన) | రూపాణి | = రూపములను |
| నానావిధాని | = నానావిధములైన | పశ్య | = చూడు |

**హే పార్థ! మే నానా-విధాని, నానా-వర్ణ-ఆకృతీని, దివ్యాని చ**
**శతశః అథ సహస్రశః రూపాణి పశ్య ।**

తా: ఓ పార్థా! ఇప్పుడు నాయొక్క వందలు, వేలకొలదిగల (అసంఖ్యాకములైన) నానావిధములైన ఇంకా నానావర్ణము (వన్నె)లతో, ఆకృతులతో ఉన్న, అలౌకికములైన రూపములను చూడు.

**శ్రీభగవాన్ ఉవాచ** – కృష్ణపరమాత్మ చెబుతున్నాడు.

**పశ్య మే పార్థ రూపాణి** – ఓ అర్జునా, నువ్వు నా రూపాలు చూడు.

**శతశోఽథ సహస్రశః** – ఆ రూపాలు వందలు, వేలల్లో ఉన్నాయి. అంటే ఎన్నో ఉన్నాయి.

**నానావిధాని** – అనేక రకాలుగా ఉన్నాయి. అంటే వాటి రంగులు, రూపాలు ఎన్నో, ఎన్నెన్నో ఉన్నాయి.

**దివ్యాని** – అన్నీ పవిత్రమైనవే. అంటే అన్నీ దైవానికి చెందినవే.

**నానావర్ణాకృతీని చ** – అనేక ఆకారాలు, రంగులతో నిండివున్నాయి.

ఇక్కడ కూడా ఒక విషయాన్ని స్పష్టంగా అర్థం చేసుకోవాలి. అనేక రూపాలు, రంగులతో కూడిన నా విశ్వరూపం చూడు అని కృష్ణపరమాత్మ చెపితే, దాని అర్థం ఏమిటి? ఏకరూప ఈశ్వరునిలాగా, ఈ విశ్వరూప ఈశ్వరుడు కూడా అనేకరూపాలు, రంగులతో కూడి దర్శనమిస్తాడా? అంటే జగత్తులో ఉన్న అనేక అందమైన రంగులు, రూపాలు సాక్షాత్తూ ఆ భగవంతునియొక్క రంగులూ, రూపాలే. సూర్యచంద్రుల భిన్నరూపాలు భగవంతునివే, అవన్నీ ఈశ్వరవర్ణాలే.

ఆభరణం అంతటా ఉన్నది బంగారమే అని తెలుసుకున్నాక గాజును, గొలుసుని చూసినా అవి బంగారంయొక్క భిన్న ఆకారాలుగా కనిపిస్తాయి కాని ఆ ఆకారాలలో మైమరచిపోము. అలాగే అంతటా ఉన్నది ఈశ్వరుడే అని తెలుసుకున్నాక, ఎన్ని రంగులు, ఎన్ని రూపాలు చూసినా వాటిలో ఈశ్వరుణ్ణే దర్శిస్తాము.

**అసౌయస్తామ్రో అరుణ ఉత బభ్రుస్సుమంగలః** – నమకం

ఇది శ్రీరుద్రంలోని నమకంలోనిది. రుద్రం ఈశ్వరుని వర్ణన. శివుణ్ణి అనేక రంగులతో వర్ణిస్తోంది. ఆ రంగులేవీ కొత్తవి కావు. అవి తామ్ర, అరుణ, బభ్రు, సుమంగళ వర్ణాలు. ఈ రంగులను సూర్యుడు ఉదయిస్తున్నప్పుడు, సూర్యోదయం ముందే లేచిన గోపకులు చూస్తారు.

**ఉతైనం గోపా అదృశన్నదృశ్రన్నుదహార్యః**

అప్పుడే ఉదయిస్తున్న సూర్యుడు ఎరుపురంగుతో ఉంటాడు; తర్వాత బంగారువర్ణం, ఆ తర్వాత పసుపు రంగులోకి మారి, చివరికి తెల్లరంగుగా కనిపిస్తాడు. ఇవన్నీ సూర్యుని రంగులు కావు, విశ్వరూప ఈశ్వరునివి. మొత్తం రుద్రం విశ్వరూప ఈశ్వరునియొక్క వర్ణన.

అలాగే ఆకుల్లో అనేక రంగులు – లేత ఆకుపచ్చ, ఆకుపచ్చ, ఎండుటాకుల రంగులు వస్తాయి.

**హరికేశాయోపవీతినే పుష్టానాం పతయే నమో నమో**

**హరికేశాయ** – ఆకుపచ్చ రంగు జుట్టు ఉన్న భగవంతుడు. జుట్టుకు నలుపు, తెలుపు, గోధుమవర్ణాలు చూస్తాము. ఎవరైనా కావాలని కొన్ని పాయలకు రంగు వేసుకుంటే, అదీ చూస్తాము కాని ఆకుపచ్చ రంగు ఉన్న జుట్టు ఎవరికైనా ఉంటుందా? దీని అర్థం చెట్లయొక్క ఆకులు భగవంతుని వెంట్రుకలు. అందువల్ల ఏదైనా అడవికి వెళ్ళినా, దట్టమైన చెట్లను చూసినా, ఈ వర్ణనను గుర్తు తెచ్చుకుని వాటిని విశ్వరూప ఈశ్వరునిగా ఆస్వాదించాలి.

అందువల్ల అనేక రంగుల గురించి చెప్పినా, అవి కొత్తరంగులు కాదు, పాత రంగులనే కొత్తకోణంలో చూస్తాము. ఒక లడ్డును మామూలుగా చూసినా, అది తిరుపతి ప్రసాదం అంటే దానికి ఒక పవిత్రతను ఆపాదిస్తాము. లడ్డు ఒకటే. మన భావన మారింది అని అంతకుముందు కూడా చూశాము.

ఆ విధంగా నానావర్ణాని అంటే అనేక రంగులు; నానావర్ణాకృతీని అంటే అనేక ఆకారాలు. ఏవి చూసినా విశ్వరూప దర్శనమే. సహస్రశీర్ష పురుషః అని భగవంతుణ్ణి కొలిస్తే, నిజంగా ఆయనను వెయ్యి తలలతో ఊహించుకోకూడదు. అది విశ్వరూపం.

శ్లో. 6 **పశ్యాదిత్యాన్ వసూన్ రుద్రాన్ అశ్వినౌ మరుతస్తథా ।**
**బహూన్యదృష్టపూర్వాణి పశ్యాశ్చర్యాణి భారత ॥**
పశ్య, ఆదిత్యాన్, వసూన్, రుద్రాన్, అశ్వినౌ, మరుతః తథా,
బహూని, అదృష్టపూర్వాణి, పశ్య, ఆశ్చర్యాణి, భారత ॥

| | | | |
|---|---|---|---|
| భారత! | = ఓ అర్జునా! | తథా | = అలాగే |
| ఆదిత్యాన్ | = అదితియొక్క ద్వాదశపుత్రులను | బహూని | = అనేకములైన |
| వసూన్ | = అష్టవసువులను | అదృష్ట పూర్వాణి | = మునుపు ఎన్నడును చూడనట్టి |
| రుద్రాన్ | = ఏకాదశ రుద్రులను | ఆశ్చర్యాణి | = ఆశ్చర్యకరరూపములను |
| అశ్వినౌ | = అశ్వినీ కుమారులను | పశ్య | = చూడు |
| మరుతః | = నలభైతొమ్మిది మరుత్తులను | | |
| పశ్య | = చూడు | | |

**హే భారత! ఆదిత్యాన్, వసూన్, రుద్రాన్, అశ్వినౌ తథా**

**మరుతాః పశ్య, అదృష్ట-పూర్వాణి బహూని ఆశ్చర్యాణి (చ) పశ్య ।**

తా: ఓ అర్జునా! అదితి యొక్క ద్వాదశపుత్రులను, అష్టవసువులను, ఏకాదశ రుద్రులను, అశ్వినీకుమారులను, నలభై తొమ్మిది మరుత్తులను చూడు. అలాగే అనేకములైన మునుపు ఎన్నడును చూడనట్టి ఆశ్చర్యకర రూపములను చూడు.

**పశ్యాదిత్యాన్ వసూన్ రుద్రాన్** – ద్వాదశ ఆదిత్యులను, అష్టవసువులను, ఏకాదశరుద్రులను – ఎవరిని చూసినా విశ్వరూపంగా చూడు.

ఈ ముగ్గురి గురించి అంటే ఆదిత్యులు, వసువులు, రుద్రుల గురించి బృహదారణ్యకోపనిషత్తులో వస్తుంది. ముప్ఫయిముగ్గురు దేవతలు ఎవరు అని అడిగితే, యాజ్ఞవల్క్యుడు ద్వాదశ ఆదిత్యులు, అష్టవసువులు, ఏకాదశరుద్రులు, ప్రజాపతి, ఇంద్రుడు అని చెబుతాడు.

**కతమే వసవ ఇతి। అగ్నిశ్చ పృథివీ చ వాయుశ్చాంతరిక్షం**

**చాఽఽదిత్యశ్చద్యౌ చంద్రమాశ్చ నక్షత్రాణి చైతే వసవః**

అష్టవసువులు ఎవరు? అగ్ని, పృథివి, వాయువు, అంతరిక్షం, ఆదిత్యుడు, స్వర్గలోకం, చంద్రుడు, నక్షత్రాలు– అష్టవసువులు. పశ్య వసూన్ – ఆ వసువులను చూస్తే నా విశ్వరూపంగా భావించు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ద్వాదశాదిత్యులు అంటే పన్నెండు నెలల్లో కనబడే ఆదిత్యుడు.

**ద్వాదశమాస సంవత్సరస్య ఏతే ఆదిత్యాః**

ఎందుకు సూర్యుణ్ణి పన్నెండు నెలల్లో తిరిగే ఆదిత్యునిగా వర్ణిస్తారు? ఎందుకంటే సూర్యుని శక్తిలో కొంత వ్యత్యాసం ఉంటుంది. మే నెలలో గ్రీష్మతాపంతో ఉన్న సూర్యుడు, డిసెంబరు నెలలో అంత తీక్షణంగా ఉండడు. అలా ద్వాదశాదిత్యులను నా విశ్వరూపంగా చూడు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**కతమే రుద్రాః। దశేమే పురుషే ప్రాణా ఆత్మా ఏకాదశః**

పది ఇంద్రియాలు+మనస్సు కలిసి ఏకాదశ రుద్రాలు అని బృహదారణ్యకోపనిషత్తు వర్ణిస్తుంది. అందువల్ల ఈ ఏకాదశరుద్రులను కూడా నా విశ్వరూపంగా చూడు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**అశ్వినౌ** – అశ్వినీ కుమారులు. అశ్వినీ కుమారులు ప్రాణానికి అధిష్ఠానదేవతలు.

**మరుతస్తథా** – మరుద్గణాలు. అశ్వినీ కుమారులను, మరుద్గణాలను కూడా నా విశ్వరూపంగా చూడు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**అదృష్టపూర్వాణి** – మునుపెన్నడూ నువ్వు గమనించి ఉండవు.

**వాట్ ఈజ్ దిస్ లైఫ్ ఇఫ్ ఫుల్ ఆఫ్ కేర్ వియ్ హావ్ నో టైమ్ టు స్టాండ్ అండ్ స్టేర్**

డేవిస్ అనే ఆంగ్లకవి అంటాడు, ఈ ప్రకృతిలో ఎన్నో అందాలు, అద్భుతాలు ఉన్నాయి కాని మనం ఈ పరుగు పందెంలో పడిపోయి, పరుగులు తీస్తున్నాము కాని ఒక్క నిముషం ఆగి, ప్రకృతి అందాలను ఆస్వాదించే తీరిక లేదు అని. ఇక్కడ కృష్ణపరమాత్మ ప్రకృతిలో ఉన్న విశ్వరూపాన్ని చూసే తీరిక లేదు అంటున్నాడు.

**బహూని** – నిజంగా ఆస్వాదించగలిగితే ఎన్నో, ఎన్నెన్నో అద్భుతాలు ఉన్నాయి ప్రకృతిలో. సూర్యుడు ఒక అద్భుతం! వాన మరొక అద్భుతం! ఆ అద్భుతాలను మానవమాత్రుడు సృష్టించలేడు! సర్వజ్ఞుడైన భగవంతుడు మాత్రమే సృష్టించగలడు. వాన సక్రమంగా కురుస్తున్నంతసేపూ దాని అద్భుతం మనకు తెలియదు. కాని కృత్రిమంగా వాన సృష్టించాల్సి వచ్చినప్పుడు దాని విలువ తెలుస్తుంది. భూమి ఒక అద్భుతం! ఏది చూసినా, అది భగవంతునియొక్క సృజనాత్మకతకు సంకేతం. కాసేపు మన పరుగుపందెం ఆపేసి, రోజువారీ కార్యక్రమాలు పక్కనపెట్టి, జగత్తును గమనిస్తే ఏమవుతుంది?

**పశ్యాశ్చర్యాణి భారత** – ఆశ్చర్యమే ఆశ్చర్యం కలుగుతుంది అర్జునా అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఐదు నిముషాలు సెల్‌ఫోనుని పక్కన పెట్టలేని దుస్థితి ఏర్పడింది ఇప్పుడు. అలా మన యాంత్రిక జీవితంనుంచి కాసేపు బయటకు తొంగిచూసినా చాలు, ఎటు చూసినా ఆశ్చర్యమే ఆశ్చర్యం!

శ్లో. 7 **ఇహైకస్థం జగత్ కృత్స్నం పశ్యాద్య సచరాచరమ్ ।**
**మమ దేహే గుడాకేశ యచ్చాన్యద్ద్రష్టుమిచ్ఛసి ॥**
ఇహ, ఏకస్థమ్, జగత్, కృత్స్నమ్, పశ్య, అద్య, సచరాచరమ్,
మమ, దేహే, గుడాకేశ, యత్, చ, అన్యత్, ద్రష్టుమ్, ఇచ్ఛసి ॥

| | | | |
|---|---|---|---|
| గుడాకేశ | = ఓ అర్జునా! | చ | = ఇంకను |
| అద్య | = ఇప్పుడు | అన్యత్ | = ఇతరమైన |
| ఇహ, మమ దేహే | = ఈ నా దేహమునందు | యత్ | = దేనిని |
| ఏకస్థమ్ | = ఒకేచోట స్థితమైయున్న | ద్రష్టుమ్ | = చూచుటకు |
| సచరాచరమ్ | = చరాచరములతో గూడియున్న | ఇచ్ఛసి | = కోరుకొనుచున్నావో వాటి నన్నింటిని చూడు |
| కృత్స్నమ్, జగత్ | = సంపూర్ణజగత్తును | | |
| పశ్య | = చూడు | | |

**హే గుడాకేశ! కృత్స్నమ్ సచర–అచరమ్ జగత్, యత్, అన్యత్**
**చ ద్రష్టుమ్ ఇచ్ఛసి (తత్ అపి) ఇహ మమ దేహే ఏకస్థమ్ అద్య పశ్య ।**

తా: ఓ అర్జునా! ఇప్పుడు ఈ నా దేహమునందు ఒకేచోట స్థితమైయున్న, చరాచరములతో గూడియున్న సంపూర్ణజగత్తును చూడు. ఇంకను ఇతరమైన దేనిని చూచుటకు కోరుకొనుచున్నావో వాటినన్నింటిని చూడు.

**ఇహ** – నాలో అంటే విశ్వరూప ఈశ్వరునిలో. విశ్వరూప ఈశ్వరునికి ఆకాశమే శరీరం.

**జగత్ కృత్స్నం పశ్యాద్య** – మొత్తం జగత్తును చూడు.

**అంతస్థం యశ్య విశ్వం సురనరఖగగోభోగిగంధర్వదైత్యైః**

యశోదాదేవికి మొత్తం విశ్వం దర్శనమైంది. ఎప్పుడు? చిన్నికృష్ణుడు మన్ను తిన్నాడని విని, అది చూడటానికి నోరు తెరవమంటే, ఆ చిన్నికృష్ణుని చిన్ని నోటిలో పద్నాలుగు లోకాలు కనబడ్డాయి. దీన్ని విశ్వరూపదర్శనంగా తీసుకోవాలి.

అలాగే కృష్ణుణ్ణి నీలమేఘశ్యాముడు అంటారు. నిజంగా నీలవర్ణంతో ఎవరైనా ఉంటారా? తెల్లవారు, నల్లవారు, పసుపురంగు వారు, గోధుమవర్ణం వారు అని నాలుగుతెగల మనుష్యులను వర్ణిస్తారు. కాని ఇందులో నీలిరంగు లేదు. అంటే నీలాకాశాన్ని భగవంతుని రూపంగా చూడాలి. ఆకాశంలో ఉన్న నక్షత్రమండలాలన్నీ భగవంతునిలో ఉన్నాయి. ఇంతకుముందు హరికేశాయ అన్నాము. ఆకుపచ్చజుట్టు ఉంది అంటే వృక్షాల ఆకులను భగవంతుని కేశాలుగా ఊహించుకోవాలని చూశాము.

ఇహైకస్థం జగత్కృత్స్నం పశ్యాద్య అంటే నాలో సమస్త జగత్తును చూడు. నాలో అంటే కృష్ణశరీరంలో కాదు, ఆకాశశరీరం బ్రహ్మ. విశ్వం ఎంత విస్తారంగా ఉందో చూస్తే, నా శరీరం ఎంత విస్తారంగా ఉందో నీకు తెలుస్తుంది. ఎందుకంటే సమస్త విశ్వం నాలోనే ఇమిడివుంది. అది నీముందే ఉంది.

ఒక విజ్ఞానశాస్త్రవేత్త భగవంతునియొక్క అద్భుతసృష్టిని కీర్తిస్తూ ఒక వ్యాసం రాశారు, 'ఈ విశ్వాన్ని ఒక మీటర్ కొలత ఉన్న డయామీటర్‌లో (వ్యాసంలో) ఉన్న కొన్ని ఇసుకరేణువులుగా తీసుకుంటే, అందులో ఉన్న ఒక్కొక్క ఇసుకరేణువుని ఒక గెలాక్సీ (నక్షత్రకూటమి)గా భావించవచ్చు. గెలాక్సీ అంటే అనేక నక్షత్రాల కూటమి. వాటి మధ్య దూరం అనేకవేల కాంతిసంవత్సరాలు. ఒక కాంతిసంవత్సరం అంటే ఒక సంవత్సరంలో కాంతి ప్రయాణించే దూరం. కాంతి ఒక సెకనులో ప్రయాణించే దూరం మూడు లక్షల కిలోమీటర్లు. అంటే ఒక సంవత్సరంలో ఎంత దూరం ప్రయాణిస్తుందో ఊహించుకోండి. అలాంటిది కొన్ని గెలాక్సీలకి వేల కాంతిసంవత్సరాలు అంటే ఎంత దూరమో ఊహించుకోండి. మళ్ళీ అలాంటి గెలాక్సీలు లక్షలకొద్దీ ఉన్నాయి. ఒక గెలాక్సీ ఒక్క ఇసుకరేణువులో ఉంటే, అనేక లక్షల ఇసుకరేణువుల్లో లక్షల గెలాక్సీలు ఉన్నాయి.

ఆ లక్షల గెలాక్సీలలో ఒక గెలాక్సీని మిల్కీవే (పాలపుంత) అంటారు. ఆ మిల్కీవేలో లక్షలకొద్దీ నక్షత్రాలు ఉన్నాయి, అందులో సూర్యుడు ఒక మామూలు నక్షత్రం. దానికి దగ్గరగా భూమిమీద ఉన్నాం మనం. అంటే ఇసుకరేణువులలో మనం ఎక్కడ ఉన్నామో ఊహించుకోండి. ప్రతిరాత్రీ ఈ అద్భుతాన్ని మనకు ఆకాశం చూపిస్తోంది కాని మనం రాత్రిని ఈ జ్ఞానాన్ని పొందటానికి వినియోగించుకోవటం లేదు. రాత్రి ఆకాశం కేసి చూస్తే ఎన్నో వేల నక్షత్రాలు కనిపిస్తాయి; ఆ నక్షత్రాల మధ్య చాలా ఖాళీ ప్రదేశం కూడా ఉంది. అంటే ఇన్ని లక్షల గెలాక్సీలను, వాటి మధ్య ఖాళీ ప్రదేశాలను తనలో పొందుపరుచుకున్న ఆకాశం ఎంత విస్తారమైంది? ఇంత విస్తారమైన ఆకాశం ఈశ్వరుని శరీరం.'

ఇంత అద్భుతమైన సృష్టిని విశ్వరూప ఈశ్వరునిగా భావించండి. ఈ విశ్లేషణను లోతుగా చేయండి.

అలా విశ్వరూపదర్శనం మనకు అందుబాటులో ఉన్నా కూడా మనం చూడటం లేదు. విశ్వరూపదర్శనం అందుబాటులో ఉన్నా చూడటం లేదంటే లోపం మన లౌకికచక్షువులదే; మనకు దివ్యచక్షువులు కావాలి. అంటే మన మనస్సును సంసిద్ధపరచుకోవటంలో ఉంది. మనస్సును సంసిద్ధపరుచుకోవాలంటే మనస్సు ఎలా ఉండాలి? కామక్రోధాదిరహితం మనః, రాగద్వేషాదిరహితం మనః, అహంకారమమకారాదిరహితం మనః. అంటే కామక్రోధాలు, రాగద్వేషాలు, అహంకారమమకారాలకు అతీతంగా ఉండాలి.

అలాంటి సంస్కృత మనస్సు ఉంటే విశ్వరూపదర్శనం చేయవచ్చు. ఎలాంటి విశ్వరూపం?

**సచరాచరమ్** – చర అంటే కదలిక ఉన్న, అచర అంటే కదలిక లేని వస్తువులలో చూడవచ్చు. వీటిని జంగమం, స్థావరం అంటారు.

**అంతస్థం యస్యవిశ్వం సురనరఖగగోభోగిగంధర్వదైత్యైః**
**చిత్రం రంరమ్యతే తం త్రిభువనవపుషం విష్ణుమీశం నమామి** – 2

**వపుషం** అంటే శరీరం; ఎటువంటి శరీరం? **త్రిభువనం** – మూడు లోకాలూ అంటే భూలోక, భువర్లోక, సువర్లోకాలు.

**మమ దేహే** – అందువల్ల కృష్ణపరమాత్మ మమదేహే అంటే, కృష్ణపరమాత్మ శరీరంలో కాదు, ఆకాశశరీరంలో, విశ్వరూపశరీరంలో.

పశ్య – చూడుగాక; **గుడాకేశ** – అర్జునా. గుడాకేశ అంటే సత్త్వగుణం ప్రధానంగా ఉన్నవాడా. అంటే నీకు మనస్సును సంసిద్ధం చేసుకునే శక్తి ఉంది.

**యచ్చాన్యద్ద్రష్టుమిచ్ఛసి** – వీటినే కాదు, నువ్వు ఇంకేవి చూడాలనుకుంటున్నావో వాటిని కూడా చూడు. ఎందుకంటే అన్నీ విశ్వరూపంలోకే వస్తాయి.

శ్లో. 8 **న తు మాం శక్యసే ద్రష్టుమ్ అనేనైవ, స్వచక్షుషా ।**
**దివ్యం దదామి తే చక్షుః పశ్య మే యోగమైశ్వరమ్ ॥**
న, తు, మామ్, శక్యసే, ద్రష్టుమ్, అనేన, ఏవ, స్వచక్షుషా,
దివ్యమ్, దదామి, తే, చక్షుః, పశ్య, మే, యోగమ్, ఐశ్వరమ్ ॥

| | | | |
|---|---|---|---|
| తు | = కాని | (అతః) | = అందువల్ల |
| మామ్ | = ఈ నా రూపమును | తే | = నీకు |
| అనేన | = ఈ | దివ్యమ్ | = దివ్యమైన |
| స్వచక్షుషా | = చర్మచక్షువులతో | చక్షుః | = దృష్టిని |
| ద్రష్టుమ్ | = చూచుటకు | దదామి | = ఇచ్చెదను |
| ఏవ | = నిస్సందేహముగా | మే, ఐశ్వరమ్ యోగమ్ | = నా దివ్యయోగశక్తిని |
| న, శక్యసే | = సమర్థుడవుకావు | పశ్య | = చూడు |

**అనేన ఏవ స్వ-చక్షుషా తు మామ్ ద్రష్టుమ్ న శక్యసే, (అత ఏవ)**
**దివ్యమ్ చక్షుః తే దదామి, మే ఐశ్వరమ్ యోగమ్ పశ్య ।**

తా: కాని ఈ నా రూపమును ఈ చర్మచక్షువులతో చూచుటకు నిస్సందేహముగా సమర్థుడవు కావు. అందువల్ల నీకు దివ్యమైన దృష్టిని ఇచ్చెదను. నా దివ్యయోగశక్తిని చూడు.

మనం చూసిన దివ్యచక్షువులను ఇక్కడ పరిచయం చేస్తున్నాడు కృష్ణపరమాత్మ. రెండు రకాల చక్షువులు ఉండాలి మనకు. లౌకికచక్షువు, దివ్యచక్షువు. లౌకిక విషయాలను చూడటానికి లౌకిక చక్షువులు కావాలి. కాని ఈశ్వరదర్శనానికి అవి సరిపోవు.

**అనేనైవ స్వచక్షుషా** – స్వచక్షుషా అంటే లౌకిక కన్నులు. లోకపరమైన కన్నులతో,

**మాం ద్రష్టుమ్ న తు శక్యసే** – నన్ను చూడలేవు. చూసినా దాని విలువ తెలియదు. శ్రీరాముణ్ణి రావణాసురుడు చూసినా అతనికి రాముని విలువ తెలియలేదని చూశాము.

నిజానికి కొంతమంది తిలకాన్ని దివ్యచక్షువుకు ప్రతీకగా తీసుకుంటారు. తిలకం పెట్టుకోవటానికి అనేక ప్రత్యేకతలు ఉన్నాయి కాని ఇది ఒక కారణం. అది భావనా చక్షువును సూచిస్తుంది. ఇది ఆలయానికి వెళ్ళినప్పుడు కావాలి.

కెమెరా భుజానికి తగిలించుకుని పుణ్యక్షేత్రాలకు వెళ్ళే యాత్రికుడు ఆలయంలో ఉన్న అనేక దేవతామూర్తుల ఫోటోలు, ఆలయంలో ఉట్టిపడుతున్న శిల్పకళల ఫోటోలు తీస్తాడు. అది క్రీస్తుపూర్వం వెలసిన ఆలయం అంటే మరికొన్ని ఫోటోలు తీస్తాడు. ఆ ఆలయచరిత్ర, దాని పుట్టుపూర్వోత్తరాలు, కళానైపుణ్యం, విగ్రహాల లోహాల వివరణలాంటివెన్నో తెలుసుకుంటాడు. వెనక్కి వెళ్ళి పెద్ద ప్రదర్శన ఏర్పాటుచేసి తను తీసిన కళాఖండాల గురించి కథలు కథలుగా జనబాహుళ్యంలోకి ప్రసారం చేసినా ఆశ్చర్యపోనవసరం లేదు. కాని ఆలయంలో అంతసేపున్నా, శ్రద్ధగా సాష్టాంగనమస్కారం చేయలేడు.

కాని మామూలుగా ఏ భక్తుడైనా ఏం చేస్తాడు? ఏదైనా ఆలయానికి వెళితే భక్తిభావనతో వెళతాడు. ఆ శిలావిగ్రహం పూర్వాపరాలు చర్చించకుండా, అందులో ప్రాణప్రతిష్ఠ చేయబడ్డ ఇష్టదైవాన్ని మనసారా స్మరిస్తాడు. ఆ విగ్రహానికి సాష్టాంగనమస్కారం చేస్తాడు. అంతేకాదు, విభూతిని నుదుట పెట్టుకుని, కొంచెం నోట్లో కూడా వేసుకుంటాడు. విభూతి ఎలా తయారు చేయబడింది, అది శుభ్రంగా ఉందా, లేదా అనే ఆలోచనలకు తావివ్వడు. ఇదంతా ఎలా చేయగలుగుతున్నాడు? భావనాచక్షువుతో. అంటే ఉన్న వస్తువుకు దైవత్వం ఆపాదించటంవల్ల.

అందువల్ల విశ్వరూపదర్శనం చెయ్యాలంటే దివ్యచక్షువు ఉండాలంటున్నాడు కృష్ణపరమాత్మ. నదికి నమస్కారం చేయాలన్నా, కొండకు నమస్కారం చేయాలన్నా దివ్యచక్షువు ఉండాలి. అది లేకపోతే వాటికి దైవత్వం ఆపాదించలేడు. అందువల్ల అర్జునా, నేను నీకు ఆ దివ్యచక్షువును ప్రసాదిస్తాను అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**పశ్య మే యోగమైశ్వరమ్** – ఎప్పుడైతే ఆ మార్పు వస్తుందో, అప్పుడు అదే ప్రపంచాన్ని నువ్వు కొత్తకోణంలో చూస్తావు. అంటే నా దివ్యయోగశక్తిని చూస్తావు అంటున్నాడు కృష్ణపరమాత్మ. అప్పుడు పంచభూతాలు కూడా పరమేశ్వరుడు అవుతాయి. అలా పంచభూతాలలో ఆకాశలింగంగా చిదంబరంలో; వాయులింగంగా కాళహస్తిలో; అగ్నిలింగంగా తిరువణ్ణామలైలో; జంబులింగంగా జంబుకేశ్వరంలో; పృథివీలింగంగా కంచిలో ఈశ్వరుణ్ణి కొలుస్తాము.

ముందు ఆ పంచభూతాలను పైన పేర్కొనబడిన ఆయా ఆలయాలలోనే కొలిచినా, నెమ్మదిగా మన చుట్టూ ఉన్న పంచభూతాలలో దైవత్వాన్ని చూడగలగాలి; అంతేకాదు పంచభూతాలనుంచి వచ్చిన ఈ జగత్తులో కూడా దైవత్వాన్ని చూడగలగాలి. నిజానికి భగవంతునినుంచి దూరంగా వెళ్ళే ప్రసక్తే లేదు. అలాంటప్పుడు దేవునికి దగ్గరగా వెళ్ళే మాటకు చోటేది? అందువల్ల విశ్వరూపదర్శనం చెయ్యగలిగే భక్తునికి దేవునికి దగ్గరగా వెళ్ళాలనే ఆలోచనకు తావే లేదు. అండపిండ బ్రహ్మాండాలన్నీ శివమయం లేదా రామమయం. ఈ జ్ఞానం పొందకపోతే, జగత్తు అంతా మాయామయం; ఈ జ్ఞానం పొందాక ఈశ్వరమయం.

**దివ్యం దదామి తే చక్షుః** – నా విశ్వరూపాన్ని చూడటానికి నీకు దివ్యచక్షువును ప్రసాదిస్తున్నాను అన్నాడు కృష్ణపరమాత్మ.

కృష్ణపరమాత్మ దివ్యదృష్టితో అర్జునుణ్ణి దీవిస్తున్నట్టుగా ఊహించుకోవాలి. అందువల్ల అక్కడ నిశ్శబ్దం నెలకొంది. ఇదే దృశ్యకావ్యం అయితే కృష్ణపరమాత్మ తన చేతిని చూపిస్తే, ఆయన చేతినుంచి ఒక కాంతి కిరణం ప్రసరించి, అర్జునుని మొహంలోకి వెళ్ళినట్టు చూపిస్తారు. అప్పుడు నేపథ్య సంగీతంతో మారుమ్రోగిస్తారు. ఇదంతా శబ్దకావ్యంలో కుదరదు కాబట్టి, వ్యాసాచార్యులవారు తన వివరణలో చూపించాలి.

ఈ దివ్యచక్షువును ప్రసాదిస్తున్నప్పుడు నెలకొన్న నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ సంజయుడు ఆ సన్నివేశాన్ని వివరిస్తాడు.

**సంజయ ఉవాచ**

శ్లో. 9 **ఏవముక్త్వా తతో రాజన్ మహాయోగేశ్వరో హరిః ।**
**దర్శయామాస పార్థాయ పరమం రూపమైశ్వరమ్ ॥**

ఏవమ్, ఉక్త్వా, తతః, రాజన్, మహాయోగేశ్వరః, హరిః,
దర్శయామాస, పార్థాయ, పరమమ్, రూపమ్, ఐశ్వరమ్ ॥

| | | | |
|---|---|---|---|
| రాజన్! | = ఓ రాజా! | తతః | = అనంతరము |
| మహాయోగేశ్వరః | = మహాయోగేశ్వరుడును | పార్థాయ | = అర్జునునకు |
| హరిః | = పాపములను హరించువాడును అగు భగవానుడు | ఐశ్వరమ్ | = షడ్గుణైశ్వర్య సంపన్నమైన |
| | | పరమమ్ | = తన పరమ |
| ఏవమ్ | = ఈ విధముగా | రూపమ్ | = దివ్యరూపమును |
| ఉక్త్వా | = చెప్పి | దర్శయామాస | = చూపెను |

**సంజయ ఉవాచ**

**హే రాజన్! ఏవమ్ ఉక్త్వా, తతః మహా–యోగ–ఈశ్వరః హరిః పార్థాయ**

**పరమమ్ ఐశ్వరమ్ రూపమ్ దర్శయామాస ।**

తా: ఓ రాజా! మహాయోగేశ్వరుడును, పాపములను హరించువాడును అగు భగవానుడు ఈ విధముగా చెప్పి అనంతరము అర్జుననకు షడ్గుణైశ్వర్య సంపన్నమైన తన పరమదివ్యరూపమును చూపెను.

**2. సంజయుని వివరణ శ్లోకాలు: 9–14**

**సంజయ ఉవాచ** – సంజయుడు వివరిస్తున్నాడు.

**రాజన్** – ఓ రాజా! ధృతరాష్ట్రుణ్ణి సంబోధిస్తున్నాడు.

**హరిః ఏవమ్ ఉక్త్వా** – హరి ఈ విధంగా పలికాడు అంటున్నాడు సంజయుడు. హరి ఎవరో కాదు, విష్ణుమూర్తి. విశ్వరూప ఈశ్వరుడు. అంటే ఈ కృష్ణపరమాత్మే ఆ విష్ణుమూర్తి అని చెప్పకనే చెబుతున్నాడు. అంతేకాదు, హరి పదానికి చాలా ప్రాముఖ్యత ఉంది.

**హరిర్హరతి పాపాని దుష్టచిత్తైరపి స్మృతాః ।**

**అనిచ్ఛయాఽపి సంస్పృష్టో దహత్యేవ హి పావకః ॥** – హర్యష్టకము

**హరిః పాపాని హరతి** – అంటే భక్తుల మనస్సులోంచి పాపాలను తీసివేస్తాడు విష్ణుమూర్తి. మనస్సు శుద్ధంగా లేకపోవటంవల్ల, రాగద్వేషాలతో నిండివుండటంవల్ల, నా కళ్ళముందు ఉన్న దైవత్వాన్ని చూడలేకపోతున్నాను. కాని హరి నా పాపాలను హరిస్తాడు.

**మహాయోగేశ్వరో హరిః** – ఈ హరి ఎలాంటివాడు? శుద్ధి చేసే గొప్ప శక్తి ఉన్నవాడు. మామూలుగా చిత్తశుద్ధి పొందాలంటే దాని వెనక సంవత్సరాల కృషి చేయాలి. కర్మయోగం, పంచమహాయజ్ఞాలు నిర్విరామంగా చేసి ఉండాలి. కాని కృష్ణపరమాత్మ తన లీలలను ఉపయోగించి, అర్జునునికి తాత్కాలికంగా చిత్తశుద్ధిని కలుగజేశాడు. అంటే అంతఃకరణశుద్ధి ఉంటే ఎలా ఉంటుందో, కృష్ణపరమాత్మ ఒకసారి రుచి చూపించాడు అర్జునునికి.

మహాయోగేశ్వరో హరిః ఏవముక్త్వా – గొప్పశక్తి ఉన్న హరి ఈ విధంగా మాట్లాడాడు అర్జునునితో. ఏమన్నాడు? అది ఇంతకుముందు శ్లోకంలో చూశాము. లౌకికచక్షువు సరిపోదు, దివ్యచక్షువు కావాలి అన్నాడు.

**పరమమ్ ఐశ్వరం రూపం దర్శయామాస** – కృష్ణపరమాత్మ తన విశ్వరూపదర్శనం చేయించాడు. ఐశ్వరం రూపం అంటే తన రూపం చూపించాడు. ఈశ్వరస్య ఇదమ్ ఐశ్వరమ్. ఆ విధంగా విశ్వరూపం చూపించాడు. అది ఎటువంటి విశ్వరూపం? పరమమ్ – శ్రేష్ఠమైన రూపం. ఎందుకు విశ్వరూపం శ్రేష్ఠమైనది? ఎందుకంటే తక్కిన రూపాలకు పరిమితి ఉంది. రామరూపం, కృష్ణరూపం, దేవీరూపం, గణేశరూపం – వీటిల్లో ఏది తీసుకున్నా వాటికి పరిమితి ఉంది. రామరూపం వస్తే కృష్ణరూపం అంతర్ధానమవాలి. అంటే వాటికి రాకపోకలు ఉన్నాయి. కాని విశ్వరూపానికి ప్రత్యేకత ఉంది. అది సర్వవ్యాపకం; సర్వరూపకం. అన్ని రూపాలూ అందులోనే వస్తాయి. రామరూపం, శివరూపం, కృష్ణరూపం ఏది కావాలన్నా వస్తుంది. అంతేకాదు, దానికి రాకపోకలు లేవు. మన కళ్ళముందే ఉంటుంది ఎప్పుడూ.

**ప్రాచ్యై దిశే నమః। దక్షిణాయై దిశే నమః। ప్రతీచ్యై దిశే నమః। ఉదీచ్యై దిశే నమః। ఊర్ధ్వాయ నమః। అధరాయ నమః। అంతరిక్షాయ నమః। భూమ్యై నమః। విష్ణవే నమః। మృత్యవే నమః** – సంధ్యావందనం

తూర్పుదిక్కుకు నమస్కారం; దక్షిణదిక్కుకు నమస్కారం; పశ్చిమదిక్కుకు నమస్కారం; ఉత్తరదిక్కుకు నమస్కారం; పైభాగానికి నమస్కారం; కిందభాగానికి నమస్కారం; అంతరిక్షానికి నమస్కారం; భూమికి నమస్కారం. అన్ని దిక్కులకూ ఎందుకు నమస్కారం చేస్తున్నాము? మనకు భగవంతుడు అంతటా ఉన్నాడు. ఈ భావనను చిన్నప్పటినుంచే మన ప్రార్థనలో రంగరించిపోసింది మన శాస్త్రం. దానివల్ల జగత్తును భగవంతునిగా చూడగలిగే శక్తి ఏర్పడుతుంది.

ఇలా అన్ని దిక్కులలో ఈశ్వరుడిని చూడగలగటం వ్యావహారిక ఈశ్వరదర్శనం కిందికి వస్తుంది; పారమార్థిక ఈశ్వరదర్శనం కాదు. ఆ విధంగా మన సాంప్రదాయం వ్యావహారిక స్థాయితో మొదలుపెట్టి, పారమార్థిక స్థాయికి నెమ్మదిగా తీసుకువెళుతుంది. ఇప్పుడు ఈ పరమం రూపం ఎవరికి చూపిస్తున్నాడు?

**పార్థాయ దర్శయామాస** – అంటే అర్జునునికి చూపిస్తున్నాడు.

శ్లో. 10 **అనేకవక్త్రనయనమ్ అనేకాద్భుతదర్శనమ్ ।**
**అనేకదివ్యాభరణం దివ్యానేకోద్యతాయుధమ్ ॥**
అనేకవక్త్రనయనమ్, అనేకాద్భుతదర్శనమ్,
అనేకదివ్యాభరణమ్, దివ్యానేకోద్యతాయుధమ్ ॥

శ్లో. 11 **దివ్యమాల్యాంబరధరం దివ్యగంధానులేపనమ్ ।**
**సర్వాశ్చర్యమయం దేవమ్ అనంతం విశ్వతోముఖమ్ ॥**
దివ్యమాల్యాంబరధరమ్, దివ్యగంధానులేపనమ్,
సర్వాశ్చర్యమయమ్, దేవమ్, అనంతమ్, విశ్వతోముఖమ్ ॥

అనేక = అనేకములైన
వక్త్ర నయనమ్ = ముఖములతో, నేత్రములతో ఒప్పుచున్నదియు
అనేక = పెక్కు
అద్భుత దర్శనమ్ = అద్భుతదృశ్యములను కలిగియున్నదియు
అనేక = అనేకములైన
దివ్యాభరణమ్ = దివ్యాభరణములను ధరించియున్నదియు
దివ్యానేకోద్యతా = అనేకములైన
యుధమ్
దివ్యాయుధములను
చేబూనియున్నదియు
దివ్య = దివ్యములైన
మాల్యాంబర = మాలలను, వస్త్రములను
ధరమ్ ధరించియున్నదియు
దివ్య = దివ్యములైన
గంధాను = చందన పరిమళములను దశదిశల
లేపనమ్ వ్యాపింప జేయుచున్నదియు
సర్వాశ్చర్యమయమ్ = సర్వాశ్చర్యకరమైనదియు

| | | | | | |
|---|---|---|---|---|---|
| అనంతమ్ | = అనంతమైనదియు | | | | విరజిమ్ము చున్నదియు అగు |
| విశ్వతోముఖమ్ | = సర్వత్రముఖశోభలను | | దేవమ్ | = | ఆ దేవదేవుని విరాఢ్రూపమును |
| | | | | | అర్జునుడు దర్శించెను |

**అనేక–వక్త్ర–నయనమ్, అనేక–అద్భుత–దర్శనమ్,**

**అనేక–దివ్య–ఆభరణమ్, దివ్య–అనేక–ఉద్యత–ఆయుధమ్ ।**

**దివ్య–మాల్య–అమ్బర–ధరమ్, దివ్య–గన్ధ–అనులేపనమ్,**
**సర్వ–ఆశ్చర్యమయమ్, అనన్తమ్, విశ్వతోముఖమ్ దేవమ్ (అర్జునః అపశ్యత్) ।**

తా: అనేకములైన ముఖములతో, నేత్రములతో ఒప్పుచున్నదియు, పెక్కు అద్భుతదృశ్యములను కలిగియున్నదియు, అనేకములగు దివ్యాభరణములను ధరించియున్నదియు, అనేకములైన దివ్యాయుధములను చేబూని యున్నదియు, దివ్యములైన మాలలను, వస్త్రములను ధరించియున్నదియు, దివ్యములైన చందన పరిమళములను దశదిశల వ్యాపింప జేయుచున్నదియు, సర్వాశ్చర్యకరమైనదియు, అనంతమైనదియు, సర్వత్ర ముఖశోభలను విరజిమ్ముచున్నదియు అగు ఆ దేవదేవుని విరాఢ్రూపమును అర్జునుడు దర్శించెను.

ఇక్కడ్నుంచి విశ్వరూపదర్శనం సంజయునిద్వారా చేస్తాము మనం కూడా. సంజయుడు వివరిస్తున్నాడు కాబట్టి అతనికి కూడా విశ్వరూపదర్శనం అయిందన్నమాట.

**అనేకవక్త్రనయనమ్** – వక్త్రం అంటే నోరు. నయనం అంటే కన్ను. అనేక నోళ్ళతో, అనేక కన్నులతో కనబడ్డాడుట. అంటే అక్షరాలా ఆయన వంటి నిండా అనేక నోళ్ళు, కళ్ళు ఉన్నట్టు కాదు; అందరి మొహాలూ భగవంతునిలోనే ఉన్నాయని అర్థం. సముద్రానికి భిన్నంగా అల లేదు; సమష్టికి భిన్నంగా వ్యష్టి లేదు; నేనే భిన్నంగా లేకపోతే నా నోరు, నా కన్ను అని విడిగా చూసే ఆస్కారం ఎక్కడ?

**తన్ మన్ ధన్ సబ్‌కుచ్ తేరా**

ఎంత అద్భుతమైన ప్రార్థన. శరీరం, మనస్సు, డబ్బు సర్వస్వం నీకే చెందుతాయి. ఆ ప్రార్థన మనస్ఫూర్తిగా చేస్తే దానికి విలువ ఉంటుంది. ఎవరో అన్నారు, 'మనసారా భావించకుండా పైపై మాటలు చెప్పేకన్నా, మాటల్లో పలకలేని నిండుమనస్సుతో కూడిన ప్రార్థన ఉత్తమమైనది.'

**అనేకాద్భుతదర్శనమ్** – అనేక అద్భుతాలు ఉన్నాయి. అన్నీ భగవంతుని అద్భుతాలే. అవి మనకు తెలిసిన ఏడు అద్భుతాలో, పద్నాలుగు అద్భుతాలో కాదు. అంతులేనన్ని అద్భుతాలు.

**అనేకదివ్యాభరణమ్** – అనేకదివ్యాభరణాలను ధరించాడు. అంటే అక్షరాలా అన్ని ఆభరణాలు వేసుకున్నాడని కాదు; ఆభరణాలన్నీ ఆయనకు చెందినవే.

అందువల్లనే మన సాంప్రదాయం ఏదైనా ఆభరణం ధరించేముందు, ఆ మాటకొస్తే కొత్తదుస్తులు ధరించేముందు

వాటికి పసుపు కుంకుమలు పెట్టి, భగవంతునికి అర్పించి, తీసుకోవాలని నేర్పిస్తుంది. అప్పుడు వాటిమీద మనకు మమకారం ఏర్పడదు. అవి భగవంతునికి చెందుతాయని గుర్తుంచుకోవటమే కాక, వాటిని భగవంతునికి తిరిగి అప్పచెప్పాల్సిన సమయంలో చిరునవ్వుతో అర్పిస్తాము. అందువల్ల ఆభరణాలన్నీ ఆయనవే.

**దివ్యానేకోద్యతాయుధమ్** – ఎత్తిపట్టిన చేతుల్లో అనేక దివ్యాయుధాలు ఉన్నాయి. అంటే భగవంతునికి అనేక వేల చేతులు ఉన్నట్టు, ఒక్కొక్క చేతిలోనూ ఒక్కొక్క ఆయుధం ఉన్నట్టు ఊహించుకోకూడదు. విశ్వరూపదర్శన చిత్రపటం అలా వేస్తారు కాని అసలు అర్థం ఆయుధాలన్నీ ఆయనవే.

సంజయుడు ప్రత్యేకించి ఆయుధాల గురించి ఎందుకు చెప్పాడు? భగవద్గీత బోధ యుద్ధరంగం మధ్యలో జరుగుతున్నదనే విషయం మర్చిపోకూడదు. ఒకవైపు ఏడు, ఇంకొకవైపు పదకొండు అక్షౌహిణుల సైన్యం ఉంది. వాళ్ళంతా అనేక రకాల ఆయుధాలతో వచ్చివున్నారు. అవన్నీ కూడా విశ్వరూప ఈశ్వరునికే చెందుతాయి. ఉద్యత అంటే ఎత్తిపట్టిన ఆయుధం.

ఆయుధానికి దైవత్వం ఎలా వస్తుంది? రెండు కారణాలవల్ల వస్తుంది. ఒక ఆయుధాన్ని మనిషి పట్టుకుంటే అది లౌకికం, కాని అదే ఆయుధాన్ని భగవంతుడు పట్టుకుంటే, దానికి దైవత్వం ఆపాదించబడుతుంది. అంటే ఆ వస్తువుకు దైవత్వం ఉందా, లౌకికత్వం ఉందా అనేది అది పట్టుకున్న వ్యక్తిని బట్టి ఉంటుంది.

ఒక ఆపిల్‌పండును బజారులో కొని తింటే, అది వ్యావహారికం; అదే ఆపిల్‌ను భగవంతునికి అర్పించి తింటే అది ఆధ్యాత్మికం. విశ్వరూపదర్శనం చేసిన భక్తునికి ఇంక లౌకికంగా ఏదీ మిగలదు. సర్వం విష్ణుమయం జగత్ అంటాడు.

ఆయుధాలకు, ఆభరణాలకు దైవత్వం రావటానికి రెండవ కారణం, అవి ధర్మసంరక్షణకోసం వాడబడటం.

**ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే** – 4.8

ఎప్పుడైతే ఒక ఆయుధాన్ని ధర్మంకోసం వినియోగిస్తామో, అప్పుడే ఆ ఆయుధానికి భగవంతునితో అనుబంధం ఏర్పడుతుంది. **ధర్మః ఏవ ఈశ్వరః**. అందువల్లనే రామో విగ్రహవాన్ ధర్మః అంటాము. విశ్వాన్ని ఒక క్రమపద్ధతిలో నడిపేది ఈశ్వరుడు. అందువల్ల ధర్మాన్ని పాటించటానికి వాడే ఆయుధం దివ్యాయుధం అవుతుంది.

ఈ పదాలన్నీ తొమ్మిదవ శ్లోకంలో చెప్పిన ఐశ్వరం రూపమ్‌కు విశేషణాలు. ఇవి పదకొండవ శ్లోకంలో కూడా కొనసాగుతున్నాయి.

**దివ్యమాల్యాంబరధరమ్** – అనేక దివ్యమైన మాలలను, వస్త్రాలను ధరించాడు. అంటే మనుష్యులు ధరించే మాలలు, వస్త్రాలు అన్నీ భగవంతునివే.

**దివ్యగంధానులేపనమ్** – విశ్వరూపం అనేక సుగంధాలను గుభాళింపజేస్తున్నది. అంటే మనం వాడే అన్ని సుగంధాలూ భగవంతునివే. అందువల్లనే విభూతిని ధరించేటప్పుడు కూడా ఒక మంత్రం ఉంది. దాన్ని విభూతి ధారణ మంత్రం అంటారు. వైష్ణవులు శరీరం అంతటా విభూతి ధరించినప్పుడు నారాయణుణ్ణి తలుచుకోవాలి.

అంటే నేను అలంకరిస్తున్నది నా శరీరాన్ని కాదు, నీ శరీరాన్నే అని అర్థం.

**విశ్వతోముఖమ్** – అనేక ముఖాలు ఉన్నాయి. అన్ని దిక్కుల వైపూ ఈ ముఖాలు చూస్తున్నాయి.

**అనంతమ్** – సరిహద్దులు లేవు. ఇప్పుడున్న విశ్వం ఎంత ఉందో తెలియదు, అది ఇంకా విస్తరిస్తోందని, నక్షత్రాలు ఇంకా వెనక్కి వెళుతున్నాయనీ అంటారు. అలాంటప్పుడు ఎంత పెద్దది విశ్వం?

**పాదోఽస్య విశ్వాభూతాని త్రిపాదస్యామృతందివి**

**త్రిపాదూర్ధ్వ ఉదైత్ పురుషః పాదోస్యేహాఽభవత్పునః** – పురుషసూక్తం

ఈ అనంతమైన విశ్వం, విశ్వరూపంలో ఒక చిన్న భాగం మాత్రమే అంటుంది పురుషసూక్తం. అంటే ఈ విశ్వం భగవంతునిలో ఒక చిన్నమాల అంటే, భగవంతుడు ఇంకెంత పెద్దగా ఉండివుండాలి? అనంతం అంటే కాలపరిమితి లేదు, దేశపరిమితి లేదు.

**సర్వాశ్చర్యమయం దేవమ్** – విశ్వరూప ఈశ్వరుడు అన్నింటికన్నా గొప్ప అద్భుతం. దేవం అంటే విశ్వరూప ఈశ్వరుడు. దీన్ని పార్థాయ దర్శయామాసతో కలుపుకోవాలి.

**మహాయోగేశ్వరో హరిః పార్థాయ దర్శయామాస**

అటువంటి విశ్వరూపాన్ని అర్జునుడు దర్శించాడు. అంటే 10, 11 శ్లోకాలకు క్రియాపదంగా దర్శయామాస కలుపుకోవాలి.

ఇక్కడ కూడా జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. అర్జునునికి కృష్ణపరమాత్మ విశ్వరూపదర్శనం చేయించాడు అంటే అంతకుముందు విశ్వరూపం లేనట్టూ, ఇప్పుడు కొత్తగా వచ్చినట్టూ అర్థం వస్తుంది. కాని అది కాదు ఇక్కడ అర్థం. నిజంగా ఒక ఆకారంలో కనబడటం కాదు, అతని దృష్టిలో మార్పు తీసుకువచ్చాడు. జగత్తును బ్రహ్మగా చూడటానికి అడ్డుపడే ఆటంకాలను తొలగించాడు విశ్వరూపదర్శనంద్వారా.

శ్లో. 12 **దివి సూర్యసహస్రస్య భవేద్యుగపదుత్థితా।**

**యది భాః సదృశీ సా స్యాత్ భాసస్తస్య మహాత్మనః ॥**

దివి, సూర్యసహస్రస్య, భవేత్, యుగపత్, ఉత్థితా,

యది, భాః, సదృశీ, సా, స్యాత్, భాసః, తస్య, మహాత్మనః ॥

| | | | |
|---|---|---|---|
| దివి | = ఆకాశమునందు | మహాత్మనః | = విరాట్ పురుషునియొక్క |
| సూర్యసహస్రస్య | = వేలకొలది సూర్యులయొక్క | భాసః | = కాంతులకు |
| భాః | = కాంతిపుంజము | సదృశీ | = సమానమైనది |
| యుగపత్ | = ఒక్కసారిగా | యది | = బహుశా |
| ఉత్థితా, భవేత్ | = ఉదయించినచో | స్యాత్ | = అవుతుందేమో?(అయినను సమానము కాదని దీని భావము) |
| సా | = ఆ కాంతిపుంజము | | |
| తస్య | = ఆ | | |

**యది దివి సూర్య–సహస్రస్య భాః యుగపత్ ఉత్థితా భవేత్,**

**(తర్హి) సా తస్య మహాత్మనః భాసః సదృశీ స్యాత్ ।**

తా: ఆకాశమునందు వేలకొలది సూర్యులయొక్క కాంతిపుంజము ఒక్కసారిగా ఉదయించినచో ఆ కాంతిపుంజము ఆ విరాట్ పురుషునియొక్క కాంతులకు సమానమైనది బహుశా అవుతుందేమో? (అయినను సమానము కాదని దీని భావము).

అటువంటి విశ్వరూప ఈశ్వరుని తేజస్సు ఎంత ఉండాలి? ప్రచండంగా ఉన్న సూర్యుడినే మనం చూడలేక పోతున్నాము. సూర్యుడు కొన్నికోట్ల మైళ్ళ దూరంలో ఉన్నాడు. సూర్యకాంతి మన భూమిమీద పడటానికి కొన్ని నిముషాలు అవుతుంది. అదే మనం తట్టుకోలేకపోతే, విశ్వరూపంలో అటువంటి జ్యోతులన్నిటినీ కలిపి చూడాలంటే అది ఎంత కాంతివంతంగా ఉండివుంటుంది? అందువల్ల సంజయుడే ఒక ఉదాహరణ కూడా ఇస్తున్నాడు.

**సూర్యసహస్రస్య భాః** – వేలాది సూర్యులయొక్క కాంతులు;

**ఉత్థితా** – ఒకేసారి ఆకాశంలో ఉదయిస్తే ఎంతకాంతి ఉంటుందో అంత కాంతి ఉంది అంటున్నాడు సంజయుడు.

అణుబాంబు విస్ఫోటన జరిగినప్పుడు, ఒక శాస్త్రజ్ఞుడు దానిని వివరించటానికి ఈ వాక్యాన్ని అంటే సూర్యసహస్రస్య భాః – ఉటంకించాడుట. ఒక మామూలు అణుబాంబుకే అంత కాంతి ఉంటే, నక్షత్రాలకు ఇంకెంత కాంతి ఉంటుందో ఊహించుకోండి. ఒక్క సూర్యకాంతినే మనం భరించలేము.

**యుగపత్** – అలాంటిది వేలాది సూర్యులు ఒక్కసారిగా ఉదయిస్తే ఎంత మిరుమిట్లు గొలిపే కాంతి ఉంటుందో,

**తస్య మహాత్మనః భాసః సదృశీ స్యాత్** – అంత గొప్పగా ఉంది ఆ విశ్వరూప ఈశ్వరుని కాంతి. మహాత్మ అంటే విశ్వరూప ఈశ్వరుడు. ఇక్కడ ఆత్మ అంటే సచ్చిదానంద ఆత్మ కాదు; ఇక్కడ శరీరం. మహాత్మా అంటే భగవంతునియొక్క అనంతమైన శరీరం. విశ్వరూపదర్శనంయొక్క కాంతితో వెయ్యి సూర్యకాంతులు కూడా సరిపోవు అని అర్థం.

శ్లో. 13 **తత్రైకస్థం జగత్ కృత్స్నం ప్రవిభక్తమనేకధా ।**

**అపశ్యద్దేవదేవస్య శరీరే పాండవస్తదా ॥**

తత్ర, ఏకస్థమ్, జగత్, కృత్స్నమ్, ప్రవిభక్తమ్, అనేకధా,

అపశ్యత్, దేవదేవస్య, శరీరే, పాండవః తదా ॥

| | | | |
|---|---|---|---|
| తదా | = అప్పుడు | దేవదేవస్య | = దేవదేవుడైన విరాట్ పురుషునియొక్క |
| అనేకధా | = పెక్కు విధములుగా | తత్ర, శరీరే | = ఆ శరీరమునందు |
| ప్రవిభక్తమ్ | = వేర్వేరుగా వివిధ బ్రహ్మాండములుగా విభక్తమైయున్న | ఏకస్థమ్ | = కేంద్రీకృతమైయున్నట్లు |
| కృత్స్నమ్, జగత్ | = సమస్త జగత్తును | పాండవః | = అర్జునుడు |
| | | అపశ్యత్ | = చూచెను |

**పాణ్డవః తదా అనేకధా ప్రవిభక్తమ్ కృత్స్నమ్ జగత్,**
**తత్ర దేవ-దేవస్య శరీరే ఏకస్థమ్ అపశ్యత్ ।**

తా: అప్పుడు పెక్కు విధములుగా వేర్వేరుగా వివిధ బ్రహ్మాండములుగా విభక్తమైయున్న సమస్త జగత్తును దేవదేవుడైన విరాట్ పురుషునియొక్క ఆ శరీరమునందు కేంద్రీకృతమై యున్నట్లు అర్జునుడు చూచెను.

సంజయుడు విశ్వరూప ఈశ్వరవర్ణనను ఇంకా కొనసాగిస్తున్నాడు. భగవంతుని శరీరంగా సర్వవ్యాపకమైన ఆకాశాన్ని తీసుకోవచ్చు. ఆ శరీరంలో అర్జునుడు అంతా చూశాడు.

**కృత్స్నం జగత్ ఏకస్థమ్ అపశ్యత్** – ఆ ఒక్క అనంతమైన దేవదేవుని శరీరంలో మొత్తం జగత్తును చూశాడు అర్జునుడు అంటున్నాడు సంజయుడు. ఎలాంటి జగత్తు అది?

**అనేకధా ప్రవిభక్తమ్** – అనేక రూపాలుగా విభజించబడివుంది జగత్తు. సమష్టిస్థాయిలో ముందు నక్షత్రమండలాలు; తర్వాత స్థాయిలో సౌరమండలం; ఆ తర్వాత స్థాయిలో గ్రహాలు, తర్వాత ఖండాలు, దేశాలు ఉన్నాయి. భగవంతుడు ఖండాల విభజనే చేశాడు, మనమే వాటిని దేశాలుగా విడగొట్టుకున్నాము. యశోదాదేవి పద్నాలుగు లోకాలను బాలకృష్ణుని నోటిలో చూసినట్టుగా, ఇప్పుడు అర్జునుడు విశ్వరూపదర్శనం చేసుకుంటున్నాడు. ఎక్కడ?

**దేవదేవస్య శరీరే** – భగవంతుని శరీరంలో. దేవదేవుడు అంటే ఈశ్వరుడు. శరీరం అంటే అక్షరాలా శరీరంగా తీసుకోకూడదని చూశాము. మొత్తం ఆకాశం (స్పేస్) అంతా. అందువల్ల

**దేవదేవస్య ఆకాశాత్మకశరీరే, అనంతశరీరే పాండవః తదా**

**పాండవః తదా** – అప్పుడు అర్జునుడు చూశాడు. అప్పుడు అంటే ఎప్పుడు? కృష్ణపరమాత్మ దివ్యచక్షువును ఇచ్చినప్పుడు. అంతకు ముందు కూడా అదే ప్రపంచాన్ని చూశాడు అతను. కాని అప్పుడు ఆ ప్రపంచం ఎలా ఉంది? తనను బాధిస్తున్నది, సమస్యాపూరితంగా ఉంది, భరించలేనిదిగా ఉంది, మోయలేని భారాన్ని మోపుతున్నది. ఇప్పుడు అదే జగత్తు మారిపోయింది. అందువల్ల **తదా** అంటే కృష్ణపరమాత్మ దివ్యచక్షువును ప్రసాదించిన తర్వాత. దివ్యచక్షువుతో అర్జునుడు విశ్వరూపాన్ని చూశాడు.

దివ్యచక్షువు అంటే శుద్ధ అంతఃకరణం, జ్ఞానం పొందిన బుద్ధియొక్క మేలు కలయిక అని చూశాము. మాంసచక్షువు వెనక ఈ దివ్యచక్షువు ఉంటే ప్రపంచాన్ని ఈశ్వరునిగా చూస్తాము. మాంసచక్షువు అంటే మనకున్న మామూలు కన్ను.

శ్లో. 14 **తతః స విస్మయావిష్టో హృష్టరోమా ధనంజయః ।**
**ప్రణమ్య శిరసా దేవం కృతాంజలిరభాషత ॥**
తతః, సః, విస్మయావిష్టః, హృష్టరోమా, ధనంజయః,
ప్రణమ్య, శిరసా, దేవమ్, కృతాంజలిః, అభాషత ॥

| | | | |
|---|---|---|---|
| తతః | = ఆ పిమ్మట | దేవమ్ | = ఆ విరాట్ పురుషునకు |
| సః, ధనంజయః | = ఆ అర్జునుడు | శిరసా, ప్రణమ్య | = సాష్టాంగముగా నమస్కరించి |
| విస్మయావిష్టః | = ఆశ్చర్యచకితుడై | కృతాంజలిః | = అంజలి ఘటించినవాడై |
| హృష్టరోమా | = నిక్కబొడుచుకున్న రోమాలతో | అభాషత | = భాసించెను |

**తతః విస్మయ–ఆవిష్టః హృష్ట–రోమా సః ధనఞ్జయః, దేవమ్**
**శిరసా ప్రణమ్య, కృత–అఞ్జలిః అభాషత ।**

తా: ఆ పిమ్మట ఆ అర్జునుడు ఆశ్చర్యచకితుడై, నిక్కబొడుచుకున్న రోమాలతో ఆ విరాట్ పురుషునకు సాష్టాంగముగా నమస్కరించి అంజలి ఘటించినవాడై భాసించెను.

ఎప్పుడైతే అర్జునుడు తన దివ్యచక్షువుతో విశ్వరూప ఈశ్వరుడిని దర్శించాడో, అప్పుడే అర్జునుడు పులకించి పోయాడు. అతని ఆనందానికి అవధులు లేవు. ముందే చెప్పినట్టుగా, ఇది దృశ్యకావ్యమయి ఉంటే, అర్జునుని మొహాన్ని అనేకకోణాల్లో చూపించి ఉండేవారు. కాని అదంతా వ్యాసాచార్యులవారు తన వాక్పటిమతో వర్ణించాలి, అది కూడా సంజయుని కళ్ళద్వారా.

**తతః స విస్మయావిష్టః** –అర్జునుడు విస్మయానికి లోనయ్యాడు. ఎందుకు? అర్జునుడు కొత్తగా ఏమీ చూడటం లేదు, ఒక మామూలు విషయాన్ని కొత్తకోణంలోంచి చూస్తున్నాడు. అంటే చూసే దృశ్యం అసాధారణమైనది కాదు, చూసే దృక్పథం అసాధారణమైనది. విస్మయావిష్టః అంటే ఆశ్చర్యచకితుడు అయ్యాడు. అతను మనస్సులో ఎంత తీవ్రంగా స్పందించాడంటే అది భౌతికశరీరంలో కూడా కనిపించింది. మనస్సు, శరీరాలు వేర్వేరు వస్తువులు కావు; ఆ రెండింటికీ అవినాభావ సంబంధం ఉంటుంది. ఆ విషయం మొదటి అధ్యాయంలోనే చూశాము. అర్జునుడు రాగ, మోహాల్లో పడ్డాడు. అవి మానసికస్థాయికి చెందినవి; అవి శోకరూపంలో శరీరస్థాయికి వచ్చాయి. **సీదంతి మమ గాత్రాణి ముఖం చ పరిశుష్యతి** – 1.29

అన్నాడు అర్జునుడు. ఇక్కడ కూడా మానసికోద్వేగం చాలా ఎక్కువగా ఉంది. అది శరీరం వరకు ప్రాకింది.

**హృష్టరోమా ధనంజయః** – అర్జునుని రోమాలు నిక్కబొడుచుకున్నాయి. భగవంతుని విశ్వరూపం ఎంత గొప్పగా ఉందంటే, ఆయన ముందు మనం ఒక చిన్న ఇసుకరేణువులాంటివారము. నిజానికి గగనంలో ఒక్క ఇసుకరేణువు అనేక నక్షత్రాల కూటమిలాంటిదని ఒక శాస్త్రజ్ఞుడు చెప్పారని చూశాము. అలాంటప్పుడు, ఒక వ్యష్టిగా మనం అందులో ఎంత ఉంటాము? మన అల్పత్వాన్ని ఎలా చూపించగలము?

**శిరసా ప్రణమ్య** – సాష్టాంగనమస్కారం చేశాడు. ఎవరికి?

**దేవమ్** – విశ్వరూప ఈశ్వరునికి.

**కృతాంజలిః** – అంజలి ఘటించాడు. అంటే నమస్కారముద్రతో రెండు చేతులనూ జోడించటాన్ని అంజలి ఘటించారు అంటారు.

**అభాషత** – అర్జునుడు ఇలా చెప్పాడు అంటున్నాడు సంజయుడు. అంటే అర్జునుడు మాట్లాడటానికి కొంత సమయం తీసుకున్నప్పుడు, సంజయుడు ఆ సన్నివేశాన్ని వివరించాడు. ఇప్పుడు అర్జునుడు సిద్ధమయ్యేసరికి, సంజయుడు తప్పుకున్నాడు. అర్జునుడు విశ్వరూప ఈశ్వరుణ్ణి ఎలా వర్ణిస్తాడో చూద్దాము.

**అర్జున ఉవాచ**

శ్లో. 15 **పశ్యామి దేవాంస్తవ దేవ దేహే సర్వాంస్తథా భూతవిశేషసంఘాన్ ।**
**బ్రహ్మాణమీశం కమలాసనస్థమ్ ఋషీంశ్చ సర్వానురగాంశ్చ దివ్యాన్ ॥**
పశ్యామి, దేవాన్, తవ, దేవ, దేహే, సర్వాన్, తథా, భూతవిశేషసంఘాన్,
బ్రహ్మాణమ్, ఈశమ్, కమలాసనస్థమ్, ఋషీన్, చ, సర్వాన్, ఉరగాన్, చ, దివ్యాన్ ॥

| | | | |
|---|---|---|---|
| దేవ! | = ఓ పరమేశ్వరా! | ఈశమ్ | = శంకరుని |
| తవ దేహే | = విరాట్ స్వరూపమందు | చ | = ఇంకా |
| సర్వాన్, దేవాన్ | = సకల దేవతలను | సర్వాన్ | = సమస్త |
| తథా | = అలాగే | ఋషీన్ | = ఋషులను |
| భూతవిశేష | = వివిధ ప్రాణి | చ | = ఇంకా |
| సంఘాన్ | సముదాయములను | దివ్యాన్ | = దివ్యములైన |
| కమలాసనస్థమ్ | = కమలమందు ఆసీనుడైయున్న | ఉరగాన్ | = సర్పములను |
| బ్రహ్మాణమ్ | = బ్రహ్మను | పశ్యామి | = చూచుచున్నాను |

**అర్జున ఉవాచ**
**హే దేవ! (అహం) తవ దేహే సర్వాన్ దేవాన్, తథా భూత–విశేష–సఙ్ఘాన్, కమల–ఆసనస్థమ్ ఈశమ్ బ్రహ్మాణమ్ చ, సర్వాన్ ఋషీన్, దివ్యాన్ ఉరగాన్ చ పశ్యామి ।**

తా: ఓ పరమేశ్వరా! నీ విరాట్ స్వరూపమందు సకల దేవతలను అలాగే వివిధ ప్రాణి సముదాయములను, కమలమందు ఆసీనుడైయున్న బ్రహ్మను, శంకరుని, సమస్తఋషులను ఇంకా దివ్యములైన సర్పములను చూచుచున్నాను.

ఇప్పుడు అర్జునుడు తను చూసిన విశ్వరూపాన్ని వర్ణించబోతున్నాడు. ఆ విశ్వరూపాన్ని ప్రత్యేకంగా కీర్తించాలి వ్యాసాచార్యులవారు. ఎలా చూపిస్తారు దాన్ని? ఇప్పుడు అచ్చులో గ్రంథాలు వస్తున్నప్పుడు ఇలా ఏదైనా ప్రత్యేకంగా చెప్పాలంటే దాన్ని పెద్ద అక్షరాలతో చూపటమో, అండర్‌లైన్ చెయ్యటమో, ఇటాలిక్స్‌లో చూపటమో చేస్తారు. కాని ఆ రోజుల్లో ఆకులమీద రాసేటప్పుడు ఇలాంటివి కుదరవు కదా.

అందువల్ల వ్యాసాచార్యులవారు తను వాడుతున్న ఛందస్సును మార్చారు. అంతవరకూ ఒక ఛందస్సులో సాగుతున్నది, ఉన్నట్టుండి ఛందస్సు మారితే మనలో కూడా ఒక విధమైన చలనం వస్తుంది. ఇంతవరకూ వాడిన రాగం పనికిరాదు. దీని రాగం వేరు. ఆ విధంగా, ఛందస్సును మార్చటంద్వారా వ్యాసాచార్యులవారు అర్జునునిలోని ఆశ్చర్యభావాలను వ్యక్తం చేశారు.

## మూడు దశల్లో అర్జునుని స్పందన

అర్జునుడు మూడు రకాల భావాలను వ్యక్తం చేశాడు.

### 3. విస్మయం లేదా ఆశ్చర్యం: శ్లోకాలు 15–22

మొదటిది **విస్మయం** లేదా **ఆశ్చర్యం**. నిజానికి మనకు కూడా ప్రపంచం ఆశ్చర్యకరంగానే కనిపిస్తుంది, మన ఆలోచనలతో ప్రమేయం లేకుండా దాన్ని బాహ్యంగా చూడగలిగితే. ఎప్పుడైతే ప్రపంచాన్ని మన కళ్ళతో చూస్తామో అప్పుడే దాని అందాన్ని ఆస్వాదించలేము.

ఉదాహరణకు, మనం ఏదో మంచి కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నాము, కాని అనుకోకుండా హఠాత్తుగా వాన కురవటం మొదలుపెట్టింది. నిజానికి ఈ వానకోసం అల్లాడిపోతున్నాము. కురవాల్సిన సమయంలో కురవలేదు, ఆ రోజు వాన కురిస్తే మనం దాన్ని ఆస్వాదించలేము. రాకరాక ఇవాళే రావాలా ఈ వాన అని తిట్టుకుంటాము. అప్పుడేమయింది? భగవంతుని సృష్టిలోని ఒక అద్భుతాన్ని అద్భుతంగా చూడలేకపోతున్నాము.

జగత్తును మన కళ్ళతో చూడటాన్ని శాస్త్రం జీవసృష్టి అంటుంది. జీవసృష్టి రాగద్వేషాల రూపంలో, కామక్రోధాల రూపంలో, అహంకారమమకారాల రూపంలో ప్రకటితమవుతుంది. అందువల్ల ఇప్పుడు అర్జునుడు పొందిన ఆశ్చర్యం మనం పొందలేకుండా ఉన్నాము. అర్జునుణ్ణుంచి కృష్ణపరమాత్మ ఈ అహంకారమమకారాల పొరలు తీశాడు కాబట్టి, అతను జీవసృష్టినుంచి బయటపడి ఈశ్వరసృష్టిని చూడగలిగాడు. అంటే జగత్తును ఉన్నదున్నట్టుగా చూడగలిగాడు. దానిలోని అద్భుతాలను ఆస్వాదించగలుగుతున్నాడు.

అంటే ప్రపంచం అంతా ఇలా హింసాకాండలు చెలరేగిపోతున్నా కూడా ప్రపంచం అద్భుతంగా ఉందంటారా? అవును, అయినా కూడా జగత్తు అద్భుతంగా ఉంది. ఎందుకంటే మీరు ఈ ప్రశ్న అడిగినప్పుడు మీరు జగత్తులో కేవలం పంచభూతాల్లోని పృథివిని మాత్రమే చూస్తున్నారు; అది కూడా అందులోని నేలను, నేలమీద ఉన్న కొంతమంది మనుష్యులను, అందులోనూ రాక్షసప్రవృత్తి ఉన్న మనుష్యులను మాత్రమే చూస్తున్నారు. విశ్వం మొత్తాన్ని చూస్తే, అందులో మీరు చెప్పే ఈ రాక్షసకృత్యాలు ఒక చిన్న దోమకాటులాంటిది మాత్రమే.

ఈ భూలోకం మొత్తం నాశనమయినా కూడా, మొత్తం విశ్వంలో అది ఒక చిన్న ఇసుకరేణువులాంటిది మాత్రమే. ఒక కాగితంమీద చిన్నమరకను దగ్గరగా చూస్తే అది పెద్దదిగా అనిపిస్తుంది; కాని అదే మరకను చాలా దూరంగా చూస్తే కనీకనపడకుండా ఉంటుంది. అందువల్ల మీరు చూస్తున్నది కాస్త రాక్షసగుణం ఉన్న వారి గురించి. దురదృష్టవశాత్తూ మన వార్తాపత్రికల్లో కూడా ఇలాంటి ప్రతికూల సంఘటన వార్తలే తాటికాయంత అక్షరాలతో చోటుచేసుకుంటాయి. ఎక్కడో హత్య జరగటం ఆలస్యం, ఎక్కడో దొంగతనం జరగటం ఆలస్యం, ఎక్కడో తీవ్రవాదులు ప్రజలను బాధించటం ఆలస్యం, అవి ప్రధానంగా వార్తాపత్రికలలో వచ్చేస్తాయి.

ఎన్నో అద్భుతాలు కూడా జరుగుతాయి కాని వాటి గురించి ఎవరూ రాయరు. మనం కేవలం ఇవే చదువుతూ కూర్చుంటే ప్రపంచం అంటే ఇంతే అనుకుంటాము, విశ్వరూపదర్శనం చెయ్యలేము. విశ్వరూపదర్శనం చేయగలిగితే, ప్రపంచయుద్ధం కూడా చిన్న గుండుసూదితో గుచ్చినంత బాధ కలిగిస్తుంది అంతే. అందువల్ల

జగత్తును జీవసృష్టిగా కాక, ఈశ్వరసృష్టిగా చూడటం నేర్చుకోవాలి. అహంకార మమకారాలను వీడి, వస్తువును వస్తువుగా చూడాలి. అప్పుడు అద్భుతాలు తెలుస్తాయి. అర్జునునికి ఈశ్వరసృష్టి దర్శనం కలిగింది. అందువల్ల ఆశ్చర్యంలో మునిగిపోతాడు. ఈ ఆశ్చర్యాన్ని 15 నుంచి 22 శ్లోకాల వరకూ ప్రకటింస్తాడు.

ఏదైనా ఎంత పెద్దదిగా ఉంటే, మనకు అది అంత అద్భుతంగా అనిపిస్తుంది. అందువల్లనే ఆకాశం, సముద్రం, పర్వతం, జలపాతాలు మనను ఎక్కువగా ఆకర్షిస్తాయి. నయాగరా జలపాతం అంటే ఎందుకంత ఆకర్షణ మనకు? ఏం, మనం ఎన్నడూ నీరు చూడలేదా, జలపాతాలు అసలే చూడలేదా? అయినా అంత అద్భుతంగా అది ఎందుకు కనిపిస్తుందంటే అది అంత పెద్దదిగా ఉంది కాబట్టి. అలాంటప్పుడు విశ్వరూపం గురించి ప్రత్యేకించి చెప్పాలా? ఈ నేపథ్యంతో ఈ శ్లోకాలు చూద్దాము.

**దేవ తవ దేహే దేవాన్ పశ్యామి** – అర్జునుడు చెబుతున్నాడు, ఓ దేవా! నీ దేహంలో నేను దేవతలను చూస్తున్నాను. దేహే అంటే కృష్ణశరీరంలో కాదు; ఆకాశశరీరంలో లేదా విశ్వరూపశరీరంలో అని మర్చిపోకూడదు.

**సర్వాన్ దేవాన్ తథా భూతవిశేషసంఘాన్** – భూత అంటే ప్రాణులు; విశేష అంటే వివిధ ప్రాణులు. అత్యంత సూక్ష్మమైన క్రిమికీటకాలనుంచి, పూర్తిగా అభివృద్ధి చెందిన మనిషి దాకా అందరినీ చూస్తున్నాడు. సంఘాన్ అంటే సముదాయం. అంటే అనేక ప్రాణుల సముదాయాలను చూస్తున్నాడు.

**ఈశం బ్రహ్మాణం కమలాసనస్థమ్** – అంతేకాదు, సృష్టికర్త అయిన బ్రహ్మదేవుణ్ణి కూడా చూస్తున్నాను. ఆయన కలువపువ్వుమీద ఆసీనుడై ఉన్నాడు. పురాణాల్లో విష్ణుమూర్తి నాభినుంచి కలువపువ్వుమీద బ్రహ్మదేవుడు వచ్చినట్టుగా చిత్రీకరిస్తారు. ఇక్కడ కూడా దాని లక్ష్యార్థం తీసుకోవాలి. విష్ణుమూర్తి సమష్టికారణశరీరానికి ప్రతీక అయితే, కలువపువ్వు సమష్టి సూక్ష్మశరీరానికి ప్రతీక అయితే, బ్రహ్మదేవుడు సమష్టిసూక్ష్మశరీర ప్రతిబింబిత చైతన్యానికి ప్రతీక. ఈశంపదం బ్రహ్మకు వాడిన విశేషణం. ఈశం బ్రహ్మ అంటే బ్రహ్మదేవుడు. ఇక్కడ ఈశం అంటే శివుడు కాదు; కమలనాభుడు అయిన బ్రహ్మదేవుడు.

**సర్వాన్ ఋషీన్ చ దివ్యాన్** – దేవలోకాలకు చెందిన ఋషులందరినీ చూస్తున్నాను.

**ఉరగాన్ చ** – వాసుకి, అనంతుడువంటి సర్పాలను కూడా చూస్తున్నాను.

ఇప్పుడు, అర్జునుడు చెప్పిన వర్ణన వింటే మీకొక సందేహం రావచ్చు. అర్జునుడు కంటికి కనబడే భౌతిక జగత్తునే చూశాడా; లేక భువర్లోక, సువర్లోకాలను కూడా చూశాడా? బ్రహ్మ, దేవఋషులు, సర్పాలను కూడా చూస్తున్నాను అన్నాడు కాబట్టి ఊర్ధ్వలోకాలను కూడా చూశాడా?

దీన్ని రెండు రకాలుగా చూడవచ్చు; బ్రహ్మను, దేవతలను పేర్కొన్నాడు కాబట్టి బ్రహ్మ, దేవతలు భూలోకంలో ఉండరు కాబట్టి, అతను ఊర్ధ్వలోకాలను కూడా చూసినట్టు అర్థం చేసుకోవచ్చు. అర్జునుడు అక్షరాలా ఈ లోకాలను చూడలేదు కాని, వ్యాసాచార్యులవారు ఆ విషయాన్ని కవితాధోరణిలో చెప్పారని అర్థం చేసుకోవాలి.

విశ్వరూపదర్శనాన్ని వ్యాసాచార్యులవారు కవితాశైలిలో వర్ణిస్తున్నారు.

కవితాశైలి అని ఎలా చెప్పగలరు? అక్షరాలా ఆయా లోకాలను చూసినట్టు అర్థం చేసుకోవచ్చు కదా? కవితాధోరణి అని ఎందుకంటున్నామంటే, తర్వాత వచ్చే శ్లోకాల్లో భీష్మద్రోణాదులు విష్ణుమూర్తి నోట్లోకి వేగంగా వెళ్ళి అక్కడ నుగ్గునుగ్గై పోతున్నట్టుగా చూస్తాడు అర్జునుడు.

**భీష్మో ద్రోణః సూతపుత్రస్తథాసౌ సహాస్మదీయైరపి యోధముఖ్యైః** – 11.26
**వక్త్రాణి తే త్వరమాణా విశంతి దంష్ట్రాకరాళాని భయానకాని** – 11.27

భీష్మ, ద్రోణ, కర్ణులు అందరూ భగవంతుని నోట్లోకి వేగంగా వెళ్ళి అక్కడ నుగ్గునుగ్గై పోతున్నట్టుగా అర్జునుడు చూస్తున్న ఈ సన్నివేశం నిజమా, కవితాధోరణా? అక్షరాలా భీష్మద్రోణాదులు విష్ణుమూర్తి నోట్లో నుగ్గునుగ్గైపోతే, అర్జునుడు వారిని తర్వాత ఎలా చంపగలడు? మనకు కురుక్షేత్రయుద్ధం గురించి తెలుసు; అర్జునుడే వీరందరినీ చంపాడనీ తెలుసు. అందువల్ల వారంతా విశ్వరూప ఈశ్వరునిలోకి ప్రవేశించటం అనేది కవియొక్క కవితాశైలి. అలాగే అర్జునుడు అన్ని లోకాలను చూశాడు అంటే, అర్జునుడు ఈ లోకాలను ఈశ్వరశరీరంగా చూశాడు అని అర్థం చెప్పవచ్చు.

కాని దీన్ని కవితాధోరణిగా ఒప్పుకోము, అర్జునుడు నిజంగా ఊర్ధ్వలోకాలను చూశాడు అనవచ్చు మీరు. అంటే దాన్ని దేవుని లీలగా చూడాలని ఉంటుంది కాని కవియొక్క కల్పనాధోరణిగా కాదు. రెండవ అర్థం, నిజంగా ఊర్ధ్వలోకాలు చూశాడనే అనుకుందాం. అలా చూసినా కూడా, విశ్వరూపదర్శనంయొక్క సందేశం అది కాదని గుర్తుపెట్టుకోవాలి. విశ్వరూపదర్శనంలో ఊర్ధ్వలోకాలను చూపించటం కాదు ముఖ్యం. ఎందుకంటే ఊర్ధ్వలోకాలను చూసినంత మాత్రాన మోక్షం రాదు. అలా వచ్చేటట్టయితే కృష్ణపరమాత్మ ఊర్ధ్వలోకాలను రెండవ అధ్యాయంలో విమర్శించి ఉండేవాడు కాదు.

అందువల్ల అర్జునుడు ఊర్ధ్వలోకాలను చూశాడా లేదా అన్నది మన చర్చనీయాంశం కాదు. విశ్వరూపదర్శనం అంటే అసాధారణ వస్తువులను చూడటం కాదు, సాధారణ జగత్తును భగవంతునియొక్క విశ్వరూపదర్శనంగా భావించగలగటం. అందువల్ల అర్జునుడు ఏం చూశాడు అన్నది కాదు ముఖ్యం, ఎలా చూశాడు అన్నది ముఖ్యం. ఎలా చూశాడన్నదే అతనికి ఆధ్యాత్మిక ఎదుగుదలను ఇస్తుంది. ఏం చూశాడన్నదే ముఖ్యమైతే ఇంద్రుడు ఎప్పుడూ స్వర్గలోకాన్నే చూస్తూ ఉంటాడు, కాని అది అతనికి మోక్షాన్ని ఇవ్వదు. ఇంద్రుడు కూడా మహాసంసారే, అందువల్లనే ఎవరైనా కాస్త తీవ్రంగా తపస్సు చేస్తున్నారంటే ఖంగారు పడిపోయి, దాన్ని చెడగొట్టటానికి ప్రయత్నిస్తాడు.

అందువల్ల విశ్వరూపదర్శనంలో ఊర్ధ్వలోకాలను చూడటం కాదు ముఖ్యం, సాధారణ లోకాలను కూడా ఈశ్వరుని శరీరంగా చూడగలగటం ముఖ్యం. అందువల్ల అతను ఋషులను, అందరు దేవతలను చూశాడు అని చెప్పారు వ్యాసాచార్యులవారు.

శ్లో. 16 **అనేకబాహూదరవక్త్రనేత్రం పశ్యామి త్వాం సర్వతోఽనంతరూపమ్ ।**
**నాంతం న మధ్యం న పునస్తవాదిం పశ్యామి విశ్వేశ్వర విశ్వరూప ॥**
అనేకబాహూదరవక్త్రనేత్రమ్, పశ్యామి, త్వామ్, సర్వతః, అనంతరూపమ్,
న, అంతమ్, న, మధ్యమ్, న, పునః, తవ, ఆదిమ్, పశ్యామి, విశ్వేశ్వర, విశ్వరూప ॥

| | | | |
|---|---|---|---|
| విశ్వేశ్వర! | = ఓ జగన్నాథా! | విశ్వరూప! | = ఓ విరాడ్రూపా! |
| అనేక | = అనేకములైన | తవ | = నీయొక్క |
| బహూదర | = బాహువులును, ఉదరములును, | ఆదిమ్ | = ఆదిని |
| వక్త్రనేత్రమ్ | ముఖములును, నేత్రములును | న పశ్యామి | = తెలిసికొనలేకున్నాను |
| | గలవాడవు | మధ్యమ్ | = మధ్యమును |
| సర్వతః | = అంతటను | న | = కానరాకున్నాను |
| అనంత– | = అనంతములైన రూపములు | పునః | = ఇంకా |
| రూపమ్ | గలవాడవు అయిన | అంతమ్ | = అంతమును |
| త్వామ్ | = నిన్ను | న | = చూడకున్నాను |
| పశ్యామి | = చూచుచున్నాను | | |

**(అహం) త్వామ్ అనేక–బాహు–ఉదర–వక్త్ర–నేత్రమ్ సర్వతః అనన్త–రూపమ్ పశ్యామి ।**
**హే విశ్వరూప విశ్వేశ్వర! పునః తవ అన్తమ్ మధ్యమ్ ఆదిమ్ న పశ్యామి ।**

తా: ఓ జగన్నాథా! అనేకములైన బాహువులును, ఉదరములును, ముఖములును, నేత్రములును గలవాడవు అంతటను అనంతములైన రూపములు గలవాడవు అయిన నిన్ను చూచుచున్నాను. ఓ విరాడ్రూపా! నీయొక్క ఆదిని తెలిసికొనలేకున్నాను, మధ్యమును కానరాకున్నాను ఇంకా అంతమును చూడకున్నాను.

ఈ శ్లోకంలో ఈ విషయం స్పష్టంగా తెలుస్తుంది. ఏ విషయం? విశ్వరూపదర్శనం అంటే అసాధారణ దృష్టి కాదు, జగత్తులోని సాధారణ విషయాలమీద విశేషదృక్పథం చూపించటం అని. దాన్నే ఇక్కడ అద్భుతంగా వర్ణిస్తున్నాడు.

**త్వామ్** – ఓ దేవా, నేను నీ విశ్వరూపాన్ని చూస్తున్నాను అంటున్నాడు అర్జునుడు. ఎలా?

**అనేకబాహూదరవక్త్రనేత్రమ్** – అనేక చేతులు, ఉదరాలు, ముఖాలు, నేత్రాలు చూస్తున్నాను. వక్త్రం అంటే ముఖం లేదా నోరు అనవచ్చు.

అంటే ఒక దేవుడు అక్కడ నిల్చుని ఉంటే, అతని శరీరమంతా ముఖాలతో, కళ్ళతో, చేతులతో నిండివుందనా? అంటే అందరి మనుష్యుల చేతులు, ఉదరాలు, ముఖాలు, కళ్ళు కూడా విశ్వరూప ఈశ్వరునియొక్క అంగాలు మాత్రమే. మన దృక్పథంలో ఈ మార్పు రావాలి.

**పశ్యామి త్వాం సర్వతోఽనంతరూపమ్** – ఓ దేవా, నీకు అనంతరూపాలు ఉన్నాయి. నిజంగా దేవుని సృష్టి ఎంత అద్భుతం! ఒక వ్యక్తి వేలిముద్రలను పోలివుండవు ఇంకొక వ్యక్తి వేలిముద్రలు. ఈ సిద్ధాంతాన్ని ఉపయోగిస్తారు నేరస్థులను పట్టుకోవటానికి. అంతేకాదు, ఏ విషయం తీసుకున్నా మనిషి మనిషికీ అంతటా పోలిక లేదు. అతని దంతాల అమరిక భిన్నంగా ఉంటుంది; పుర్రె భిన్నంగా ఉంటుంది. కళ్ళు భిన్నంగా ఉంటాయి, చెవి ఆకారం భిన్నంగా ఉంటుంది. ఎంత భిన్నత్వం!

**నాంతం న మధ్యం న పునస్తవాదిమ్** – నేను నీ ఆది, మధ్యమ, అంతాలు చూడలేకుండా ఉన్నాను అంటున్నాడు అర్జునుడు. ఎందుకంటే ఆది, మధ్యమ, అంతాలు ఈ విశ్వంయొక్క ఆది, మధ్యమ, అంతాలు. విశ్వానికి సరిహద్దులు తెలుసుకోలేము. ఆది, అంతాలు తెలిస్తేనే మధ్యభాగం తెలుస్తుంది. అందువల్ల ఓ దేవా, నువ్వు అనంతం అంటున్నాడు అర్జునుడు.

**పశ్యామి విశ్వేశ్వర విశ్వరూప** – ఓ విశ్వేశ్వరా అంటే విశ్వానికి ఈశ్వరుడు. విశ్వరూప అంటే విశ్వాన్ని తన శరీరంగా ధరించినవాడు.

**విశ్వమ్ ఏవ రూపం శరీరం యస్య**

విశ్వరూపం అంటే విశ్వాన్ని శరీరంగా ధరించినవాడు.

శ్లో. 17 **కిరీటినం గదినం చక్రిణం చ తేజోరాశిం సర్వతో దీప్తిమంతమ్ ।**
**పశ్యామి త్వాం దుర్నిరీక్ష్యం సమంతాత్ దీప్తానలార్క ద్యుతిమప్రమేయమ్ ॥**
కిరీటినమ్, గదినమ్, చక్రిణం, చ, తేజోరాశిమ్, సర్వతః, దీప్తిమంతమ్,
పశ్యామి, త్వామ్, దుర్నిరీక్ష్యమ్, సమంతాత్, దీప్తానలార్కద్యుతిమ్, అప్రమేయమ్ ॥

| | | | |
|---|---|---|---|
| కిరీటినమ్ | = కిరీటమును ధరించిన వాడవు, | దీప్తానలార్క ద్యుతిమ్ | = ప్రజ్వలితాగ్నివలెను, జ్యోతిర్మయుడైన సూర్యునివలెను వెలుగొందుచు |
| గదినమ్ | = గదను చేపట్టినవాడవు | దుర్నిరీక్ష్యమ్ | = చూచుటకు శక్యముగానివాడవు |
| చ | = ఇంకా | సమంతాత్ | = అంతటను |
| చక్రిణమ్ | = చక్రము చేబూనినవాడవు అయి | అప్రమేయమ్ | = అప్రమేయ స్వరూపుడవు అయియున్న |
| సర్వతః | = అన్ని దిశలయందు | త్వామ్ | = నిన్ను |
| తేజోరాశిమ్ | = తేజోరాశిగా | పశ్యామి | = చూచుచున్నాను |
| దీప్తిమంతమ్ | = ప్రకాశించుచున్నవాడవు | | |

**త్వామ్ కిరీటినమ్, గదినమ్, చక్రిణమ్, తేజో–రాశిమ్ సర్వతః దీప్తిమన్తమ్,**
**సమన్తాత్ దీప్త–అనల–అర్క–ద్యుతిమ్ అప్రమేయమ్ దుర్నిరీక్ష్యమ్ చ పశ్యామి ।**

తా: కిరీటమును ధరించిన వాడవు, గదను చేపట్టినవాడవు ఇంకా చక్రము చేబూనినవాడవు అయి అన్ని దిశలయందు తేజోరాశిగా ప్రకాశించుచున్నవాడవు, ప్రజ్వలితాగ్నివలెను, జ్యోతిర్మయుడైన సూర్యుని వలెను వెలుగొందుచు చూచుటకు శక్యముగానివాడవును అంతటను అప్రమేయ స్వరూపుడవు అయియున్న నిన్ను చూచుచున్నాను.

**కిరీటినం గదినం చక్రిణం చ** – అనేక కిరీటాలు, గదలు, చక్రాలు చూస్తున్నాను అంటున్నాడు అర్జునుడు. అంటే మళ్ళీ అదే అర్థం తీసుకోవాలి. భగవంతుడు అనేక కిరీటాలు ధరించలేదు, కిరీటాలు ధరించిన అనేక రాజులు భగవంతుడే.

**సహస్రశీర్షా పురుషః సహస్రాక్షః సహస్రపాత్**

అలాగే అనేక గదలు ధరించిన యోధులను కూడా చూస్తున్నాడు; చక్రాయుధాలను చూస్తున్నాడు.

**తేజోరాశిమ్** – నువ్వు తేజోరాశివి. అన్ని నక్షత్రాలూ భగవంతుడే అయినప్పుడు ఎంత కాంతి ఉంటుంది!

**సర్వతో దీప్తిమంతమ్** – అన్నివైపులా ప్రకాశిస్తున్నావు. విశ్వంలోకి వెళితే దిక్కులు అనే విభజన ఉండదు. భూమ్మీద ఉంటేనే సూర్యోదయాన్ని ఆధారంగా తీసుకుని దిక్కుల విభజనను చెబుతాము. అది పరిమితి ఉన్న చిన్న మనస్సునుంచి వచ్చిన విభజన. విశ్వరూపాన్ని చూస్తే ఇలాంటి విభజనలు ఉండవు. అందువల్ల భగవంతుడు అన్ని దిక్కులా ప్రకాశిస్తున్నాడు.

**దుర్నిరీక్ష్యం సమంతాత్** – నీ కాంతి ఎంత మిరుమిట్లు గొలిపేదిగా ఉందంటే, నేను నా కళ్ళను కూడా పూర్తిగా తెరిచి చూడలేకపోతున్నాను. ఇక్కడకి కొన్ని కోట్ల మైళ్ళ దూరంలో ఉన్న సూర్యుడిని మిట్టమధ్యాహ్నం కళ్ళెత్తి చూడలేము. అలాంటిది వేలాది సూర్యులు ఉదయిస్తున్నప్పటి కాంతి కలిగిన విశ్వరూపాన్ని ఎలా చూడగలదు? మంచు పర్వతాలను అధిరోహించటానికి వెళ్ళిన పర్వతారోహకులకు ఈ అనుభవం ఎదురవుతుంది. అంతటా తెల్లగా మెరుస్తున్న మంచుమీద సూర్యకిరణాలు పడితే ఆ కాంతి కళ్ళను మిరుమిట్లు గొలుపుతుంది. ప్రత్యేకమైన చలువకళ్ళజోడు పెట్టుకోకపోతే, కంటిచూపు దెబ్బతినే ప్రమాదముంది. అంటే ప్రతిబింబ ప్రకాశమే చూడలేకపోతే, అంతకు వెయ్యిరెట్లు ప్రకాశవంతమైన విశ్వరూపదర్శనం గురించి వేరే చెప్పాలా!

అమర్‌నాథ్‌వంటి యాత్రలు చేసేటప్పుడు ఈ విశ్వరూపదర్శనభావనతో వెళితే ఆ యాత్రను ఆస్వాదించ గలుగుతారు. ఆ ప్రయాణం చాలా ప్రయాసతో కూడినది. అక్కడ శివుడు మంచులింగం; వాతావరణం బాగుండకపోతే మంచు కరిగిపోయి, శివలింగం కనపడకపోవచ్చు. దానికి ప్రయాణం కూడా ఆషామాషీ కాదు. గాడిదమీదో, గుర్రంమీదో కూర్చుని అవస్థపడి వెళ్ళాలి; ఎక్కడ వాటిమీదనుంచి జారిపడతామో అనే భయంతో బితుకుబితుకుమంటూ వెళ్ళాలి. ఆ జంతువుల యజమాని వారితో నడవకపోతే అతన్ని అరుస్తారు. తీరా ఇన్ని అవస్థలూ పడి వెళితే, మంచులింగం దర్శనం అవుతుందో లేదో తెలియదు. ఆ దర్శనమవని వారి మనస్థితి చూడాలి. వారికి చెప్పలేని కోపం, నిరాశా కలుగుతుంది. తీసుకువచ్చిన వారిని తిట్టటమో, ఏడవటమో చేస్తారు.

కాని ఆ అమర్‌నాథ్ ప్రయాణమే చాలా అద్భుతంగా ఉంటుంది. అక్కడ విశ్వరూప ఈశ్వరదర్శనం చేసుకోగలిగితే, ప్రతి అణువునూ పులకింపజేస్తుంది. అందమైన మంచుకొండలు, చుట్టూ ప్రకృతి– అన్నింటినీ భగవంతుని తేజస్సుకు చిహ్నాలుగా ఆస్వాదిస్తే, భగవంతుడు కేవలం మంచులింగంలో లేడు, అంతటా ఉన్నాడని అర్థమవుతుంది.

మనకు ఆలయాలు ఎందుకలా మనం తేలికగా వెళ్ళలేని చోట ఉన్నాయి? నగరం నడిబొడ్డులో పెట్టవచ్చు కదా అంటే భగవంతుడు అంతటా ఉన్నాడు; ప్రకృతిలో ఉన్నాడు; కొండలో ఉన్నాడు; నదిలో ఉన్నాడని చూపించి నెమ్మదిగా మన దృక్పథాన్ని మార్చటానికే. సర్వతోదీప్తిమంతం అనగానే ఇలాంటి అద్భుతప్రదేశాలు, అక్కడ పడే కాంతి మన మనస్సులోకి రాక తప్పదు.

**దీప్తానలార్క ద్యుతిమప్రమేయమ్** – బాగా ప్రజ్వలిస్తున్న అగ్నిలాగా, జ్యోతిర్మయుడైన సూర్యునిలాగా ఉన్న నీ అప్రమేయ రూపాన్ని;

**పశ్యామి** – చూస్తున్నాను అంటున్నాడు అర్జునుడు.

విశ్వరూపకాంతిని బాగా ప్రజ్వలిస్తున్న అగ్నితోనూ, బాగా మెరుస్తున్న సూర్యకాంతితోనూ పోలుస్తున్నాడు అర్జునుడు.

శ్లో. 18 **త్వమక్షరం పరమం వేదితవ్యం త్వమస్య విశ్వస్య పరం నిధానమ్ ।**
**త్వమవ్యయః శాశ్వతధర్మగోప్తా సనాతనస్త్వం పురుషో మతో మే ॥**
త్వమ్, అక్షరమ్, పరమమ్, వేదితవ్యమ్, త్వమ్, అస్య, విశ్వస్య, పరమ్, నిధానమ్,
త్వమ్, అవ్యయః, శాశ్వతధర్మగోప్తా, సనాతనః త్వమ్, పురుషః మతః, మే ॥

| | | | |
|---|---|---|---|
| త్వమ్ | = నీవు | త్వమ్, (ఏవ) | = నీవే |
| వేదితవ్యమ్ | = తెలిసికొనదగిన | శాశ్వతధర్మ గోప్తా | = సనాతనధర్మమును పరిరక్షించువాడవు |
| పరమమ్ అక్షరమ్ | = పరమమైన అక్షరుడవు | త్వమ్ (ఏవ) | = నీవే |
| త్వమ్ | = నీవే | అవ్యయః | = నాశరహితుడవు |
| అస్య, విశ్వస్య | = ఈ విశ్వమునకు | సనాతనః, పురుషః | = సనాతనపురుషుడవు, అని |
| పరమ్, నిధానమ్ | = పరమాశ్రయుడవు | మే, మతః | = నా నిశ్చయము |

**త్వమ్ వేదితవ్యమ్ పరమమ్ అక్షరమ్, త్వమ్ అస్య విశ్వస్య పరమ్ నిధానమ్,**
**త్వమ్ అవ్యయః శాశ్వత–ధర్మ–గోప్తా, త్వమ్, సనాతనః పురుషః మే మతః ।**

తా: నీవు తెలిసికొనదగిన పరమమైన అక్షరుడవు. నీవే ఈ విశ్వమునకు పరమాశ్రయుడవు. నీవే సనాతన ధర్మమును పరిరక్షించువాడవు. నీవే నాశరహితుడవు, సనాతనపురుషుడవు, అని నా నిశ్చయము.

కృష్ణపరమాత్మమీద అర్జునునికి ఉన్న గౌరవభావం అంతకంతకూ పెరుగుతూ వస్తున్నది. కృష్ణపరమాత్మ దైవత్వం పెరుగుతున్నది అనకూడదు, కృష్ణపరమాత్మమీద అర్జునునికి పూజ్యభావం పెరుగుతున్నది.

ఇంతవరకూ అర్జునుడు కృష్ణపరమాత్మను ఒక వ్యక్తిగా, వసుదేవుని పుత్రునిగా, తన సఖునిగా చూశాడు. ఇప్పుడు అదే కృష్ణపరమాత్మను సమష్టిప్రపంచంగా, నిర్గుణబ్రహ్మగా చూస్తున్నాడు. అంటే కృష్ణపరమాత్మను సగుణబ్రహ్మగా, నిర్గుణబ్రహ్మగా కూడా చూస్తున్నాడు.

ప్రళయకాలంలో కృష్ణపరమాత్మ వటపత్రంమీద తేలుతున్నట్టుగా వర్ణిస్తారు పురాణాల్లో.

**వటస్య పత్రస్య పుటే శయానం బాలం ముకుందం మనసా స్మరామి**

వటపత్రం సమష్టికారణ శరీరానికి ప్రతీక; సమష్టికారణశరీరాన్ని మాయ అని కూడా అంటారు. దానిమీద కృష్ణుడు యోగనిద్రలో ఉన్నాడంటే జగత్తు అవ్యక్తంలో ఉందని అర్థం. అంటే జగత్తు సృష్టి జరిగినప్పుడు వ్యక్తంలోకి వస్తుంది; ప్రళయంలో అవ్యక్తంలోకి వెళుతుంది. అందువల్ల విశ్వరూప ఈశ్వరుడు అవ్యయం.

**త్వమక్షరమ్** – నువ్వు అక్షరంబ్రహ్మ అంటున్నాడు అర్జునుడు. అంటే నిర్గుణబ్రహ్మను సూచిస్తున్నాడు.

**అథ పరా యయా తదక్షరమధిగమ్యతే** – ముండకం

ఓ కృష్ణా, నువ్వు కేవలం విశ్వరూప ఈశ్వరుడివే కాదు, దీనికన్నా అతీతమైన అక్షరం బ్రహ్మవు అంటున్నాడు అర్జునుడు. అంటే నువ్వు ఏకరూప ఈశ్వరుడివి మాత్రమే కాదు, అనేకరూప ఈశ్వరుడివి మాత్రమే కాదు, అరూప ఈశ్వరుడివి కూడా.

**పరమమ్** – పరమం అంటే శ్రేష్ఠం. దేశకాలాతీతం. దేశకాలవస్తు పరిచ్ఛేద శూన్యం.

**వేదితవ్యమ్** – నిర్గుణబ్రహ్మ అయిన నువ్వే పారమార్థిక సత్యం. ఆ నిర్గుణబ్రహ్మ గురించే అందరూ తెలుసుకోవాలి.

**జ్ఞేయం యత్తత్ ప్రవక్ష్యామి యద్ జ్ఞాత్వామృతమశ్నుతే** – 13.12

కృష్ణపరమాత్మే స్వయంగా పదమూడవ అధ్యాయంలో పరబ్రహ్మ గురించే తెలుసుకోవాలి, ఆ జ్ఞానం పొందిన వ్యక్తి మోక్షాన్ని పొందుతాడని చెబుతాడు.

**స ఆత్మా స విజ్ఞేయః** – మాండూక్యం

అందువల్ల, అందరూ నేర్చుకుని తీరాల్సింది నిర్గుణబ్రహ్మ గురించి. అందువల్ల వేదితవ్యం అంటే నిర్గుణబ్రహ్మకు రావాలి. నిర్గుణబ్రహ్మ, తురీయబ్రహ్మ, జ్ఞేయంబ్రహ్మ అన్నీ పర్యాయపదాలు.

**త్వమస్య విశ్వస్య పరం నిధానమ్** – నువ్వే మొత్తం సృష్టికి అధిష్ఠానం అంటున్నాడు.

**విశ్వాధారం గగనసదృశం మేఘవర్ణం శుభాంగం**

సర్వాధారం నువ్వే. నిధానం అంటే ఏమిటి?

**నిధీయతే అస్మిన్ యస్య**

అన్నిటికీ ఏది ఆధారమో అది నిధానం. పరం అంటే అదే అంతిమ ఆధారం. ఆధారం అంటే చాలదా? ఎందుకు అంతిమ ఆధారం అన్నాడు?

రెండు రకాల ఆధారాలు ఉన్నాయి. ఒకటి సాపేక్షిక ఆధారం, ఇంకొకటి అంతిమ ఆధారం. ఒక పుస్తకాన్ని ఒక బల్లమీద పెడితే, ఆ బల్ల ఆ పుస్తకానికి ఆధారం; కాని అది అంతిమ ఆధారం కాదు; దానికి ఆధారం నేల; అలా ఒకదానిమీద ఒకటి ఆధారపడుతూ వస్తాయి. కాని అంతిమ ఆధారం అంటే ఏదైతే అన్నింటికీ ఆధారమో, దానికి ఏదీ ఆధారం కాదో, అది అంతిమ ఆధారం. ఒక్కముక్కలో చెప్పాలంటే, ఆధారం లేని ఆధారం. అలా ఆధారం లేని ఆధారాన్ని పరం నిధానం అంటారు.

ఆకాశం అన్నింటికీ ఆధారం అంటాము, కాని వేదాంతం ప్రకారం ఆకాశం కూడా అంతిమ ఆధారం కాదు. ఎందుకు? ఆకాశానికి కూడా చైతన్యమే ఆధారం కాబట్టి. ఆకాశం కూడా చైతన్యంనుంచి వచ్చింది. అంటే దానికి కూడా రాకపోకలు ఉన్నాయి. ఈ విషయం వేదాంతంలో నేర్చుకుంటాము. వేదాంతం గొప్పదనం అదే. కంటికి కనపడనిదాన్ని తెలుసుకునేలా చేస్తుంది.

**త్వమ్ అవ్యయమ్** – నువ్వు కాలాతీతుడివి. నిన్ను దేశ, కాలాలు పరిచ్ఛిన్నం చేయలేవు. నువ్వు పారమార్థిక సత్యానివి. నీకు నాశనం లేదు. దీన్నిబట్టి కృష్ణపరమాత్మను ఏకరూప ఈశ్వరునిగా భావించటం లేదు, నిర్గుణబ్రహ్మగా భావిస్తున్నాడు. అంటే అర్జునుడు సగుణవిశ్వరూపదర్శనం చేస్తున్నా కూడా నిర్గుణబ్రహ్మను వివరిస్తున్నాడు.

అర్జునుడు ఇంకా నేర్చుకునే దశలో ఉంటే, అప్పుడే నిర్గుణబ్రహ్మ గురించి ఎలా తెలుసుకున్నాడు? అర్జునుడు అప్పటి సాంప్రదాయం ప్రకారం క్షత్రియధర్మాన్ని పాటించి, గురుకులవాసం చేసి శాస్త్రాన్ని అధ్యయనం చేశాడు. అందువల్ల అతను శాస్త్రంలో నేర్చుకున్నదంతా ఇక్కడ గుర్తుతెచ్చుకుని, దాన్ని వల్లిస్తున్నాడు. దీన్ని పరోక్షజ్ఞానం అంటారు.

**నిర్గుణా నిష్కలా శాంతా నిష్కామా నిరుపప్లవా** – లలితా సహస్రనామం

మనకు తెలియకుండానే లలితా సహస్రనామంలో ఈ పదాలను వల్లెవేస్తాము. అలాగే సచ్చిదానందాయ నమః అంటాము. వీటి అర్థాలు పూర్తిగా తెలియకుండా పారాయణం చేస్తాము. అలాగే అర్జునుడు కూడా తనకున్న పరోక్షజ్ఞానాన్ని ప్రదర్శిస్తున్నాడు.

**శాశ్వతధర్మగోప్తా** – నువ్వు విశ్వంలో సమతుల్యతను నిలబెడతావు. అంటే నువ్వు స్థితికారకుడవు. ఈ విశ్వం మొత్తం కొన్ని ప్రకృతినియమాలననుసరించి, కొన్ని ధర్మసూత్రాలననుసరించి నడుస్తున్నది. భగవంతుడు ఈ ప్రకృతిసూత్రాలకు, ధర్మసూత్రాలకు సృష్టికర్త, స్థితికర్త కూడా. మనం ఆ నియమాలద్వారా నడుచుకోవాలి కాని మనం ఆ నియమాలను సృష్టించలేదు. వాటి స్థితికారకులమూ కాదు. భూమ్యాకర్షణశక్తిని మనం సృష్టించలేదు; ఆ భూమ్యాకర్షణశక్తికి లోనవుతాము కాని, దానిని మనం సృష్టించలేదు.

మనం సృష్టికర్త కాదు కాబట్టి, స్థితికర్త కూడా కాలేము. సృష్టికర్తకే ఆ హక్కు ఉంటుంది. అందువల్ల నువ్వు ధర్మగోప్తా – గోప్తా అంటే స్థితికర్త. ఈ ప్రకృతిసూత్రాలు కూడా శాశ్వతమైనవి. వాటిని సాధారణంగా ఎవరూ ఉల్లంఘించలేరు. ఒకవేళ ఎవరైనా ఉల్లంఘించటం అంటూ జరిగితే, అది జరిగేది ఎవరివల్లో తెలుసా? మనిషివల్లనే.

మనిషి ఎక్కడ కాలుపెడితే, అక్కడ ప్రకృతిసూత్రాల నియమాలను చెడగొడతాడు. సముద్రంలో కాలుపెడితే, సముద్రాన్ని కలుషితం చేస్తాడు; ఆకాశంలో అడుగుపెడితే ఆకాశాన్ని చెడగొడతాడు; అడవిలోకి అడుగుపెడితే అడవిని సర్వనాశనం చేస్తాడు. మనిషి తనకున్న ఫ్రీవిల్‌ను ఉపయోగించి, సమతుల్యతను చెడగొట్టినప్పుడల్లా, ప్రకృతినియమాలను నిలబెట్టటానికి భగవంతుడు అవతారం ఎత్తి, సమతుల్యతను చెడగొట్టే భాగాన్ని నిశ్శబ్దంగా తీసివేస్తాడు.

**పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్**

భగవంతుడు సమతుల్యతను కొత్తగా సృష్టించనవసరం లేదు. అది ముందే ఉంది. దాన్ని ఆరోగ్యంతో పోల్చవచ్చు. మనం కొత్తగా ఆరోగ్యాన్ని సృష్టించనవసరం లేదు. ఆరోగ్యం మన స్వరూపం. ఏ కారణంవల్లనైనా ఆరోగ్యం పాడయితే, ఆ కారణాన్ని మనం పారద్రోలాలి. ఆ కారణాన్ని పారద్రోలితే, మన సహజ ఆరోగ్యం తిరిగివస్తుంది.

అందువల్లనే సంస్కృతంలో ఆరోగ్యాన్ని స్వస్థత అంటారు. స్వ+స్థ+త.

**స్వస్మిన్ స్వరూపే తిష్ఠతి ఇతి స్వస్థతః**

అవతారరహస్యం గురించి నాలుగవ అధ్యాయంలో చెప్పాడు కృష్ణపరమాత్మ. అక్కడ చూశాము – మన శరీరంలో కూడా ఏదైనా సమస్య వస్తే, ఆరోగ్యసూత్రం ఒక అవతారాన్ని ఎత్తుతుంది అని. ఉదాహరణకు ముక్కులో ఏదైనా దూరితే, వెంటనే ఆరోగ్యసూత్రం **తుమ్ము అవతారం** ఎత్తుతుంది. తుమ్ములరూపంలో ఆ వస్తువును బయటకు తోలుతుంది. అలాగే తిన్న ఆహారం పడకపోతే, వెంటనే **వాంతి అవతారం** ఎత్తుతుంది ఆరోగ్యసూత్రం. తిన్న ఆహారం అంతటిని వాంతిరూపంలో బయటకు తోసేస్తుంది. కంట్లో దుమ్ము పడితే, **కన్నీటి అవతారం** ఎత్తుతుంది ఆరోగ్యసూత్రం. కన్నీటితో పాటు దుమ్ము కూడా కిందికి జారుతుంది. అందువల్ల మనకు ఆరోగ్యం ముందే ఉంది. ఏదైనా సమస్య వచ్చినప్పుడు అది వచ్చి అడ్డుకుంటుంది.

అదే విధంగా భగవంతుడు మొత్తం విశ్వానికి ఆరోగ్యసూత్రం లేదా ధర్మసూత్రం. ఎప్పుడైతే మనిషి ఈ విశ్వానికి అనారోగ్యం కలుగజేస్తాడో, అప్పుడే భగవంతుడు తుమ్ము అవతారమో, వాంతి అవతారమో, కన్నీటి అవతారమో ఎత్తి విశ్వాన్ని పరిరక్షిస్తాడు.

గోప్తా అంటే స్థితికర్త, ధర్మ అంటే ధర్మసూత్రాలు, శాశ్వత అంటే నిత్యం. శాశ్వతపదం గోప్తాపదంకు, ధర్మపదంకు కూడా విశేషణం. అందువల్ల ఓ భగవంతుడా, నువ్వు శాశ్వత ధర్మాన్ని నిలబెట్టే శాశ్వత స్థితికర్తవు.

**సనాతనః** – నువ్వు ఎప్పుడూ ఉన్నావు.

**త్వం పురుషః సనాతనః యతో మే –**

పురుషః అంటే సర్వవ్యాపకమైన బ్రహ్మ. నువ్వు సర్వవ్యాపకం కాబట్టి, నువ్వు అంతటా ఉన్నావు. ఆకాశమే నీ శరీరం కాబట్టి నువ్వు అంతటా ఉన్నావు.

ఆకాశం (స్పేస్) లేని ప్రదేశం ఏదైనా చెప్పగలరా? ఈ ప్రదేశంలో ఆకాశం లేదంటే రెండు పరస్పర విరుద్ధమైన పదాలు వాడినట్టు అర్థం వస్తుంది. ఈ ప్రదేశంలో అంటేనే ఆకాశం అని వస్తుంది. అందువల్ల ఆకాశంలేని ప్రదేశం లేదు. అలాగే భగవంతుడులేని ప్రదేశం కూడా లేదు. ఒక వ్యక్తి ఒక గోడమీద –

భగవంతుడు ఎక్కడా లేడు!

అని రాశాడుట. ఇంకొక భక్తుడు వెళ్ళి దానికి చిన్నమార్పు చేశాడు.

భగవంతుడు ఎక్కడ లేడు?

ఎక్కడా పదాన్ని ఎక్కడ చేశాడు. వాక్యాన్ని ప్రశ్నగా మార్చాడు అంతే. ఎంతో గంభీరమైన మార్పు వచ్చింది. ఎక్కడ చూసినా భగవంతుడే ఉన్నాడని అర్థం వస్తుంది.

**త్వం పురుషో మతో మే** – నువ్వు సర్వగత పురుషుడవు. ఇది నాకు అర్థమయింది.

శ్లో. 19 **అనాదిమధ్యాంతమనంతవీర్యమ్ అనంతబాహుం శశిసూర్యనేత్రమ్ ।**
**పశ్యామి త్వాం దీప్తహుతాశవక్త్రం స్వతేజసా విశ్వమిదం తపంతమ్ ॥**
అనాదిమధ్యాంతమ్, అనంతవీర్యమ్, అనంతబాహుమ్, శశిసూర్యనేత్రమ్,
పశ్యామి, త్వామ్, దీప్తహుతాశవక్త్రమ్, స్వతేజసా, విశ్వమ్, ఇదమ్, తపంతమ్ ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| అనాది మధ్యాంతమ్ | = | ఆదిమధ్యాంతరహితుడవు | ఇదమ్ | = | ఈ |
| అనంతవీర్యమ్ | = | అనంతమైన సామర్థ్యము గలవాడవు | విశ్వమ్ | = | విశ్వమును |
| అనంతబాహుమ్ | = | అపరిమితమైన బాహువులుగల వాడవు | తపంతమ్ | = | తపింపజేయుచున్న వాడవు అయిన |
| శశిసూర్య నేత్రమ్ | = | సూర్యచంద్రులను నేత్రములుగా గలవాడవు | త్వామ్ | = | నిన్ను |
| | | | పశ్యామి | = | చూచుచున్నాను |
| దీప్తహుతాశ వక్త్రమ్ | = | ప్రజ్వలితాగ్ని వలె ప్రకాశించుచున్న ముఖములు గలవాడవు | | | |
| స్వతేజసా | = | నీ తేజస్సుతో | | | |

**అనాది–మధ్య–అన్తమ్, అనన్త–వీర్యమ్, అనన్త–బాహుమ్, శశి–సూర్య–నేత్రమ్,**
**దీప్త–హుతాశ–వక్త్రమ్, స్వ–తేజసా ఇదమ్ విశ్వమ్ తపన్తమ్, త్వామ్ పశ్యామి ।**

తా: ఆది మధ్యాంత రహితుడవు, అనంతమైన సామర్థ్యము గలవాడవు, అపరిమితమైన బాహువులుగల వాడవు, సూర్యచంద్రులను నేత్రములుగా గలవాడవు, ప్రజ్వలితాగ్ని వలె ప్రకాశించుచున్న ముఖములు గలవాడవు, నీ తేజస్సుతో ఈ విశ్వమును తపింపజేయుచున్నవాడవు అయిన నిన్ను చూచుచున్నాను.

**అనాదిమధ్యాంతమ్** – ఆది లేదు, మధ్యమం లేదు, అంతం లేదు. అనాది మధ్యాంతం అంటే ఆదిమధ్యాంత రహితం. నీకు మొదలు లేదు, మధ్యభాగం లేదు, చివరిభాగం లేదు అంటున్నాడు అర్జునుడు.

ఒక బీద పండితుడు ఈ పదాన్ని తీసుకుని చమత్కారంగా తన గోడు వెళ్ళబోసుకున్నాడు. సాధారణంగా లక్ష్మీ, సరస్వతులు ఒకచోట ఉండరు అంటారు. అందువల్ల ఈ కవి సరస్వతీపుత్రుడైనా కూడా అతనికి లక్ష్మీకటాక్షం కలుగలేదు. కవిహృదయం బాధలో కూడా కనబడుతుంది. ఆ కవి ఇలా రాశాడు –

**ఆదిమధ్యాంతరహితం దశహీనం పురాతనమ్**

**అద్వితీయమ్ అహం వందే మద్వస్త్ర సదృశం హరిమ్**

నా వస్త్రాలను పోలివున్న హరికి నా నమస్కారములు అంటున్నాడు ఆ కవి. హరిని తన వస్త్రాలతో పోలుస్తున్నాడు. ఎలా?

**ఆదిమధ్యాంత రహితమ్** – నా వస్త్రాలు ఎంత జీర్ణావస్థలో ఉన్నాయంటే వాటికి ఆది ఏదో, మధ్యభాగం ఏదో, అంతభాగం ఏదో చెప్పటం చాలా కష్టం. భగవంతుడైన నీకు కూడా ఆది, మధ్యమం, అంతం లేదు.

**దశహీనమ్** – దశకు అనేక అర్థాలు ఉన్నాయి. దశ అంటే వస్త్రంయొక్క చివరిదశ; మనిషి జీవితంలో వచ్చే అనేకదశలు – వృద్ధాప్యం ఒక దశ. లేదా జాతకరీత్యా చూస్తే శనిదశ, రాహుకేతుదశ. అతని వస్త్రానికి దశ లేదు; భగవంతునికి దశ లేదు. భగవంతునికి రాహుదశ, కేతుదశలులాంటివి ఉండవు.

**పురాతనమ్** – నా వస్త్రం ఎప్పుడో తాతల నాటిది; నువ్వు కూడా ఎప్పటినుంచో ఉన్నావు.

**అద్వితీయమ్** – రెండవది లేదు. నా వస్త్రం పోలినది ఇంకొకటి లేదు; ఓ భగవంతుడా, నీకు రెండవది లేదు.

**మద్వస్త్ర సదృశం హరిమ్** – అలా నా వస్త్రంతో పోలిన హరికి;

**అహం వందే** – నేను నమస్కరిస్తున్నాను.

ఇది ఒక కవి చమత్కారానికి చిన్న ఉదాహరణ. మనం గుర్తుంచుకోవాల్సింది భగవంతుడు ఆదిమధ్యాంత రహితుడు అని.

**అనంతవీర్యమ్** – నువ్వు అనంతశక్తివంతుడివి. నీ అనంతశక్తివల్ల ఈ మొత్తం విశ్వాన్ని సృష్టించగలిగావు.

**అనంతబాహుమ్** – అనంతః భావః యస్య సః అనంతబాహుః తమ్ అనంతబాహుమ్ – దాని అర్థం ముందే చూశాము. అనంత బాహువు అంటే ఒక్క భగవానుడు అనేక చేతులతో నిలుచున్నట్టు కాదు, మనం చూసే అందరి చేతులు కూడా భగవంతునివే. అందువల్ల నువ్వు అనంతబాహువువి అంటున్నాడు అర్జునుడు.

**శశిసూర్యనేత్రమ్** – ఓ దేవా, నీ కళ్ళు సూర్యచంద్రులు. కళ్ళద్వారా మనం బాహ్యప్రపంచాన్ని చూడగలుగుతాము. అలాగే పగలు సూర్యునివల్ల, రాత్రి చంద్రునివల్ల ప్రపంచాన్ని చూడగలుగుతున్నాము. అందువల్ల మనకు కళ్ళు ఎలాగో, భగవంతునికి కళ్ళు సూర్యచంద్రులు. దీన్నిబట్టి కూడా విశ్వరూపం అంటే ఇంకొకరూపం కాదు అని చెప్పవచ్చు; అంటే భగవంతుడు ఒక ప్రత్యేకరూపంలో అర్జునుని ముందు ప్రత్యక్షమవలేదు. మొత్తం విశ్వమే భగవంతుడు. ఆయనకు నేత్రాలు సూర్యచంద్రులు.

**సూర్యో యథా సర్వలోకస్య చక్షుః న లిప్యతే చాక్షుషైర్బాహ్యదోషైః**

మనలో ఉన్న ప్రతి ఒక్క అంగానికి ఒక్కొక్క అధిష్ఠానదేవత ఉంటుందని తత్త్వబోధలో చూశాము. దాని ప్రకారం కంటికి అధిష్ఠానదేవత సూర్యుడు; రసనేంద్రియానికి అధిష్ఠానదేవత వరుణుడు; వాగ్దేవత అగ్ని.

చక్షుః సూర్యః – కంటికి అధిష్ఠానదేవత సూర్యుడు అంటే భగవంతునికి కన్ను సూర్యుడు అవుతాడు.

రసనాయాః వరుణః – వరుణ దేవత రసనేంద్రియానికి అధిష్ఠానదేవత. అంటే వరుణదేవత భగవంతునికి నాలుక అవుతాడు. ఈ శ్లోకంలో సూర్యుడి విషయం వచ్చింది.

**దీప్తహుతాశవక్త్రం** – అగ్నిదేవత భగవంతునియొక్క ముఖం. ఎందుకు అగ్నిదేవతను భగవంతునియొక్క ముఖం అని అంటారు? దానికి రెండు కారణాలు. ఒకటి తత్త్వబోధలో వాచోదేవత వహ్నిః అని వస్తుంది. అంటే వాగింద్రియానికి అధిష్ఠానదేవత అగ్నిదేవత. అంటే అగ్నిదేవత భగవంతుని ముఖం అవుతుంది. ముఖం అంటే నోరు.

ఇంకొక కారణం – నోట్లో ఏది వేసినా దాన్ని తీసుకుంటుంది నోరు. నోరు ప్రతిదాన్నీ స్వాహా చేస్తుంది. పొద్దున్న లేచినప్పటి నుంచీ, రాత్రి పడుకునేదాకా నోట్లో ఏదో వేస్తూనే ఉంటాము, అది స్వాహా చేస్తూనే ఉంటుంది. అగ్ని గురించి కూడా అలాగే చెబుతారు. యజ్ఞయాగాదులు చేసేటప్పుడు స్వాహా అని వేసిన ఆహుతులను అగ్ని తీసుకుంటుంది. అగ్నిదేవత మన నోరుకు అధిష్ఠానదేవత; అందువల్ల అగ్నిదేవత భగవంతుని నోరు అవుతుంది. భగవంతుని నోరు అగ్నితో ఎలా మండుతుందో ముందుముందు చూస్తాము. ఇప్పుడు భగవంతుని నోరు అగ్నిలా ఉందని తెలుసుకుంటే చాలు. వక్త్రం అంటే నోరు. హుతాశ అంటే అగ్ని.

**హుతమ్ అశ్నాతి ఇతి హుతాశనః**

హుతమ్ అంటే ఆహుతులు, అశ అంటే తీసుకునేవాడు. అందువల్ల హుతాశ అంటే ఆహుతులను తీసుకునేవాడు. అది కూడా ఎలాంటి అగ్ని? దీప్తహుతాశ. దీప్త అంటే బాగా ప్రజ్వరిల్లుతున్న అగ్ని. నీ నోరు అలా బాగా ప్రజ్వరిల్లుతున్న అగ్నిలా ఉంది అంటున్నాడు అర్జునుడు. అలా ప్రజ్వరిల్లుతున్న అగ్నిలో ఏం వేసినా తీసుకుంటుంది.

**స్వతేజసా** – నీ తేజస్సుతో భగ్గుమనిపించేలా ఉన్నావు అంటున్నాడు అర్జునుడు.

**విశ్వమిదం తపంతమ్** – నీ నోరు కూడా ఎంతగా ప్రజ్వలిస్తోందంటే మొత్తం విశ్వాన్నే నీ వేడితో భగ్గుమనిపించేలా ఉన్నావు అంటున్నాడు అర్జునుడు.

మంచి ఎండాకాలంలో, సూర్యాస్తమయం అయ్యాక కూడా, రాత్రి కూడా వేడిగా అనిపిస్తుంది మనకు. రాత్రి వేడి కూడా సూర్యునికి చెందుతుంది. సూర్యునిలోని ఈ అగ్నితత్త్వం భగవంతునికి చెందుతుంది. పదిహేనవ అధ్యాయంలో సాక్షాత్తూ కృష్ణపరమాత్మే చెబుతాడు, తను సూర్యునిలోని కాంతిని, వేడిని కూడా అని. ఎండాకాలంలో ఏ.సి. పనిచేయకపోయినా, ఫ్యాను కాసేపు తిరగకపోయినా అల్లాడిపోతాము. ఎక్కడో కోట్లమైళ్ళ దూరంలో ఉన్న సూర్యుడు అస్తమించాడు కూడా. అయినా ఆయన వేడిని అనుభవిస్తున్నాము అంటే అది విశ్వరూపదర్శనం కాక ఏమిటి?

అందువల్ల ఇలా ఎప్పుడైనా వేడిని, చెమటను భరించలేని పరిస్థితి వస్తే, ఓ దేవా, నేను నీ విశ్వరూపాన్ని చాలా దగ్గరగా అనుభవిస్తున్నాను అనుకోగలగాలి. కాసేపు కరెంటు పోతే అల్లాడిపోయి, ఎలక్ట్రిసిటీ ఆఫీసుకు ఫోన్లు చేసి వారిని తిట్టేయకూడదు. మన దృక్పథంలో మార్పు రావాలి. విశ్వరూపదర్శనం చేస్తున్నామనుకోవాలి.

శ్లో. 20 **ద్యావాపృథివ్యోరిదమంతరం హి వ్యాప్తం త్వయైకేన దిశశ్చ సర్వాః ।**
**దృష్ట్వాద్భుతం రూపముగ్రం తవేదం లోకత్రయం ప్రవ్యథితం మహాత్మన్ ॥**
ద్యావాపృథివ్యోః, ఇదమ్, అంతరమ్, హి, వ్యాప్తమ్, త్వయా, ఏకేన, దిశః, చ, సర్వాః,
దృష్ట్వా, అద్భుతమ్, రూపమ్, ఉగ్రమ్, తవ, ఇదమ్, లోకత్రయమ్, ప్రవ్యథితమ్, మహాత్మన్ ॥

| | | | |
|---|---|---|---|
| మహాత్మన్! | = ఓ మహాత్మా! | ఇదమ్ | = ఈ |
| ఇదమ్ | = ఈ | అద్భుతమ్ | = అద్భుతమైన |
| ద్యావాపృథివ్యోః | = దివినుండి భువివరకు గల | ఉగ్రమ్ | = భయంకరమైన |
| అంతరమ్ | = ఆకాశము | రూపమ్ | = రూపమును |
| చ | = ఇంకా | దృష్ట్వా | = చూచి |
| సర్వాః, దిశః | = అన్ని దిశలును | లోకత్రయమ్ | = ముల్లోకములును |
| ఏకేన, త్వయా, హి | = నీ ఒక్కనిచేతనే | ప్రవ్యథితమ్ | = భయకంపితములైనవి |
| వ్యాప్తమ్ | = వ్యాప్తములైనవి | | |
| తవ | = నీయొక్క | | |

**హే మహాత్మన్! త్వయా ఏకేన ద్యావా-పృథివ్యోః ఇదమ్ అన్తరమ్ వ్యాప్తమ్, సర్వాః దిశః చ (వ్యాప్తాః), ఇదమ్ తవ అద్భుతమ్ ఉగ్రమ్ రూపమ్ దృష్ట్వా లోక-త్రయమ్ ప్రవ్యథితమ్ హి ।**

తా: ఓ మహాత్మా! ఈ దివినుండి భువివరకు గల ఆకాశము ఇంకా అన్ని దిశలును నీ ఒక్కనిచేతనే వ్యాప్తములైనవి. నీయొక్క ఈ అద్భుతమైన, భయంకరమైన రూపమును చూచి ముల్లోకములును భయకంపితములైనవి.

**ద్యావాపృథివ్యోరిదమంతరం హి వ్యాప్తం** – దివినుంచి భువి వరకు అంతా నువ్వే వ్యాపించి ఉన్నావు. దివిని సువర్లోకం అని, పృథివిని భూలోకం అని, మధ్యభాగాన్ని భువర్లోకం అని అంటారు. అంటే భూః, భువః, సువర్లోకాలు అన్నింటా వ్యాపించి ఉన్నాడు. అంటే భువర్లోకం భగవంతుని శరీరం.

> **భూః పాదౌ యస్యనాభిర్వియదసురనిలశ్చంద్రసూర్యౌ చ నేత్రే**
> **కర్ణావాశాః శిరోద్యౌర్ముఖమపి దహనో యస్య వాస్తేయమబ్ధిః ।** – విష్ణు సహస్రనామం

మొత్తం అంతరిక్షం విష్ణుమూర్తి నాభి. నాభి అంటే మధ్యభాగం; భూలోకం ఆయన పాదాలు, సువర్లోకం ఆయన శిరస్సు.

పరమేశ్వరుణ్ణి అందువల్లనే నీలకంఠుడు అంటారు. నీలాకాశం ఆయన కంఠం; ఆకాశంలో ఉన్న నక్షత్రాలు ఆయన ధరించే ఆభరణాలు. అందువల్ల ఆకాశాన్ని చూస్తే, మనం చూస్తున్నది ఏమిటి? **అలంకృత నీలకంఠః.** అలా భగవంతుడు అంతటా వ్యాపించివున్నాడు.

**ఏకేన** – నువ్వు మాత్రమే ఉన్నావు; వేరే రెండవ వస్తువు లేదు. సర్వవ్యాపకుడవై ఉన్నావు.

**అద్భుతమ్** – అందువల్ల అద్భుతంగా ఉన్నావు అంటున్నాడు అర్జునుడు. కాని అదే సమయంలో కొంచెం భయం కూడా చోటుచేసుకుంటున్నది. తక్కినదంతా అద్భుతంగా ఉంది కాని, భగవంతుని నోరు భీతి కొల్పేదిగా ఉంది. ఆ నోటితో సమస్త విశ్వాన్నే హరించేలాగా ఉన్నాడు. అంటే లయకారుడిగా కనిపిస్తున్నాడు.

భగవంతుణ్ణి సృష్టి స్థితి లయకారునిగా వర్ణిస్తాము. భగవంతుణ్ణి సృష్టికారకునిగా చూసి ఆనందిస్తాము. భగవంతుణ్ణి స్థితికారకునిగా చూసి ఆరాధిస్తాము. కాని అదే భగవంతుణ్ణి లయకారకునిగా చూసి భరించలేము. అదే జరిగింది అర్జునునికి కూడా. భగవంతుణ్ణి లయకారకునిగా చూసి భయం కలిగింది.

**ఉగ్రమ్** – అందువల్ల అద్భుతం వెంటనే ఉగ్రం పదాన్ని కూడా వేశాడు. అంటే నీ విశ్వరూపం అద్భుతంగానూ, భీతికొల్పేదిగానూ ఉంది అంటున్నాడు. ఉగ్రం అంటే భయంకరం. పైగా అతనే కాదుట,

**లోకత్రయం ప్రవ్యథితమ్** – మూడులోకాలూ భయపడుతున్నాయి అంటున్నాడు.

ఎవరైనా, దేనికైనా భయపడ్డారంటే అది ఒక్క మరణానికే. ఎక్కడో ప్రపంచంలో ఏ మారుమూలో ఏదో ప్రకృతిభీభత్సం జరిగిందంటే, వెంటనే మనవారు అక్కడ ఎవరున్నారా అని చూసి, వెంటనే వారి క్షేమసమాచారం తెలుసుకుంటాము. ఐదువేలమంది, పదివేలమంది మరణించినా ఫర్వాలేదు; మనవారు మాత్రం మరణించకూడదు.

అందువల్ల ఈ జీవితంలో నేను అసలు జరగకూడదని కోరుకునేది మరణం సంభవించకూడదని. ఎవరికి? నాకూ, నాకు ముఖ్యమైన కొందరికీ. ఈ భయమే అందరినీ ఎప్పుడూ పట్టిపీడిస్తుంటుంది. అందువల్లనే అర్జునుడు లోకత్రయం అంటున్నాడు. త్రిలోకాల్లోనూ ఉన్న దేవతలు, అసురులు, మనుష్యులు, పశుపక్ష్యాదులు, ఆఖరికి క్రిమికీటకాలు కూడా మరణం అంటే భయపడతాయి.

**మహాత్మన్** – ఓ మహాత్మా అని సంబోధిస్తున్నాడు అర్జునుడు. ఆత్మ అంటే ఇక్కడ శరీరం. అందువల్ల ఓ మహాత్మా అంటే విశ్వరూపశరీరం ధరించినవాడా అంటున్నాడు.

శ్లో. 21 **అమీ హి త్వాం సురసంఘా విశంతి కేచిద్భీతాః ప్రాంజలయో గృణంతి ।**
**స్వస్తీత్యుక్త్వా మహర్షిసిద్ధసంఘాః స్తువంతి త్వాం స్తుతిభిః పుష్కలాభిః ॥**
అమీ, హి, త్వామ్, సురసంఘా, విశంతి, కేచిత్, భీతాః, ప్రాంజలయః, గృణంతి,
స్వస్తి, ఇతి, ఉక్త్వా, మహర్షిసిద్ధసంఘాః, స్తువంతి, త్వామ్, స్తుతిభిః, పుష్కలాభిః ॥

| | | | |
|---|---|---|---|
| అమీ | = ఇదిగో, ఆ | మహర్షిసిద్ధ | = మహర్షుల, సిద్ధుల |
| సురసంఘాః, హి | = దేవతలందరును | సంఘాః | సమూహములు |
| త్వామ్ | = నీలో | స్వస్తి, ఇతి | = స్వస్తివచనములను |
| విశంతి | = ప్రవేశించుచున్నారు | | జయమగుగాక అని |
| కేచిత్ | = కొందరు | ఉక్త్వా | = పలికి |
| భీతాః | = భీతులై | పుష్కలాభిః | = పరిపూర్ణములైన |
| ప్రాంజలయః | = అంజలి ఘటించినవారై | స్తుతిభిః | = చక్కని స్తోత్రములతో |
| గృణంతి | = నీ నామగుణములను | త్వామ్ | = నిన్ను |
| | కీర్తించుచున్నారు | స్తువంతి | = కొనియాడున్నారు |

**అమీ హి సుర–సఙ్ఘాః త్వామ్ విశన్తి, కేచిత్ భీతాః ప్రాఞ్జలయః గృణన్తి,**
**మహర్షి–సిద్ధ–సఙ్ఘాః స్వస్తి ఇతి ఉక్త్వా పుష్కలాభిః స్తుతిభిః త్వామ్ స్తువన్తి ।**

తా: ఇదిగో, ఆ దేవతలందరును నీలో ప్రవేశించుచున్నారు. కొందరు భీతులై అంజలి ఘటించినవారై నీ నామగుణములను కీర్తించుచున్నారు. మహర్షుల, సిద్ధుల సమూహములు స్వస్తివచనములను జయమగుగాక అని పలికి పరిపూర్ణములైన చక్కని స్తోత్రములతో నిన్ను కొనియాడున్నారు.

మూడు లోకాల్లోనూ భయపడుతున్నారు అన్నాడు అర్జునుడు అంతకుముందు శ్లోకంలో. ఇక్కడ ఎవరెవరు ఎలా స్పందిస్తారో వివరంగా చెబుతున్నాడు.

**సురసంఘా అమీ హి త్వాం విశంతి** – భగవంతుని గురించి తెలిసిన దేవతలు, ఆయన విశ్వరూపాన్ని ఆరాధిస్తారు. సురసంఘాః అంటే దేవతల గుంపులు. త్వాం విశంతి అంటే నీ దగ్గరకు వస్తున్నారు. భగవంతుని ఉగ్రరూపం ధార్మికంగా చేసే నాశనంకోసం అని గ్రహించిన వీరు, ఉగ్రరూపాన్ని చూసి భయపడరు. మరణాన్ని స్వీకరించటానికి, నాశనాన్ని స్వీకరించటానికి పరిపక్వత రావాలి. దేవతలకు ఆ పరిపక్వత ఉండటంవల్ల నిన్ను ప్రార్థన చేస్తూ చేరుకుంటున్నారు.

**కేచిద్భీతాః ప్రాంజలయః గృణంతి** – మరికొంతమంది నీ దగ్గరకు ఆరాధనతోనో, భక్తితోనో రావటం లేదు, భయంతో వస్తున్నారు.

అంటే వారివారి మనస్తత్త్వాన్నిబట్టి వారు భగవంతుణ్ణి సమీపిస్తారు. తెలివైనవారు భగవంతుని లీలలను అర్థం చేసుకుంటే, మామూలు మనుష్యులు భగవంతుణ్ణి చూసి భయపడతారు. ఆ మాటకొస్తే చాలామందికి భక్తి, భయంతో కూడినదిగా ఉంటుంది. రోజూ చేసే పూజ ఏ కారణంవల్లనైనా, ఏ రోజైనా చెయ్యలేకపోతే, భగవంతుడు శిక్షిస్తాడేమో అని భయపడతారు. ఆ భయాన్ని విజయవంతంగా పిల్లలకు కూడా అందజేస్తారు. అలాగే పూజగదిలో అనేక దేవతామూర్తుల ఫోటోలో, విగ్రహాలో పెట్టుకుని హారతి ఇచ్చేటప్పుడు, 'అమ్మో, ఈ దేవునికి మర్చిపోయాను, ఆ దేవునికి ఇవ్వలేదు,' అని భయపడతారు.

భగవంతునిమీద భయం ఉండకూడదు అనటం లేదు. ధార్మికజీవనం అలవాటు పడేదాకా భయం ఉండాలి కాని, కొంత పరిపక్వత వచ్చాక భయం చోటులో భగవంతునిమీద ఆరాధనాభావన నెలకొనాలి. ఇంట్లో కూడా అంతే. తల్లి చెప్పేది అర్థం అయ్యే వయస్సు రానంతవరకూ తల్లి భయపెట్టి మంచిమార్గంలో పెడుతుంది. తర్వాత పిల్లలు పెద్దవారయ్యాక, వారికి మంచీ, చెడూ విడమర్చి చెబుతుంది.

ఈ శ్లోకం మొదటి పాదంలో పరిపక్వత వచ్చిన వారి గురించి వస్తే, రెండవపాదంలో పరిపక్వత లేనివారి గురించి వస్తుంది. అందువల్ల భయపడేవారు అంజలి జోడించి నిన్ను సమీపిస్తున్నారు. ప్రాంజలయః అంటే రెండు చేతులూ జోడించి నమస్కారం పెట్టటం. అందువల్లనే మనకు భయాన్ని పోగోట్టే భయ నివారక శ్లోకాలు ఉన్నాయి కూడా.

**రామస్కందం హనూమంతం వైనతేయం వృకోదరమ్ ।**

**శయనే యః స్మరేన్నిత్యం దుస్వప్నం తస్య నశ్యతి ॥**

**ఆపదామపహర్తారం దాతారం సర్వసంపదామ్ ।**

**లోకాభిరామం శ్రీరామం భూయో భూయో నమామ్యహమ్ ॥**

**మహర్షిసిద్ధసంఘాః** – మహర్షులు, సిద్ధుల సమూహాలు. మహర్షులకు భగవంతుని స్వరూపం బాగా తెలుసు; సిద్ధులు అంటే పుట్టుకతోనే శక్తులు ఉన్నవారు.

**స్వస్తి ఇతి ఉక్త్వా** – పెద్దగా స్వస్తివచనాలను పలుకుతారు. అంటే జగత్తుకు మంగళమగుగాక అని పలుకుతారు. అలాంటి దీవెనలు ఇలాంటి యుద్ధసమయంలో కావాలి కూడా. ఈ యుద్ధంలో కూడా మంచి రక్షింపబడాలి. స్వస్తి అంటే మంగళం.

**స్తువంతి త్వాం స్తుతిభిః** – ఈ మహర్షులు, సిద్ధులు నిన్ను అనేక స్తోత్రాలతో, అనేక ప్రార్థనలతో స్తుతిస్తున్నారు.

**పుష్కలాభిః** – ఆ ప్రార్థనలు గొప్పగా, నీ కీర్తిని వర్ణించేలా సంపూర్ణంగా ఉన్నాయి అంటున్నాడు అర్జునుడు.

శ్లో. 22 **రుద్రాదిత్యా వసవో యే చ సాధ్యా విశ్వేఽశ్వినౌ మరుతశ్చోష్మపాశ్చ ।**

**గంధర్వయక్షాసురసిద్ధసంఘా వీక్షంతే త్వాం విస్మితాశ్చైవ సర్వే ॥**

రుద్రాదిత్యాః, వసవః, యే, చ, సాధ్యాః విశ్వే, అశ్వినౌ, మరుతః, చ, ఊష్మపాః, చ,

గంధర్వయక్షాసురసిద్ధసంఘాః వీక్షంతే, త్వామ్, విస్మితాః, చ, ఏవ, సర్వే ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| రుద్రాదిత్యాః చ | = | ఏకాదశరుద్రులును, ద్వాదశాదిత్యులును | గంధర్వయక్షాసుర సిద్ధసంఘాః | = | గంధర్వులును, యక్షులును, అసురులును, సిద్ధులును |
| వసవః | = | అష్టవసువులును | యే | = | ఎవరెవరు గలరో |
| సాధ్యాః | = | సాధ్యులును | (తే) సర్వే | = | (వారు) అందరును |
| విశ్వే | = | విశ్వేదేవతలును | విస్మితాః | = | సంభ్రమాశ్చర్యములకు లోనైనవారై |
| అశ్వినౌ, చ | = | అశ్వినీకుమారులును | | | |
| మరుతః, చ | = | మరుద్గణములును | త్వామ్, ఏవ | = | నిన్నే |
| ఊష్మపాః, చ | = | పితరులును | వీక్షంతే | = | చూచుచున్నారు |

**రుద్ర–ఆదిత్యాః, వసవః, యే చ సాధ్యాః, విశ్వే అశ్వినౌ చ, మరుతః ఊష్మపాః చ,**
**గన్ధర్వ–యక్ష–అసుర–సిద్ధ–సఙ్ఘాః చ సర్వే విస్మితాః ఏవ త్వామ్ వీక్షన్తే ।**

తా: ఏకాదశరుద్రులును, ద్వాదశాదిత్యులును, అష్టవసువులును, సాధ్యులును, విశ్వేదేవతలును, అశ్వినీ కుమారులును, మరుద్గణములును, పితరులును, గంధర్వులును, యక్షులును, అసురులును, సిద్ధులును, ఎవరెవరు గలరో (వారు) అందరును సంభ్రమాశ్చర్యములకు లోనైనవారై నిన్నే చూచుచున్నారు.

అర్జునుడు అంటున్నాడు, ఈ విశ్వరూపదర్శనం నా ఒక్కడికే కాదు, దివ్యచక్షువు ఉన్న అందరికీ జరిగింది అని. ఈ విషయం మనం ముందే చూశాము. జగత్తు సృష్టి జరిగినప్పుడే విశ్వరూపం అందుబాటులో ఉంది. ఎందుకంటే జగత్తే విశ్వరూపం. అందువల్ల విశ్వరూపాన్ని చూడలేకపోవటానికి కారణం పొరలు కప్పిన మన కళ్ళే. అహంకారమమకారాలు మన కళ్ళకు కప్పిన పొరలు. అవి మనను విశ్వరూపాన్ని చూడకుండా చేస్తున్నాయి. అలా అహంకారమమకారాల పొరలు లేని అనేకమంది చూస్తున్నారు విశ్వరూపాన్ని. ఇక్కడ వారి పేర్లన్నీ వస్తున్నాయి. ఎవరెవరు?

**రుద్రాః** – ఏకాదశరుద్రులు; **ఆదిత్యాః** – ద్వాదశ ఆదిత్యులు; **వసవః** – అష్టవసువులు. వీరు ప్రత్యేక దేవతలు. వీరికి యజ్ఞాల్లో ఆహుతులు పొందే అర్హత ఉంది. వీరిని హుతభుక్ దేవతలు అంటారు. **సాధ్యాః** – ఇంకొక రకం దేవతలు; **విశ్వే** – వీరిని విశ్వేదేవతలు అంటారు. వీరి సంఖ్య చాలా పెద్దది; **అశ్వినౌ** – ఇద్దరు దేవతలు, వీరిని అశ్వినీకుమారులు అంటారు; **మరుతః** – మరుద్గణాలు అంటారు. వీరు నలభై తొమ్మిది మంది ఉన్నారు. **ఊష్మపాశ్చ** – పితృదేవతలు కూడా.

**గంధర్వయక్షాసురసిద్ధసంఘాః** – గంధర్వులు, యక్షులు, అసురులు, సిద్ధుల గుంపులు అంతా.

**సర్వే వీక్షంతే** – వీరంతా నీ విశ్వరూపాన్ని చూస్తున్నారు. కేవలం చూడటమే కాదు, నాలాగే వారు కూడా విస్మయంలో మునిగిపోయారు.

ఈ పేర్లను కృష్ణపరమాత్మ కూడా పేర్కొన్నాడు.

**పశ్యాదిత్యాన్ వసూన్ రుద్రాన్ అశ్వినౌ మరుతస్తథా** – 11.6

ఓ అర్జునా, నాలో ద్వాదశాదిత్యులను, అష్టవసువులను, ఏకాదశరుద్రులను, అశ్వినీకుమారులను, మరుద్గణాలను చూడు అన్నాడు. వీరినీ, ఇంకా కొంతమందినీ చూశాడు. వారు కూడా తనలాగే ఆశ్చర్యంగా చూడటం చూశాడు.

రాబోయే శ్లోకంనుంచి అర్జునుని స్పందన మారుతుంది. ఇంతవరకూ విస్మయం చూశాము.

**4. భయం: శ్లోకాలు 23–30: ఉపోద్ఘాతం**

విశ్వరూపదర్శనాన్ని అర్జునుడు విస్మయంతో వీక్షిస్తుండగానే అతను భగవంతుని నోరు చూడటం తటస్థించింది.

**పశ్యామి త్వాం దీప్తహుతాశవక్త్రం** – 11.19

భగవంతుని నోరును బాగా ప్రజ్వలిస్తున్న అగ్నితో పోల్చటం జరిగింది.

నోరును అక్షరాలా నోరుగా తీసుకోకూడదని చూశాము. ఇక్కడ నోరు కాలతత్త్వాన్ని సూచిస్తుంది. కాలతత్త్వాన్ని కూడా సృష్టికర్తగా కాకుండా లయకర్తగా చూపిస్తున్నాడు. కాలమే జగత్తుయొక్క సృష్టి, స్థితి, లయలకు కారణం. భగవంతునికి ఈ మూడు అంశాలకు మూడు పేర్లు పెట్టుకున్నాము. సృష్టికర్త బ్రహ్మ, స్థితికర్త విష్ణువు, లయకర్త శివుడు అన్నాము. శివుణ్ణి కాలం అని కూడా పిలుస్తారు.

**కాలాయ కాలాగ్ని రుద్రాయ నీలకంఠాయ**
**మృత్యుంజయాయ సర్వేశ్వరాయ సదాశివాయ శ్రీమన్మహాదేవాయ నమః** – రుద్రం

కాలాగ్నిరుద్రాయ అంటున్నారు శివుడిని అందులో. ఇక్కడ అర్జునుడు భగవంతుని నోరుకేసి చూస్తే అది కాలాగ్నిలా ఉందిట. అంటే లయకర్తగా ఉంది.

భగవంతుణ్ణి లయకర్తగా చూడటానికి ఎవరూ ఇష్టపడరు. అందువల్ల భగవంతుడు ఒకవేళ లయకారునిగా వారి ముందు కనబడితే, వారి తక్షణ స్పందన భయం. భగవంతుణ్ణి సృష్టికర్తగా అందరూ ప్రేమిస్తారు; స్థితికర్తగా అందరూ ఆరాధిస్తారు; కాని లయకర్తగా చూస్తే భయపడతారు. అర్జునుని విషయంలో జరిగింది కూడా అదే. అర్జునుడు లయకర్తను చూసి భయపడుతున్నాడు.

విశ్వరూపంలో ద్వంద్వవస్తువులు ఉంటాయి. విశ్వరూపదర్శనం చెయ్యాలనుకుంటే, అందులో ఒక భాగాన్ని స్వీకరించి, ఇంకొక భాగాన్ని తృణీకరిస్తే అది దృష్టిదోషం అవుతుంది. విశ్వరూపం ద్వంద్వాలతో కూడినది, అవి వ్యతిరేక అంశాలు కాదు, అవి విడదీయలేని, విడదీయరాని జంటలు అని గుర్తించగలిగితే, ఈ భయం వెయ్యదు. వాటిని పరస్పర భిన్న అంశాలుగా చూస్తే భయం; వాటిని ఈడూ–జోడూగా చూస్తే నిశ్చింత.

విడదీయరాని, విడదీయలేని మొట్టమొదటి అత్యంత ముఖ్యమైన జంట – చావు పుట్టుకలు. పుట్టిన ప్రతిదానికీ మరణం తప్పదు. మన పెద్దలు అంటారు పుట్టుట గిట్టుట కొరకే అని. సృష్టి, స్థితి, లయలను పూజ్యస్వామీజీ

అద్భుతంగా 'బార్న్ ఈజ్ గాన్' గా అభివర్ణిస్తారు. బార్న్ సృష్టి; ఈజ్ స్థితి; గాన్ లయలను సూచిస్తాయి. అంటే వరుసగా బ్రహ్మ విష్ణు మహేశ్వరులను సూచిస్తాయి.

మన శరీరంలో అనేక కణాలు పుడుతూ ఉంటాయి, కొన్నాళ్ళు ఉంటాయి, తర్వాత మాయమవుతాయి. అవి పోయాక మళ్ళీ కొత్తవి పుడతాయి. పుట్టుకను ఆస్వాదిస్తే, మరణాన్ని కూడా ఆస్వాదించాలి కదా. కాని మనం మరణాన్ని రెండు చేతులతోనూ ఆహ్వానించలేము. పుట్టినందుకు సంతోషిస్తాము; కాని శాశ్వతంగా జీవించి ఉండాలనుకుంటాము. మనమే కాదు, మన దగ్గరవారు కూడా శాశ్వతంగా ఉండాలనుకుంటాము. వేరే ఎవరైనా మరణిస్తే మనకేం అభ్యంతరం లేదు. పైగా గొప్పగా గీతాశ్లోకాన్ని ఉటంకిస్తాము –

**జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ** – 2.27

పుట్టినవారు మరణించక తప్పదు; మరణించిన వారికి పునర్జన్మ తప్పదు. అంటే జన్మ, మృత్యువులు అనేవి ఒకే నాణేనికి ఉన్న రెండుపక్కలలాంటివి. ఇలాంటి కబుర్లన్నీ ఊర్లో ఎవరి గురించైనా అయితే చెబుతాము. కాని అదే మృత్యువు మనను కబళించి వేయటానికి సిద్ధంగా ఉందంటే జీర్ణించుకోలేము. ఒకవేళ మనకు మృత్యువును ఎదుర్కొనే ధైర్యం ఉన్నా, మనం ఎవరిమీద మమకారం పెంచుకుంటామో, వారు మరణిస్తే తట్టుకోలేము.

అందువల్ల విశ్వరూపదర్శనం చేయాలంటే జన్మమృత్యువులు రెండింటినీ మంగళకరంగా చూడాలి తప్ప, ఒకదానిని మంగళంగానూ, ఇంకొకదానిని అమంగళంగానూ చూడకూడదు. దాన్నే దృష్టిదోషం అంటారు. అలా ఏ ద్వంద్వవిషయాలను చూసినా, మంగళకరంగా తీసుకోవాలి. ఎదుగుదల–క్షీణించటం; ఆరోగ్యం–అనారోగ్యం; కలవటం–విడిపోవటం; రాత్రి–పగలు అన్నీ మంగళమే. అన్నీ విశ్వరూపంలో భాగంగా చూడాలి. పవిత్రంగా లేనిది ఏదీ లేదు; నాకు అంగీకారం కానిది ఏదీ లేదు అనుకోగలగాలి. అలా అనుకోగలగటం పరిపక్వతను సూచిస్తుంది. ఈ పరిపక్వత లేకపోతే భగవంతుడు కరుణామయుడుగా ఒకసారి అనిపిస్తే, నిర్దాక్షిణ్యుడుగా ఇంకొకసారి అనిపిస్తాడు. భగవంతుడు నిర్దాక్షిణ్యుడుగా కనిపిస్తే అది భగవంతుని నిర్దాక్షిణ్యం కాదు, నా అపరిపక్వత.

అర్జునునికి ఇంకా పూర్తిగా పరిపక్వత రాలేదు; అందువల్ల అతను భగవంతునిలోని రెండవ అంశాన్ని చూడలేకపోతున్నాడు. రెండవ అంశం – నాశనం, అనారోగ్యం లాంటివి. ఇప్పుడు అంటే 23 నుంచి 30 శ్లోకాల వరకూ అర్జునునిలో చోటుచేసుకున్న భయం అంశాన్ని చూడబోతున్నాము. అహంకారమమకారాలతో కూడుకున్న అజ్ఞానులకు విశ్వరూపం భయహేతువు అని చూశాము.

ఈ నేపథ్యంతో ఈ శ్లోకాలలోకి అడుగు పెడదాము.

శ్లో. 23 **రూపం మహత్తే బహువక్త్రనేత్రం మహాబాహో బహుబాహూరుపాదమ్ ।**
**బహూదరం బహుదంష్ట్రాకరాళం దృష్ట్వా లోకాః ప్రవ్యథితాస్తథాహమ్ ॥**
రూపమ్, మహత్, తే, బహువక్త్రనేత్రమ్, మహాబాహో, బహుబాహూరుపాదమ్,
బహూదరమ్, బహుదంష్ట్రాకరాళమ్, దృష్ట్వా, లోకాః, ప్రవ్యథితాః, తథా, అహమ్ ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| మహాబాహో! | = | ఓ మహాబాహూ! | బహుదంష్ట్రా | = | పెక్కు కోరలచే |
| బహు | = | అనేకములైన | కరాళమ్ | | భయంకరమైనదియు అయిన |
| వక్త్రనేత్రమ్ | = | వక్త్రములను, నేత్రములును గలదియు | తే, మహత్, రూపమ్ | = | నీ మహారూపమును |
| | | | దృష్ట్వా | = | చూచి |
| బహుబహూరు | = | అసంఖ్యాకములైన | లోకాః | = | లోకములన్నియును |
| పాదమ్ | | బాహువులు, తొడలు, పాదములు గలదియు | ప్రవ్యథితాః | = | భయకంపితములు అగుచున్నవి |
| | | | తథా | = | అలాగే |
| బహూదరమ్ | = | పెక్కు ఉదరములు గలదియు | అహమ్, అపి | = | నేను కూడా భయముతో వణకిపోవుచున్నాను |

**హే మహా-బాహో! బహు-వక్త్ర-నేత్రమ్, బహు-బాహు-ఊరు-పాదమ్,**
**బహు-ఉదరమ్, బహు-దంష్ట్రా-కరాలమ్ తే మహత్ రూపమ్ దృష్ట్వా లోకాః ప్రవ్యథితాః,**
**తథా అహమ్ (అపి వ్యథితః అస్మి) ।**

తా: ఓ మహాబాహూ! అనేకములైన వక్త్రములను, నేత్రములును గలదియు, అసంఖ్యాకములైన బాహువులు, తొడలు, పాదములు గలదియు, పెక్కు ఉదరములు గలదియు, పెక్కు కోరలచే భయంకరమైనదియు అయిన నీ మహారూపమును చూచి లోకములన్నియును భయకంపితములు అగుచున్నవి. అలాగే నేను కూడా భయముతో వణకిపోవుచున్నాను.

**తే రూపం మహత్** – ఓ భగవంతుడా, నీ విశ్వరూపం నిజంగా అద్భుతంగా ఉంది.

**బహువక్త్రనేత్రమ్** – నీ విశ్వరూపానికి అనేక ముఖాలు, నేత్రాలు ఉన్నాయి. వక్త్రం అంటే ముఖం లేదా నోరు, నేత్రం అంటే కన్ను.

**బహుబాహురుపాదమ్** – అలాగే లెక్కలేనన్ని బాహువులు, తొడలు, పాదాలు ఉన్నాయి.

**మహాబాహో** – అనేక చేతులున్న ఓ దేవా,

**బహూదరమ్** – అనేక ఉదరాలు ఉన్నాయి.

అన్నీ బాగానే ఉన్నాయి, కాని ఒక్క భాగం చూడటానికి ఇష్టపడటం లేదు. కొంతమంది చూడండి, వారు సినిమాకి వెళ్ళినప్పుడు అందులో రక్తపాతం అవుతుంటే, కళ్ళు మూసుకుని, ఆ సీన్ అయిందా అని పక్కవారిని అడుగుతారు. ఇక్కడ అర్జునుడు చూడలేకపోయిన భాగం ఏమిటి? నోరు.

**బహుదంష్ట్రాకరాళమ్** – అనేక కోరలతో ఉండి భయపెడుతున్నావు.

పులి నోరు తెరిచి గాండ్రించిందంటే హడలిపోతాము. దాని కోరలు చూసి భయపడతాము. దంష్ట్రా అంటే

కోరలు. కాని పులి నోటిలో పైన రెండు, కింద రెండు కోరలు మాత్రమే ఉండవచ్చేమో కాని, విశ్వరూప ఈశ్వరునికి అనేక నోరులు, వాటిలో అనేక కోరలు ఉన్నాయి. మామూలుగా రాక్షసులు బయటకి పొడుచుకువచ్చిన ఆ కోరలతో భయంకరంగా ఉంటారు. భగవంతుడు దానికి భిన్నంగా శాంతిస్వరూపుడుగా, సౌమ్యంగా ఉంటాడు.

నీ సుందరవదనారవిందం చూసి జన్మ ధన్యమైపోతుంది అంటారు కథల్లో; అలాంటిది అనేక నోర్లతో, అనేక కోరలతో ఉన్న నిన్ను చూస్తుంటే భయం వేస్తోంది అంటున్నాడు అర్జునుడు.

**దృష్ట్వా లోకాః ప్రవ్యథితాస్తథాహమ్** – ఇలా భయంకరమైన కోరలతో ఉన్న నిన్ను చూసి లోకాలన్నీ భయపడుతున్నాయి అంటున్నాడు అర్జునుడు. ప్రవ్యథితాః అంటే భయకంపితులవుతున్నాయి. లోకాలన్నీ భయపడుతున్నాయి అంటే అర్జునుని సంగతేమిటి? అతను భయపడటం లేదా? చెప్పుకోవటానికి సిగ్గుపడుతున్నాడు కాని, అతను కూడా భయపడుతున్నాడు. అర్జునుడు ధైర్యసాహసాలకు పెట్టింది పేరు. అలాంటి అతను కూడా భయపడుతున్నాడు కాని చెప్పటానికి సిగ్గుగా ఉంది. అందువల్ల లోకాలన్నీ భయపడుతున్నాయి అని గట్టిగా చెప్పి,

**తథా అహమ్** – నేను కూడా వణికిపోతున్నాను అని లోగొంతుకలో చెబుతున్నాడు.

ఏదైనా పెళ్ళికి వెళితే, మీకు మళ్ళీ పాయసం తినాలని ఉంటుంది. కాని పాయసం వడ్డించే వ్యక్తి తొందరగా మీ దగ్గరకు రాడు. అప్పుడు మీరేం చేస్తారు? ఆ పాయసం వడ్డించే వ్యక్తిని పిలిచి, మీ పక్కనున్న వ్యక్తిని చూపించి, ఇదుగో ఇతనికి వెయ్యండి అని అతనికి వేయించి, ఆ చేత్తోనే నాక్కూడా కాస్త వేసిపోండి అంటారు. మీకోసం పిలిపించినట్టు ఎవరికీ తెలియదు. అర్జునుడు కూడా ఇదే గారడీ చేశాడు. విశ్వం మొత్తం భయపడుతోందని చెప్పి, అలాగే నేను కూడా అని నెమ్మదిగా పలికాడు. ఆ భయం ఎలా ఉందో తర్వాత వర్ణిస్తాడు.

శ్లో. 24 **నభఃస్పృశం దీప్తమనేకవర్ణం వ్యాత్తాననం దీప్తవిశాలనేత్రమ్ ।**
**దృష్ట్వా హి త్వాం ప్రవ్యథితాంతరాత్మా ధృతిం న విందామి శమం చ విష్ణో ॥**
నభఃస్పృశమ్, దీప్తమ్, అనేకవర్ణమ్, వ్యాత్తాననమ్, దీప్తవిశాలనేత్రమ్,
దృష్ట్వా, హి, త్వామ్, ప్రవ్యథితాంతరాత్మా, ధృతిమ్, న, విందామి, శమమ్, చ, విష్ణో ॥

| | | | |
|---|---|---|---|
| హి | = ఎందుకంటే | దీప్తవిశాల | = కాంతులను విరజిమ్ము |
| విష్ణో! | = ఓ మహావిష్ణూ! | నేత్రమ్ | = విశాల నేత్రములు గల |
| నభఃస్పృశమ్ | = ఆకాశమును స్పృశించుచున్న | త్వామ్ | = నిన్ను (నీ రూపమును) |
| దీప్తమ్ | = మిక్కిలి ప్రకాశించుచున్న | దృష్ట్వా | = చూచి |
| అనేకవర్ణమ్ | = రంగురంగుల వన్నెలను గల్గియున్న | ప్రవ్యథితాంతరాత్మా (అహమ్) | = మిక్కిలి తత్తరపడుచున్న నేను |
| | | ధృతిమ్, చ | = ధైర్యమును |
| వ్యాత్తాననమ్ | = విస్తరించిన ముఖములతో ఒప్పుచున్న | శమమ్, చ | = శాంతిని |
| | | న, విందామి | = పొందలేకున్నాను |

**హే విష్ణో! త్వామ్ నభః-స్పృశమ్, దీప్తమ్, అనేక-వర్ణమ్, వ్యాత్త-ఆననమ్, దీప్త-విశాల-నేత్రమ్, దృష్ట్వా హి (అహం) ప్రవ్యథిత-అన్తర-ఆత్మా (భూత్వా) ధృతిమ్ శమమ్ చ న విన్దామి ।**

తా: ఎందుకంటే ఓ మహావిష్ణూ! ఆకాశమును స్పృశించుచున్న, మిక్కిలి ప్రకాశించుచున్న, రంగురంగుల వన్నెలను గల్గియున్న, విస్తరించిన ముఖములతో ఒప్పుచున్న కాంతులను విరజిమ్ము విశాలనేత్రములు గల నీ రూపమును చూచి మిక్కిలి తత్తరపడుచున్న నేను ధైర్యమును, శాంతిని పొందలేకున్నాను.

ఒకపక్క అర్జునుడు అద్భుతమైన విశ్వరూపాన్ని చూసి అచ్చెరువొందుతున్నాడు కాని అదే సమయంలో భీతిగొలిపే ముఖాలను మర్చిపోలేకుండా ఉన్నాడు. ఏదైనా భయంకరమైన సినిమా చూస్తే అది పదేపదే గుర్తుకొచ్చినట్టుగా, విశ్వరూపంలోని అనేక నోర్లను మర్చిపోలేకుండా ఉన్నాడు అర్జునుడు. ఆ భీతిగొలిపే నోరు కాలతత్త్వానికి సంకేతం. ముందు విశ్వరూపంలో వచ్చిన అంశాలను వర్ణిస్తున్నాడు మళ్ళీ.

**నభఃస్పృశమ్** – నీ విశ్వరూపం ఆకాశాన్ని అంటుతున్నది. నభః అంటే ఆకాశం.

**దివిస్పృగ్ సర్వదృగ్వ్యాసో వాచస్పతిరయోనిజః** – విష్ణుసహస్రనామం 61

దివిస్పృగ్ అంటే నభస్పృగ్. అంటే అంబరాన్ని అంటుతున్న అర్థం.

**దీప్తమనేకవర్ణమ్** – నువ్వు అనేక రంగులతో దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నావు అంటున్నాడు అర్జునుడు. అనేక నక్షత్రాలు, గ్రహాలతో కూడిన విశ్వరూపకాంతి గురించి ప్రత్యేకించి చెప్పాలా? అన్ని రంగులూ భగవంతునివే.

**వ్యాత్తాననమ్** – వద్దనుకున్నా కూడా అర్జునుని కన్ను విశ్వరూపంయొక్క నోళ్ళవైపు వెళ్ళకుండా ఉండలేక పోతోంది. వ్యాత్తం అంటే పూర్తిగా తెరిచివున్న నోళ్ళు. నోళ్ళను చూడగానే అగ్నితో మండుతున్న నోళ్ళు, కోరలతో ఉండి భయపెడుతున్న నోళ్ళే కనిపిస్తున్నాయి.

**దీప్తవిశాలనేత్రమ్** – దేదీప్యమానంగా ప్రకాశిస్తున్న నీ విశాలనేత్రాలను చూస్తున్నాను అంటున్నాడు అర్జునుడు. శశిసూర్యనేత్రమ్ అని అంతకుముందే అన్నాడు అర్జునుడు. అందువల్ల అవి చాలా ప్రకాశవంతంగా, చాలా పెద్దవిగా ఉన్నాయి.

**త్వాం దృష్ట్వా** – నీ రూపం చూసి, ముఖ్యంగా నీ నోళ్ళు చూసి;

**ప్రవ్యథితాంతరాత్మా** – నా అంతరాత్మ హడలిపోతున్నది, భయపడుతున్నది, భీతి చెందుతున్నది. అంతరాత్మ అంటే ఆత్మ కాదు; మనస్సు, అంతఃకరణం.

**ధృతిం న విందామి** – నా ధైర్యం సన్నగిల్లుతున్నది. నా హృదయం బెంబేలెత్తిపోతున్నది.

**శమం చ విష్ణో** – నాకు మనశ్శాంతి లేకుండా ఉంది. నేను చాలా కలత చెందుతున్నాను.

కాలతత్త్వానికి వ్యతిరేక అంశాలు కూడా ఉన్నాయి. కాలం తీసుకువచ్చే వృద్ధాప్యం భయం కలిగిస్తుంది. వృద్ధాప్యంలో మనలో శక్తి సన్నగిల్లుతూ వస్తుంది. కాని మనకు భిన్నంగా తక్కినవన్నీ శక్తిని పుంజుకుంటున్నట్టుగా

ఉంటుంది. ఒకప్పుడు చిన్న జలుబు కూడా చేసి ఉండదు; కాని ఇప్పుడు ఎక్కడో ఎవరో గట్టిగా తుమ్మితే చాలు, మనకు జలుబు చేసేస్తుంది; ఊర్లో ఎక్కడ ఏ అనారోగ్యం ఉన్నా, మన శరీరం దాన్ని ఆప్యాయంగా కౌగలించుకుంటుంది. ఆ విధంగా మనలో ఉన్న రోగనిరోధకశక్తిని భగవంతుడు కొంచెం కొంచెంగా హరించి వేస్తాడు. శక్తి సన్నగిల్లుతుంది; అనారోగ్యం వస్తుంది, ఏకాంతం ముంచెత్తుంది; ఒకరొకరుగా అందరూ మాయమవుతారు.

ఇవన్నీ తలుచుకోనంతవరకూ బాగానే ఉంటుంది. కాని ఒక్కసారిగా నిజం కళ్ళముందు తారట్లాడుతుంటే, ఏమవుతుంది? ప్రవ్యథితాంతరాత్మా – భయం ముంచుకొస్తుంది. ఇదంతా ఎందువల్ల జరుగుతున్నది? కాలంవల్ల. కాలం విశ్వరూప ఈశ్వరునిలో ఒక అంతర్గతభాగం. భగవంతుణ్ణి కాలః అంటారు. విష్ణుసహస్రనామంలో కూడా ఈ పదాన్ని చూస్తాము. ఈ భీకరమైన విషయాన్ని తలుచుకుని నాకు శాంతిభావన పోయింది అంటున్నాడు అర్జునుడు.

శ్లో. 25 **దంష్ట్రాకరాళాని చ తే ముఖాని దృష్ట్వైవ కాలానలసన్నిభాని ।**
**దిశో న జానే న లభే చ శర్మ ప్రసీద దేవేశ జగన్నివాస ॥**
దంష్ట్రాకరాళాని, చ, తే, ముఖాని, దృష్ట్వా, ఏవ, కాలానలసన్నిభాని,
దిశః, న, జానే, న, లభే, చ, శర్మ, ప్రసీద, దేవేశ, జగన్నివాస ॥

| | | | |
|---|---|---|---|
| జగన్నివాస! | = ఓ జగన్నివాసా! | దృష్ట్వా | = చూచి |
| దంష్ట్రా కరాళాని | = భయంకరములైన కోరలు గలవియు | దిశః, న జానే | = దిక్కులను తెలిసికొనలేకున్నాను |
| | | చ | = ఇంకా |
| చ | = ఇంకా | శర్మ, ఏవ | = శాంతిని |
| కాలానల | = ప్రళయాగ్ని జ్వాలలవలె | న, లభే | = పొందలేకున్నాను |
| సన్నిభాని | = భీతి గొల్పునవియు అయిన | దేవేశ! | = ఓ దేవాదిదేవా! |
| తే, ముఖాని | = నీ ముఖములను | ప్రసీద | = అనుగ్రహింపుము |

**హే దేవేశ! హే జగత్–నివాస! కాల–అనల–సన్నిభాని దంష్ట్రా–కరాళాని చ తే ముఖాని దృష్ట్వా ఏవ, (అహం) దిశః న జానే, శర్మ చ న లభే, (అతః త్వం) ప్రసీద ।**

తా: ఓ జగన్నివాసా! భయంకరములైన కోరలు గలవియు, ప్రళయాగ్ని జ్వాలల వలె భీతి గొల్పునవియు అగు నీ ముఖములను చూచి దిక్కులను తెలిసికొనలేకున్నాను ఇంకా శాంతిని పొందలేకున్నాను. ఓ దేవాదిదేవా! అనుగ్రహింపుము.

మళ్ళీ అర్జునుని ఆలోచన భగవంతునియొక్క నోళ్ళవైపు వెళుతోంది. నోళ్ళు తప్ప ఇంకేం కనబడటం లేదు అతనికి.

**తే ముఖాని** – నీ ముఖాలు భయపెడుతున్నాయి నన్ను అంటున్నాడు అర్జునుడు. ముఖాలు అంటే నోళ్ళు అని చూశాము. కోరలతో కూడిన భగవంతుని నోళ్ళు మనిషికి కలుగజేసే బాధకు చిహ్నంగా ఉంది. ఆ బాధకు కారణం కాలతత్త్వం. కోరలతో కూడియున్న నీ నోళ్ళు భయపెడుతున్నాయి. ఆ నోళ్ళు ఎలా ఉన్నాయి?

**కాలానలసన్నిభాని** – నోళ్ళు ప్రళయకాలాగ్నిలా ఉన్నాయి అంటున్నాడు అర్జునుడు. ఎందుకు ప్రళయకాల్నాగితో పోల్చాడు? ప్రళయకాలంలో సృష్టి మొత్తం క్రమేపీ భగవంతునిలో లయమయిపోతుంది. పంచభూతాల సృష్టి జరిగినప్పుడు ఒక పద్ధతిలో జరుగుతుంది –

**తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశః సమ్భూతః। ఆకాశాద్వాయుః। వాయోరగ్నిః। అగ్నేరాపః। అద్భ్యఃపృథివీ। –**
తైత్తిరీయం

బ్రహ్మనుంచి ముందు ఆకాశం; ఆకాశంనుంచి వాయువు; వాయువునుంచి అగ్ని; అగ్నినుంచి జలము; జలంనుంచి పృథివీ వచ్చాయి. కాని ప్రళయకాలంలో లయ వ్యతిరేకపద్ధతిలో జరుగుతుంది. అంటే భూమి జలంలో లయమవుతుంది; జలం అగ్నిలో; అగ్ని వాయువులో; వాయువు ఆకాశంలో లయమవుతాయి. అటువంటి ప్రళయాగ్నిలాగా ఉంది నీ నోరు.

**దిశో న జానే** – అటువంటి నీ నోరు చూస్తున్నప్పుడు నాకు దిక్కులు ఏవో కూడా తెలియటం లేదు అంటున్నాడు అర్జునుడు. దిక్కులు ఎప్పుడు తెలుస్తాయి? ఒక్క సూర్యుని ముందు నిల్చుని చూస్తుంటే – ఇదుగో ఇది తూర్పు, అటువైపు పడమర అంటూ తెలుస్తాయి. కాని అనేక సూర్యకాంతులతో మెరిసిపోతూ, విశ్వాన్నే రూపంగా ధరించిన భగవంతుని ముందు దిక్కులన్నీ దిక్కులేకుండా పారిపోతాయి. దిక్కులకు అర్థం లేదు; కాలానికి అర్థం లేదు; తారీఖుకి అర్థం లేదు. మన దేశంలో ఒక తారీఖు అయితే, అది ఇంకో దేశంలో ఇంకో తారీఖు అవుతుంది. అందువల్ల విశ్వం మొత్తాన్ని చూస్తున్నప్పుడు దేశ, కాలపరిమితులు తెలియవు. అందువల్ల దిక్కులు తెలియటం లేదు అంటున్నాడు అర్జునుడు.

**న లభే చ శర్మ** – అంతేకాదు, శాంతిని కూడా పొందలేకుండా ఉన్నాను అంటున్నాడు అర్జునుడు. ఎందుకు? నువ్వు దయాశీలుడవా, క్రూరుడవా అర్థం కాకుండా ఉందని అతని భావన.

అందువల్లనే, ఏదైనా ప్రకృతివైపరీత్యం జరిగితే, కొంతమంది నాస్తికులుగా మారిపోతారు. ఒక సునామీ వస్తేనో, ఒక భూకంపం ఏర్పడితేనో, అందులో అమాయకులు, చిన్నపిల్లలు అందరూ దారుణంగా మరణిస్తే ఆ విషాదదృశ్యాన్ని చూసి తట్టుకోలేరు వారు. అప్పుడు భగవంతుణ్ణి నిందిస్తారు. ఎందుకు భగవంతుడు ప్రత్యేకించి ఈ సునామీలను, భూకంపాలను సృష్టించాడని నిందిస్తారు. కొంతమంది నిందించి ఊరుకోకుండా ఒక్కసారిగా నాస్తికులుగా మారిపోతారు. భగవంతుడు చేసే సృష్టి, లయలను రెండింటికీ సమానంగా స్వీకరించటానికి పరిపక్వత ఉండాలి. ఇంకా అర్జునునికి ఆ పరిపక్వత రాలేదని చూశాము. అందువల్ల అతను భయపడుతున్నాడు. నా మనస్సు చాలా అశాంతికి లోనవుతున్నది అని వాపోతున్నాడు. శర్మ అంటే శాంతి. నేను శాంతిని పొందలేకుండా ఉన్నాను అంటున్నాడు అర్జునుడు.

**ప్రసీద దేవేశ జగన్నివాస** – ఓ భగవంతుడా, నాయందు దయ చూపుము. నన్ను అనుగ్రహించి నీ నోరు తెరవకు. అది తప్ప అంతా బాగుంది. జగన్నివాస అంటే జగత్తు అంతటికీ నివాసమైనవాడా అని అర్థం.

శ్లో. 26 **అమీ చ త్వాం ధృతరాష్ట్రస్య పుత్రాః సర్వే సహైవావనిపాలసంఘైః ।**
**భీష్మో ద్రోణః సూతపుత్రస్తథాసౌ సహాస్మదీయైరపి యోధముఖ్యైః ॥**
అమీ, చ, త్వామ్, ధృతరాష్ట్రస్య, పుత్రాః, సర్వే, సహ, ఏవ, అవనిపాలసంఘైః,
భీష్మః, ద్రోణః, సూతపుత్రః, తథా, అసౌ, సహ, అస్మదీయైః, అపి, యోధముఖ్యైః ॥

శ్లో. 27 **వక్త్రాణి తే త్వరమాణా విశంతి దంష్ట్రాకరాళాని భయానకాని ।**
**కేచిద్విలగ్నా దశనాంతరేషు సందృశ్యంతే చూర్ణితైరుత్తమాంగైః ॥**
వక్త్రాణి, తే, త్వరమాణాః, విశంతి, దంష్ట్రాకరాళాని, భయానకాని,
కేచిత్, విలగ్నాః, దశనాంతరేషు, సందృశ్యంతే, చూర్ణితైః, ఉత్తమాంగైః ॥

| | | | |
|---|---|---|---|
| అమీ | = ఇదిగో | అస్మదీయైః | = మన పక్షమునకు చెందిన |
| ధృతరాష్ట్రస్య | = ధృతరాష్ట్రుని | యోధముఖ్యైః, సహ | = ముఖ్యయోధులతో గూడ |
| పుత్రాః | = కుమారులు | తే | = నీయొక్క |
| సర్వే, ఏవ | = అందరును | దంష్ట్రాకరాళాని | = భయంకరములైన కోరలతో గూడి |
| అవనిపాల | = రాజసముదాయములతో | భయానకాని | = భీతిని గొల్పు |
| సంఘైః, సహ | గూడినవారై | వక్త్రాణి | = నోళ్ళలో |
| త్వామ్ | = నీలో | త్వరమాణాః | = త్వరపడుచున్నవారై |
| (ప్రవిశంతి) | = ప్రవేశించుచున్నారు | విశంతి | = ప్రవేశించుచున్నారు |
| చ | = ఇంకా | కేచిత్ | = కొందరు |
| భీష్మః | = భీష్ముడును | చూర్ణితైః | = నుగ్గునుగ్గు కావింపబడిన |
| ద్రోణః | = ద్రోణుడును | ఉత్తమాంగైః | = శిరస్సులతో |
| తథా | = అలాగే | దశనాంతరేషు | = దంతముల మధ్య |
| అసౌ | = ఈ | విలగ్నాః | = చిక్కుకొని వ్రేలాడుచున్నవారై |
| సూతపుత్రః | = సూతపుత్రుడైన కర్ణుడును | సందృశ్యంతే | = కనబడుచున్నారు |
| అపి | = ఇంకా | | |

**అమీ చ సర్వే ధృతరాష్ట్రస్య పుత్రాః అవనిపాల-సఙ్ఘైః సహ ఏవ,**
**తథా భీష్మః ద్రోణః అసౌ సూత-పుత్రః అస్మదీయైః అపి యోధ-ముఖ్యైః సహ త్వామ్ విశన్తి ।**

**తే దంష్ట్రా-కరాళాని భయానకాని వక్త్రాణి త్వరమాణాః (విశన్తి)**
**కేచిత్ దశన-అన్తరేషు విలగ్నాః చూర్ణితైః ఉత్తమ-అఙ్గైః (యుక్తాః) సన్దృశ్యన్తే ।**

తా: ఇదిగో ధృతరాష్ట్రుని కుమారులు అందరును రాజ సముదాయములతో గూడినవారై నీలో ప్రవేశించుచున్నారు, భీష్ముడును, ద్రోణుడును అలాగే ఈ సూతపుత్రుడైన కర్ణుడును ఇంకా మన పక్షమునకు చెందిన ముఖ్యయోధులతో గూడ నీయొక్క భయంకరములైన కోరలతో గూడి భీతిని గొల్పు నోళ్ళలో త్వరపడుచున్నవారై ప్రవేశించుచున్నారు. కొందరు నుగ్గునుగ్గు కావింపబడిన శిరస్సులతో దంతముల మధ్య చిక్కుకొని వ్రేలాడుచున్నవారై కనబడుచున్నారు.

ఇదే జీవితం ఆడే తమాషా. మనం ఏ ఆలోచననైతే వద్దనుకుంటామో, దేన్నైతే తీవ్రంగా పారద్రోలాలని అనుకుంటామో, ఆ ఆలోచనే పదేపదే వెన్నంటి వస్తూవుంటుంది. అర్జునుని విషయంలో కూడా అదే జరుగుతున్నది. అతను భగవంతుని నోరు చూడకుండా ఉందామనుకుంటే, అది ఇంకా దగ్గరగా, ఇంకా కొట్టొచ్చినట్టుగా కనిపిస్తోంది. ఇంతకుముందు దూరంనుంచి చూశాడు. కాని ఇప్పుడు అది చాలా దగ్గరగా కనిపిస్తోంది.

ఇక్కడ భగవంతుని నోరు కాలతత్త్వానికి ప్రతీక అని చూశాము. భగవంతుని నోరు కాలం అయితే, అది ఏం చేయాలి? అది అన్నింటినీ భక్షించాలి. **కాలో జగత్ భక్షకః**

కాలం జగత్తును భక్షిస్తుంది. భగవంతుడు కాని, కాలం కాని జగత్తును ఎలా భక్షిస్తారు? అది కూడా క్రమంగా జరుగుతుంది. దీనికి మనం ఆహారం తీసుకునే పద్ధతిని గమనించవచ్చు. ముందు వండినవన్నీ వంటింట్లో ఉంటాయి. తర్వాత ఒక్కొక్కటిగా మన ఆకులో చోటు చేసుకుంటాయి. అది కూడా కొన్ని ఆకులో ఏ మూలో కనీకనబడకుండా ఉంటాయి, కొన్ని ఎదురుగా మనం తినటానికి అందుబాటులో ఉంటాయి. కాని వెంటనే అన్నింటినీ తినేయము. ముందు ప్రార్థన చేసి, తర్వాత ఒక్కొటొక్కటిగా, మనకు నచ్చినరీతిలో తింటాము.

ఇప్పుడు భగవంతుని ఆకులో అలా అనేక జీవులు ఉన్నారు. ఈ జీవులు కూడా కొందరు ఇంకా వంటింట్లో ఉన్నారు; కొంతమందిని ఆకులో ఉన్నా భగవంతుడు ఇంకా చూడలేదు (ఆకులో మారుమూల దాగిన పచ్చడి, కిచిడీ, పాయసంలాంటివి). కొంతమందిని ఇప్పటికే రుచి చూశాడు అంటే గుండెజబ్బును ఒకసారో, రెండుసార్లో ఇచ్చాడు; కొంతమందిని ఒకసారి నోట్లో వేసుకున్నాడు, అంటే కొంతమంది మృత్యుకోరల్లోకి వెళ్ళి మళ్ళీ బయటపడి ఉంటారు. ఈ వర్ణనలన్నీ ఇప్పుడు రాబోతున్నాయి. ఇలాంటి వర్ణనలు వింటే అనారోగ్యం, వృద్ధాప్యం, మృత్యువు అంటే భయం పోతుంది. వీటిని ఎంతగా తప్పించుకుందామంటే అవి అంతగా భయాన్ని కలిగిస్తాయి. కాబట్టి ఇవి జీవితంలో ఒక భాగమని గ్రహించుకుని, ఆ భయాలనుంచి బయటపడటం మంచిది.

ఇంకాసేపట్లో మహాభారతయుద్ధం జరగబోతున్నది. అందులో వేలాది యోధులు మరణించబోతున్నారు. దాన్ని ఇక్కడ సూచనప్రాయంగా వర్ణిస్తున్నాడు అర్జునుడు. అనేకమంది సైనికులు భగవంతుని నోరులోకి వెళుతున్నట్టుగా చూస్తున్నాడు అర్జునుడు. దీన్ని కవి హృదయంగా తీసుకోవాలి కాని, నిజంగా అంతమంది సైనికులు పరుగెత్తుకుంటూ వెళ్ళి నోట్లో దూరటం జరగదు. ఎవరెవరు వెళుతున్నారో కూడా అర్జునునికి తెలుస్తున్నది.

**ధృతరాష్ట్రస్య పుత్రాః** – ధృతరాష్ట్రుని పుత్రులందరూ నీ నోటిలో ప్రవేశిస్తున్నారు. అంటే కౌరవులు అందరూ మరణించబోతున్నారు. **అమీ** – అమీ అంటే ఇదుగో, నా ఎదురుగుండా ఉన్న వీరు. ఈ శ్లోకంలో క్రియాపదం లేదు. దాన్ని తర్వాత వచ్చే శ్లోకంలోంచి తీసుకోవాలి.

**వక్త్రాణి విశంతి** – వక్త్రాణి అంటే నోళ్ళలో; విశంతి అంటే ప్రవేశిస్తున్నారు. ధృతరాష్ట్రస్య పుత్రాః వక్త్రాణి విశంతి అంటే కౌరవులందరూ భగవంతుని విశ్వరూపంలోని అనేక నోళ్ళలో ప్రవేశిస్తున్నారు. వాళ్ళే కాదు, పాండవుల వైపు సైనికులు కూడా వెళుతున్నారు. మహాభారతయుద్ధం జరిగాక, పన్నెండుమంది మాత్రమే మిగిలారు అంటారు.

**సర్వే సహైవావనిపాలసంఘైః** – అనేక రాజుల సముదాయాలు. అవనిపాల అంటే రాజులు. పూర్వకాలంలో సామంతరాజులు, రాజులు, చక్రవర్తులు అని రకరకాల స్థాయీబేధాలు ఉండేవి. అవనిపాలసంఘైః అంటే రాజుల సముదాయం. పూర్వం యుద్ధభూమిలో ఒక్క అస్త్రం వేస్తే వేలమంది ఒక్కసారే మరణించేవారు. ఒక్కొక్క అస్త్రమూ ఒక్కొక్క అణుబాంబు అంత శక్తివంతమైనది. పురాణాల్లో వాటి గురించి కథలు, కథలుగా చదువుతాము. బ్రహ్మాస్త్రం అనీ, ఆగ్నేయాస్త్రం అనీ వాటి గురించి వస్తాయి. అందువల్ల సహైవా అన్నాడు అర్జునుడు. ఒక్కసారే వందలు, వేలల్లో యోధులు, రాజులు భగవంతుని నోళ్ళలో ప్రవేశిస్తున్నారు.

తమాషా ఏమిటంటే, అర్జునుడు భీష్మద్రోణులను చంపబోతున్నాననే విషయాన్ని భరించలేక భగవద్గీత బోధను అడిగాడు. అతను వారు మరణిస్తారన్న ఊహనే భరించలేకపోయాడు. ఇంక నిజంగా మరణిస్తే తట్టుకోగలడా? అలా వారిద్దరి మరణం గురించిన ఆలోచననే తట్టుకోలేకపోయిన అర్జునుడు, ఇప్పుడు ఏకంగా వందల్లో, వేలల్లో తన ఆత్మీయుల మరణాన్ని చూస్తున్నాడు.

**భీష్మః** – భీష్మ పితామహ కూడా నీ నోటిలో ప్రవేశిస్తున్నాడు;

**ద్రోణః** – నా ఆచార్యుడు, అంత శక్తివంతమైనవాడు కూడా నీ నోటిలో ప్రవేశిస్తున్నాడు.

**సూతపుత్రః** – కర్ణుడు కూడా నీ నోటిలో ప్రవేశిస్తున్నాడు. ఇది అర్జునునికి ఆశాజనకమైన వార్త.

**తథా అసౌ** – వీరితో పాటు;

**అస్మదీయైరపి యోధముఖ్యైః** – ఎంతోమంది యోధులు కూడా ఉన్నారు. అర్జునుని పుత్రుడు అభిమన్యుడు కూడా చాలా దారుణంగా మరణించబోతున్నాడు. అది అర్జునుడు కలలోనైనా ఊహించి ఉండడు. అలా ఎందరో మరణిస్తున్నారు.

ఇక్కడ మనం గ్రహించాల్సిన ముఖ్యమైన అంశం ఏమిటి? సత్యాన్ని స్వీకరించాలి. ఇది జీవితసత్యం. కాని మనం అంగీకరించటానికి సిద్ధంగా లేము. సత్యాన్ని మనం తిరస్కరించినన్నాళ్ళూ జీవితం బాధాకరంగానే ఉంటుంది.

**తస్మాదపరిహార్యేఽర్థే న త్వం శోచితుమర్హసి** – 2.27

తప్పించుకోలేని విషయాల గురించి శోకించకూడదు. మనం తప్పించుకోలేని సంఘటనలను స్వీకరించటమే

వివేకం అంటే. అర్జునుడు ఇంకా దాన్ని స్వీకరించే మనస్థితిలో లేడు. అందువల్ల అతను విశ్వరూపాన్ని చూసి భయపడుతున్నాడు.

ఇంకా అటువంటి వర్ణనే కొనసాగుతున్నది.

తే వక్త్రాణి విశంతి – వీరంతా నీ నోళ్ళలోకి ప్రవేశిస్తున్నారు. అది కూడా ఎలా?

**త్వరమాణాః** – పరుగులు పెడుతూ వెళుతున్నారు. కొండచిలువ నోరు తెరుచుకు కూర్చుంటే, ఆ విషయం తెలియక అందులోకి వెళ్ళిపోతాయి కొన్ని. అది ఎప్పుడో టక్కున నోరు మూసేసి, వాటిని మింగేస్తుంది. అలా భగవంతుని నోరు తెరుచుకున్న కొండచిలువ నోరులా ఉంది. దానిలోకి తెలియకుండా పరుగులు పెడుతూ వెళుతున్నారు వీరంతా. ఆ నోరు ఎలా ఉంది?

**దంష్ట్రాకరాళాని** – భయంకరమైన కోరలతో కూడి ఉంది.

**భయానకాని** – భీతిని గొల్పుతున్నాయి.

వేరుశెనగపప్పులు తినేటప్పుడు కొంతమంది ఒక్కొక్కటిగా తింటే, కొంతమంది ఒకేసారి ఒక గుప్పెడు పప్పులు వేసేసుకుంటారు నోటిలో. అప్పుడు ఏమవుతుంది? కొన్ని పప్పులు పళ్ళలో ఇరుక్కుంటాయి; కొన్ని పంటికింద నలుగుతాయి. అదే విధంగా అంతమంది ఒకేసారి భగవంతుని నోళ్ళలోకి ప్రవేశించటంవల్ల వారి పరిస్థితి కూడా రకరకాలుగా ఉంది. అదే అర్జునుడు వివరిస్తున్నాడు.

**కేచిద్విలగ్నాః** – కొంతమంది చిక్కుకున్నారు.

**దశనాంతరేషు** – దంతాల మధ్యలో చిక్కుకుని అవస్థ పడుతున్నారు.

**సందృశ్యంతే** – వారిని నేను చూస్తున్నాను.

**చూర్ణితైరుత్తమాంగైః** – నుగ్గునుగ్గు కావింపబడ్డ శిరస్సులతో ఉన్నారు కొందరు అంటున్నాడు అర్జునుడు.

అంటే కొంతమందికి తల మాత్రమే నుగ్గునుగ్గు అయితే, కొంతమందికి పాదాలు మాత్రం నుగ్గునుగ్గు అయితే కొంతమందికి ఉదరం మాత్రం నుగ్గునుగ్గు అయ్యాయి. ఇవన్నీ మన జీవితానికి సంకేతం. ఒకరికి కాళ్ళనొప్పులు వస్తే, కొంతమందికి చక్కెరవ్యాధి వస్తుంది. కొంతమందికి కిడ్నీ దెబ్బతింటే, కొంతమందికి ఇంకో భాగం దెబ్బతింటుంది. సైన్సు ఎంతగా అభివృద్ధి చెందినా కూడా, ఈ అనారోగ్యాల బారిన పడకుండా తప్పించుకోలేరు. అందువల్ల వాటిని జీవితంలో ఒక భాగంగా నవ్వుతూ స్వీకరించటం నేర్చుకోవాలి.

శ్లో. 28 **యథా నదీనాం బహవోఽమ్బువేగాః సముద్రమేవాభిముఖా ద్రవంతి ।**
**తథా తవామీ నరలోకవీరా విశంతి వక్త్రాణ్యభివిజ్వలంతి ॥**
యథా, నదీనామ్, బహవః, అంబువేగాః, సముద్రమ్, ఏవ, అభిముఖాః, ద్రవంతి,
తథా, తవ, అమీ, నరలోకవీరాః, విశంతి, వక్త్రాణి, అభివిజ్వలంతి ॥

| | | | |
|---|---|---|---|
| యథా | = ఏ విధముగా | తథా | = అలాగే |
| నదీనామ్ | = నదీనదములయొక్క | అమీ | = ఈ |
| బహవః | = అనేకములైన | నరలోకవీరాః | = శ్రేష్ఠులైన సమరయోధులూ నరలోకవీరులూ |
| అంబువేగాః | = వేగముగా ప్రవహించుచున్న జలములన్నియును | తవ | = నీయొక్క |
| సముద్రమ్ | = సముద్రమునకు | అభివిజ్వలంతి | = మిక్కిలి జ్వలించుచున్న |
| అభిముఖాః, ఏవ | = అభిముఖముగానే | వక్త్రాణి | = నోళ్ళయందు |
| ద్రవంతి | = పరుగులుదీయుచు అందు ప్రవేశించునో | విశంతి | = ప్రవేశించుచున్నారు |

**యథా నదీనామ్ బహవః అమ్బు-వేగాః అభిముఖాః సముద్రమ్**
**ఏవ ద్రవన్తి, తథా అమీ నర-లోక-వీరాః తవ అభివిజ్వలన్తి వక్త్రాణి విశన్తి ।**

తా: ఏ విధముగా నదీనదములయొక్క అనేకములైన వేగముగా ప్రవహించుచున్న జలములన్నియును సముద్రమునకు అభిముఖముగానే పరుగులు దీయుచు అందు ప్రవేశించునో అలాగే ఈ శ్రేష్ఠులైన సమరయోధులూ నరలోకవీరులూ నీయొక్క మిక్కిలి జ్వలించుచున్న నోళ్ళయందు ప్రవేశించుచున్నారు.

అలా మరణించేది సైనికులే కాదు, మామూలు మనుష్యులు కూడా. ఎందుకంటే పుట్టిన ప్రతివారూ మరణించక తప్పదు. జీవితం అంటే అవ్యక్తదశనుంచి వ్యక్తదశకు రావటం. మనుష్యులంతా అవ్యక్తంనుంచి వ్యక్తంలోకి వచ్చారు; మళ్ళీ ఎప్పుడో అవ్యక్తంలోకి వెళ్ళిపోవాల్సిందే. పునరపి జననం, పునరపి మరణం పొందుతూ ఉండాలి, తప్పదు. ఇదే సంసారవృత్తం.

ఇలా భగవంతునితో లయమవటానికి అర్జునుడు ఒక ఉదాహరణను కూడా ఇస్తున్నాడు. అనేక నదులు ఎటు ప్రవహించినా, చివరికి అన్నీ ఒకటే అంతిమగమ్యానికి చేరుకుంటాయి. అంటే సాగరంలో కలిసిపోతాయి. ఎందుకు? అవి పుట్టింది సాగరం అంటే సముద్రంనుంచే కాబట్టి. చూడటానికి కొండలనుంచి పుట్టినట్టు కనిపించినా, నిజానికి అవి వచ్చింది సముద్రంనుంచే. సముద్రపు నీరు ఆవిరయి, మేఘాలుగా ఏర్పడి, మేఘాలు వర్షంగా కురిస్తే, ఆ వర్షపునీరు చిన్నధారగా కొండలనుంచి జారిపడి, పెద్ద నదులుగా మారి పరవళ్ళు తొక్కుతూ అనేక మార్గాలలో ప్రవహిస్తాయి. ఎటు వెళ్ళినా, ఎంత ఎగిరెగిరిపడ్డా, చివరకి వాటి గమ్యం సాగరమే. మనమూ అంతే. ఆ దేవునినుంచి వచ్చాము; పరవళ్ళు తొక్కుతూ ఎగిరెగిరి పడతాము; చివరికి ఎప్పుడో ఆ భగవంతునిలో కలిసిపోతాము.

**నదీనాం బహవోఽంబువేగాః** – అనేక నదులు, వాటి పాయలు అన్నీ వేగంగా ప్రవహించి, చివరికి –

**సముద్రమేవాభిముఖా ద్రవంతి** – ఒకటే గమ్యం వైపు ప్రవహిస్తాయి. ఏమిటది? సముద్రానికి అభిముఖంగా, అంటే సముద్రం వైపు పరుగులు తీస్తాయి. ఒక్కోచోట చూస్తే అవి సముద్రానికి వ్యతిరేకంగా ప్రవహిస్తున్నట్టు కనిపించినా, చివరికి వాటి గమ్యం ఒకటే. సముద్రంలో లయమవటమే.

**తథా అమీ నరలోకవీరాః** – అదే విధంగా మనుష్యలోకానికి చెందిన ఈ వీరులందరూ కూడా నీలో కలవాల్సిందే. ఈ యోధులందరికీ రక్షణకవచాలు ఉంటాయి, రకరకాల ఆయుధాలు ఉంటాయి, అయినా అంత్యకాలం సమీపించినప్పుడు ఎవరూ తప్పించుకోలేరు. మృత్యువు సమీపించినప్పుడు ఏ రక్షణకవచమూ పనిచేయదు. అందువల్ల నరలోకవీరులు కూడా.

**విశంతి వక్త్రాణి** – నీ నోళ్ళలోకి ప్రవేశిస్తున్నారు. ఎలా ఉన్నాయి ఆ నోళ్ళు?

**అభివిజ్వలంతి** – తీవ్రంగా జ్వలిస్తున్న అగ్నిలా ఉన్నాయి.

శ్లో. 29 **యథా ప్రదీప్తం జ్వలనం పతంగా విశంతి నాశాయ సమృద్ధవేగాః ।**
**తథైవ నాశాయ విశంతి లోకాః తవాపి వక్త్రాణి సమృద్ధవేగాః ॥**
యథా, ప్రదీప్తమ్, జ్వలనమ్, పతంగాః, విశంతి, నాశాయ, సమృద్ధవేగాః,
తథా, ఏవ, నాశాయ, విశంతి, లోకాః, తవ, అపి, వక్త్రాణి, సమృద్ధవేగాః ॥

| | | | |
|---|---|---|---|
| యథా | = ఏ విధముగా | లోకాః, అపి | = లోకములన్నియును |
| పతంగాః | = మిడుతలు | నాశాయ | = తమ నాశనమునకై |
| నాశాయ | = మోహవశమున తమ నాశనముకోసం | తవ | = నీయొక్క |
| ప్రదీప్తమ్ | = ప్రజ్వలించుచున్న | వక్త్రాణి | = ముఖములందు |
| జ్వలనమ్ | = అగ్నిలో | సమృద్ధవేగాః | = మిక్కిలి వేగముగలవై |
| సమృద్ధవేగాః | = మిక్కిలి వేగముగా | విశంతి | = ప్రవేశించుచున్నవి |
| విశంతి | = ప్రవేశించునో | | |
| తథా, ఏవ | = ఆ విధముగానే | | |

**యథా పతఙ్గాః సమృద్ధ-వేగాః నాశాయ ప్రదీప్తమ్ జ్వలనమ్**
**విశన్తి, తథా ఏవ లోకాః సమృద్ధ-వేగాః నాశాయ తవ అపి వక్త్రాణి విశన్తి ।**

తా: ఏ విధముగా మిడుతలు మోహవశమున తమ నాశనముకోసం ప్రజ్వలించుచున్న అగ్నిలో మిక్కిలి వేగముగా ప్రవేశించునో ఆ విధముగానే లోకములన్నియును తమ నాశనమునకై నీయొక్క ముఖములందు మిక్కిలి వేగముగలవై ప్రవేశించుచున్నవి.

ఇక్కడ ఇంకొక ఉదాహరణను చెబుతున్నాడు అర్జునుడు. మిడుతలు జ్వలిస్తున్న అగ్ని వైపు మోహావేశంతో వెళ్ళి, ఆ అగ్నికి ఆహుతి అవుతాయి. ఆ అగ్ని తమను కబళించివేస్తుందని తెలియక, దానివైపు ఆకర్షించబడతాయి మిడుతలు. అందులో పడి మరణిస్తాయి. అంటే వాటి నాశనాన్ని అవి కోరితెచ్చుకుంటాయి. అలాగే భగవంతుని నోళ్ళు కూడా జ్వలిస్తున్న అగ్నిలా ఉన్నాయి. మనుష్యులంతా ఆ మిడుతలవలే పరుగెత్తుకుంటూ వెళ్ళి భగవంతుని నోళ్ళలో పడుతున్నారు.

**పతంగా జ్వలనం విశంతి** – మిడుతలు అగ్నివైపు వెళ్ళినట్టుగా; పతంగా అంటే మిడుతలు. అవి కాంతివైపు ఆకర్షించబడతాయి. అందువల్లనే, చూడండి ఒక్కోసారి ట్యూబ్‌లైట్ చుట్టూ చిన్నచిన్న పురుగులు చేరతాయి. జ్వలనం అంటే అగ్ని. ఆ అగ్ని ఎలా ఉంది?

**ప్రదీప్తం** – బాగా మండుతోంది. దాని దగ్గరకు ఎందుకు వెళతాయి?

**నాశాయ** – నాశనాన్ని కోరి తెచ్చుకుంటున్నాయి.

**సమృద్ధవేగాః** – అది కూడా చాలా వేగంగా వెళతాయి.

**తథైవ** – అదే విధంగా; **లోకాః తవ వక్త్రాణి విశంతి** – మనుష్యులందరూ తెలిసో, తెలియకో నీ వైపే వస్తున్నారు. ఎలా?

**సమృద్ధవేగాః** – అత్యంత వేగంగా. ఎందుకు?

**నాశాయ** – వారి నాశనానికి వస్తున్నారు.

ఈ శ్లోకాల్లో ఈ విధంగా కాలతత్త్వం వివరించబడింది. ఇది విశ్వరూపంలో ఒక భాగం. అందువల్ల ఎటువంటి వ్యతిరిక్తత చూపకుండా, కాలాన్ని స్వీకరించటం నేర్చుకోవాలి. కాలాన్ని వ్యతిరేకించాలంటే, దానికి ఒక్కటే మార్గముంది. ఏమిటది? యమధర్మరాజును తప్పించుకోవటానికి ఎలాగైతే మార్కండేయుడు శివలింగాన్ని కౌగిలించుకున్నాడో, అలా మనం కూడా మృత్యుబారిన పడకుండా ఉండాలంటే శివుణ్ణి కౌగలించుకోవాలి. ఆ శివుడెవరు? ఆత్మ. ఆత్మ ఒక్కటే దేశకాలాలకు అతీతం. అందువల్ల ఆత్మ శరణాగతి లేదా ఆత్మజ్ఞానం ఒక్కటే దీనికి మార్గం. ఆత్మనుంచి దూరంగా ఉన్నన్నాళ్ళూ ఈ దేశకాలాలను స్వీకరించక తప్పదు.

కాలం కూడా విశ్వరూపంలో ఒక భాగమే అని అర్థం చేసుకోవాలి. ఎందుకు? దేశం–కాలం కూడా సృష్టితో పాటు వచ్చాయి. అవి కూడా జగత్తుతో పాటు లయమవుతాయి. అంటే అవి జగత్తుకు భిన్నంగా లేవు.

ఈ విషయాన్ని స్పష్టంగా సుషుప్తిలో గమనించవచ్చు. సుషుప్తిలో బాహ్యప్రపంచంలోని వస్తువులన్నీ లయమవటమే కాక, దేశం–కాలం కూడా లయమవుతాయి. అంటే అప్పుడు మనకు దేశం, కాలం అనుభవంలోకి రావు. మళ్ళీ మనం లేవగానే దేశం, కాలం కూడా అనుభవంలోకి వస్తాయి. దీన్నిబట్టి దేశం, కాలం జగత్తులోని స్వాభావిక లక్షణం అని అర్థమవుతున్నది. అందువల్లనే అర్జునుడు విశ్వరూపాన్ని దర్శించినప్పుడు కాలతత్త్వాన్ని కూడా భగవంతునిలో ఒక అంతర్లీనభాగంగా దర్శించాడు.

ఈ కాలతత్త్వం ప్రతివస్తువుయొక్క సృష్టి, స్థితి, లయలుగా దానిలో అంతర్లీనంగా ఉంటుంది. ఆ వస్తువు ఒక సమయంలో వస్తుంది, కొన్ని రోజులు ఆ వస్తువు పెరిగి, క్షీణిస్తుంది; చివర్లో మరణిస్తుంది.

ఈ కనబడని, సర్వవ్యాపకమైన, అంతర్లీనమైన కాలతత్త్వాన్ని భగవంతుని నోళ్ళుగా చూపించటం జరిగింది. కాలతత్త్వానికి రెండు శక్తులు ఉంటాయి – సృష్టించేశక్తి, నాశనం చేసేశక్తి. అర్జునుడు సృష్టించేశక్తిని చూసి ఉండి ఉంటే, ఏమీ భయపడివుండేవాడు కాదు. సృష్టిని మాత్రం చూసివుంటే, అది మంగళకర్మగా భావించి

ఉండేవాడు. అంటే ఒక శిశువు పుట్టటం చూసి ఉండివుంటే, ఆనందించి ఉండి ఉండేవాడు. కాని అర్జునుడు ఉన్నది రణరంగంలో. ఇంకాసేపటిలో మహాభారతయుద్ధం ప్రారంభం కాబోతున్నది. అక్కడ రక్తపాతం తప్ప ఏముంటుంది? అందువల్ల కాలతత్త్వంయొక్క నాశనం చేసేశక్తిని చూస్తున్నాడు.

కాలతత్త్వాన్ని భగవంతుని నోళ్ళుగా చూశాడని చూశాము. రాజులందరూ అనేకమంది సైనికులతో సహా దేవుని నోళ్ళలోకి అతివేగంగా పరుగులుతీస్తూ వెళ్ళటం చూస్తున్నాడు. అర్జునునికి పరిపక్వత ఉండి ఉంటే, చావు పుట్టుకలు విశ్వరూపమనే నాణేనికి రెండు పక్కలుగా ఉంటాయని తెలుసుకుని ఉండేవాడు. అప్పుడు చావు కూడా మంగళంగానే తోచేది.

జీవితంగూర్చి పూర్తి అవగాహన ఉంటే, మనం చావుపుట్టుకలను రెండూ సమదృష్టితో చూస్తాము. చావూ మంగళమే, పుట్టుకా మంగళమే. ఒకదాన్ని స్వీకరించి, ఇంకొకదాన్ని తృణీకరించలేము. మరణం భగవంతుడే, జననం భగవంతుడే; అంటే కలయిక మంగళమే, విడిపోవటం మంగళమే; రావటం మంగళమే, వెళ్ళిపోవటం మంగళమే; ఎదుగుదల మంగళమే, క్షీణించటం మంగళమే; ఆరోగ్యం మంగళమే, అనారోగ్యం మంగళమే.

ఈ ద్వంద్వప్రవృత్తులను స్వీకరించగలిగితే, విశ్వరూపం మనను భయపెట్టదు. అందువల్ల మనకు ఒక్కటే అవకాశం ఉంది. ఏమిటది? అంతటినీ మంగళకరంగా భావించి, నవ్వుతూ స్వీకరించటం. మనం అలా అన్నింటినీ మంగళకరంగా భావించలేము అంటే ఇంకో మార్గముంది. అది ఏమిటో తెలుసా? అంతటినీ అమంగళకరంగా చూడటం. మరణాన్ని మాత్రమే కాదు, జననాన్ని కూడా అమంగళకరంగా చూడాలి. నిజానికి ఇదే వేదాంతదృక్పథం. వేదాంతంలో జన్మను సంసారంగా వర్ణిస్తారు.

**పునరపి జననం పునరపి మరణం పునరపి జననీ జఠరే శయనం**
**ఇహ సంసారే బహుదుస్తారే కృపయాఽ పారే పాహి మురారే** – భజగోవిందం 21

ఇందులో శంకరులవారు సంసారంలో మరణాన్నే కాదు, జననాన్ని కూడా కలిపారు. పునరపి జననం కూడా అమంగళం. పెళ్ళిని కళ్యాణం అంటారు కాని అది కూడా అమంగళం; విడిపోవటం కూడా అమంగళం అనుకుంటే సమదృష్టి ఉంటుంది. స్వర్గాన్నీ అమంగళంగా, నరకాన్నీ అమంగళంగా చూడమంటుంది ఈశావాస్యోపనిషత్తు.

**అంధంతమః ప్రవిశంతి యేఽ విద్యాముపాసతే**
**తతో భూయ ఇవ తే తమో య ఉ విద్యాయాగ్ం రతాః** **– ఈశావాస్యం**

అంటే వేదాంతం స్వర్గలోకాన్ని కూడా అమంగళ సంసారంగా వర్ణిస్తున్నది. అందువల్ల మనకు రెండే మార్గాలున్నాయి. అయితే అన్నింటినీ మంగళంగా చూడటం; లేదా అన్నింటినీ అమంగళంగా చూడటం.

కాని మనకున్న సమస్య ఏమిటి? మనం పుట్టుకను మంగళంగా చూస్తాము; చావును అమంగళంగా చూస్తాము. అంటే నాణెంలో బొమ్మా, బొరుసు ఉంటే మనం బొమ్మ మాత్రమే ఉండాలి, బొరుసు ఉండకూడదు అంటాము. అదెలా కుదురుతుంది? మనలో ఈ ఏకపక్షవాదన ఉన్నంతవరకూ జగత్తు భయానకంగానే ఉంటుంది.

అయితే జగత్తును పూర్తిగా స్వీకరించాలి, లేదా జగత్తును పూర్తిగా త్యజించాలి. అంతేకాని ఒక భాగాన్ని స్వీకరించి, ఇంకొక భాగాన్ని తృణీకరించకూడదు. అలా చేస్తే మనకు దుఃఖం తప్పదు.

కాని ప్రస్తుతం అర్జునుడు ఈ పరిస్థితిలోనే ఉన్నాడు అంటే ఒక భాగాన్ని స్వీకరించి, ఇంకొక భాగాన్ని తృణీకరించే స్థాయిలోనే ఉన్నాడు. భగవంతునియొక్క సృష్టించేశక్తిని కీర్తిస్తున్నాడు; నాశనం చేసేశక్తిని చూసి భయపడుతున్నాడు. నాశనం చేసేశక్తిలో కూడా కర్ణుణ్ణి నాశనంచేస్తే చాలా సంతోషం – అటువైపు సైనికులు మరణిస్తే సంతోషం – కాని తాను పూజించి, గౌరవించే భీష్మద్రోణులు మరణించకూడదు.

మన పరిస్థితీ అలాగే ఉంటుంది. మనకు సంబంధం లేనివారు ఎంతమంది మరణించినా ఫర్వాలేదు; కాని మన దగ్గరివారికి అనారోగ్యం రాకూడదు; వృద్ధాప్యం రాకూడదు; అసలు మరణించకూడదు. వారు ఎప్పుడూ ఆయురారోగ్య ఐశ్వర్యాలతో తులతూగాలి. మరణించినా కూడా వారు మనతోనే, మనం ఎక్కడికి వెళితే అక్కడికి రావాలి. అంటే మనం స్వర్గానికి వెళితే వారూ స్వర్గానికి రావాలి; మనం నరకానికి వెళితే వారూ మనతోపాటు నరకానికి రావాలి.

అందువల్ల అర్జునుడు ఆ కాలతత్త్వాన్ని జీర్ణించుకోలేకపోతున్నాడు. నదులన్నీ సముద్రంలో కలుస్తున్నట్టుగా, సైనికులందరూ భగవంతుని నోళ్ళలోకి వేగంగా పరుగులు తీస్తున్నారని వర్ణిస్తున్నాడు.

శ్లో. 30 **లేలిహ్యసే గ్రసమానః సమంతాత్ లోకాన్ సమగ్రాన్ వదనైర్జ్వలద్భిః ।**
**తేజోఽభిరాపూర్య జగత్ సమగ్రం భాసస్తవోగ్రాః ప్రతపంతి విష్ణో ॥**

లేలిహ్యసే, గ్రసమానః, సమంతాత్, లోకాన్, సమగ్రాన్, వదనైః, జ్వలద్భిః,
తేజోభిః ఆపూర్య, జగత్, సమగ్రమ్, భాసః, తవ, ఉగ్రాః ప్రతపంతి, విష్ణో ॥

| | | | |
|---|---|---|---|
| విష్ణో | = ఓ మహావిష్ణూ! | తవ | = నీయొక్క |
| సమగ్రాన్ | = సమగ్రములైన | ఉగ్రాః | = భయంకరములైన |
| లోకాన్ | = లోకములను | భాసః | = కాంతులు |
| జ్వలద్భిః | = ప్రజ్వలించుచున్న | సమగ్రమ్ | = సమస్త |
| వదనైః | = ముఖములతో | జగత్ | = జగత్తును |
| గ్రసమానః | = కబళించుచున్న వాడవై | తేజోభిః | = తేజస్సులతో |
| సమంతాత్ | = అన్నివైపులనుంచి | ఆపూర్య | = నింపి |
| లేలిహ్యసే | = మాటిమాటికిని చప్పరించుచున్నావు | ప్రతపంతి | = తపింపజేయుచున్నవి |

**హే విష్ణో! సమన్తాత్ జ్వలద్భిః వదనైః సమగ్రాన్ లోకాన్ గ్రసమానః (త్వం) లేలిహ్యసే, తవ ఉగ్రాః భాసః తేజోభిః సమగ్రమ్ జగత్ ఆపూర్య ప్రతపన్తి ।**

తా: ఓ మహావిష్ణూ! సమగ్రములైన లోకములను ప్రజ్వలించుచున్న ముఖములతో కబళించుచున్న వాడవై అన్నివైపులనుంచి మాటిమాటికిని చప్పరించుచున్నావు. నీయొక్క భయంకరములైన కాంతులు సమస్తజగత్తును తేజస్సులతో నింపి తపింపజేయుచున్నవి.

భగవంతుడు వీరందరినీ కబళించి వేస్తున్నప్పుడు ఆయన స్పందన ఏమిటి? తమ ఆత్మీయుడు మరణించినప్పుడు అందరూ హృదయవిదారకంగా ఏడుస్తుంటే భగవంతుడు వారిమీద జాలి చూపిస్తాడా? భగవంతుడు జాలి చూపించడు. నిజానికి భగవంతుడు జనన, మరణాలు నాణేనికి రెండువైపులా ఉన్న బొమ్మా బొరుసులాంటివనీ, ఆ పచ్చి నిజాన్ని తెలుసుకుని జీర్ణించుకోకపోతే, అది మన సమస్య అనీ, ఆ విషయంలో తనను నిందించి లాభం లేదనీ అంటాడు.

ఆ విషయం అర్థం చేసుకోవటానికి మనకు శాస్త్రాన్ని ఇచ్చాడు. పుట్టిన వ్యక్తి మరణించక తప్పదనీ, ఆది ఉన్న ప్రతిదానికీ అంతం ఉంటుందనీ, ఒక కాలంలో వచ్చేది, ఇంకొక కాలంలో వెళ్ళిపోతుందనీ అర్థం చేసుకోవాలి. మరణం అంటే ఏమిటో శాస్త్రం స్పష్టంగా అనేక విధాలుగా చెబుతుంది. కాని అసలు మరణం మాట వినటానికే భయపడతారు చాలామంది. ఆ ఊహే భరించలేరు. అందువల్ల చాలామంది ఎల్.ఐ.సీ పాలసీలు కూడా తీసుకోరు. అమంగళకర మాటలను మాట్లాడవద్దంటారు.

మరణం గురించి వినటానికి కూడా ఇష్టంలేక, చెవులు మూసుకుంటే నష్టపోయేది మనమే. శాస్త్రం ఎన్నడూ దాని గురించి వినవద్దని అనదు. శాస్త్రం మరణం గురించి సరిగ్గా అర్థం చేసుకోమంటుంది. అది అర్థం చేసుకోకుండా, ఎవరైనా దగ్గరివారు మరణించినప్పుడు మనం దుఃఖిస్తే, భగవంతునికి మనమీద జాలి ఉండదు. మీరు నేర్చుకునే అవకాశం కలుగజేశాను; మీరు నేర్చుకోవటానికి నిరాకరిస్తే నేనేం చేయలేను అంటాడు. అందువల్ల భగవంతుడు పట్టించుకోనట్టుగా కనిపిస్తాడు. అలాంటి వర్ణన చూస్తాము ఈ మంత్రంలో. భగవంతునికి వీరి మరణం పంచభక్ష్యపరమాన్నాలు తింటున్నట్టుగా ఉంటుంది.

పెళ్ళిభోజనం చేస్తూ ఆనందించే వ్యక్తిని ఊహించుకోండి. అతని ముందు ఒక పెద్ద అరటి ఆకు వేసి, పంచభక్ష్యపరమాన్నాలు వడ్డిస్తే, అతను ముందు ఏ కూరో తింటాడు; మళ్ళీ ఇంకో వైపు ఉన్న పాయసాన్ని తీసుకుంటాడు. నోరు తియ్యగా అయిందని ఏ ఆవకాయో నంజుకుంటాడు. అద్భుతం అనుకుంటాడు. అలా తన ఆకులో వడ్డించిన ప్రతి వంటకాన్నీ ఆస్వాదిస్తూ ఆరగిస్తాడు. అలా భగవంతుడు తను భక్షిస్తున్న జీవులను ఆస్వాదిస్తున్నాడుట.

**సమగ్రాన్ లోకాన్ సమంతాత్ గ్రసమానః** – ఈ లోకంలో ఉన్న అందరినీ భగవంతుడు కబళిస్తున్నాడు. సమంతాత్ అంటే అన్ని వైపులనుంచి; లోకాన్ సమగ్రాన్ – లోకంలోని అందరినీ; గ్రసమానః అంటే భక్షిస్తున్నాడు. దేనితో,

**జ్వలద్భిః వదనైః** – జ్వలిస్తున్న ముఖాలతో. ముఖం అంటే నోరు అని చూశాము. ఆ జ్వలిస్తున్న ముఖాలు కాలాగ్నికి సంకేతాలని చూశాము.

**లేలిహ్యసే** – నువ్వు మాటిమాటికీ చప్పరిస్తున్నావు అంటున్నాడు అర్జునుడు. అంటే భగవంతుడు తను తింటున్న ఆహారాన్ని ఆస్వాదిస్తున్నాడు.

**సమగ్రం జగత్ ఆపూర్య** – నీ నోళ్ళలోని అగ్నిజ్వాలలు నీ లోపలికి ప్రవేశించినవారినే కాదు, జగత్తంతా కూడా వ్యాపించినట్టుగా ఉంది.

**తేజోభిః** – నీ అగ్నిజ్వాలలు అంతటా వ్యాపించి ఉన్నాయి.

**ఉగ్రాః భాసః** – నీ అగ్నిజ్వాలల వేడి భయంకరంగా ఉంది. ఇదంతా కాలతత్త్వానికి చిహ్నం అని చూశాము. కాలతత్త్వం మనను వృద్ధాప్యంలో మాత్రమే పట్టి పీడించదు. ఇప్పుడు, ఈ క్షణంలో కూడా దాని ప్రభావం ఉంది. ఒక గంట క్రితానికీ, ఇప్పటికీ మన వయస్సు గంట పెరుగుతుంది.

కాలతత్త్వం తన వేడితో మనను వండుతోంది. ఎప్పుడైతే మనం తినబడే పక్వానికి చేరుకుంటామో, అప్పుడే మనను భగవంతునికి ఆహారంగా సమర్పిస్తుంది. మనను ఎన్నాళ్ళు వండుతుందనేది మనిషి, మనిషికీ మారుతుంది. ఆ మాటకొస్తే మనం చేసే వంటలో కూడా అంతేకదా. ఒక కూరను చాలాసేపు వండితే, పాయసాన్ని కాసేపు వండుతాము. ఏ పచ్చడో అయితే మరీ నిమిషంలో అయిపోతుంది. అలా మనమందరం వండబడ్డాక, స్వాహా అంటాడు భగవంతుడు.

**ప్రతపంతి** – నీ ఉగ్రరూపం అందరినీ తపింపజేస్తున్నది అంటున్నాడు అర్జునుడు.

**విష్ణో** – ఈ సందర్భానికి సరిపోయిన పేరుతో సంబోధిస్తున్నాడు.

**సర్వం వేవేష్టి ఇతి విష్ణుః**

విష్ణువు అంటే సర్వవ్యాపకం. ఓ విష్ణూ, నువ్వు నీ ఉగ్రరూపంతో అందరినీ హడలగొడుతున్నావు అంటున్నాడు అర్జునుడు.

ఇక్కడ భగవంతుని స్వరూపం గురించి చిన్నగా సందేహం కలుగుతుంది అర్జునునికి. భగవంతుణ్ణి ఎప్పుడూ కరుణామయుడు, దయాశీలి, సుందరవదనుడు, చిద్విలాసుడు, ప్రసన్నుడు అంటూ మంచి గుణాలతోనే కీర్తిస్తాము. కాని ఇక్కడ కనిపిస్తున్న చిత్రం దానికి పూర్తిగా భిన్నంగా ఉంది. అందరినీ జుర్రుకుంటూ తినేస్తున్నాడు; మళ్ళీ చప్పరిస్తున్నాడు. అందువల్ల భగవంతుణ్ణి ఎలా భావించాలి? కరుణామూర్తా, ఉగ్రరూపుడా? ఇదీ అర్జునుని సందేహం.

నిజానికి ఇటువంటి సందేహం అందరికీ ఎప్పుడో ఒకప్పుడు రాకతప్పదు. ఏదైనా భరించలేని కష్టం ముంచుకొచ్చినప్పుడు భగవంతుడు కరుణామయుడా, నిర్దయుడా అనే సందేహం వస్తుంది. ఆ కష్టం ఇంకా తీవ్రరూపం దాలిస్తే ఈ సందేహం కూడా పరాకాష్ఠకు చేరుకుంటుంది. అసలు దేవుడనే వాడున్నాడా అనే సందేహం కలుగుతుంది. అర్జునుడు కూడా ఆ సందేహావస్థలో పడ్డాడు. అందువల్ల కృష్ణపరమాత్మను ఒక ప్రశ్న అడుగుతున్నాడు వచ్చే శ్లోకంలో.

శ్లో. 31 **ఆఖ్యాహి మే కో భవానుగ్రరూపో నమోఽస్తు తే దేవవర ప్రసీద ।**
**విజ్ఞాతుమిచ్ఛామి భవంతమాద్యం న హి ప్రజానామి తవ ప్రవృత్తిమ్ ॥**
ఆఖ్యాహి, మే, కః, భవాన్, ఉగ్రరూపః, నమః, అస్తు, తే, దేవవర, ప్రసీద,
విజ్ఞాతుమ్, ఇచ్ఛామి, భవంతమ్, ఆద్యమ్, న, హి, ప్రజానామి, తవ, ప్రవృత్తిమ్ ॥

| | | | |
|---|---|---|---|
| దేవవర! | = ఓ పరమాత్మా! | హి | = ఎందుకంటే |
| తే | = నీకు | తవ, ప్రవృత్తిమ్ | = నీ ప్రవృత్తిని |
| నమః, అస్తు | = నమస్కారము | న, ప్రజానామి | = తెలియకున్నాను |
| ప్రసీద | = ప్రసన్నుడవు కమ్ము | ఉగ్రరూపః | = (కనుక) ఉగ్రరూపుడవైన |
| ఆద్యమ్ | = ఆదిపురుషుడవైన | భవాన్ | = నీవు |
| భవంతమ్ | = నిన్ను | కః | = ఎవరవో |
| విజ్ఞాతుమ్ | = వివరముగా తెలిసికొనుటకు | మే | = నాకు |
| ఇచ్ఛామి | = కోరుచున్నాను | ఆఖ్యాహి | = తెలుపుము |

**హే దేవవర! తే నమః అస్తు, (త్వం) ప్రసీద, భవాన్ ఉగ్ర-రూపః కః (అస్తి)? (తత్) మే ఆఖ్యాహి । (అహం) ఆద్యమ్ భవన్తమ్ విజ్ఞాతుమ్ ఇచ్ఛామి తవ ప్రవృత్తిమ్ హి (అహం) న ప్రజానామి ।**

తా: ఓ పరమాత్మా! నీకు నమస్కారము, ప్రసన్నుడవు కమ్ము. ఆదిపురుషుడవైన నిన్ను వివరముగా తెలిసికొనుటకు కోరుచున్నాను. ఎందుకంటే నీ ప్రవృత్తిని తెలియకున్నాను. కనుక ఉగ్రరూపుడవైన నీవు ఎవరవో నాకు తెలుపుము.

## 5. అర్జునుని ప్రశ్న, కృష్ణపరమాత్మ జవాబు: శ్లోకాలు 31-34

అర్జునుడు ప్రాథమిక ప్రశ్న వేస్తున్నాడు. ఓ భగవంతుడా, ఎవరు నువ్వు? నువ్వు సౌమ్యమైన ఈశ్వరునివా, ఉగ్రరూపం ధరించిన భగవంతునివా?

**కః భవాన్ ఉగ్రరూపః** – ఎవరు నువ్వు? ఉగ్రరూపం దాల్చిన ఓ భగవంతుడా, నన్ను భయపెడుతున్నావు నువ్వు. ఎవరు నువ్వు?

**ఆఖ్యాహి మే** – నాకు చెప్పుగాక! ఎందుకంటే నాకు కొన్ని ప్రాథమిక సందేహాలు కలుగుతున్నాయని అర్థం.

మనం కూడా అంతే. జీవితం హాయిగా సాగుతున్నంతసేపూ ఏమీ ఆలోచించము. భగవద్గీత జోలికే పోము. కాని సమస్యలు చుట్టుముట్టినప్పుడు ఎక్కడలేని వేదాంతం దూసుకొస్తుంది. అనేక అర్థం లేని, అర్థం కాని ప్రశ్నలే వేధిస్తాయి.

భగవంతుడు ప్రత్యేకించి ఈ ప్రపంచాన్ని ఎందుకు సృష్టించాడు? పోనీ సృష్టించాడే అనుకో; అతను సర్వజ్ఞుడు, సర్వశక్తివంతుడు కదా, అందరినీ సాధన చతుష్టయ సంపన్నులుగా, అందరినీ ముక్తపురుషులుగా సృష్టించి ఉండవచ్చు కదా! మళ్ళీ అందులో అర్థరాజ్యాన్ని చెడగొట్టటం ఎందుకు? అంతా మంచివారే, అందరూ ధనవంతులే

ఉండవచ్చు కదా. కొంతమందిని అష్టదరిద్రులుగా, దుర్మార్గులుగా ఎందుకు సృష్టించాడు? ఈ దోమలను, రోగాలను ఎందుకు సృష్టించాడు? ఇవికాక ఈ కష్టాల కడలిని ఎందుకు సృష్టించాడు? జీవితమంతా హాయిగా, గాలిలో తేలిపోయేలా ఉండే ఆనందమే ఆనందం సృష్టించి ఉండవచ్చు కదా. అన్నింటినీ మించి మరణాన్ని ఎందుకు సృష్టించాడు? అది కూడా బాగా వృద్ధిలోకి వస్తున్న యువకుడు హఠాత్తుగా మరణిస్తాడు. ఎందుకు? ఒక్కో వ్యక్తి అయితే నిద్రలోనే మరణిస్తాడు. ఎందుకు?

ఇలాంటి ఆలోచనలను స్మశానవైరాగ్యం అంటారు. తింటూ, తిరుగుతూ ఉన్న వ్యక్తి హఠాత్తుగా మరణించాడని వింటే, ఇలాంటి ఆలోచనలు వేధిస్తాయి. అప్పుడు భగవద్గీత, శాస్త్రం, గురువు అందరూ గుర్తుకువస్తారు. కాని రెండు రోజుల్లో ఈ స్మశానవైరాగ్యం సన్నగిల్లుతుంది, మనమూ చప్పబడిపోతాము. ఇప్పుడు అర్జునుడు ఆ పరిస్థితిలో ఉన్నాడు. అందువల్ల ఉగ్రరూపంలో ఉన్న నువ్వు ఎవరో చెప్పు అంటున్నాడు.

**నమోఽస్తు తే** – నీకు నమస్కారాలు అంటున్నాడు అర్జునుడు.

**దేవవర** – ఓ దేవశ్రేష్ఠా! అంటే దేవదేవోత్తమా అంటున్నాడు.

**ప్రసీద** – ప్రసన్నుడవు కమ్ము. నీ ఉగ్రరూపం తగ్గించుకుని, ప్రసన్నుడవు కమ్ము.

ఎవరైనా పరిచయం అయితే రెండు ప్రశ్నలు వేస్తాము. ఎవరు నువ్వు? ఏం చేస్తుంటావు? అంటే నీ ఉద్యోగం ఏమిటి? అర్జునుడు కూడా అలాగే అడుగుతున్నాడు. ఎవరు నువ్వు? నీ ప్రవృత్తి ఏమిటి అంటున్నాడు. ప్రస్తుతం భగవంతుని పని మనుష్యులను తినటంగానే కనిపిస్తున్నది.

**భవంతమాద్యం విజ్ఞాతుమిచ్ఛామి** – సృష్టికారణమైన నీ గురించి పూర్తిగా తెలుసుకోగోరుతున్నాను. ఆద్యం అంటే సృష్టికారణం; అంటే సృష్టికి ముందు కూడా నువ్వు ఉన్నావు.

**తవ ప్రవృత్తిమ్ న హి ప్రజానామి** – కాని నీ ప్రవృత్తి ఏమిటో నాకు తెలియటం లేదు. ప్రవృత్తి అంటే చేసే పని. అంటే నువ్వు ఇలా తినటమే కాక, ఇంకేదైనా పనిచేస్తావా?

మనిషిగా మనం ఎదగాలంటే, ఎన్నో విషయాలు నేర్చుకోవాలి. ఈ విధంగా ఆలోచించి, దానికి సమాధానాలు తెలుసుకోవాలి. కాని ఎంతసేపూ గుడ్డిగా కొన్ని పనులు చేసుకుంటూపోతాము; ఆగి సృష్టి గురించి ఆలోచించే తీరికే లేదు. భగవంతుడు ఎవరు? ఆయన ప్రవృత్తి ఏమిట అనే ప్రాథమిక ప్రశ్నల జోలికి పోము. అంటే ఎప్పుడైనా కలిగినా, సందేహస్థాయిలోనే ఆగిపోతాము కాని వాటి జవాబులు పొందటానికి వెంపర్లాడము. అందువల్ల అర్జునుడు ఈ ప్రశ్నలు వేసేసరికి భగవంతుడు మురిసిపోతాడు. మురిసిపోతాడని ఎలా చెప్పగలము? దానికి వెంటనే జవాబు చెబుతున్నాడు కాబట్టి.

ఈ శ్లోకంతో అర్జునుని స్పందనలో రెండవదశ ముగిసింది. ఈ అధ్యాయం మొదట్లో చూశాము, అర్జునుడు విశ్వరూపాన్ని చూసి మూడురకాల స్పందనలను చూశాడని. వాటిలో ఇప్పటిదాకా రెండు స్పందనలను చూశాము. మొదటి స్పందన ఆశ్చర్యం లేదా విస్మయం. రెండవ స్పందన భయం. ఇంక మూడవ దశ చూడాలి, కాని అది చూసేముందు అర్జునుడు వేసిన ప్రశ్నకు భగవంతుడు ఇచ్చిన జవాబు చూడబోతున్నాము.

**శ్రీభగవాన్ ఉవాచ**

శ్లో. 32 **కాలోఽస్మి లోకక్షయకృత్ ప్రవృద్ధో లోకాన్ సమాహర్తుమిహ ప్రవృత్తః ।**
**ఋతేఽపి త్వాం న భవిష్యంతి సర్వే యేఽవస్థితాః ప్రత్యనీకేషు యోధాః ॥**

కాలః, అస్మి, లోకక్షయకృత్, ప్రవృద్ధః, లోకాన్, సమాహర్తుమ్, ఇహ, ప్రవృత్తః,
ఋతే, అపి, త్వామ్, న, భవిష్యంతి, సర్వే, యే, అవస్థితాః, ప్రత్యనీకేషు, యోధాః ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| లోకక్షయకృత్ | = | సర్వలోకములను సంహరించుటకు | ప్రత్యనీకేషు | = | శత్రుపక్షములందు |
| | | | యే, యోధాః | = | ఏ వీరులు |
| ప్రవృద్ధః | = | విజృంభించిన | అవస్థితాః | = | కలరో |
| కాలః, అస్మి | = | మహాకాలుడను | (తే) | = | (వారు) |
| ఇహ | = | ఇప్పుడు | సర్వే | = | అందరును |
| లోకాన్ | = | ఈ లోకములను | త్వామ్ | = | నీవు |
| సమాహర్తుమ్ | = | రూపుమాపుటకై | ఋతే, అపి | = | యుద్ధము చేయకున్నను |
| ప్రవృత్తః | = | పూనుకొనియున్నవాడను | న, భవిష్యంతి | = | ఎవరూ మిగిలియుండరు |

**శ్రీభగవాన్ ఉవాచ**

**(అహం) లోక-క్షయ-కృత్ ప్రవృద్ధః కాలః అస్మి, ఇహ లోకాన్ సమాహర్తుమ్ ప్రవృత్తః (అస్మి), త్వామ్ ఋతే అపి ప్రత్యనీకేషు యే యోధాః అవస్థితాః, (తే) సర్వే న భవిష్యన్తి ।**

తా: సర్వలోకములను సంహరించుటకు విజృంభించిన మహాకాలుడను. ఇప్పుడు ఈ లోకములను రూపుమాపుటకై పూనుకొనియున్నవాడను. శత్రుపక్షములందు ఏ వీరులు కలరో వారు అందరును, నీవు యుద్ధము చేయకున్నను ఎవరూ మిగిలియుండరు.

**శ్రీ భగవాన్ ఉవాచ** – భగవంతుడు జవాబు చెబుతున్నాడు. ముందు శ్లోకంలో అర్జునుడు రెండు ప్రశ్నలు వేశాడు. అవి **ఎవరు నువ్వు**? **నీ ప్రవృత్తి ఏమిటి**? ఇందులో మొదటి ప్రశ్నకు జవాబు వస్తుంది. ఎవరు నువ్వు?

**కాలః అస్మి** – నేను కాలతత్త్వాన్ని అంటున్నాడు కృష్ణపరమాత్మ. కాలతత్త్వాన్ని వ్యావహారిక స్థాయిలో చూస్తాము.

మూడు రకాల సత్యాలు ఉన్నాయని చాలాసార్లు చూశాము. అవి ప్రాతిభాసిక సత్యం, వ్యావహారిక సత్యం, పారమార్థిక సత్యం. ప్రాతిభాసిక సత్యం అంటే స్వప్నప్రపంచం. దాని గురించి ఎక్కువగా పట్టించుకోము. ఇప్పుడు చూసేది పారమార్థిక సత్యం, వ్యావహారిక సత్యాల గురించి మాత్రమే.

వ్యావహారిక సత్యం అంటే ఇప్పుడు మనమున్న జాగ్రదావస్థ. వ్యావహారిక సత్యంలో కాలతత్త్వం విడరాని, విడదీయలేని అంశం. అందువల్ల వ్యావహారిక స్థాయిలో అన్నీ ద్వంద్వాలనే చూస్తాము. రాక-పోకలు; అభివృద్ధి-వినాశనం; కలయిక-విడిపోవటం; చావు-పుట్టుకలు మొదలైనవి. అందువల్ల వేదాంతం వ్యావహారిక సత్యంలో మీకు రెండే మార్గాలు ఉన్నాయంటుంది. ఏమిటవి? ఈ ద్వంద్వాలలో స్వీకరిస్తే రెండింటినీ స్వీకరించటం, తిరస్కరిస్తే రెండింటినీ తిరస్కరించటం.

ఒక వ్యక్తి తరచు విమానాల్లో ప్రయాణిస్తూ ఉంటాడు. చాలా విమానాల్లో చాలా రకాల ఆహారం ఏర్పాటు చేసేవారు. అందులో కూడా విస్తారంగా ఉండేది ఆహారం. అందువల్ల నిముషనిముషం ఎయిర్‌హోస్టెస్ వచ్చి కాఫీ కావాలా, టీ కావాలా, డ్రింకు కావాలా అని అడిగేది; అల్పాహారం విషయంలో కూడా దోశ కావాలా, ఇడ్లీ కావాలా, బ్రెడ్‌టోస్ట్ కావాలా అని అడిగేది; భోజనం విషయంలో వెజ్ కావాలా, నాన్‌వెజ్ కావాలా అని అడిగేది. అలా ప్రశ్నలు వేసి, అతనికి కావాల్సినవి అందించేది. కాని ఒకసారి అతను అనుకోకుండా ఇంకో మామూలు విమానంలో ప్రయాణం చెయ్యాల్సివచ్చింది. ఎయిర్‌హోస్టెస్ వచ్చి ఆహారం కావాలా అని అడిగింది. ఏమేమి ఉన్నాయి అని అతను అలవాటు ప్రకారం అడిగాడు. ఎయిర్‌హోస్టెస్ నవ్వి, మీకు ఒకటే అవకాశం ఉంది అంది. ఏమిటది అని అడిగితే, ఏ ఆహారం కావాలో ఎన్నుకునే అవకాశం లేదు కాని, ఇచ్చిన ఆహారాన్ని స్వీకరించటమో, తిరస్కరించటమో చేసే అధికారం ఉంది అంది.

మన జీవితం కూడా అంతే. ఈ జీవితాన్ని ఉన్నదున్నట్టుగా స్వీకరించటమో, పూర్తిగా తిరస్కరించటమో చేయగలము అంతే. దానిలో ఎన్నుకునే అధికారం లేదు మనకు. ఉన్నదున్నట్టుగా స్వీకరించటమంటే ద్వంద్వాలతో కూడిన జీవితాన్ని స్వీకరించాలి. అంటే జీవితంలో ఎదురయ్యే కష్టసుఖాలను, ఆటుపోట్లను, హెచ్చుతగ్గులను, ఎత్తుపల్లాలను చిరునవ్వుతో స్వీకరించాలి. ఇది వ్యావహారిక సత్యం. ఇందులో నేను సుఖాన్ని తీసుకుని కష్టాన్ని వదిలేస్తాను; హెచ్చు స్థాయిలో ఉండి, కిందకు దిగను అంటే కుదరదు. ఇలా ద్వంద్వాలను స్వీకరించలేను అంటే పారమార్థిక స్థాయికి ఎదగటం ఒక్కటే మార్గం.

పారమార్థికస్థాయిలో కాలం లేదు, దేశం లేదు, ద్వంద్వాలు లేవు.

**అన్యత్ర ధర్మాత్ అన్యత్రాధర్మాత్ – కఠ**

ధర్మమూ లేదు, అధర్మమూ లేదు; పుణ్యమూ లేదు, పాపమూ లేదు; పుట్టుకా లేదు, చావూ లేదు.

**న జాయతే మ్రియతే వా కదాచిత్**
**నాయం భూత్వా భవితా వా న భూయః – 2-20**

అందువల్ల మనకు ఎన్నుకునే అవకాశం ఒక్క విషయంలోనే ఉంది. పారమార్థిక స్థాయిని ఎన్నుకుని, వ్యావహారిక స్థాయిని వదులుకోవటం; లేదూ, వ్యావహారికస్థాయిలోనే ఉంటాను అంటే ద్వంద్వాలతో కూడిన వ్యావహారిక స్థాయిని స్వీకరించటం. ద్వంద్వాలలో సుఖం, ఆనందం, కలిమి స్వీకరించి దుఃఖం, ఆందోళన, లేములను స్వీకరించను అంటే కుదరదు. రెండింటినీ సమానంగా స్వీకరించాలి.

పారమార్థిక స్థాయికి ఎదగటం కూడా అంత తేలిక కాదు. అన్నింటినీ వదులుకోవటానికి కూడా చాలా గట్టి మనస్సు కావాలి. శత్రువులను ఆనందంగా వదులుకుంటాము, కాని మిత్రులను వదులుకోలేము; శత్రువులనూ వదులుకోవాలి, మిత్రులనూ వదులుకోవాలి; అనారోగ్యాన్నీ వదులుకోవాలి, ఆరోగ్యాన్నీ వదులుకోవాలి; అసంగత్వమూ వదులుకోవాలి, సంగత్వమూ వదులుకోవాలి; మరణమూ వదులుకోవాలి, జననమూ వదులుకోవాలి.

పూర్తిగా అన్నీ వదులుకోవటానికి చాలా గట్టి మనస్సు ఉండాలి; ద్వంద్వాలను స్వీకరించటానికీ అంతే గట్టి మనస్సు ఉండాలి. వేదాంతం ఆ ఆంతర్గతశక్తి ఒక్క దానివల్లనే వస్తుంది అంటుంది. అదే ఆత్మజ్ఞానం.

ఆత్మజ్ఞానం మీకు ఆంతర్గతశక్తిని ఇస్తుంది. మీరు అంతటినీ త్యజించాలనుకున్నా, ద్వంద్వాలను స్వీకరించాలనుకున్నా కూడా, వాటికి కావాల్సిన దృఢసంకల్పాన్ని ఇస్తుంది. గృహస్థాశ్రమంలో ఉండాలని మీరు నిశ్చయించుకుంటే, అందులో జరిగే అంశాలన్నింటినీ చిరునవ్వుతో స్వీకరించాలి. ఇల్లు అన్నాక మనుష్యులు వస్తారు, వెళతారు; గృహస్థు అయితే పిల్లలు పుడతారు, ఎదుగుతారు. నెమ్మదిగా మన ఒడిలోంచి కిందికి దిగి, మనకు అందనంత దూరానికి మానసికంగా, శారీరకంగా కూడా వెళ్ళిపోతారు. వారి ఆటపాటలకు మురిసిపోయినట్టే, వారు దూరంగా వెళ్ళిపోయినా నవ్వుతూ స్వీకరించాలి. పోనీ అని సన్న్యాసాశ్రమాన్ని స్వీకరిస్తే అన్నింటినీ, అందరినీ వదులుకోవాలి. నా అన్నవారు, నా ఆస్తిపాస్తులు అంటూ ఏవీ ఉండవు. ఈ ఆశ్రమంలో కొంత, ఆ ఆశ్రమంలో కొంత స్వీకరిస్తామనకూడదు.

ఇదంతా అర్థమయ్యేలా అహం కాలః అస్మి అన్నాడు కృష్ణపరమాత్మ. అంటే వ్యావహారిక స్థాయిలోంచి చూస్తే నేను కాలతత్త్వాన్ని; పారమార్థికస్థాయిలోంచి చూస్తే నేను కాలాతీతతత్త్వాన్ని అంటున్నాడు.

కాలతత్త్వంగా కృష్ణపరమాత్మకు రెండు విధులు లేదా కర్తవ్యాలు ఉన్నాయి. అవి సృష్టి, లయ. ఇప్పుడు సందర్భం మహాభారతయుద్ధం.

**లోకక్షయకృత్** – నేను లోకాలను నాశనం చేసేవాణ్ణి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**ప్రవృద్ధః** – ఇప్పుడు ఈ లయకారకునిగా విజృంభిస్తున్నాడు. ఎందుకంటే మహాభారతయుద్ధంలో లక్షలాది సైనికులను, రాజులను, యోధులను సంహరించబోతున్నాడు. ఎలాగైతే భూకంపం వస్తే లక్షల్లో జననష్టం జరుగుతుందో, అలా ఇక్కడ కూడా లక్షల్లో జననష్టం జరగబోతున్నది. అందువల్ల ఇక్కడ కాలతత్త్వంలోని లయకారణాన్ని చూస్తాము. ఏం లయ చేస్తాడు?

**లోకాన్ ఇహ సమాహర్తుమ్** – ఈ యుద్ధంలో పాల్గొంటున్న వారందరినీ సంహరించబోతున్నాను. కౌరవుల సైన్యం పదకొండు అక్షౌహిణులు అయితే, పాండవుల సైన్యం ఏడు అక్షౌహిణులు. ఇంతమందీ మరణిస్తారు. కురుక్షేత్ర యుద్ధం ముగిశాక పన్నెండుమంది మాత్రమే జీవించివున్నారు అంటారు. తక్కిన అందరూ మరణిస్తారు.

ఈ సందర్భంలో అర్జునుణ్ణి హెచ్చరిస్తున్నాడు కృష్ణపరమాత్మ. ఓ అర్జునా, నువ్వు యుద్ధం చేయటానికి సిద్ధపడినా, పడకపోయినా, నేనయితే వారందరినీ నాశనం చెయ్యటానికి సిద్ధపడ్డాను. నువ్వు నాకు సహకరించినా, సహకరించకపోయినా జరగబోయేది అదే.

**ఋతేఽపి త్వాం** – నువ్వు యుద్ధం చేయకపోయినా సరే,

**సర్వే న భవిష్యంతి** – వీరెవరూ జీవించి ఉండరు. అందరూ మరణించాల్సిందే. మొత్తం ప్రపంచాన్ని వదిలివెళ్ళే సమయం ఆసన్నమయింది. ఎవరు?

**యేఽవస్థితాః** – ఇదుగో, సముద్రంలా విస్తరించివున్న ఈ మానవసమూహం,

**ప్రత్యనీకేషు యోధాః** – రెండువైపుల ఉన్న యోధులు కూడా మరణించక తప్పదు. వారి ప్రారబ్ధకర్మ ముగియబోతున్నది. మీ వైపు ఉన్న యోధులు ధర్మం వైపు నిలిచారు, కౌరవుల సైన్యం అధర్మం వైపు నిలిచారు. ఈ యుద్ధం ధర్మ–అధర్మాల మధ్య యుద్ధం నిజమే కాని, యుద్ధరంగానికి వచ్చాక, నీవైపు వారు కూడా మరణించక తప్పదు. అనీకం అంటే సైన్యం; ప్రతి అంటే రెండువైపులా ఉన్న; అందువల్ల ప్రత్యనీకేషు అంటే రెండువైపులా ఉన్న సైన్యం మరణించక తప్పదు. అందువల్ల ఓ అర్జునా, ఒక విషయం గ్రహించు అంటున్నాడు. ఏమిటది? తర్వాత వచ్చే శ్లోకంలో చూస్తాము.

శ్లో. 33 **తస్మాత్ త్వముత్తిష్ఠ యశో లభస్వ జిత్వా శత్రూన్ భుంక్ష్వ రాజ్యం సమృద్ధమ్ ।**
**మయైవైతే నిహతాః పూర్వమేవ నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్ ॥**
తస్మాత్, త్వమ్, ఉత్తిష్ఠ, యశః, లభస్వ, జిత్వా, శత్రూన్, భుంక్ష్వ, రాజ్యమ్, సమృద్ధమ్,
మయా, ఏవ, ఏతే, నిహతాః, పూర్వమ్, ఏవ, నిమిత్తమాత్రమ్, భవ, సవ్యసాచిన్ ॥

| | | | |
|---|---|---|---|
| తస్మాత్ | = అందువల్ల | రాజ్యమ్ | = రాజ్యమును |
| త్వమ్ | = నీవు | భుంక్ష్వ | = అనుభవింపుము |
| ఉత్తిష్ఠ | = (యుద్ధము చేయుటకై) లెమ్ము | ఏతే | = వీరందరును |
| యశః | = కీర్తిని | పూర్వమ్, ఏవ | = ఇంతకు ముందే |
| లభస్వ | = పొందుము | మయా ఏవ | = నాచేతనే |
| శత్రూన్ | = శత్రువులను | నిహతాః | = చంపబడ్డారు |
| జిత్వా | = జయించి | సవ్యసాచిన్ | = ఓ సవ్యసాచీ! అర్జునా! |
| సమృద్ధమ్ | = సర్వసంపదలతో తులతూగుచున్న | నిమిత్తమాత్రమ్, భవ | = నీవు నిమిత్తమాత్రుడవు కమ్ము |

**తస్మాత్ హే సవ్య–సాచిన్! త్వమ్ ఉత్తిష్ఠ, యశః లభస్వ, శత్రూన్ జిత్వా సమృద్ధమ్ రాజ్యమ్ భుఙ్క్ష్వ। మయా ఏవ ఏతే పూర్వమ్ ఏవ నిహతాః, (త్వం) నిమిత్త–మాత్రమ్ భవ ।**

తా: అందువల్ల నీవు యుద్ధము చేయుటకై లెమ్ము, కీర్తిని పొందుము. శత్రువులను జయించి సర్వసంపదలతో తులతూగుచున్న రాజ్యమును అనుభవింపుము. వీరందరును ఇంతకు ముందే నాచేతనే చంపబడ్డారు. ఓ సవ్యసాచీ! అర్జునా! నీవు నిమిత్తమాత్రుడవు కమ్ము.

అందువల్ల అర్జునా, నువ్వు ఈ యుద్ధం చేసినా, చేయకపోయినా, ఈ యోధులందరూ మరణించక తప్పదు. వారి మరణసమయం ఆసన్నమయింది.

అర్జునుడు యుద్ధం చేశాడంటే అతనికి కీర్తిప్రతిష్ఠలు కలుగుతాయి. ధర్మం వైపు నిలిచాడని అందరూ అతన్ని పొగుడుతారు. ఎవరూ కృష్ణపరమాత్మ వారిని హతమార్చాడు అనరు; అందరూ అర్జునుణ్ణి కొనియాడుతారు.

దాని బదులు, అతను యుద్ధానికి వెన్నుచూపితే, అతను అపకీర్తి పాలవుతాడు. క్షత్రియుడై ఉండీ, తన క్షత్రియ ధర్మాన్ని నిర్వర్తించనందుకు అతనికి ప్రత్యవాయపాపం అంటుకుంటుంది. అటు చెడ్డపేరూ వస్తుంది, ఇటు పాపమూ వస్తుంది. అంతే కాకుండా ఇరుపక్షాల సైనికులూ మరణించక తప్పదు. అందువల్ల వీటిలో ఏది నయం? లేచి, తన ధర్మాన్ని నిర్వర్తించటం.

**తస్మాత్** – అందువల్ల; ఎందువల్ల? ఈ యోధులందరూ మరణించే సమయం ఆసన్నమయింది కాబట్టి, వారిని నేనూ ఎలాగూ చంపబోతున్నాను కాబట్టి;

**త్వమ్ ఉత్తిష్ఠ** – లే, లేచి యుద్ధం చేయి.

**యశో లభస్వ** – యుద్ధం చేసి కీర్తిప్రతిష్ఠలు పొందు అంటున్నాడు కృష్ణపరమాత్మ. నిజానికి వారిని సంహరించేది భగవంతుడే అయినా, భగవంతునికి ఈ కీర్తిప్రతిష్ఠలు అవసరం లేదు. అందువల్ల నువ్వే పొందు అంటున్నాడు. ఎలా పొందుతాడు?

**శత్రూన్ జిత్వా** – శత్రువులను జయించటంద్వారా. జిత్వా అంటే శత్రువులను ఓడించి, తను గెలవటం. అంతేకాదు –

**సమృద్ధం రాజ్యం భుంక్ష్వ** – నువ్వు పోగొట్టుకున్న రాజ్యాన్ని, సర్వసంపదలతో కూడిన రాజ్యాన్ని తిరిగి పొంది అనుభవించవచ్చు. ఇన్నాళ్ళూ పాండవులు అడవుల్లో అష్టకష్టాలు పడ్డారు; ఇప్పుడు యుద్ధం చేస్తే, అందులో గెలిచి అష్టైశ్వర్యాలు అనుభవించవచ్చు.

**మయైవైతే నిహతాః పూర్వమేవ** – వీరంతా నాచేత ముందే చంపబడ్డారు. ఎందుకంటే వారి ప్రారబ్ధకర్మ ముగిసింది. వారు ఎలా చంపబడతారు అనే మార్గం మారవచ్చేమో కాని, మరణం తథ్యం.

వారు ముందే మరణించారు కాబట్టి, అర్జునుడు బ్రహ్మాస్త్రం ఉపయోగించినా, పాశుపతాస్త్రం ఉపయోగించినా వారు మరణించక తప్పదు. చిన్నప్పుడు వీధి నాటకాల్లో చూసి ఉంటారు. ఒకవైపు రాముడు, ఇంకొకవైపు రావణాసురుడు నిల్చుని ఉంటారు. రాముడు ఇటునుంచి బాణం వేస్తాడు. ఆ బాణం కూడా అసలు సిసలు బాణం కాదు. అయినా, రావణాసురునికి ముందే చెప్పి ఉంచుతారు. రాముడు బాణం వదలగానే, నీకు తగిలినా, తగలకపోయినా కింద పడిపో అని. ఆ విధంగా అర్జునుడు పాశుపతాస్త్రాన్ని ఉపయోగించినా, బ్రహ్మాస్త్రాన్ని ఉపయోగించినా, ఎన్ని భావాలకు లోనయినా, వారందరూ మరణించి తీరుతారు.

ఏతే అంటే ఈ సైనికులందరూ; పూర్వమేవ నిహతాః – ముందే సంహరించబడ్డారు.

**సవ్యసాచిన్** – ఓ సవ్యసాచీ అంటున్నాడు. అర్జునునికి సవ్యసాచి అనే బిరుదు ఉంది. సవ్యమ్ అంటే ఎడమచెయ్యి.

**సవ్యేన హస్తేన సహితుం శీలమ్ అస్య అస్తి ఇతి సవ్యసాచిన్**

అంటే రెండు చేతులతోనూ బాణాలను ప్రయోగించగలడని అర్థం. అర్జునుడు ఏ చేత్తో యుద్ధం చేసినా శత్రుసైనికులు మరణించక తప్పదు.

నసీరుద్దీన్ ముల్లా ఒకసారి తన ఇంటికి విచ్చేసిన అతిథిని పిలిచి తన ఇంట్లో ప్రదర్శించిన అనేక జంతువుల భాగాలు చూపిస్తూ వచ్చాడు. గోళ్ళ దగ్గరనుంచి అన్ని భాగాలూ ఉన్నాయి, ఒక్క తల భాగం తప్ప. వచ్చిన అతిథి ఆశ్చర్యంగా అడిగాడు, 'ఇన్ని జంతువులను వెంటాడి, వేటాడి, వాటిని హతమార్చావంటే నువ్వు గొప్ప వేటగాడివి అయివుండాలి. కాని ఏ జంతువుదీ తల మాత్రం లేదే?' అన్నాడు. దానికి నసీరుద్దీన్ ముల్లా అన్నాడు కదా, 'నేను వేటకు వెళ్ళేసరికే తలను ఎవరో తీసుకువెళ్ళి పోయేవారు!' అంటే ఏమిటి అర్థం? అతను ఒక్క జంతువును కూడా చంపలేదు. ఎవరో చంపిన జంతువుల భాగాలను తను ఏరి తెచ్చుకున్నాడు.

ఆ విధంగా అర్జునుడు ఎవరినీ ప్రత్యేకించి చంపనవసరం లేదు. భగవంతుడు ముందే వారిని చంపేశాడు.

**నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్** – ఓ సవ్యసాచీ! నువ్వు పేరుకు మాత్రమే యుద్ధం చేస్తున్నావు. నువ్వు నిమిత్తమాత్రుడవు అవుము అంటున్నాడు కృష్ణపరమాత్మ. అందువల్ల అర్జునుడు అయ్యో, నా వారిని ఎలా హతమారుస్తానని బాధపడనవసరం లేదు, పారిపోనవసరం లేదు, భయపడనవసరమూ లేదు. కానున్నది కాకమానదు. మరణం తథ్యం. అందువల్ల అర్జునుడు కృష్ణుని చేతిలో ఉన్న ఆయుధం మాత్రమే. నిమిత్తం అంటే ఆయుధం.

ఆ విధంగా కృష్ణపరమాత్మ తను కాలతత్వాన్ని అని చెబుతున్నాడు. విశ్వం ఆయన శరీరం అయితే, కాలం కూడా ఆయనలో ఒక భాగమే అవుతుంది. అందువల్ల భగవంతుడు కాలం లేదా యముడు.

**యమాయ నమః, యమాయ ధర్మరాజాయ మృత్యవే చాంతకాయ చ ।**
**వైవస్వతాయ కాలాయ సర్వభూతాక్షయాయ చ**

యమధర్మరాజు ప్రకృతి నియమాలను అనుసరించి అంతటినీ నియంత్రిస్తాడు. యమధర్మరాజు అన్యాయం చేయడు. ఇప్పుడు భగవంతుడు వారి ప్రారబ్ధకర్మల ప్రకారం వారిని సంహరించాలంటే, ఆయనే స్వయంగా కత్తి పట్టుకునో, తుపాకి పట్టుకునో రంగంలోకి దిగడు. ఇక్కడ అర్జునునికి అవకాశం ఇస్తున్నాడు అంతే.

## ప్రత్యేక విశ్లేషణ – ఫ్రీవిల్లా, విధా

ఈ సందర్భంలో మనిషిని నడిపించేది ఫ్రీ విల్లా, విధిరాతనా అనేది చర్చనీయాంశం. ఎందుకంటే

**నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్**

ఈ వాక్యాన్ని తీసుకుని, చాలామంది దాన్ని వేరే సందర్భాలలో అన్వయించి, భగవంతుడు జగన్నాటక సూత్రధారి అనీ, మనం ఆయన చేతుల్లో కీలుబొమ్మలం మాత్రమే అనీ అంటారు. పైగా

**మయైవైతే నిహతాః పూర్వమేవ**

నేను వారిని ముందే సంహరించాను అన్నాడు. అంటే వారి తలరాతను నేను ముందే రాసి పంపాను అని చెప్పినట్టు అర్థం. అంటే భగవంతుడు మనను ఈ భూమ్మీదకు పంపినప్పుడే మన తలరాతను రాసి పంపిస్తాడనీ, మనం ఎలాగూ ఆ విధిరాతను తప్పించుకోలేమనీ, మనమంతా విధి రాసిన వింతనాటకంలో పాత్రధారులం మాత్రమేననీ అంటారు కొందరు. అంటే వీరు విధి బలీయమైనది అంటారు.

**హరిణాపి హరేణాపి బ్రహ్మణాపి సురైరపి ।**

**లలాట లిఖితా రేఖా పరిమార్ష్టుం న శక్యతే ॥**

ఇది విధిని నమ్మే శ్లోకం. లలాట లిఖితరేఖను నమ్మే శ్లోకం. విధిరాతను గాని, జాతకాన్ని గాని, చేతిలో ఉన్న గీతలను కాని ఎవరూ తప్పించలేరు. హరి అంటే విష్ణుమూర్తి, హరేణాపి అంటే శివుడు కూడా, బ్రహ్మణాపి అంటే బ్రహ్మదేవుడు కూడా, సురైరపి అంటే దేవతలు కూడా. అంటే ఒకసారి మన రాత రాసేశాక హరిహరాదులు కాని, ఆ తలరాత రాసిన బ్రహ్మ కాని, వేరే దేవతలు కాని ఎవరూ దానిని మార్చలేరు అంటారు. అంటే దీని అర్థం ఏమిటి? తలరాత రాసిన బ్రహ్మదేవుడే మార్చలేకపోతే, హరిహరాదులే మార్చలేకపోతే, మామూలు మనిషిని నేనెంత అనుకుంటారు కొందరు. అలా విధిరాతను నమ్మేవారికి భగవద్గీతలోని ఈ శ్లోకం చదివితే హల్వా తిన్నట్టు ఉంటుంది.

అదుగో కృష్ణపరమాత్మే నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్ అని ప్రకటిస్తున్నాడు. అంటే విధి ఆడే వింత నాటకంలో మనమందరం కీలుబొమ్మలం; ఆ జగన్నాటక సూత్రధారి అంతా వెనకవుండి ఆడిస్తాడు అంటారు. అంతా ఆయన చేతిలో ఉంటే, మన ఫ్రీవిల్‌కి చోటేది అంటారు నిరాశగా.

మనం ఒక విషయం బాగా అర్థం చేసుకోవాలి. శాస్త్రం పూర్తిగా విధిమీదే ఆధారపడే సిద్ధాంతాన్ని ఒప్పుకోదు. ఎందుకంటే మనం జగన్నాటక సూత్రధారి చేతిలో కీలుబొమ్మలం అనుకుంటే, మనకు ఫ్రీవిల్ ఉందనే సిద్ధాంతాన్ని తృణీకరించినట్టు అవుతుంది. శాస్త్రం మనిషి బుద్ధిజీవి, ఫ్రీవిల్ ఉంది అతనికి అంటుంది.

మన తలరాత ఎలా ఉంటే అలా అవుతుంది అనుకోవటాన్ని ఫేటలిజమ్ అంటారు. అంటే విధి చేతిలో కీలుబొమ్మలుగా ఉండిపోవటం. కాని ఇక్కడ ఒక చిన్న సూక్ష్మభేదం ఉంది – దాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. మనం తలరాత లేదనటం లేదు. శాస్త్రం విధిని నమ్ముతుంది. విధి లేదా తలరాత అంటే ఏమిటి? మనం గతంలో కాని, గతజన్మల్లో కాని చేసిన కర్మల ఫలితం విధిలిఖితం. శాస్త్రం కర్మఫలాన్ని నమ్ముతుంది. కర్మఫలానికి ఇంకోపేరు విధిలిఖితం లేదా ప్రారబ్ధం లేదా దైవం. మన జాతకంలో మన ప్రారబ్ధం ఎలా ఉందో తెలుస్తుంది.

ఇక్కడ కూడా చిన్న సూక్ష్మభేదం ఉంది. మన గ్రహాలు మన జీవితాన్ని ప్రభావితం చేయవు. మరి ఏమిటి ప్రభావితం చేస్తుందంటే మన ప్రారబ్ధం ప్రభావితం చేస్తుంది. కాకపోతే ఆ గ్రహాలు మన ప్రారబ్ధం ఎలా ఉందో

చూపిస్తాయి. ఉదాహరణకు కారులో పెట్రోలు ఎంత ఉందో ఒక మీటరు సూచిస్తుంది. ఈ మీటరు నడిపిస్తుందా కారును? లేదే. పెట్రోలు నడిపిస్తుంది; కాకపోతే ఈ మీటరు హెచ్చరిస్తుంటుంది, పెట్రోలు అయిపోతోంది సుమా అంటుంది. అలాగే మన గ్రహాలు మన ప్రారబ్ధకర్మను సూచిస్తాయి, కాని మన ప్రారబ్ధకర్మను ప్రభావితం చేయవు. ఈ ప్రారబ్ధకర్మనే విధి, లలాటలిఖితం అంటారు.

విధికీ, విధిని నమ్మటానికీ చిన్న సూక్ష్మభేదం ఉందన్నాము ఇందాక. ఏమిటది? మన జీవితాన్ని ప్రభావితం చేసే కొన్ని అంశాల్లో విధి ఒకటి. అంతేకాని విధి మాత్రమే ప్రభావితం చేస్తుందనుకుంటే అది ఫేటలిజమ్ అవుతుంది. విధి కాకుండా మన జీవితాన్ని ప్రభావితం చేసేది ఇంకొకటి ఉంది. అదే మన ఫ్రీవిల్. దీన్ని పురుషార్థం అంటారు. (పురుషార్థం అంటే మనకున్న లక్ష్యాలు కాదు) అందువల్ల మన విధి+మన ఫ్రీవిల్ రెండూ కలిసి మన భవిష్యత్తును నిర్దేశిస్తాయి అంటుంది శాస్త్రం.

ఫ్రీవిల్ + విధి మన భవిష్యతును నిర్దేశిస్తాయి అని మీరు అంటే దాన్ని శాస్త్రం అంటారు; విధి మాత్రమే నిర్దేశిస్తుంది అంటే దాన్ని ఫేటలిజమ్ అంటారు. ఫేటలిజమ్‌ను నమ్మారంటే, ఫ్రీవిల్‌ను తిరస్కరించినట్టే. ఫ్రీవిల్‌ను తిరస్కరిస్తే వచ్చే సమస్యలేమిటో తెలుసుకోవాలి. ఈ చర్చను ప్రవేశపెట్టింది అందువల్లనే.

మన చేతిలో ఏంలేదు, అంతా బ్రహ్మలిఖితం అంటే అందులో ప్రయోజనాలు లేకపోలేదు. ఆ ప్రయోజనాలేమిటో చూశాక, అందులో ఉండే సమస్యలు ఏమిటో చూద్దాము.

**ప్రయోజనాలు –**

ఎ). అంతా భగవంతుడే చూస్తున్నాడు అంటే మన దుర్మార్గాలకు మనం బాధ్యత వహించనవసరం లేదు. 'పొరపాటు చెయ్యటం మానవసహజం; దాన్ని ఇతరులమీద నెట్టివెయ్యటం మరింత మానవసహజం,' అన్నారు ఎవరో. అందువల్ల ఏదైనా పొరపాటు చేసి, దాన్ని ఎవరి నెత్తిన రుద్దుదామా అని ఆలోచించే అలవాటు ఉంటే, దాన్ని హాయిగా భగవంతునిమీద తోసేయవచ్చు. నాదేం లేదు, అంతా ఈశ్వరేచ్ఛ అనేస్తారు. పైగా శివుడాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు అని సమర్థించుకుంటారు కూడా. దీన్నే పలాయనవాదం అంటారు. ఇలా ఈశ్వరేచ్ఛ అనే వారికి ఇది మంచి సాకు; వారు దేనికీ బాధ్యత వహించకుండా భగవంతునిమీదకు తోసేయవచ్చు.

బి). ఇంకొక చిన్న సానుకూల లాభం కూడా ఉంది. మన చేతిలో ఏంలేదు, అంతా భగవంతుని చేతిలో ఉందని అనుకుంటే, మనకు భగవంతునిమీద గౌరవం పెరుగుతుంది. భగవంతుడు ఎవరికీ అన్యాయం చేయడని తెలుసు మనకు. ఈ సిద్ధాంతం ఒక విధంగా జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లను తట్టుకోవటానికి తోడ్పడుతుంది. అప్పుడు కష్టాలను చిరునవ్వుతో స్వీకరించే గుండెధైర్యం కలుగుతుంది.

ఒక సామెత ఉంది: 'భగవంతుడు మనను తరచు నీటి కిందికి తీసుకువచ్చేది మనను ముంచటానికి కాదు, మనను శుద్ధి పరచటానికి.' అంతా ఈశ్వరేచ్ఛ. నేను కష్టపడాలని రాసి పెట్టి ఉంది కాబట్టే నాకు ఈ కష్టం వచ్చింది అంటారు. ఈ కష్టంద్వారా నన్ను పునీతుడిని చేస్తాడు అనుకుంటారు కూడా. కాని శాస్త్రం పూర్తిగా విధిమీద ఆధారపడవద్దు అంటుంది.

శంకరాచార్యులవారు కూడా సందర్భం వచ్చినప్పుడల్లా ఫ్రీవిల్‌కు అవకాశం లేదని ఎవరైనా అంటే, ఆయన చేసే విశ్లేషణలో ఆ వాదనను స్వీకరించకూడదు అంటారు.

ఇంతవరకూ ఈశ్వరేచ్ఛను స్వీకరిస్తే కలిగే రెండు ప్రయోజనాలను చూశాము. కాని ఇప్పుడు కేవలం ఈశ్వరేచ్ఛమీద మన జీవితం నడుస్తోంది అంటే వచ్చే ఆరు సమస్యలను చర్చిద్దాము.

**సమస్యలు–**

ఎ) **ఈశ్వరః మహాసంసారిత్వమ్** – ఒకవేళ భగవంతుడే అంతా చేస్తున్నాడు, మనం ఆయన చేతిలో కీలుబొమ్మలం అంటే, భగవంతుడు కర్తా, మనం కరణం అవుతాము. ఇక్కడ కరణం అంటే పరికరం. కర్మ సిద్ధాంతంలో ఒక సూత్రం ఉంది. అది –

**యః కర్తా భవతి సః ఏవ భోక్తా భవతి**

ఎవరైతే ఒక కర్మ చేస్తారో, వారు మాత్రమే ఆ కర్మయొక్క ఫలాన్ని అనుభవించాలి. అంటే ఎవరు కర్తో, అతనే భోక్తా అవుతాడు. కర్మఫలం అంటే పుణ్యపాపాలు. అంటే ఇప్పుడు భగవంతుడు కర్త కాబట్టి, పుణ్యపాపాలు అన్నీ ఆయనకే చెందుతాయి. హత్యలు, దోపిడీలు, దొంగతనాలూ అన్నీ భగవంతునికే వెళతాయి. నేనేం చేయటం లేదు అంటారు నేరస్థులు. అంతేకాదు, సంచిత, ప్రారబ్ధ, ఆగామి కర్మలు అన్నీ భగవంతునికే చెందుతాయి. అంటే ఈ సిద్ధాంతంవల్ల వచ్చే అర్థం లేని ఫలం, భగవంతుడు **మహాసంసారి** అవుతాడు. మనం చేసే కర్మలు మనను సంసారిని చేస్తే, మనమందరం చేస్తున్న కర్మలన్నిటినీ భరిస్తున్న భగవానుడు మహాసంసారి అవ్వాలి.

బి) **జీవః అసంసారిత్వమ్** – ఇది అర్థం లేని వాదనో, జీవునికి లాభమో తెలియదు కాని, దీని ప్రకారం జీవుడు అసంసారి అవుతాడు. భగవంతుడు కర్తా, మనం కరణం అన్నాము కదా మొదటి అంశంలో. మనం కరణం అయితే, మనకు కర్మఫలం అంటదు. ఉదాహరణకు ఒక కారు ఒక వ్యక్తిని ఢీకొంటే, ఆ వ్యక్తి మరణించాడు అనుకుందాము. ఇప్పుడు శిక్ష కారుకు వేస్తారా, కారు నడిపే వ్యక్తికి వేస్తారా? కారు నడిపే వ్యక్తికే! నిజానికి గుద్దింది కారే, కాని దాన్ని వాడిన వ్యక్తికి శిక్ష పడుతుంది. అలాగే కత్తితో ఎవరినైనా పొడిచినా, తుపాకితో ఎవరినైనా కాల్చినా; కత్తిని, తుపాకులను శిక్షించరు. ఆ సూత్రాన్ని ఇక్కడ అన్వయిస్తే భగవంతుడు కర్తా, మనం ఆయన వాడిన కరణం. అందువల్ల మనకు శిక్ష పడటానికి వీలులేదు. అంటే మనకు పుణ్యపాపాలు అంటవు.

పుణ్యపాపాలు అంటకపోతే కలిగే ప్రయోజనం ఏమిటి? మోక్షం. అలా మోక్షం వచ్చేటట్టయితే, మనం కష్టపడి భగవద్గీత నేర్చుకోనవసరం లేదు. ఎవరు నేర్చుకోవాలి? భగవంతుడు నేర్చుకోవాలి. ఎందుకు? ఆయన పాపం మహాసంసారి అవుతాడు, దాన్నించి ఆయనకు మోక్షం రావాలంటే భగవద్గీత నేర్చుకోవాలి. సంచిత, ఆగామి, ప్రారబ్ధకర్మలు మనకు అంటవు, ఆయనకే చెందుతాయి. మనం **నిత్యముక్తులం** అవుతాము. అంటే **జీవి అసంసారి** అవుతాడు.

సి) **నైర్ఘ్ణ్యదోషమ్** – భగవంతుడే అంతా చేస్తుంటే, మన చేతిలో ఏమీ లేకపోతే, మనం జీవితంలో పడే కష్టాలన్నీ ఎవరివల్ల కలుగుతున్నాయి? సాక్షాత్తూ భగవంతునివల్లనే. మనకొక అనారోగ్యం కలిగినా, ఎక్కడో యుద్ధం జరిగినా, మరెవరో బాంబులు వేసినా, వాటివల్ల జరిగే నష్టాలన్నీ భగవంతుడు కలుగజేసినట్టు అవుతుంది.

జైల్లో నిజం చెప్పించటానికి పోలీసులు వాడే పద్ధతులు నేరస్థులను చాలా బాధిస్తాయి. వాటి గురించి వింటేనే మనకు ఆ రాత్రి నిద్రపట్టదు. అలాగే ఏ ఆసుపత్రికి వెళ్ళి చూసినా, ఐ.సి.యు.లోకి తొంగిచూసినా, వారి అవస్థలు చూస్తే మనసంతా కకావికలమైపోతుంది. వారికి ఇంత బాధలు కలుగజేస్తున్నది ఎవరు? మీరా, నేనా? కాదు, మనమంతా ఆయన చేతిలో కీలుబొమ్మలం మాత్రమే. జగన్నాటక సూత్రధారి చేస్తున్నాడు ఇదంతా అంటే, భగవానుడు కరుణామయుడు, దయాసాగరుడు అనలేము.

అలా భగవంతుడు నిర్దయగా ప్రవర్తిస్తే, దాన్ని నైర్ఘృణ్యదోషం అంటాము. నిర్ఘృణ అంటే జాలి లేకపోవటం; నైర్ఘృణ్య అంటే జాలిలేని వ్యక్తి. భగవంతుడు నిస్సహాయుడు. అందువల్ల వారు అవస్థ పడుతున్నారని కూడా అనలేము. ఎందుకంటే భగవంతుణ్ణి సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు అంటారు. ద్రౌపదికి నిండు కౌరవసభలో వస్త్రాపహరణం జరుగుతుంటే అలా అభయహస్తం చూపించి, ఆమెను కాపాడాడా లేదా? అలా తను విశ్వరూపం ధరించి అనేకవేల చేతులతో ఆసుపత్రులకి వెళ్ళి, నానా అవస్థలు పడుతున్న రోగులందరి బాధను చేత్తో తీసేసినట్టు తీసేయాలి. భగవంతునికి శక్తి లేదు అనలేరు, ఎందుకంటే ఆయన సర్వశక్తిమంతుడు. భగవంతునికి తెలియదు అనలేరు ఎందుకంటే ఆయన సర్వజ్ఞుడు. అంతేకాదు, ఆయన దయాసాగరుడు కూడా. అలాంటి దయాసాగరుడు మానవుల కష్టాలకు ఎందుకు ముగింపు పలకటం లేదు అనే ప్రశ్న వస్తుంది. అప్పుడు భగవంతునికి **నైర్ఘృణ్యదోషం** ఉన్నట్టు అవుతుంది.

డి) **వైషమ్యదోషమ్** – దేవునిమీదే అంతా భారం వేసేస్తే దేవుడు కరుణామయుడు కాదని ఇంతకుముందు చూశాము. ఇప్పుడు, ఇంకో కోణంలోంచి చూస్తే, కొంతమంది మనుష్యులు విందువిలాసాలలో మునిగి తేలుతున్నారు; కొంతమంది రాజభోగాలు అనుభవిస్తున్నారు. ఆ ఆనందంలో కూడా తారతమ్యాలు ఉన్నాయి. కొంతమంది ఆనందంగా, కొంతమంది చాలా ఆనందంగా, మరికొంతమంది చాలా ఎక్కువ ఆనందంగా ఉన్నారు. కారు ఉన్నవారు ఆనందంగా ఉంటారు అనుకుంటే ఆ కారుల్లో హెచ్చుతగ్గులు ఉన్నాయి. ఒకటి ఖరీదైన కారు అయితే, ఇంకొకటి సాదాసీదా కారు.

అంటే భగవంతుడు తనకు తోచినట్టు సుఖాలను ఇచ్చినట్టు అవుతుంది. అంటే కొంతమందిమీద పక్షపాతం చూపించినట్టు అవుతుంది. అంటే కొంతమంది నవ్వుతారు; కొంతమంది ఏడుస్తారు; కొంతమంది ఏడుస్తూ నవ్వుతారు; కొంతమంది నవ్వుతూ ఏడుస్తారు. ఈ పక్షపాతధోరణిని **వైషమ్యదోషం** అంటారు.

ఇ) **ధర్మశాస్త్ర నిష్ప్రయోజనమ్** – భగవంతుడు కర్త అయితే, మనం కరణం మాత్రమే అవుతామనీ, అంటే మనం చేసే కర్మలకు మనం బాధ్యులం కాము అని చూశాము కదా. అంటే పుణ్యపాపాలు, ధర్మాధర్మాల గురించి మనం నేర్చుకోనవసరం లేదు. మనం కారులాంటివారం అని చూశాము. రోడ్డుమీద వెళ్ళేది కారే అయినా, కారు ట్రాఫిక్ రూల్సు నేర్చుకోనవసరం లేదు; కారుని నడిపే వ్యక్తి నేర్చుకోవాలి. అలా భగవంతునివల్ల నడపబడే మనం ధర్మశాస్త్రం నేర్చుకోనవసరం లేదు. ధర్మశాస్త్రంవల్ల ప్రయోజనముండదు. మనను నడిపే భగవంతుడే నేర్చుకోవాలి.

**సత్యం వద ధర్మం చర స్వాధ్యాయ ప్రవచనాభ్యాం న ప్రమదితవ్యమ్** – తైత్తిరీయం

ఈ ధర్మసూత్రాలన్నీ నేర్చుకోనవసరం లేదు. ఎందుకంటే మనం నిమిత్తమాత్రులం మాత్రమే. అయితే ఎవరు నేర్చుకోవాలి? భగవంతుడు నేర్చుకోవాలి. గురుకులం వెళ్ళి ధర్మశాస్త్రం నేర్చుకోవాలి; లౌకికవిద్య నేర్చుకోవాలి. అమెరికాలో కారు ఎలా నడపాలో, మనదేశంలో కారు ఎలా నడపాలో నేర్చుకోవాలి. మనం ధర్మశాస్త్రాన్ని నేర్చుకోనవసరం లేదు కాబట్టి దాన్ని **ధర్మశాస్త్ర నిష్ప్రయోజనమ్** అంటారు.

ఎఫ్) **వికల్ప అభావః** – భగవంతుడు కర్త అయితే, మనం కరణం మాత్రమే అయితే, కరణంగా మనకు జీవితంలో ఏ ఘర్షణా ఉండదు. ఎందుకంటే ఏ పని చేయాలో ఒక పరికరం నిర్ణయించనవసరం లేదు. ఎప్పుడైతే ఏ పని చేయాలో నిర్ణయించనవసరం లేదో, అప్పుడే మనకు జీవితంలో ఏ ఘర్షణా ఉండదు. ఆ ఘర్షణ కూడా భగవంతుడే పడతాడు. మన ఇంటికి వెళ్ళటానికి రెండు మార్గాలుంటే, ఏ మార్గంలో వెళ్ళాలో, ఆ నిర్ణయం ఏదో మనమే తీసుకోవాలి. ఎక్కడ ఫ్రీవిల్ ఉంటే అక్కడ ఛాయిస్ ఉంటుంది; ఎక్కడ ఛాయిస్ ఉంటే, అక్కడ సంఘర్షణ ఉంటుంది. రెండు అవకాశాలు ఉంటే ఏది ఎన్నుకోవాలి? పెద్ద సంఘర్షణ ఉంటుంది మనస్సులో. దాన్ని మానసిక సంఘర్షణ అంటారు.

అంటే ఫ్రీవిల్, ఛాయిస్, కాన్ఫ్లిక్ట్ ప్యాకేజీ డీల్ లాంటివి. ఒకటి ఉన్నచోట తక్కిన రెండూ ఉంటాయి. మనుష్యులకు ఫ్రీవిల్ ఉందో లేదో ఎలా తెలుస్తుంది? వారి మనస్సులో సంఘర్షణ ఉందో లేదో అడగండి. నిజానికి పొద్దున్న లేవటమే పెద్ద సంఘర్షణ అంటారు పూజ్య స్వామీజీ. పొద్దున్నే అలారం మోగుతుంది, కాని పక్క దిగకుండా ఉండటానికి కుంటిసాకులు వెతుక్కుంటారు. ఇప్పుడు స్నానం చేయాలా, తర్వాత స్నానం చేయాలా? గీతాబోధకు వెళ్ళాలా, వద్దా? ప్రతిదీ ఒక సంఘర్షణే.

ఈ సంఘర్షణ ఎందుకు వస్తుంది? మీకు ఛాయిస్ ఉంది కాబట్టి. దాన్ని వికల్పం అంటారు. వికల్పం ఎందుకు వస్తుంది? ఫ్రీవిల్ ఉంది కాబట్టి. దాన్ని పురుషప్రయత్నం అంటారు. ఇప్పుడు మీ కార్లో మీరు, మీ డ్రైవరు వెళుతున్నారు. మీ డ్రైవరుకు ఏ విధమైన సంఘర్షణ ఉండదు. ఎందుకు? అతనేమీ నిర్ణయం తీసుకోడు కాబట్టి. మీరు ఎప్పుడు వెళ్ళమంటే అప్పుడు వెళతాడు. ఎటు వెళ్ళమంటే అటు వెళతాడు. మీరు యజమాని, అతను మీ సేవకుడు; మీ మాట వినటం అతని ధర్మం.

ఈ సూత్రాన్ని ఉపయోగించి చూస్తే, భగవంతుడు యజమాని, మనం ఆయన చేతిలో ఉన్న సేవకులం; అంటే మనకు కూడా ఏమీ సంఘర్షణ కలుగకూడదు. కాని ప్రతి విషయంలోనూ మనకు సంఘర్షణ కలుగుతూనే ఉంటుంది. అంటే మనకు ఫ్రీవిల్ ఉందని అర్థం. మనకు ఫ్రీవిల్ లేకపోతే మోహం లేదు, వికల్పం లేదు.

ఎవరైనా వచ్చి నాకు సంఘర్షణ లేదని గొప్పగా చెపితే, అటువంటి వ్యక్తిని మెచ్చుకోకూడదు. ఎందుకంటే అతను తన ఫ్రీవిల్‌ను ఉపయోగించటం లేదు. జంతువులకూ, మనుష్యులకూ మధ్యనున్న భేదం అదే అని చూస్తాము. మనిషి బుద్ధిజీవి. అతని బుద్ధిని ఉపయోగించి, మంచీ–చెడు విచక్షణ చూపించాలి. జంతువులకు ఆ విచక్షణా బుద్ధి లేదు. ఏనుగు ఎక్కడ ఉన్నా గడ్డినే తింటుంది; సింహం ఎక్కడున్నా మాంసాన్నే తింటుంది. మనిషికి ఏం తినాలో తెలియదు. తన విచక్షణా బుద్ధిని సరిగ్గా ఉపయోగించడు. పాకేవి, ఈదేవి, ఎగిరేవి అన్నీ

తినేస్తారు కొందరు. అంటే తన ఫ్రీవిల్‌ను సరిగ్గా ఉపయోగించకపోయినా, మనిషికి దేవుడిచ్చిన గొప్పవరం బుద్ధి. దాన్ని సరిగ్గా ఉపయోగించాలి.

అంటే మనిషి భవిష్యత్తును కేవలం అతని ఫ్రీవిల్లే నిర్ణయిస్తుందా? లేదు. ఫ్రీవిల్+విధి=భవిష్యత్తు. రెండూ కలిపి మనిషి భవిష్యత్తును నిర్ణయిస్తాయి. జంతువులకు విధి మాత్రమే భవిష్యత్తును నిర్ణయిస్తుంది కాని మనిషిమీద రెండు శక్తులు పనిచేస్తాయి. ఫిజిక్స్‌లో దీన్ని రిజల్టంట్ ఫోర్స్ అంటారు. భవిష్యత్తులోని ప్రతిక్షణమూ ఈ ఫేట్, ఫ్రీవిల్‌యొక్క ఇంటరాక్షన్‌వల్ల నిర్ణయింపబడుతుంది.

ఒక సందర్భంలో ఫ్రీవిల్ ప్రభావం ఎక్కువగా ఉండవచ్చు; ఇంకొక సందర్భంలో విధి బలీయంగా ఉండవచ్చు. ఒక్కోసారి రెండూ సమానస్థాయిలో ప్రభావం చూపవచ్చు. ఇదంతా మనిషికి మాత్రమే జరుగుతుంది.

ఫ్రీవిల్, విధి – రెండూ మన జీవితాన్ని ప్రభావితం చేసేటట్టయితే కృష్ణపరమాత్మ 'నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్,' అని ఎందుకన్నాడు? నువ్వు నిమిత్తమాత్రుడివి అంటే ధార్మికమైన జీవనం గడపాలని అర్థం. భగవంతుడు జగత్తును ధర్మసూత్రాల ఆధారంగా నడుపుతాడు. మన జీవితంలో ఎన్నుకోవాల్సి వచ్చినప్పుడల్లా మనకు రెండు మార్గాలు ఉంటాయి – ధర్మపరంగా పోవాలా, రాగద్వేషాల మాట వినాలా? టాక్స్ కట్టాలా, ఎగగొట్టాలా? పోలీసు చుట్టుపక్కల లేకపోతే సిగ్నల్ వచ్చేవరకూ ఆగాలా, దూసుకుపోవాలా? ఇలాంటి సందర్భాలు ఎన్నో. మనం ధర్మపరంగా నిర్ణయం తీసుకుంటే, మనం ధర్మశాస్త్రానికి కట్టుబడి ఉన్నట్టు అవుతుంది. అప్పుడు భగవంతుని చేతిలో పరికరంలా ఉన్నట్టు అనిపిస్తుంది.

అర్జునుడు అటువంటి ధర్మసంకటంలో పడ్డాడు. ధర్మశాస్త్రం అతను యుద్ధం చేయాలి అంటున్నది.

**స్వధర్మమపి చావేక్ష్య న వికంపితుమర్హసి ।**
**ధర్మ్యాద్ధి యుద్ధాచ్ఛ్రేయోఽన్యత్ క్షత్రియస్య న విద్యతే ॥** – 2.31

క్షత్రియునియొక్క ధర్మం యుద్ధం చేయటం. క్షత్రియుడు ధర్మాన్ని పరిరక్షించాలి; దుర్యోధనుడు అధర్మానికి పాలుబడ్డాడు కాబట్టి అతన్ని శిక్షించాలి. నిజానికి దుర్యోధనుణ్ణి శిక్షించటానికే యుద్ధభూమికి ఆవేశంగా వచ్చాడు. కాని తీరా యుద్ధం ప్రారంభించాల్సిన సమయంలో అతన్ని రాగమోహాలు కమ్ముకున్నాయి. ఆ రాగమోహాలు భీష్మద్రోణులు నావారు అనేలా చేశాయి.

**కథం భీష్మమహం సంఖ్యే ద్రోణం చ మధుసూదన ।**
**ఇషుభిః ప్రతియోత్స్యామి పూజార్హావరిసూదన ॥** – 2.4

భీష్మ పితామహునితోను, ద్రోణాచార్యునితోను ఎలా యుద్ధం చేయగలను? వారిద్దరూ నాకు పూజ్యనీయులు అన్నాడు. అతని బుద్ధి వివేకం చూపించమంటోంది, అంటే యుద్ధం చేయమంటోంది, కాని అతని మనస్సు రాగమోహాల్లో పడిపోయింది. అటు వినాలా, ఇటు వినాలా పెద్ద సంఘర్షణ. తను సంఘర్షణలో పడ్డాడని తనకే తెలిసింది.

**కార్పణ్యదోషోపహతస్వభావః పృచ్ఛామి త్వాం ధర్మసమ్మూఢచేతాః ।**
**యచ్ఛ్రేయః స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్ ॥** – 2.7

నేను రాగమోహాలలో పడిపోయి, ధర్మాధర్మవిచక్షణను కోల్పోయాను. అందువల్ల నా కర్తవ్యమేమిటో నిర్ణయించు కోలేకుండా ఉన్నాను. నాకు నిజంగా శ్రేయస్కరమైనది ఏదో అది నాకు చెప్పు. నేను నీ శిష్యుణ్ణి అని శరణాగతి పొందాడు.

దానికి కృష్ణపరమాత్మ చేసిన బోధ సారాంశం – నీ రాగద్వేషాలకు లొంగకు; ధర్మాన్ని పాటించు. ధర్మాన్ని పాటిస్తే భగవదిచ్ఛను పాటించినట్టు అవుతుంది. ఎందుకంటే భగవంతుని ఇచ్ఛ (కోరిక) ధర్మాన్ని పాటించటం. అప్పుడు ఫ్రీవిల్‌ను ఒదులుకున్నట్టు కాదు; ఫ్రీవిల్‌ను, గాడ్స్‌విల్‌తో కలిపినట్టు అవుతుంది. రెండు చేతులూ కలిసేసరికి భగవంతుని చేతిలో కీలుబొమ్మలా కనిపిస్తాము కాని నిజానికి అది భగవంతుడు చూపిన మార్గంలో నడవటం అవుతుంది. ఒక్కముక్కలో చెప్పాలంటే ధర్మాన్ని పాటించటం అవుతుంది.

ఫ్రీవిల్‌ను సరిగ్గా ఉపయోగించుకోవటంలో ఉంది అంతా. రాగద్వేషాలకు లోనయితే పతనం తప్పదు. రావణాసురుడు రాగద్వేషాలకు లోనయ్యాడు; నాశనమయ్యాడు. కంసమామ రాగద్వేషాలకు లోనయ్యాడు, మధుసూదనుడు అతనిని హతమార్చాడు. వారు చెప్పినా వినే పరిస్థితిలో లేరు. ఇక్కడ అర్జునుడు నేను నీ శిష్యుణ్ణి, నాకు శ్రేయస్కరమైనది ఏదో అది చెప్పు అని ప్రత్యేకించి అడిగాడు. అందువల్ల కృష్ణపరమాత్మ రాగద్వేషాలకు లోనవకు, ధర్మాన్ని ఆచరించు అంటున్నాడు. ధర్మాన్ని ఆచరించటంవల్ల స్వజనులను కోల్పోవాల్సి రావచ్చు కాని తప్పదు, వారు అధర్మంతో చేతులు కలిపారు.

**ధర్మ్యాద్ధి యుద్ధాచ్ఛ్రేయోఽన్యత్ క్షత్రియస్య న విద్యతే ॥** – 2.31

క్షత్రియునికి ధర్మయుద్ధాన్ని మించిన శ్రేయస్కరమైన కర్తవ్యం మరొకటి లేదు అన్నాడు. శ్రేయస్కరమైన మార్గమేదో చెప్పు అన్నాడు అర్జునుడు. నీ క్షత్రియధర్మాన్ని పాటించటమే శ్రేయస్కరమైన మార్గం అన్నాడు కృష్ణపరమాత్మ.

అలాంటి ధర్మమార్గాన్ని ఎన్నుకోవాలంటే, రాగద్వేషాలను అదుపులో పెట్టుకోవాల్సి ఉంటుంది. అది కష్టమే కాని ధర్మపథంలో నడవటం అంటే భగవంతుని అడుగుజాడల్లో నడిచినట్టే అవుతుంది. అది ఆధ్యాత్మిక ఎదుగుదలకు తోడ్పడుతుంది. ఒక్కముక్కలో చెప్పాలంటే ధర్మపథంలో నడిస్తే ఫ్రీవిల్‌ను సరిగ్గా ఉపయోగించినట్టు, అధర్మపథంలో నడిస్తే, ఫ్రీవిల్‌ను దుర్వినియోగం చేసినట్టు అవుతుంది.

ధర్మపథంలో నడిస్తే కర్మయోగాన్ని, భక్తిని కలగలిపినట్టు అవుతుంది. కర్మయోగి అంటే ఈశ్వరార్పణభావనతో కర్మచేసి, ఈశ్వరప్రసాదబుద్ధితో ఫలాన్ని స్వీకరించే వ్యక్తి. ఈశ్వరార్పణబుద్ధి అంటే భగవంతుని అడుగుజాడల్లో నడిచినట్టే. అందువల్ల భక్తుడు కానివాడు, కర్మయోగి కాలేడు. కర్మయోగి ధర్మాన్ని పాటించకుండా ఉండలేడు. ధర్మాన్ని పాటిస్తే నిమిత్తమాత్రుడిగా కనిపిస్తాడు. అదీ నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్ అర్థం.

ఇక్కడితో ప్రత్యేక విశ్లేషణ – ఫ్రీవిల్లా,విధా ముగిసింది.

శ్లో. 34 **ద్రోణం చ భీష్మం చ జయద్రథం చ కర్ణం తథాన్యానపి యోధవీరాన్ ।**
**మయా హతాంస్త్వం జహి మా వ్యథిష్ఠా యుధ్యస్వ జేతాసి రణే సపత్నాన్ ॥**
ద్రోణమ్, చ, భీష్మమ్, చ, జయద్రథమ్, చ, కర్ణమ్, తథా, అన్యాన్, అపి, యోధవీరాన్, మయా, హతాన్, త్వమ్, జహి, మా, వ్యథిష్ఠాః, యుధ్యస్వ, జేతాసి, రణే, సపత్నాన్ ॥

| | | | |
|---|---|---|---|
| మయా | = నాచేత | యుద్ధవీరాన్, అపి | = యుద్ధవీరులను గూడ |
| హతాన్ | = చంపబడిన | త్వమ్ | = నీవు |
| ద్రోణమ్,చ | = ద్రోణుని | జహి | = సంహరింపుము |
| భీష్మమ్, చ | = భీష్ముని | మా, వ్యథిష్ఠాః | = భయపడవలదు |
| జయద్రథమ్, చ | = సైంధవుని | రణే | = యుద్ధమందు |
| కర్ణమ్, చ | = కర్ణుని | సపత్నాన్ | = శత్రువీరులను |
| తథా | = అలాగే | జేతాసి | = తప్పక జయింపగలవు |
| అన్యాన్ | = తదితరులైన | యుధ్యస్వ | = కనుక యుద్ధము చేయుము |

**త్వం ద్రోణం చ భీష్మం చ జయద్రథం చ కర్ణం తథా మయా హతాన్ అన్యాన్ అపి యోధ–వీరాన్ జహి, మా వ్యథిష్ఠాః, యుధ్యస్వ, రణే సపత్నాన్ జేతా అసి ।**

తా: నాచేత చంపబడిన ద్రోణుని, భీష్ముని, సైంధవుని, కర్ణుని అలాగే తదితరులైన యుద్ధవీరులను గూడ నీవు సంహరింపుము. భయపడవలదు. యుద్ధమునందు శత్రువీరులను తప్పక జయింపగలవు. కనుక యుద్ధము చేయుము.

ఇక్కడ కృష్ణపరమాత్మ అర్జునుడు పాటించాల్సిన శ్రేయస్కరమైన మార్గమేమిటో నిర్దేశిస్తున్నాడు. అది ధర్మపథం. ధర్మసూత్రం లేదా కర్మసూత్రం ప్రకారం వీరంతా భూమినుంచి నిష్క్రమించే సమయం ఆసన్నమయింది. ఎవరు వారు?

ద్రోణుడు, భీష్ముడు, జయద్రథుడు, కర్ణుడు, ఇరువైపుల ఉన్న యోధులు. వారందరినీ నేను ముందే చంపాను అంటున్నాడు కృష్ణపరమాత్మ. అంటే వారి ప్రారబ్ధకర్మ ముగిసింది, వారు మరణించి తీరాలి.

ఒక్కోసారి చాలా విషమపరిస్థితిని ఎదుర్కోవాల్సి ఉంటుంది. మన దగ్గరివారికెవరికో అనారోగ్యం ముంచుకు వస్తుంది. డాక్టర్లు పరిస్థితి విషమించింది, కొన్ని రోజులు అయితే కాని ఏ విషయమూ చెప్పలేము అంటారు. అంటే మన దగ్గరివారు కోలుకుంటారో, అంతిమశ్వాస విడుస్తారో, వారికి అప్పుడు ఏం రాసిపెట్టి ఉందో మనకు తెలియదు. అలాగని వారిని వదిలిపెట్టలేము. మన ఫ్రీవిల్ ఉపయోగించి, వీలున్నంత వైద్యసహాయం అందేలా చేస్తాము. వారి ఫలం అదృష్టఫలం కాబట్టి మనకు తెలియదు. అందువల్ల మనం కర్మ చేసేటప్పుడు అంతా మన చేతిలో ఉన్నట్టు కర్మ చేయాలి; ఫలితాన్ని ఆశించేటప్పుడు మాత్రం అంతా భగవంతుని చేతిలో ఉన్నట్టుగా స్వీకరించాలి. ఫ్రీవిల్, ఫేట్‌లకు ఆచరణీయ సూత్రం ఇది. మనకు విధి ఎలా ఉందో తెలియదు. కొంతమంది జ్యోతిష్యునిద్వారా తెలుసుకుందామని ప్రయత్నిస్తారు కాని దానిమీద పూర్తిగా ఆధారపడకూడదు. ఒకే విషయాన్ని

ఇద్దరిని అడిగితే ఇద్దరూ రెండు భిన్నధృవాలుగా ఉంటారు. ఒకవేళ ఒకరినే అడిగి, అతను అన్నీ సరిగ్గా చెప్పే గొప్ప జ్యోతిష్యుడే అయినా కూడా ప్రతి చిన్నదానికీ అతనిమీద ఆధారపడకూడదు. భగవద్గీత నేర్చుకోవాలా, వద్దా అని కూడా అతనిని అడగకూడదు. ముఖ్యమైన, పెద్ద అంశాల విషయంలో జాతకం చూపించుకుంటే ఫర్వాలేదు, కాని ఇందాక చూసినట్టు మన శాయశక్తులా మన ప్రయత్నంచేయాలి; తక్కినది భగవంతునిమీద భారం వేసి వదిలేయాలి.

**త్వం జహి** – నువ్వు వారిని వధించు అంటున్నాడు కృష్ణపరమాత్మ. కనబడితే కాల్చివేయండి అంటారు కొన్ని సందర్భాలలో. ఎవరిని చంపాలి అర్జునుడు?

**ద్రోణమ్** – ద్రోణాచార్యుణ్ణి. ద్రోణాచార్యులవారు అర్జునునికి గురువే కావచ్చు కాని, ఆయన అధర్మం వైపు నిలిచాడు. గురుహత్య బాధగానే ఉంటుంది కాని తప్పదు. రాగద్వేషాలు మనోమయకోశానికి చెందినవి; ధర్మం విజ్ఞానమయకోశానికి చెందినది. మనస్సు ఆడించినట్టు ఆడకూడదు. బుద్ధి చెప్పిన మాటను బుద్ధిగా వినాలి.

**భీష్మం చ జయద్రథం చ** – భీష్మపితామహుణ్ణి, జయద్రథుణ్ణి కూడా చంపాలి. కృష్ణపరమాత్మకు కూడా వీరంటే అభిమానమే. అర్జునుని ఆత్మీయులు, అతనికి ఆత్మీయుడైన కృష్ణపరమాత్మకు కూడా ఆత్మీయులే. ఆ మాటకొస్తే కృష్ణపరమాత్మ స్వయంగా తన మేనమామ అయిన కంసుడిని వధించాడు. ఎందుకు? అతను అధర్మానికి పాల్పడ్డాడు కాబట్టి. అందువల్ల అటువంటి వారిని చంపటం బాధాకరమే అయినా తప్పదు. ఆ రాగద్వేషాలను పక్కన పెట్టాలి.

**కర్ణమ్** – కర్ణుణ్ణి చంపాలి. అది అతనికి బాధాకరం కాదు.

**తథాన్యానపి యోధవీరాన్** – ఈ తతంగంలో అనేక యోధులను కూడా సంహరించాల్సివుంటుంది. వారిలో పాండవులవైపు యోధులు కూడా ఉన్నారు. కాని తప్పదు. వారి ప్రారబ్ధకర్మ ముగిసింది. వారు కూడా మరణించాలి.

**మయా హతాన్** – నేను ముందే వారిని చంపాను; అంటే వారి కాలం ముగిసిపోయింది. నేను ముందే చంపిన వారిని నువ్వు చంపాలి.

**మా వ్యథిష్ఠాః** – నువ్వు బాధపడకు. ఇవన్నీ జీవితసత్యాలు. ఇష్టం ఉన్నా లేకపోయినా జీవితంలో ఎన్నో పనులు చేయాల్సి వుంటుంది. అందువల్ల బాధపడకూడదు.

**యుధ్యస్వ** – అర్జునా నువ్వు యుద్ధం చేయి అంటున్నాడు కృష్ణపరమాత్మ. క్షత్రియధర్మం యుద్ధం చేయటమని ఇంతకుముందే చూశాము. బ్రాహ్మణుడు యుద్ధం చేయనవసరం లేదు, కాని క్షత్రియుని ధర్మం ధర్మాన్ని రక్షించటం.

**జేతాసి రణే సపత్నాన్** – నువ్వు ఖచ్చితంగా నీ శత్రువులను జయిస్తావు. సపత్నాన్ అంటే శత్రువులు. రెండవ అధ్యాయంలో యుద్ధంలో గెలుస్తానో లేదో అనే సందేహాన్ని వెలిబుచ్చాడు అర్జునుడు.

**యద్వా జయేమ యది వా నో జయేయుః** – 2.6

యుద్ధంలో వారిని మనం జయిస్తామో, లేక వారు మనను జయిస్తారో కూడా తెలియదు అన్నాడు అక్కడ. అందువల్ల ఇక్కడ కృష్ణపరమాత్మ అతనికి ముందే యుద్ధంలో నువ్వు గెలుస్తావు అని చెబుతున్నాడు. ఎందుకు? అతను సవ్యసాచి కాబట్టి కాదు, అతని వైపు ధర్మం ఉంది కాబట్టి.

**సంజయ ఉవాచ**

శ్లో. 35 **ఏతచ్ఛ్రుత్వా వచనం కేశవస్య కృతాంజలిర్వేపమానః కిరీటీ ।**
**నమస్కృత్వా భూయ ఏవాహ కృష్ణం సగద్గదం భీతభీతః ప్రణమ్య ॥**
ఏతత్, శ్రుత్వా, వచనమ్, కేశవస్య, కృతాంజలిః, వేపమానః, కిరీటీ,
నమస్కృత్వా, భూయః, ఏవ, ఆహ, కృష్ణమ్, సగద్గదమ్, భీతభీతః, ప్రణమ్య ॥

కేశవస్య = శ్రీకృష్ణునియొక్క

| | | | |
|---|---|---|---|
| ఏతత్ | = ఈ | భూయః ఏవ | = ఇంకా |
| వచనమ్ | = మాటలను | భీతభీతః | = మిక్కిలి భయముతో |
| శ్రుత్వా | = విని | ప్రణమ్య | = నమస్కరించి |
| కిరీటీ | = అర్జునుడు | కృష్ణమ్ | = కృష్ణునితో |
| కృతాంజలిః | = అంజలి ఘటించినవాడై | సగద్గదమ్ | = గద్గదస్వరముతో |
| వేపమానః | = వణకిపోవుచున్నవాడై | ఆహ | = పలికెను |
| నమస్కృత్వా | = నమస్కరించి | | |

**సంజయః ఉవాచ**
**కేశవస్య ఏతత్ వచనం శ్రుత్వా, వేపమానః కిరీటీ కృత–అఞ్జలిః కృష్ణం నమః కృత్వా,**
**భీత–భీతః ప్రణమ్య (చ) భూయః ఏవ సగద్గదమ్ ఆహ ।**

తా: శ్రీకృష్ణునియొక్క ఈ మాటలను విని అర్జునుడు అంజలి ఘటించినవాడై, వణకిపోవుచున్నవాడై, నమస్కరించి ఇంకా మిక్కిలి భయముతో నమస్కరించి కృష్ణునితో గద్గదస్వరముతో పలికెను.

కృష్ణపరమాత్మ మాటలకు అర్జునుడు ఎలా స్పందిస్తాడు? అర్జునునికి ఇప్పుడు ఒక విషయం బాగా స్పష్టంగా అర్థమౌతుంది. భగవంతుడు కర్మఫలదాత. ఆయన మనుష్యుల సుఖదుఃఖాలకు బాధ్యుడు కాదు.

భగవంతుడు చేసేది న్యాయాధికారి చేసే పనే. చట్టపరిధిలో న్యాయాధికారి ఒక వ్యక్తిని శిక్షిస్తే, అతనికి కారాగార శిక్ష విధిస్తే అది అతను చేతులారా చేసుకున్న పాపానికి అనుభవిస్తున్న శిక్ష. దానికి ఆ న్యాయాధికారిని నిందించి లాభం లేదు. న్యాయసూత్రాలను అనుసరించి శిక్ష విధిస్తాడు.

భగవంతుడు కూడా అంతే. కర్మసూత్రాలను అనుసరించి శిక్ష విధిస్తాడు. భగవంతుడు నిర్దయుడు కాదు, ఆయన కర్మసూత్రాలను పాటించటంలో దయ చూపిస్తున్నాడు. ఒకరికి పాపఫలాన్ని అనుభవించాలని రాసిపెట్టి ఉంటే, అతను అనుభవించక తప్పదు. భగవంతుడు దయాశీలుడే, అందులో ఏమాత్రం సందేహం లేదు.

కాని ఆయన దయ ఒక్కరిమీద చూపలేదు; ఒక్కరికోసం ప్రకృతినియమాలను సడలించలేదు. అలా సడలిస్తే ప్రకృతిలో సమతుల్యత దెబ్బ తింటుంది.

ఉదాహరణకు ఎవరో పైనుంచి కింద పడుతున్నారు అనుకుందాము. అతనిని రక్షించటానికి భూమ్యాకర్షణశక్తి అనే నియమాన్ని కాసేపు సడలిస్తే ఏమవుతుంది? అతను పడకుండా ఆగుతాడు కాని మనమందరం గాల్లో తేలుతూ ఉంటాము. అందువల్ల అలా ఆ ప్రకృతిసూత్రాన్ని సడలించాలని కోరుకోవటం హ్రస్వదృష్టి అవుతుంది. ఒక వ్యక్తికోసం ప్రకృతిసూత్రాలను సడలిస్తే, ప్రపంచం దెబ్బ తింటుంది. ఒక వ్యక్తి రైలును అందుకోలేదని అతనికోసం ట్రాఫిక్ సిగ్నలును మారిస్తే, అంతా అస్తవ్యస్తంగా మారిపోతుంది. అర్జునుడు కృష్ణపరమాత్మ కర్మఫలదాతగా ఉన్నా, ఆయన కర్మసూత్రాలను నియంత్రిస్తున్నాడు కాని ఎవరికీ పక్షపాతం చూపటం లేదు, ఎవరికీ అన్యాయం చేయటం లేదని తెలుసుకున్నాడు.

అందువల్ల మనం ఏ కారణం చేతనైనా అవస్థ పడుతుంటే, మనం ఆ కష్టాన్ని చిరునవ్వుతో స్వీకరించగలగాలి. భగవంతునికి జాలి లేదా అని నిందించే బదులు, కష్టంలో కృంగిపోయేబదులు, మన దృక్పథాన్ని మార్చుకోవాలి. ఎలా? దానికి ఒక చిట్కా ఉంది. మనం ఒక కష్టాన్ని అనుభవిస్తున్నాము అంటే మన పాపక్షయం అవుతున్నట్టు అర్థం. ఆనందం అనుభవిస్తే పుణ్యం చేసుకున్నట్టు, దుఃఖం పొందితే పాపం చేసుకున్నట్టు అని మనకూ తెలుసు.

అందువల్ల, కష్టాలకడలిలో కూరుకుపోయినప్పుడు బాధపడుతూ ఇంకా లోతుకుపోయే బదులు, ఈ కష్టాలద్వారా మనను భగవంతుడు శుద్ధి చేస్తున్నాడు అనుకోవాలి. మనం మన సంచితకర్మలలో పాపాలను, పుణ్యాలను పోగుచేసుకువస్తామని చూశాము. అందువల్ల, ఆ పాపపు మూటలోంచి కొన్ని పాపాలు కరిగి పోతున్నాయి అంటే ఏమిటి అర్థం? మనం అంతకంతకూ పునీతులమవుతున్నాము. ఈ సూత్రం పుణ్యానికీ వర్తిస్తుంది. మనం ఆనందంగా ఉంటే, అప్పుడు పుణ్యం హరించుపోతుంది కాని పుణ్యం హరించుకుపోతున్నదని బాధపడతూ కూర్చోకూడదు. ఆనందం అనుభవించాలి. కాని దుఃఖం కలిగినప్పుడు దాన్ని భరించటానికి పాపప్రక్షాళణ జరుగుతున్నదనుకోవటం గొప్ప ఉపశమన మార్గం.

కాని భగవంతుడు మన పాపాన్ని హరిస్తున్నాడు, దాన్ని నవ్వుతూ స్వీకరించాలి అంటే మళ్ళీ ఒక సందేహం కలుగుతుంది. అయితే ప్రాయశ్చిత్తకర్మలు చేసి లాభం లేదా?

## ప్రాయశ్చిత్తకర్మల గురించి విశ్లేషణ

భగవంతుడు కర్మఫలదాత అయితే, ప్రాయశ్చిత్తకర్మలు చేసి లాభం లేదా? మనం చేసిన కర్మకు ఫలం అనుభవించి తీరాలంటే, కర్మఫలాన్ని తప్పించుకోలేము అంటే ప్రాయశ్చిత్తకర్మవల్ల కలిగే లాభం ఏమిటి?

ప్రాయశ్చిత్తకర్మ ఎన్నడూ వృథాపోదు. ప్రాయశ్చిత్తకర్మ కూడా కర్మసూత్రాలను అనుసరించే పనిచేస్తుంది. అదెలా పనిచేస్తుంది? ప్రాయశ్చిత్తకర్మద్వారా పుణ్యం కలుగుతుంది; అది పాపానికి వ్యతిరేకంగా పనిచేస్తుంది. మనం తిన్న ఆహారమేదో పడలేదు, దానివల్ల ఏదో ఎలర్జీ వచ్చింది. దానికి మనం అవస్థపడాలని రాసివుంది,

అది మన కర్మఫలం అని చేతులు ముడుచుకుని కూర్చోనవసరం లేదు. ఆ ఎలర్జీని పోగొట్టే మందు ఏదైనా తీసుకోవచ్చు. ఫిజిక్స్‌లో దీన్ని లా ఆఫ్ రిజల్టంట్ ఫోర్స్ అంటారు. ప్రాయశ్చిత్తకర్మ ఆగామికర్మను ఉత్పత్తి చేస్తుంది. ఆ ఆగామికర్మ మన ప్రారబ్ధకర్మను రూపుమాపుతుంది.

ఒకవేళ ప్రాయశ్చిత్తకర్మ చేసినా కూడా ప్రారబ్ధకర్మ తగ్గలేదూ అంటే మనం చేసిన ఆగామికర్మశక్తి ప్రారబ్ధకర్మ ధాటిని తట్టుకోలేకపోయిందని అర్థం. ఒక పెద్ద బండరాయిని ఒక చిన్న మట్టిముద్దతో పగులగొట్టగలమా? అందువల్ల ప్రాయశ్చిత్తకర్మయొక్క శక్తి, ప్రారబ్ధకర్మయొక్క శక్తిమీద ఆధారపడివుంటుంది. దానికి ముందు ఒక ఉదాహరణ చూద్దాము.

మనం ఏదో ఒక అనారోగ్యంతో ఒక డాక్టరు దగ్గరకు వెళ్ళామనుకుందాము. 'డాక్టర్, నా రోగం నయమవుతుందా?' అని అడిగితే, 'ముందు పరీక్షలు కానివ్వండి, అప్పుడు చెబుతాను,' అంటాడు డాక్టరు. రోగాల్లో మూడు రకాలు ఉంటాయి.

ఎ) ఏ చిన్న జ్వరంలాంటిదో వస్తే, మందులు ఇచ్చి తగ్గిస్తాడు. లేదా ఏ అపెండిసైటిస్సో వస్తే ఆపరేషను చేసి నయం చేస్తాడు. ఈ రెండు సందర్భాల్లోనూ రోగాన్ని నయం చేయవచ్చు.

బి) బి.పి., షుగర్, థైరాయిడ్‌వంటి అనారోగ్యాలు వస్తే వాటిని పూర్తిగా నయం చేయలేడు ఏ వైద్యుడు కూడా. అలాగని అవి పెద్దగా ప్రమాదకారి జబ్బులు కావు. కాని జీవితాంతం వాటికి మందులు వేసుకుంటూ ఉండాలి. అంటే వాటిని నయం చేయలేము కాని వాటిని భరించవచ్చు.

సి) మూడవదశలో ఉన్న క్యాన్సరో, మరేదైనా మహమ్మారి రోగమో వస్తే, రోగి అట్టే రోజులు బ్రతకడని చెబుతాడు వైద్యుడు. మూడునెలలు, ఆరునెలలు, కొన్ని సంవత్సరాలు మాత్రమే బ్రతుకుతాడు; మందులు ఏవీ పనిచేయవు అని చెబుతాడు.

అంటే మూడు రకాల రోగాలను చూశాము – పూర్తిగా నయం అయ్యే రోగాలు, జీవితాంతం వాటితో సహజీవనం చేయాల్సిన రోగాలు, ప్రాణాపాయకరమైన రోగాలు. అలాగే ప్రారబ్ధకర్మలు కూడా మూడు స్థాయిల్లో ఉంటాయి – దుర్బలప్రారబ్ధం, మధ్యమప్రారబ్ధం, ప్రబలప్రారబ్ధం.

దుర్బలప్రారబ్ధాన్ని ప్రాయశ్చిత్తకర్మలతో పారద్రోలవచ్చు. మధ్యమప్రారబ్ధాన్ని ప్రాయశ్చిత్తకర్మతో భరించేశక్తిని పొందుతాము. కాని ప్రబలప్రారబ్ధం విషయంలో ప్రాయశ్చిత్తకర్మ ఏమీ చెయ్యలేదు. కాని వచ్చిన చిక్కేమిటంటే మనకు ఉన్న ప్రారబ్ధం ఈ మూడు స్థాయిల్లో దేనికి చెందినదో మనకు తెలియదు. ఇది ప్రబలప్రారబ్ధం, దీన్ని తప్పించుకోలేము అని తెలిస్తే ఏమీ చేయకుండా కూర్చోగలము కాని ప్రారబ్ధం అదృష్టఫలం కాబట్టి, మనకు ముందే తెలియదు. మనం చేయగలిగింది ఒక్కటే. ప్రాయశ్చిత్తకర్మ చేయాలనుకుంటే చేసి, దాని ప్రభావం ఎలా ఉందో గమనించాలి. మన సమస్య తీరితే తక్కువ ఉన్నట్టు, తీరకపోతే ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తుంది. అందువల్ల ప్రాయశ్చిత్తకర్మ కూడా కర్మసూత్రాల్లో వర్తిస్తుంది. అంటే దాని ప్రభావం ప్రారబ్ధంమీద ఆధారపడివుంటుంది.

ఇక్కడితో ప్రాయశ్చిత్తకర్మ గురించిన విశ్లేషణ ముగిసింది.

భీష్మ, ద్రోణుల ప్రారబ్ధం ప్రబలంగా ఉందన్నమాట. వారి అంత్యకాలం సమీపించింది. ఎప్పుడైతే అర్జునుడు భగవంతుణ్ణి కర్మఫలదాతగా అర్థం చేసుకున్నాడో, అప్పుడే అతని దృక్పథం పూర్తిగా మారిపోయింది. ఈ అధ్యాయంలో అర్జునుడు మూడు రకాల భావాలను ప్రదర్శించాడని చూశాము. ఇప్పటిదాకా వాటిలో రెండు భావాలను చూశాము. అవి ఆశ్చర్యం, భయం. ఇప్పుడు మూడవ భావాన్ని చూస్తాము. అది శరణాగతి లేదా భక్తిభావన. భగవంతుడు ప్రకృతిసూత్రాల నియంత. జీవి ప్రకృతిసూత్రాలకు కట్టుబడి ఉండాలి. ఎందుకంటే అవి భగవంతుడు నిర్దేశించిన సూత్రాలు. అర్జునునిలో వచ్చిన ఈ మార్పును ముందు సంజయుడు వివరిస్తున్నాడు. తర్వాత అర్జునుడే వివరిస్తాడు.

ఈ నేపథ్యంతో ఈ శ్లోకాన్ని చూద్దాము.

**సంజయ ఉవాచ** – సంజయుడు చెబుతున్నాడు.

**కేశవస్య ఏతత్ వచనం శ్రుత్వా** – కృష్ణపరమాత్మ చెప్పిన ఈ మాటలను విని అర్జునుడు – అర్జునునికి కర్మసూత్రాలు బాగా అర్థమయ్యాయి. భగవంతుడు కర్మఫలాన్ని దయాహృదయంతోనో, పక్షపాత వైఖరితోనో ఇవ్వటం లేదు.

**సమోఽహం సర్వభూతేషు న మే ద్వేష్యోఽస్తి న ప్రియః** – 9.29

నాకు ఎవరిమీదా ద్వేషం లేదు, ఎవరూ నాకు ప్రియం కాదు, నేను ఈ జగత్తును కర్మసూత్రాలను అనుసరించి నడుపుతున్నాను అన్నాడు కృష్ణపరమాత్మ.

**వేపమానః కిరీటీ** – అర్జునుడు వణికిపోతున్నాడు.

భూమ్మీద ఉంటే ఎలాగైతే భూమ్యాకర్షణశక్తిని తప్పించుకోలేమో అలా భగవంతుడు ఇచ్చే కర్మఫలాన్ని కూడా తప్పించుకోలేము. తప్పించుకోలేని దానిమీద మన ఇష్టాయిష్టాల ప్రసక్తి లేదు. మనకు ఇష్టం ఉన్నా లేకపోయినా ఆ సూత్రం మారదు. అందువల్ల కర్మఫలాన్ని నవ్వుతూ స్వీకరించే పరిపక్వతను పెంచుకోవాలి.

**కృతాంజలిః** – అర్జునుడు అంజలి ఘటించాడు. కర్మసూత్రాలను బుద్ధి అర్థం చేసుకుందని, శరీరం నమస్కారంద్వారా ప్రకటిస్తున్నది. అర్జునుడు తన శరణాగతిని నమస్కారంద్వారా ప్రకటిస్తున్నాడు. అంతేకాదు,

**భూయ ఏవాహ కృష్ణం నమస్కృత్వా** – మళ్ళీమళ్ళీ కృష్ణపరమాత్మకు నమస్కారం చేస్తున్నాడు. అది కూడా ఎలా?

**భీతభీతః ప్రణమ్య**– ఎంతో భయంతో వణికిపోతూ నమస్కారం చేస్తున్నాడు. కర్మసూత్రాలు చూస్తే ఎంతో శక్తివంతమైనవి. వాటి శక్తిముందు మన శక్తి చాలా అల్పం. సమష్టి ప్రకృతిసూత్రాలను తెలుసుకుంటే అందులో వ్యష్టిగా మనమెంత అల్పమో తెలుస్తుంది. ప్రకృతి నియమాన్ని మనం తప్పించుకోలేమని తెలిసినప్పుడు, ప్రప్రథమంగా ఏర్పడేది భయమే. పరిపక్వత చెందినకొద్దీ, దీన్ని సహజనియమంగా తీసుకునే శక్తి వస్తుంది. అలా వచ్చిన శక్తిని భక్తి అంటారు. ఎప్పుడైతే శరణాగతి వేడతామో అప్పుడే భయం పోతుంది.

జాగ్రత్తగా గమనించండి, సమస్యలు పోవు. కాని మనకు ఏర్పడిన భక్తివల్ల సమస్యలను స్వీకరించే శక్తి వస్తుంది. మనం చేసుకున్న కర్మలవల్ల ఈ భూమ్మీదకు వస్తామనీ, ఆ కర్మ తీరగానే వెళ్ళిపోతామనీ, ఆ కర్మలవల్లనే

శరీరం ఎదుగుతుందనీ, ఆ కర్మలవల్లనే శరీరం క్షీణిస్తుందనీ, ఆ కర్మలవల్లనే మనుష్యులు దగ్గరకు వస్తారనీ, ఆ కర్మలవల్లనే వచ్చినట్టే వచ్చి వెళ్ళిపోతారనీ అర్థమవుతుంది. వీటన్నిటినీ స్వీకరించాలని నేర్చుకోవాలి. ఆ జ్ఞానంనుంచి వచ్చినదే ఈ నమస్కారం.

**సగద్గదం** – విషయాన్ని గ్రహించాడు కాని భయపడిపోతున్నాడు అర్జునుడు. ప్రారంభదశలో అలాగే ఉంటుందని చూశాము. ఇక్కడ గద్గదస్వరంతో మాట్లాడుతున్నాడు అంటున్నాడు సంజయుడు. ఎందుకు? అతను నేర్చుకున్న విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నాడు.

అర్జునుడు ఇంకా పరిపక్వత చెందలేదు. ఇక్కడ కృష్ణపరమాత్మ తాత్కాలికంగా, అతనికి ఆ పరిపక్వతను చేకూర్చాడు. కొన్ని పండ్లను, చెట్టుమీద పండకముందే కోసి, కృత్రిమంగా పండబెడతారు. సహజంగా పండిన పండుకున్న రుచి వాటికి రాదు. ఇప్పుడు అర్జునుని పరిస్థితీ అంతే. సహజంగా జ్ఞానం పొందలేదు. కృష్ణపరమాత్మ తాత్కాలికంగా ఇచ్చిన దివ్యచక్షువులతో చూస్తున్నాడు. అది ఎక్కువ కాలం ఉండదు. కర్మయోగం పాటిస్తే ఈ దివ్యచక్షువులు సహజంగా వస్తాయి.

అందువల్ల తాత్కాలికంగా వచ్చిన ఈ జ్ఞానంతో, భయంతో వణికిపోతూ అర్జునుడు పదేపదే నమస్కారం చేస్తూ భగవంతునితో ఈ విధంగా మాట్లాడబోతున్నాడు.

**అర్జున ఉవాచ**

శ్లో. 36 **స్థానే హృషీకేశ తవ ప్రకీర్త్యా జగత్ప్రహృష్యత్యనురజ్యతే చ ।**
**రక్షాంసి భీతాని దిశో ద్రవంతి సర్వే నమస్యంతి చ సిద్ధసంఘాః ॥**

స్థానే, హృషీకేశ, తవ, ప్రకీర్త్యా, జగత్, ప్రహృష్యతి, అనురజ్యతే, చ,
రక్షాంసి, భీతాని, దిశః, ద్రవంతి, సర్వే, నమస్యంతి, చ, సిద్ధసంఘాః ॥

| | | | |
|---|---|---|---|
| హృషీకేశ! | = ఓ ఇంద్రియ నిగ్రహము కలవాడా! | భీతాని | = భయగ్రస్తులైన |
| తవ | = నీ నామగుణ ప్రభావములను | రక్షాంసి | = రాక్షసులు |
| ప్రకీర్త్యా | = బాగుగా కీర్తించుచు | దిశః | = నలుదిక్కులకును |
| జగత్ | = విశ్వమంతయును | ద్రవంతి | = పారిపోవుచున్నారు |
| ప్రహృష్యతి | = మిక్కిలి హర్షించుచున్నది | చ | = ఇంకా |
| చ | = ఇంకా | సర్వే | = సమస్తమైన |
| అనురజ్యతే | = అనురాగముతో పొంగి పోవుచున్నది | సిద్ధసంఘాః | = సిద్ధసముదాయములవారును |
| | | నమస్యంతి | = ప్రణమిల్లుచున్నారు |
| | | స్థానే | = ఇది సముచితము |

**అర్జునః ఉవాచ**

**హే హృషీకేశ! స్థానే, తవ ప్రకీర్త్యా జగత్ ప్రహృష్యతి, అనురజ్యతే చ,**
**భీతాని రక్షాంసి దిశః ద్రవన్తి, సర్వే చ సిద్ధ-సఙ్ఘాః నమస్యన్తి ।**

తా: ఓ ఇంద్రియనిగ్రహము కలవాడా! శ్రీకృష్ణా! నీ నామగుణ ప్రభావములను బాగుగా కీర్తించుచు విశ్వమంతయును మిక్కిలి హర్షించుచున్నది, అనురాగముతో పొంగి పోవుచున్నది. భయగ్రస్తులైన రాక్షసులు నలుదిక్కులకును పారిపోవుచున్నారు ఇంకా సమస్తమైన సిద్ధసముదాయములవారును ప్రణమిల్లుచున్నారు. ఇది సముచితము.

### 6. శరణాగతి లేదా భక్తి: శ్లోకాలు 36-46

ఇక్కడ్నుంచీ మళ్ళీ అర్జునుని స్పందనను చూస్తాము. ఇది మూడవ దశ. మొదటి రెండూ - ఆశ్చర్యం, భయం. ఇది శరణాగతి. కాని పూర్తిగా భయం పోలేదు. మనం సంకుచితదృష్టితో చూస్తున్నన్నాళ్ళూ సృష్టి మనకు భయాన్నే కలుగజేస్తుంది. సమష్టిపరంగా సృష్టిని అర్థం చేసుకుంటేనే అంటే ప్రకృతినియమాలను అర్థం చేసుకుంటేనే భయం పోతుంది.

నిజానికి విశ్వరూపదర్శనం చేయగలిగితేనే నిర్గుణబ్రహ్మకు రాగలము అంటుంది వేదాంతశాస్త్రం. విశ్వరూపదర్శనానికి ఏకరూపదర్శనంనుంచి రావాలి అని చూశాము. విశ్వరూపదర్శనానికి రాకుండా వేదాంతశాస్త్రానికి వచ్చి, అహం బ్రహ్మ అస్మి నేర్చుకుంటే అది అర్థం కాదు. ఒకపక్కన అహం బ్రహ్మ అస్మి అంటూనే ఇంకోపక్క భగవంతుడంటే భయం ఉంటూనే ఉంటుంది.

భయం పోవాలంటే, చిత్తవైశాల్యం పెంపొందించుకోవాలి. చిత్తవైశాల్యం పెంపొందించుకోవాలంటే ప్రకృతిసూత్రాలు, ధర్మసూత్రాలు, కర్మసూత్రాలు తెలియాలి. కర్మసిద్ధాంతం ఈ జన్మకే వర్తించదు. అంతకు ముందు జన్మలకూ, తర్వాత రాబోయే అనేక జన్మలకూ కూడా వర్తిస్తుంది. వ్యష్టిగా ఈ సమష్టినియమాలను మనం తప్పించుకోలేము.

ఈ నియమాలను తప్పించుకోవాలంటే అహంకారాన్ని జయించి, నిర్గుణబ్రహ్మస్థాయికి ఎదగాలి. కాని అహంకారాన్ని జయించాలంటే విశ్వరూపదర్శనం చేయాలి. అహంకారం ఎదగాలి, తర్వాత పడిపోవాలి. అరటిపండుకు దాని తొక్క ఉంటేనే అది పండుతుంది. అది పండాక ఆ తొక్కనుంచి తేలిగ్గా విడివడుతుంది. అలాగే విశ్వరూపదర్శనం చేస్తే అహంకారం తేలిగ్గా పండుతుంది. ఎప్పుడైతే అహంకారం బాగా పండుతుందో అప్పుడు వేదాంతం దాన్ని చాలా తేలిగ్గా తొలగిస్తుంది. వేదాంతస్పర్శ తగిలితే చాలు, అహంకారం పడిపోతుంది.

అందువల్ల అర్జునుడు ఇక్కడ చెబుతున్నాడు, ఓ కృష్ణా! ఎందుకు మహాత్ములు నీ విశ్వరూపదర్శనాన్ని స్తుతిస్తారో ఇప్పుడు అర్థమవుతున్నది. అంతేకాదు, మహాత్ములు కానివారు భయంతో వణికిపోతున్నారు.

నిజానికి భగవంతుని విశ్వరూపం తెలియకపోతే, మతం కూడా భయహేతువు అవుతుంది. నేనీ తప్పు చేస్తే భగవంతుడు నన్ను ఇలా శిక్షిస్తాడు అని భయపడతాము.

**హృషీకేశ! తవ ప్రకీర్త్యా జగత్ప్రహృష్యతి** – ఓ కృష్ణా, నీ విశ్వరూపాన్ని కీర్తిస్తూ, మహాత్ములు ఆనందంతో పొంగి పోతున్నారు.

నిజంగా కూడా సమష్టి అందాన్ని చూస్తే, మనం పొందే చిన్నచిన్న ఆనందాలు దానిముందు వెలవెల పోతాయి. మనం మన కుటుంబంమీద, మన స్నేహితులమీద అభిమానం పెంచుకుని, అందులోనే ఆనందం పొందుతాము. కాని ఆ ఆనందాన్ని కూడా పూర్తిగా అనుభవించలేము. ఎందుకంటే ఆ ఆనందాన్ని వెన్నంటే వారికేమవుతుందో అనే భయం ఉంటూనే ఉంటుంది. అందువల్ల మన బంధం కొందరితోనే పెనవేసుకుని ఉంటే అది ఆనందంతో ఆందోళనను కూడా తెస్తుంది. అదే విశాలదృక్పథంతో సమష్టిపరంగా ఆలోచిస్తే, ఆ ఆనందమే వేరు. అలాంటి పరిపక్వత కొందరికే ఉంటుంది.

**అనురజ్యతే చ** – వారు నీ విశ్వరూపాన్ని చూసి ఆనందంతో పొంగిపోతున్నారు.

మళయాళంలో ఒక గొప్ప కవిత ఉంది. దానిపేరు హరినామ కీర్తనం. దాని సారాంశం – ఓ దేవా, నాకు కొంతమందితో మాత్రమే అనుబంధం ఉండేలా చేయకు. అనుబంధం ఉండి తీరాలంటే, సమష్టితో ఉండేలా చేయి అంటాడు కవి. అసలు ఎవరితోనూ బంధం లేకపోతే మీరు బ్రహ్మ, సమష్టితో అనుబంధం ఉంటే మీరు ఈశ్వరుడు. బ్రహ్మకూ, ఈశ్వరునికీ కూడా సంసారం లేదు. కాని కొంతమందితో అనుబంధం ఉంటే సంసారంలో పడి కొట్టుమిట్టాడుతుంటారు.

**రక్షాంసి భీతాని** – భగవంతుని ధర్మసూత్రాలు అర్థం కాని రాక్షసులు నిన్ను చూసి భయపడుతున్నారు అంటున్నాడు అర్జునుడు. ఎవరైతే ధర్మాన్ని పాటించరో వారికి భగవంతుడంటే భయం ఉంటుంది. వారు కర్మఫలాన్ని తప్పించుకోవాలని చూస్తారు. ఎలా తప్పించుకోవాలనుకుంటారు?

**దిశః ద్రవంతి** – అన్ని దిక్కులకూ పారిపోతున్నారు. మనం భూమ్మీద ధర్మరక్షక భటులైన పోలీసులను తప్పించుకోగలమేమో కాని, కర్మసిద్ధాంతంనుంచి మాత్రం తప్పించుకోలేము.

**సిద్ధసంఘాః సర్వే నమస్యంతి** – సిద్ధపురుషులు అందరూ నీకు నమస్కారాలు చేస్తున్నారు. అంటే సిద్ధపురుషులు వారి కర్మఫలాన్ని స్వీకరించటానికి సిద్ధంగా ఉన్నారు. వారు ఒకవేళ ప్రార్థన చేస్తే వారి ప్రార్థన ఈ విధంగా ఉంటుంది. 'ఓ దేవా! నాకోసం నువ్వు నీ సూత్రాలను సడలించనవసరం లేదు. కాని మార్చలేని పరిస్థితులను చిరునవ్వుతో స్వీకరించే మనస్థైర్యాన్ని నాకు ప్రసాదించు. ప్రాయశ్చిత్తం చేసి మార్చగలిగే పరిస్థితులు ఉంటే, వాటికి ప్రాయశ్చిత్తం చేసే జ్ఞానాన్ని, శక్తిని నాకు ప్రసాదించు.' మార్చలేని పరిస్థితులను స్వీకరించటమే నమస్కారం అంటే.

శ్లో. 37 **కస్మాచ్చ తే న నమేరన్ మహాత్మన్ గరీయసే బ్రహ్మణోప్యాదికర్త్రే ।**
**అనంత దేవేశ జగన్నివాస త్వమక్షరం సదసత్ తత్పరం యత్ ॥**
కస్మాత్, చ, తే, న, నమేరన్, మహాత్మన్, గరీయసే, బ్రహ్మణః, అపి, ఆదికర్త్రే,
అనంత, దేవేశ, జగన్నివాస, త్వమ్, అక్షరమ్, సత్, అసత్, తత్పరమ్, యత్ ॥

| | | | |
|---|---|---|---|
| మహాత్మన్ | = ఓ మహాత్మా! | యత్ | = ఏది |
| బ్రహ్మణః, అపి | = సృష్టికర్తయైన బ్రహ్మకును | సత్ | = 'సత్' అయియున్నదో |
| ఆదికర్త్రే | = నీవు మూలకారకుడవు | అసత్ | = 'అసత్' అయియున్నదో |
| చ | = ఇంకా | తత్పరమ్ | = వాటికన్నా పరమైన |
| గరీయసే, తే | = సర్వశ్రేష్ఠుడవైన నీకు | అక్షరమ్ | = శాశ్వతమైన సచ్చిదానంద పరమాత్మతత్త్వము గలదో |
| కస్మాత్, న, నమేరన్ | = నమస్కరింపక ఎలా ఉండగలరు? తప్పక నమస్కరింతురు | (తత్) త్వమ్ | = (అది) |
| అనంత! దేవేశ! | = ఓ అనంతా! దేవాధిదేవా! | (ఏవ, అసి) | = నీవే |
| జగన్నివాస! | = ఓ జగన్నివాసా! | | |

**హే మహాత్మన్! అనన్త, దేవేశ! బ్రహ్మణః అపి గరీయసే ఆది-కర్త్రే (తుభ్యం) తే కస్మాత్ చ న నమేరన్,**
**హే జగత్-నివాస! యత్ సత్ అసత్ (అస్తి) తత్ పరమ్ అక్షరమ్ త్వమ్ ।**

తా: ఓ మహాత్మా! సృష్టికర్తయైన బ్రహ్మకును నీవు మూలకారకుడవు ఇంకా సర్వశ్రేష్ఠుడవైన నీకు నమస్కరింపక ఎలా ఉండగలరు? తప్పక నమస్కరింతురు. ఓ అనంతా! దేవాధిదేవా! ఓ జగన్నివాసా! ఏది 'సత్' అయియున్నదో, 'అసత్' అయియున్నదో వాటికంటెను పరమైన శాశ్వతమైన సచ్చిదానంద పరమాత్మతత్త్వము గలదో అది నీవే.

36వ శ్లోకంనుంచి అర్జునునిలో విశ్వరూపదర్శనం గురించిన జ్ఞానం కలిగేసరికి నెమ్మదిగా భయం స్థానంలో శరణాగతి భావన చోటు చేసుకుంటోంది. ఒక వైద్యుడు చేసే వైద్యం నిర్దాక్షిణ్యంగా కనిపించినా కూడా, అతను చేస్తున్నది మన మేలుకోసమే. అలాగే భగవంతుని చర్య నిర్దాక్షిణ్యంగా కనిపించినా, అది కర్మఫలదాతగా అతను చేసి తీరాల్సిన పని. అందువల్ల భగవంతుణ్ణి వైద్యనాథుడు అని కూడా అంటారు.

పరిపక్వత చెందనివారు భగవంతుణ్ణి అర్థం చేసుకోలేరు, కాని సిద్ధపురుషులు భగవంతుడు ఎన్నటికీ నిర్దయుడు కాడని అర్థం చేసుకోగలరు. మన జీవితంలో ఏవైనా అనుభవాలు అన్యాయంగా జరిగినట్టు అనిపించినా, ఆ అనుభవాలు చెడ్డవి కావు, మనకు వాటి గురించిన సమష్టి అవగాహన లేదు. అంతే.

కొంతమంది వారికి జీవితంలో ఏదైనా కష్టం కలగగానే, నేను చీమకు కూడా హాని తలపెట్టలేదు, నాకే ఎందుకు ఈ కష్టం కలిగించాడు అంటారు. 'నేను చీమకు కూడా హాని తలపెట్టలేదు,' అని వారు అన్నప్పుడు వారు వారికి గుర్తున్న కొన్ని సంవత్సరాల జీవితాన్నే లెక్కలోకి తీసుకుంటున్నారు. వారు పిల్లలుగా ఉన్నప్పుడు ఏం చేశారో వారికి గుర్తుండనప్పుడు, అంతకుముందు జన్మల్లో ఏం చేశారో వారికేం తెలుస్తుంది? అందువల్ల వారేమీ పాపం చేయలేదని వారికి అనిపించినా, భగవంతునికి వారి పూర్వజన్మ పాపాలు కూడా తెలుసు. భగవంతుడు అన్ని కర్మలనూ దృష్టిలో పెట్టుకుని కర్మఫలాన్ని ఇస్తాడు.

అందువల్ల భగవంతుణ్ణి విమర్శించే హక్కు మనకు లేదు. ఆయనకు మన పూర్వాపరాలు అన్నీ తెలుసు. ధర్మరాజంతటి వ్యక్తికే అనుమానం వచ్చిందిట. నేను ఎందుకు ఈ కష్టాలన్నీ పడాలి అనుకున్నాడట.

నాకే ఎందుకు? దీన్ని **నాకే ఎందుకు సిద్ధాంతం** అంటారు. అందరూ బాగున్నారు, నేను మాత్రమే ఎందుకు అవస్థ పడాలి. ఈ భావనను ధర్మరాజు కూడా తప్పించుకోలేకపోయాడు. అప్పుడు ధర్మపుత్రునికి ఋషులు ధర్మశాస్త్రాన్ని విడమర్చి చెప్పారు. ఎవరూ కర్మఫలాన్ని తప్పించుకోలేరు. భగవంతుడు కూడా మనిషిగా అవతారం ఎత్తినప్పుడు, ఈ క్లిష్టపరిస్థితులను ఎదుర్కోక తప్పలేదు.

**అవశ్యం భావి భావానాం ప్రతికారో భవేత్ యది ।**
**తదా దుఃఖైర్నలిప్యేరన్ నలరామ యుధిష్ఠిరాః ॥**

అలా కష్టాలకు నివారణోపాయము ఉండుంటే, యుధిష్టరుడు కష్టపడి ఉండేవాడు కాదు, రాముడు కష్టపడి ఉండేవాడు కాదు. వారు కూడా కష్టపడ్డారంటే కొన్ని నయం చేయగలిగిన పాపాలు ఉంటాయి, కొన్ని నయం చేయలేని పాపాలు ఉంటాయి. అలాంటప్పుడు మనం చేయగలిగింది ఒక్కటే – చిరునవ్వుతో స్వీకరించటమే.

అటువంటి మానసిక స్థైర్యం ఉండాలంటే కష్టం వచ్చినప్పుడు ప్రయత్నించకూడదు. దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి అంటారు. ఆరోగ్యం బాగున్నప్పుడే యోగాసనాలు వేసి, వాకింగ్ చేసి ఆరోగ్యాన్ని నిలబెట్టుకోవాలి. అలాగే పరిస్థితులు బాగున్నప్పుడే మనస్సుకు ఎటువంటి పరిస్థితి ఎదురైనా తట్టుకునే శక్తిని సమకూర్చాలి. భగవంతుడు ఎవరికీ అన్యాయం చేయడు. భగవంతుడు ఎవరికి ఏ ఫలాన్నిచ్చినా అది కర్మసిద్ధాంతాన్ని ఆధారంగా చేసుకుని ఇచ్చినదే. అది మనం చేతులారా చేసుకున్నదే. చేసుకున్నవారికి చేసుకున్నంత మహదేవా! ఈ సిద్ధాంతాన్ని పదేపదే మనస్సుకు చెప్పుకుంటే, మనకు కష్టం వచ్చినప్పుడు, ఈ వాసన బయటకు వస్తుంది. కాని జీవితం హాయిగా సాగిపోతున్నప్పుడు ఇలాంటి మంచివిషయాలు ఆలోచించము. 'ఓ దేవా! నా ప్రారబ్ధాన్ని తట్టుకునే శక్తిని నాకు ఇవ్వు,' అని ప్రార్థించటం నేర్చుకోవాలి. అటువంటి పరిపక్వత వచ్చినవారు నీకు నమస్కారం చేయకుండా ఎలా ఉంటారు అంటున్నాడు అర్జునుడు. అలాంటివారు నమస్కారం చేయకపోతే ఆశ్చర్యపోవాలి.

భగవంతుని సృష్టి చూసి ఆశ్చర్యపోయేది గొప్ప శాస్త్రజ్ఞులు. ఐన్‌స్టీన్ అంటాడు, 'సృష్టిరహస్యాల లోతులు కొలవలేనివి. మనం వాటిని చూసి మెచ్చుకుని, భగవంతునికి శిరస్సువంచి నమస్కారం చేయటం తప్ప ఏమీ చేయలేము.' నిజానికి సృష్టి రహస్యాలు తెలిసినకొద్దీ, వినయం పెరగటం సహజం.

అందువల్ల మనుష్యులు నీకు నమస్కారం చేయకుండా ఎలా ఉండగలరు అంటున్నాడు అర్జునుడు. సృష్టిలో ఎన్ని అద్భుతాలు ఉన్నాయో తెలిసినకొద్దీ భగవంతునిమీద భక్తి పెరిగిపోతుంది. విశ్వరూపదర్శనం చేసుకున్నాక ఏదైనా చదవండి – పెద్ద నక్షత్రాలను చూడండి, చిన్న క్రిమికీటకాలను చూడండి, డిస్కవరీ ఛానెల్ చూడండి, నేషనల్ జియాగ్రఫీ చూడండి – ఏది చూసినా ఆశ్చర్యపడకపోతే ఆశ్చర్యపోవాలి. మీరు భక్తులు కూడా అయితే, ఆ ఆశ్చర్యం భక్తిగా మారుతుంది. అందువల్ల భగవంతునికి నమస్కారం చేయకపోతే అది అతని సంకుచిత మనస్సును సూచిస్తుంది. అటువంటి వ్యక్తిని చూసి మనం జాలిపడాలి. ఎందుకంటే అతను చాలా అద్భుతమైనదాన్ని అనుభవించలేకపోతున్నాడు.

ఒక పిల్లవాడు సంగీతాన్ని ఆస్వాదించలేకపోతే అతను ఒక అద్భుతప్రపంచాన్ని అనుభవించలేకపోతున్నట్టు అర్థం. అలాగే ఒక నాస్తికుడు సృష్టిని అర్థం చేసుకోలేకపోతేనూ, శాస్త్రాన్ని అర్థం చేసుకోలేకపోతేనూ, అతనిమీద కోపం తెచ్చుకునేకన్నా, అతనిమీద జాలిపడాలి. అతను ఒక అద్భుతాన్ని అనుభవించలేకపోతున్నాడు అనుకోవాలి.

**సాహిత్య సంగీతకళావిహీనః సాక్షాత్ పశుః పుచ్ఛవిషాణహీనః ।**
**తృణం న ఖాదన్నపి జీవమానస్తద్భాగధేయం పరమం పశూనామ్ ॥**

సాహిత్యాన్ని, సంగీతాన్ని ఆస్వాదించే సూక్ష్మబుద్ధి లేనివ్యక్తి సాక్షాత్తూ పశువుతో సమానం. పశువుకు అతనికి మధ్య ఉన్న భేదం ఏమిటి?

**పుచ్ఛవిషాణహీనః** – తోక, కొమ్ములు మాత్రం ఉండవంతే.

**తృణం న ఖాదన్నపి** – ఆవులాగా గడ్డి మేయడు.

**తద్భాగధేయం పరమం పశూనామ్** – అటువంటి వ్యక్తి మహాపశువు.

ఒక వ్యక్తి సంగీతాన్ని ఆస్వాదించలేకపోతే, సంగీతం లేనట్టా? సంగీతం ఉంది, కాని అతనికి రసహృదయం లేదు. అలాగే ఎవరైనా భగవంతుడు లేడు అంటే నిజంగా భగవంతుడు లేనట్టా? విశ్వరూపదర్శనం చేసుకునేశక్తి అతనికి లేనట్టు అర్థం. ఈ నేపథ్యంతో ఈ శ్లోకాన్ని చూద్దాము.

**కస్మాచ్చ తే న నమేరన్** – వారు నీకు నమస్కరించకుండా ఎలా ఉండగలరు?

**గరీయసే బ్రహ్మణోప్యాదికర్త్రే** – ఓ దేవా, నువ్వు సర్వశ్రేష్ఠుడవు. నువ్వు సృష్టికర్త అయిన బ్రహ్మను కూడా సృష్టించావు. పురాణాల్లో బ్రహ్మ విష్ణుమూర్తి నాభినుంచి వచ్చాడని వింటాము. వేదాంతంలో ఈశ్వరుడు సమష్టి కారణశరీరం; బ్రహ్మదేవుడు సమష్టి సూక్ష్మశరీరం. బ్రహ్మ అంటే సత్యం, జ్ఞానం, అనంతం కాదు, బ్రహ్మ అంటే చతుర్ముఖ బ్రహ్మ.

**అనంత** – నువ్వు అనంతం. ఎందుకంటే దేశకాలాలు కూడా నీలో ఉన్నాయి. నువ్వు దేశకాలాలలో లేవు. నువ్వు దేశకాలాతీతుడవు.

**దేవేశ** – దేవతలకు దేవుడవు;

జగన్నివాస – జగత్తుకు ఆధారం. నువ్వు జగత్తులో లేవు, జగత్తే నీలో ఉంది.

**త్వమక్షరం సదసత్ తత్పరం యత్** – నువ్వే కారణానివి, నువ్వే కార్యానివి కూడా. నువ్వు రెండింటికీ అతీతుడవు కూడా. నువ్వు కార్యకారణ విలక్షణుడివి.

శ్లో. 38 **త్వమాదిదేవః పురుషః పురాణః త్వమస్య విశ్వస్య పరం నిధానమ్ ।**
**వేత్తాసి వేద్యం చ పరం చ ధామ త్వయా తతం విశ్వమనంతరూప ॥**
త్వమ్, ఆదిదేవః, పురుషః, పురాణః, త్వమ్, అస్య, విశ్వస్య, పరమ్, నిధానమ్,
వేత్తా, అసి, వేద్యమ్, చ, పరమ్, చ, ధామ, త్వయా, తతమ్, విశ్వమ్, అనంతరూప ॥

| | | | |
|---|---|---|---|
| అనంతరూప! | = ఓ అనంతరూపా! | పరమ్, నిధానమ్ | = పరమాశ్రయుడవు |
| త్వమ్ | = నీవు | వేత్తా, చ | = సర్వజ్ఞుడవు |
| ఆదిదేవః | = ఆదిదేవుడవు | వేద్యమ్, చ | = సర్వవేద్యుడవు |
| పురాణః, పురుషః | = సనాతన పురుషుడవు | పరమ్, ధామ, అసి | = పరంధాముడవు |
| త్వమ్ | = నీవు | త్వయా | = నీచేత |
| అస్య | = ఈ | విశ్వమ్ | = జగత్తు |
| విశ్వస్య | = జగత్తునకు | తతమ్ | = పరిపూర్ణమైయున్నది |

**త్వమ్ ఆదిదేవః, పురాణః పురుషః, త్వమ్ అస్య విశ్వస్య పరమ్ నిధానమ్, (త్వమ్) వేత్తా చ వేద్యమ్ పరమ్ ధామ చాసి, హే అనన్త-రూప! త్వయా విశ్వమ్ తతమ్ ।**

తా: ఓ అనంతరూపా! నీవు ఆదిదేవుడవు, సనాతన పురుషుడవు. నీవు ఈ జగత్తునకు పరమాశ్రయుడవు, సర్వజ్ఞుడవు, సర్వవేద్యుడవు, పరంధాముడవు. నీచేత జగత్తు పరిపూర్ణమైయున్నది.

అర్జునుని దృష్టిలో కృష్ణపరమాత్మ అంతకంతకూ ఎదిగిపోతున్నాడు. భగవంతుడు ఎప్పుడూ అనంతుడే, కాని అర్జునునికి ఇప్పుడిప్పుడే భగవంతుని గొప్పదనం అర్థమవుతున్నది. అర్థమయినకొద్దీ అతనిలో ఆరాధనా భావన పెరిగిపోతున్నది.

మనం చేసేది కూడా అదే. మన పెద్దవారు నేర్పించారు కాబట్టి భగవంతునికి యాంత్రికంగా నమస్కారం చేస్తాము. కాని భగవంతునియొక్క గొప్పతనం లోతులు కొలిచినకొద్దీ, ఆ నమస్కారంలో ఆర్తి, ఆరాధన, భక్తి పెరుగుతూ వస్తాయి. భగవంతుడు కర్మఫలదాత; అది అర్థం చేసుకుని నమస్కారం చేస్తే ఆయన ఇచ్చే కర్మఫలాన్ని మనము ప్రశ్నించము అని అర్థం. బుద్ధిలో మాటను చేతలతో చూపుతాము. ఇక్కడ అర్జునుడు తన భక్తిని మాటలతో కొలుస్తున్నాడు.

**త్వమాదిదేవః** – ఓ భగవాన్, నువ్వు ఆదిదేవుడవు అంటున్నాడు అర్జునుడు. అంటే దేవతలకన్నా ముందు ఉన్నాడు. బ్రహ్మను విష్ణుమూర్తి సృష్టించాడని పురాణాల్లో వింటాము, ఈశ్వరుడు కారణచైతన్యం, బ్రహ్మ కార్యం అని ఇంతకుముందు శ్లోకంలో చూశాము. అందువల్ల భగవంతుడు ఆదిదేవుడు.

**పురుషః** – నువ్వు సర్వాంతర్యామివి. అందరిలో ఉన్నావు. పురుష పదానికి రెండు అర్థాలున్నాయి. అవి –

**పూరయతి సర్వం ఇతి పురుషః – అంతటా ఉండేవాడు**
**పురేషేతి ఇతి పురుషః – శరీరంలో ఉండేవాడు**

**పురాణః** – నువ్వు సనాతనుడవు. నీకు ఆది లేదు.

**త్వమస్య విశ్వస్య పరం నిధానమ్** – నువ్వు లయస్థానం; జగత్తు మొత్తం నీలో లయమవుతుంది. సృష్టి జరిగినప్పుడు పంచభూతాలు ఒకదానినుంచి ఒకటి వచ్చాయని శాస్త్రం చెబుతుంది. ఆ బ్రహ్మనుంచి ఆకాశం, ఆకాశంనుంచి

వాయువు, వాయువునుంచి అగ్ని, అగ్నినుంచి జలం, జలంనుంచి పృథివీ వచ్చాయి. లయ సమయంలో వెనకనుంచి లయం జరుగుతూ వస్తుంది. అంటే పృథివీ జలంలో లయమవుతుంది. జలం అగ్నిలో, అగ్ని వాయువులో, వాయువు ఆకాశంలో, ఆకాశం బ్రహ్మలో లయమవుతాయి. బ్రహ్మ దేనిలోనూ లయమవడు. బ్రహ్మలో అన్నీ లయమవుతాయి. అందువల్ల పరం నిధానమ్ అన్నాడు అర్జునుడు.

**వేత్తాసి వేద్యం చ** – నువ్వే భోక్తవు, భోగ్యవస్తువు కూడా. వేత్తా అంటే భోక్తజీవి; వేద్యం అంటే అనుభవించే వస్తువు. అంటే ఒకటి ప్రమాతా, ఇంకొకటి ప్రమేయం; ఒకటి వేత్తా, ఇంకొకటి వేద్యం; ఒకటి సబ్జెక్టు, ఇంకొకటి ఆబ్జెక్టు; ఒకటి చైతన్యం, ఇంకొకటి జడం. నిజానికి ఈ జగత్తు మొత్తం చేతన–అచేతనల సముదాయం. అర్జునుడు, ఓ కృష్ణా నువ్వే చేతనతత్త్వానివి, అచేతనతత్త్వానివి కూడా అంటున్నాడు.

**పరం చ ధామ** – అంతేకాదు, నువ్వు భోక్త, భోగ్యాలకు అతీతుడవు అంటున్నాడు. భగవంతుడు అనుభవించే ప్రమాత కాదు, అనుభవించబడే ప్రమేయం కాదు.

**ప్రమాతృ ప్రమేయ అతీతః త్వమేవ**

అంటే నువ్వు నిర్గుణబ్రహ్మవు. ప్రమాతృ, ప్రమేయ విభజన ఉండదు. భోక్త, భోగ్యవస్తువు అనే విభజన ఉండదు.

మాండూక్యోపనిషత్తులో ఈ భావనను వివరంగా చూస్తాము. వేత్తా అంటే ప్రమాతా అన్నాము. ప్రమాతకు మూడు స్థాయిల్లో మూడు పేర్లు ఉంటాయి. జాగ్రత్‌పురుషుణ్ణి విశ్వ అనీ, స్వప్నపురుషుణ్ణి తైజస అనీ, సుషుప్తపురుషుణ్ణి (సుషుప్తి కాలంలో) ప్రాజ్ఞ అనీ అంటారు. వ్యష్టిపరంగా స్థూల, సూక్ష్మ, కారణశరీరాలకు ప్రతిబింబచైతన్యాలు ఈ మూడు – విశ్వ, తైజస, ప్రాజ్ఞ. సమష్టిపరంగా ప్రతిబింబచైతన్యాలు మూడు. అవి విరాట్, హిరణ్యగర్భ, ఈశ్వరుడు. సమష్టిస్థూలప్రపంచ ప్రతిబింబచైతన్యం విరాట్; సమష్టిసూక్ష్మప్రపంచ ప్రతిబింబచైతన్యం హిరణ్యగర్భ (బ్రహ్మ); సమష్టికారణప్రపంచ ప్రతిబింబచైతన్యం ఈశ్వరుడు.

వీటన్నిటికీ అతీతంగా ఉన్నది బింబచైతన్యం, నిర్గుణబ్రహ్మ, తురీయం. ఇవన్నీ పర్యాయపదాలు. నువ్వు పరం చ ధామం అంటే నువ్వు తురీయచైతన్యానివి. నువ్వు ప్రమాతృప్రమేయాలకు అధిష్ఠానదేవతవు. ఒక్కముక్కలో చెప్పాలంటే –

**త్వయా తతం విశ్వమనంతరూప** – నువ్వు తురీయానివి; నీలోనే మొత్తం ప్రపంచం ఉంది. నువ్వే ప్రపంచానికి అధిష్ఠానదేవతవు. ఇదంతా మాండూక్యోపనిషత్తులో వస్తుంది. అంత లోతుల్లోకి వెళ్ళలేకపోయినా, నువ్వే సగుణబ్రహ్మవు, నువ్వే నిర్గుణబ్రహ్మవు అని అర్థం చేసుకుంటే చాలు. వేత్తా, వేద్యం వ్యావహారిక సత్యాన్ని సూచిస్తే; పరం పారమార్థిక సత్యాన్ని సూచిస్తుంది. నువ్వే వ్యావహారిక సత్యమైన సగుణబ్రహ్మవు; నువ్వే పారమార్థిక సత్యమైన నిర్గుణబ్రహ్మవు. నువ్వు అనంతరూపుడవు. నువ్వు విశ్వరూప ఈశ్వరుడవు అంటున్నాడు అర్జునుడు.

శ్లో. 39 **వాయుర్యమోఽగ్నిర్వరుణ శ్శశాంకః ప్రజాపతిస్త్వం ప్రపితామహశ్చ ।**
**నమో నమస్తేఽస్తు సహస్రకృత్వః పునశ్చ భూయోఽపి నమో నమస్తే ॥**
వాయుః, యమః, అగ్నిః, వరుణః, శశాంకః, ప్రజాపతిః, త్వమ్, ప్రపితామహః, చ,
నమః, నమః, తే, అస్తు, సహస్రకృత్వః, పునః, చ, భూయః అపి, నమః, నమః, తే ॥

| | | | |
|---|---|---|---|
| త్వమ్ | = నీవు | తే | = నీకు |
| వాయుః | = వాయుదేవుడవు | సహస్రకృత్వః | = వేలకొలది |
| యమః | = యముడవు | నమః, నమః అస్తు | = వందనములు |
| అగ్నిః | = అగ్నివి | తే | = నీకు |
| వరుణః | = వరుణుడవు | భూయః, అపి | = మరి |
| శశాంకః | = చంద్రుడవు | పునః, చ | = ఇంకనూ |
| ప్రజాపతిః | = ప్రజాపతియైన బ్రహ్మవు | నమః, నమః | = నమస్కారములు |
| ప్రపితామహః, చ | = బ్రహ్మకును జనకుడవు | | |

**త్వమ్ వాయుః యమః అగ్నిః వరుణః శశాఙ్కః ప్రజాపతిః చ ప్రపితామహః (అసి)**
**తే సహస్ర-కృత్వః, నమః నమః, పునః చ భూయః అపి తే నమః నమః అస్తు ।**

తా: నీవు వాయుదేవుడవు, యముడవు, అగ్నివి, వరుణుడవు, చంద్రుడవు, ప్రజాపతియైన బ్రహ్మవు, బ్రహ్మకును జనకుడవు. నీకు వేలకొలది వందనములు. నీకు మరి ఇంకనూ నమస్కారములు.

ఈ శ్లోకం సారాంశాన్ని ఒక్కముక్కలో చెప్పాలంటే నువ్వే అన్నీ.

**వాయుర్యమోఽగ్నిర్వరుణ శ్శశాంకః** – నువ్వే వాయుదేవతవు, యముడవు, అగ్నివి, వరుణుడివి, చంద్రుడివి. యముడు అంటే కాలతత్త్వం; అగ్ని అంటే అగ్నితత్త్వం. ఇలా ఎందుకు చెబుతున్నాడో అర్థం చేసుకోవటానికి ఒకసారి మనం ఏడవ అధ్యాయానికి వెళ్ళాలి.

భగవంతుడు కారణమనీ, ఈ జగత్తంతా కార్యమనీ చూశాము ఏడవ అధ్యాయంలో. ప్రాథమిక సూత్రం – కారణమే అనేక కార్యాలుగా ప్రకటితమవుతుంది. అంటే ఒక కారణమే భిన్ననామరూపాలతో కనిపిస్తుంది. ఒక్క బంగారమే అనేక ఆభరణాలుగా ఏర్పడుతుంది. బంగారానికి భిన్నంగా ఆభరణాలు లేవు. అలాగే నీటికి భిన్నంగా అల కాని, సముద్రం కాని లేదు. భగవంతుడే ఆకాశం, అగ్ని, వాయువు, నీరు, పృథివీ రూపంలో ఉన్నాడు.

**తత్ అనన్యత్వం ఆరంభణ శబ్దాదిభ్యః** – బ్రహ్మసూత్రాలు

ఇది బ్రహ్మసూత్రాల్లో శక్తివంతమైన న్యాయం. దీన్ని ఆరంభణాధికరణ న్యాయం అంటారు. దీని అర్థం కారణానికి భిన్నంగా కార్యం లేదు. ఇంకో విధంగా చెప్పాలంటే కారణమే అనేక కార్యాలుగా వ్యక్తమవుతుంది.

అర్జునుడు ఈ సూత్రాన్ని ఉపయోగించి చెప్పాడు, 'ఓ కృష్ణా, నువ్వే వాయువు, యముడు, అగ్ని, వరుణుడు, చంద్రుని రూపాలలో ప్రకటితమవుతున్నావు.' ఇంకా ఉన్నాయి –

**ప్రజాపతిః** – ప్రజాపతులు పద్నాలుగురు ఉన్నారు. వారు సంతతిని పెంపొందించాలి. ఉదాహరణకు కశ్యప ప్రజాపతి, దక్ష ప్రజాపతి. విష్ణుమూర్తి బ్రహ్మదేవుణ్ణి సృష్టిస్తే, బ్రహ్మ ఈ ప్రజాపతులను సృష్టించాడు. వారినుంచి మనుష్యులు వచ్చారు. వారు కూడా నువ్వే అంటున్నాడు అర్జునుడు.

**(పితామహః)** – ప్రజాపతులకు పితామహుడు బ్రహ్మ. బ్రహ్మ గురించి శ్లోకంలో రాలేదు, మనం కలుపుకున్నాము. పద్నాలుగు ప్రజాపతులూ నువ్వే, ఒక బ్రహ్మవూ నువ్వే.

**ప్రపితామహశ్చ** – విష్ణుమూర్తి పితామహునికి పితామహుడు. విష్ణుమూర్తి కూడా నువ్వే.

**నమో నమస్తేఽస్తు** – నీకు నా నమస్కారాలు. ఎన్నిసార్లు?

**సహస్రకృత్వః** – వేలాదిసార్లు నీకు నా నమస్కారాలు. అయినా తృప్తి తీరటంలేదు.

**పునశ్చ భూయోఽపి నమో నమస్తే** – పదేపదే నీకు నమస్కారాలు.

శ్లో. 40 **నమః పురస్తాదథ పృష్ఠతస్తే నమోఽస్తు తే సర్వత ఏవ సర్వ ।**
**అనంతవీర్యామితవిక్రమస్త్వం సర్వం సమాప్నోషి తతోఽసి సర్వః ॥**
నమః, పురస్తాత్, అథ, పృష్ఠతః, తే, నమః, అస్తు, తే, సర్వతః, ఏవ, సర్వ,
అనంతవీర్య, అమితవిక్రమః, త్వమ్, సర్వమ్, సమాప్నోషి, తతః అసి, సర్వః ॥

| | | | |
|---|---|---|---|
| అనంతవీర్య! | = అనంతమైన సామర్థ్యము గలవాడా! | అమితవిక్రమః | = అపరిమితమైన పరాక్రమము గలవాడవైన |
| తే | = నీకు | త్వమ్ | = నీవు |
| పురస్తాత్ | = ముందునుంచి | సర్వమ్ | = జగత్తునందంతటను |
| అథ | = ఇంకా | సమాప్నోషి | = వ్యాపించియున్నవాడవు |
| పృష్ఠతః | = వెనుకనుంచి | తతః | = ఈవిధముగా నీవే |
| నమః | = నమస్కారములు | సర్వః, అసి | = సర్వరూపుడవు |
| సర్వ! | = సర్వాత్మా! | | అన్నివైపులనుండియు |
| తే | = నీకు | | |
| సర్వతః, ఏవ | = అన్ని వైపులనుంచి | | |
| నమః అస్తు | = నమస్కారము(లు) | | |

**హే సర్వ! తే పురస్తాత్ నమః, అథ తే పృష్ఠతః నమః, (తే) సర్వతః ఏవ (నమః అస్తు),**

**హే అనన్త–వీర్య! త్వమ్–అమిత–విక్రమః సర్వమ్ సమాప్నోషి తతః సర్వః అసి ।**

తా: అనంతమైన సామర్థ్యము గలవాడా! నీకు ముందునుంచి ఇంకా వెనుకనుంచి నమస్కారములు. సర్వాత్మా! నీకు అన్నివైపులనుంచి నమస్కారము(లు). అపరిమితమైన పరాక్రమము గలవాడవైన నీవు జగత్తునందంతటా వ్యాపించియున్నవాడవు. ఈ విధముగా నీవే సర్వరూపుడవు.

వేలకొలదీ నమస్కారాలు, పదేపదే చేసినా కూడా తనివి తీరటం లేదు అర్జునునికి. ఇందులో కూడా ఇంకా నమస్కారాలు పెడుతున్నాడు. నీకు ముందునుంచి, వెనకనుంచి, కుడిపక్కనుంచి, ఎడమపక్కనుంచి నమస్కారాలు అంటున్నాడు.

**పురస్తాత్ తే నమః** – నీకు ముందునుంచి; **పృష్ఠతః** – వెనకనుంచి నమస్కరిస్తున్నాను అంటున్నాడు అర్జునుడు. నిజానికి పరమాత్మకు ముందు, వెనకలు లేవు. విశ్వమంతా సర్వవ్యాపకంగా ఉన్నాడు. తూర్పు, పడమర అంటూ దిక్కులన్నీ చెప్పకుండా ఏకంగా కలిపి చెబుతున్నాడు.

**నమోఽస్తుతే సర్వత ఏవ సర్వ** – నీకు అన్నివైపులనుంచి నమస్కారాలు అంటున్నాడు. అంటే ఒక రూపానికి పెట్టటం లేదు నమస్కారం. సర్వవ్యాపకుడైన పరమాత్మకు పెడుతున్నాడు. అందువల్లనే మనకు పంచభూత లింగాలు ఉన్నాయి. వాయులింగం అనీ, ఆకాశలింగం అనీ పూజలు చేస్తాము. అంటే పంచభూతాలలో ఉన్నది కూడా భగవంతుడే.

**అనంతవీర్యామితవిక్రమస్త్వమ్** – నీకు అనంతమైన శక్తి ఉంది. భగవంతుడు సర్వాంతర్యామి కాబట్టి, అన్ని శక్తులూ ఆయనకే చెందుతాయి. ఒకసారి మెరిసిన మెరుపులోనే ఎంతో శక్తి ఉంది. అందులోని విద్యుచ్ఛక్తిని మనం పట్టుకోగలిగితే ఒక పట్టణానికి ఒక ఏడాదికి సరిపోయేటంత విద్యుచ్ఛక్తి అందుతుంది. కాని మన దగ్గర అంత సాంకేతిక పరికరాలు లేవు. అలాంటి మెరుపులు ప్రపంచమంతటా ఎన్నిచోట్ల, ఎన్నిసార్లు మెరుస్తూ ఉంటాయి? ఈ మెరుపులు ఎవరి శక్తి? భగవంతునివే. అందువల్లనే ఆయనను అనంతవీర్యుడు అన్నాడు.

అమితవిక్రముడు కూడా. కొంతమందికి ధైర్యం ఉంటుంది కాని హోదా ఉండదు; కొంతమందికి హోదా ఉంటుంది కాని ధైర్యం ఉండదు. భగవంతునికి రెండూ ఉన్నాయి. అనంతవీర్యుడు, అమితవిక్రముడు కూడా.

**సర్వం సమాప్నోషి** – నువ్వు అంతటా వ్యాపించివున్నావు.

ప్రయాణం చేసి భగవంతుణ్ణి చేరాలి అనే అపోహను ఈ వాక్యం తొలగిస్తుంది. భగవంతుడు సర్వవ్యాపకుడు కాబట్టి ఆయనను ఎక్కడికో వెళ్ళి చేరుకునే ప్రసక్తి లేదు. మామూలుగా మనం ఎవరైనా మరణిస్తే అతను విష్ణుపథం పొందాడనో, శివపథం పొందాడనో అంటాము. అంటే అతను మరణించాక, అతని ఆత్మ ప్రయాణించి విష్ణులోకమో, శివలోకమో చేరుకుంటుందని అంటాము. ఆ అపోహను తొలగించుకోవాలి. భగవంతుడు మనకు దూరంగా ఎక్కడో లేడు.

అయితే శాస్త్రం ఎందుకు భగవంతుణ్ణి చేరుకోవాలని అంటుంది? భగవంతుణ్ణి చేరుకోవాలి అంటే భగవంతుడు ఎక్కడో ఉన్నాడు, అక్కడికి చేరుకోవాలి అనే అపోహను వదిలివేయాలి. విశ్వరూపదర్శనం అయితే మన పుట్టుక, మన జీవితం, మన మరణం అంతా భగవంతుని ఒడిలోనే అవుతుంది. భగవంతుడు ఎక్కడో ఉన్నాడనేది

అపోహ. దేశపరంగా దూరంగా లేదు; కాలపరంగా దూరంగా లేదు. ఒక పిల్లవాడు పెద్దవాడు అవ్వాలంటే కాలపరంగా దూరం ఉంది. కాని భగవంతుని విషయంలో ఎటువంటి దూరమూ లేదు. ఇలాగే భక్తిలో కొనసాగితే, ఎప్పుడో ఒకప్పుడు భగవంతుని దర్శనం అవుతుందనే అజ్ఞానం తొలగిపోతుంది. భగవంతుడు– సర్వం; సమాప్నోషి – సర్వవ్యాపకుడు.

**తతోఽసి సర్వః** – అందువల్ల సర్వమూ నువ్వే. ముందేమో నువ్వు సర్వవ్యాపకుడివి అన్నాడు. ఇప్పుడు సర్వమూ నువ్వే అంటున్నాడు. ఇవి రెండు భిన్నవాక్యాలు. బంగారం పరంగా చూస్తే అర్థమవుతుంది.

1. ఆభరణాలన్నింటిలోనూ బంగారం ఉంది
2. బంగారమే ఆభరణాల రూపంలో ఉంది

ఇదే సూత్రాన్ని భగవంతునికి అన్వయించి చూద్దాము

1. జగత్తు అంతటా భగవంతుడు ఉన్నాడు
2. భగవంతుడే జగత్తు రూపంలో ఉన్నాడు

ఇక్కడ భగవంతుడు చెప్పిన వాక్యం – **కాలోఽస్మి** గుర్తుకు తెచ్చుకోవాలి. నేను కాలతత్త్వాన్ని అన్నాడు. కాలంలో, దేశం కూడా కలుపుకోవాలి. కాలం, దేశం భగవంతునికి భిన్నంగా లేవు. ఎప్పుడైతే దేశకాలాలను కూడా ఈశ్వరునిగా భావిస్తామో, అప్పుడు దేశకాలాల్లో ఉన్నవన్నీ ఈశ్వరుడే అవ్వాలి. ఎందుకంటే జగత్తుకు దేశకాలాలకు భిన్నంగా ఉనికి లేదు. సృష్టినుంచి దేశకాలాలను విడదీయలేము.

భగవంతుడు సృష్టి చేశాడు అంటే భగవంతుడు జగత్తును, కాలాన్ని, దేశాన్ని కూడా సృష్టి చేశాడు అని అర్థం. భగవంతుడు ఎప్పుడు సృష్టి చేశాడు? అంతకు ముందు దేశం ఎక్కడ ఉంది? కార్యకారణ సిద్ధాంతానికి కారణం ఏమిటి? వీటికి జవాబులు మాండూక్యోపనిషత్తులో వస్తాయి. ఇక్కడ మనం భగవంతుడే దేశం, కాలం, వస్తువులు అని అర్థం చేసుకుంటే చాలు. భగవంతుడే దేశం, కాలం, వస్తువులు అంటే, భగవంతుడే సంఘటనలు కూడా అవుతాడు. గీతాబోధ వస్తువు కాదు, సంఘటన. దేశం, కాలంలో సంఘటనలు వస్తాయి. సంఘటనను సంభవః అంటారు.

అంతేకాదు, భగవంతుడు నియమః కూడా. అంటే నియంత్రించేవాడు. ఒక సంఘటన జరిగిందంటే, ఒక నియమంవల్ల జరుగుతుంది. కాఫీ తయారు చేసుకోవటానికి నీరును మరిగిస్తే, నీరు $100^0$ సెం॥ దగ్గర మరుగుతుంది. అది నియమం. స్వచ్ఛమైన నీరు $100^0$ సెం॥ దగ్గర మరుగుతుందనేది ఒక ప్రకృతినియమం. అది మారదు. అలా ఎన్నో నియమాలు ఉన్నాయి. అవన్నీ కూడా సృష్టిలో ఒక భాగం. ఈ నియమాలు సృష్టి అనే సంగీతకచేరిని శ్రుతి చేస్తుంది.

**భగవంతుడు దేశకాల వస్తువు సంభవః, నియమః**

భగవంతుడు అన్నింటినీ సృష్టించాడు అని మొదలుపెట్టి, భగవంతుడే అన్నీ అంటున్నాము. అంటే మనం ఏ అనుభవం పొందినా కూడా, భగవంతుని అనుభవమే పొందుతున్నాము. భగవద్దర్శనం నాకు అవుతుందా

అని అడుగుతుంటారు చాలామంది. భగవద్గీత ఆ ప్రశ్నే అర్థం లేనిది అంటుంది. ప్రతినిమిషమూ భగవద్దర్శనం అవుతూనే ఉంది, కాకపోతే అది మీకు తెలియటం లేదు అంటుంది.

అంటే మన సమస్య ఈశ్వరదర్శనం కాదు. ప్రతినిమిషమూ ఈశ్వరదర్శనం అవుతూనే ఉంది. ఈశ్వరదర్శనం కోరితే మనం అధమభక్తులం అవుతాము. ఈశ్వరుడు దేశ, కాల, వస్తు, సంభవః, నియమః. ఈ విషయం తెలిస్తే మధ్యమభక్తులం అవుతాము. జీవ-ఈశ్వర ఐక్యం అర్థమయితే ఉత్తమభక్తులం అవుతాము. ఈ అధ్యాయంలో మనం మధ్యమభక్తిదశలో ఉన్నాము.

ఇప్పటికి మనం చూస్తున్నది విశ్వరూపదర్శనం అని అర్థం చేసుకుంటే చాలు. విశ్వరూపభక్తుడు ప్రకృతిని ఆరాధిస్తాడు; కాని ప్రకృతిని కేవలం ప్రకృతిగా కాకుండా, భగవంతునిగా చూస్తాడు. అర్జునుడు కూడా అంతటా భగవంతుణ్ణి చూస్తున్నాడు. అందువల్ల నీకు అన్నివైపులనుంచి నమస్కారాలు అంటున్నాడు.

**విశ్వతశ్చక్షురుత విశ్వతోముఖో విశ్వతోబాహుః ఉత విశ్వతస్పాత్**

**సం బాహుభ్యాం నమతి సంపతత్రైర్ద్యావాపృథివీ జనయన్దేవ ఏకస్తన్మే మనః శివ సంకల్పమస్తు –**

శివసంకల్పం 26

ఈ శివసంకల్ప మంత్రం మహాన్యాసంలో వస్తుంది. దీన్ని సాధారణంగా ఏకాదశరుద్రాభిషేకం చేసేటప్పుడు పఠిస్తారు. నాకు మంగళకరమైన ఆలోచన కలుగుగాక! అన్ని కళ్ళు, కాళ్ళు, మొహాలు – అన్నీ భగవంతునివే అని వర్ణిస్తాడు. అంతేకాదు నీరు, పృథివీ అంతా కూడా భగవంతుడే.

నీరును ఎన్నడూ చిన్నచూపు చూడకూడదు. నీటిలోకి ఉమ్మకూడదు, వివస్త్రగా నీటిలో స్నానం చేయకూడదు అంటుంది శాస్త్రం. అంతేకాదు వాన కురిసినా, పరుగులు పెట్టద్దు అంటుంది. దానికి రెండు అర్థాలు చెప్పవచ్చు. వర్షం కురుస్తున్నప్పుడు నేలంతా తడిగా ఉంటుంది. అప్పుడు పరుగులు తీస్తే, జారిపడే ప్రమాదముంది. ఇది ఒక అర్థం. రెండవ అర్థం – వర్షం కూడా భగవానుడే. వర్షంనుంచి పారిపోతుంటే, భగవంతునినుంచి పారిపోతున్నామన్నమాట. **వర్షతి న ధావేత్** – వర్షంనుంచి పారిపోకు అని సూర్యనమస్కారంలో వస్తుంది.

అందువల్ల భగవంతుడు సర్వవ్యాపకుడు, సర్వమూ ఆయనే.

శ్లో. 41 **సఖేతి మత్వా ప్రసభం యదుక్తం హే కృష్ణ! హే యాదవ! హే సఖేతి ।**
**అజానతా మహిమానం తవేదం మయా ప్రమాదాత్ ప్రణయేన వాపి ॥**
సఖా, ఇతి, మత్వా, ప్రసభమ్, యత్, ఉక్తమ్, హే కృష్ణ, హే యాదవ, హే సఖే, ఇతి,
అజానతా, మహిమానమ్, తవ, ఇదమ్, మయా, ప్రమాదాత్, ప్రణయేన, వా, అపి ॥

శ్లో. 42 **యచ్చావహాసార్థమసత్కృతోఽసి విహారశయ్యాసనభోజనేషు ।**
**ఏకోఽథ వాప్యచ్యుత తత్సమక్షం తత్ క్షామయే త్వామహమప్రమేయమ్ ॥**
యత్, చ, అపహాసార్థమ్, అసత్కృతః, అసి, విహారశయ్యాసనభోజనేషు,
ఏకః, అథవా, అపి, అచ్యుత, తత్సమక్షమ్, తత్, క్షామయే, త్వామ్, అహమ్, అప్రమేయమ్ ॥

| | | |
|---|---|---|
| తవ | = | నీయొక్క |
| ఇదమ్ | = | ఈ |
| మహిమానమ్ | = | మహిమను |
| అజానతా | = | తెలియనివాడనైన |
| మయా | = | నేను |
| సఖా, ఇతి | = | మిత్రుడవని |
| మత్వా | = | తలంచి |
| ప్రణయేన, వా | = | చనువుచే గాని |
| ప్రమాదాత్, అపి | = | పొరపాటుగా గాని |
| హే కృష్ణ! | = | ఓ కృష్ణా! |
| హే యాదవ! | = | ఓ యాదవా! |
| హే సఖే, ఇతి | = | ఓ మిత్రమా! అని గాని |
| యత్ | = | ఏది |
| ప్రసభమ్ | = | తొందరపాటుగా |
| ఉక్తం, చ | = | పలుకుట జరిగియుండవచ్చును |
| అచ్యుత! | = | ఓ కృష్ణా! |

| | | |
|---|---|---|
| యత్ | = | ఏది నాద్వారా |
| అవహాసార్థమ్ | = | పరిహాసమునకు గాని |
| విహార, శయ్యా ఆసన భోజనేషు | = | ఆహారవిహారములందు గాని, శయ్యాసనములపై ఉన్నప్పుడు గాని |
| ఏకః | = | ఏకాంతమున గాని |
| అథవా తత్సమక్షమ్ | = | లేక మిత్రుల మధ్యగాని నీవు |
| అపి అసత్కృతః | | కించపరచబడి |
| అసి | = | యుండవచ్చును |
| తత్ | = | ఆ అపరాధములు అన్నింటికిని |
| అప్రమేయమ్ త్వామ్ | = | అప్రమేయస్వరూపుడవైన నిన్ను |
| అహమ్ | = | నేను |
| క్షామయే | = | క్షమింపుమని వేడుకొనుచున్నాను |

**తవ ఇదం మహిమానమ్ అజానతా మయా సఖా ఇతి మత్వా, హే కృష్ణ! హే యాదవ, హే సఖా!**
**ఇతి ప్రమాదాత్ ప్రణయేన వా అపి ప్రసభమ్ యత్ ఉక్తమ్ ।**
**హే అచ్యుత! యత్ చ విహార-శయ్యా-ఆసన-భోజనేషు, అవహాసార్థమ్ ఏకః**
**అథవా తత్ సమక్షమ్ అపి, అసత్ కృతః అసి తత్ అహమ్ అప్రమేయమ్ త్వామ్ క్షామయే ।**

తా: నీయొక్క ఈ మహిమను తెలియనివాడనైన నేను మిత్రుడవని తలంచి చనువుచే గాని, పొరపాటుగా ఓ కృష్ణా! ఓ యాదవా! ఓ మిత్రమా! అని గాని తొందరపాటుగా పలుకుట జరిగి యుండవచ్చును. ఓ కృష్ణా! నాద్వారా పరహాసమునకు గాని, ఆహారవిహారములందు గాని, శయ్యాసనములపై ఉన్నప్పుడు గాని, ఏకాంతమున గాని లేక మిత్రుల మధ్యగాని నీవు కించపరచబడియుండవచ్చును. ఆ అపరాధములు అన్నింటిని అప్రమేయస్వరూపుడవైన నిన్ను నేను క్షమింపుమని వేడుకొనుచున్నాను.

కృష్ణుడు మామూలు మనిషి కాదు, సాక్షాత్తూ భగవంతుడే అని అర్థం చేసుకున్నాడు. అనేకవేల నమస్కారాలు చేశాడు. ముందు, వెనక, అంతటా నువ్వే ఉన్నావు అన్నాడు. ఇప్పుడు ఒకసారి వెనక్కి తిరిగి చూసుకుంటే, అంటే కృష్ణునితో తను గడిపిన రోజులు గుర్తు తెచ్చుకుంటే, అతన్ని భగవంతునిగా ఎన్నడూ చూడలేదనీ, తన స్నేహితునిగానే చూశాడనీ గ్రహించాడు. దానికి చాలా బాధపడుతున్నాడు. కృష్ణపరమాత్మ పట్టించుకోకపోయినా, అర్జునుడు పశ్చాత్తాపభావనతో కృంగిపోతున్నాడు. పరమాత్మను చిన్నచూపు చూసినట్టుగా భావించి క్షమాపణ వేడుకుంటున్నాడు ఈ శ్లోకాల్లో.

**సఖా ఇతి మత్వా** – నిన్ను నేను మామూలు మనిషిగా భావించాను అంటున్నాడు అర్జునుడు. సఖా అంటే స్నేహితుడు; ముఖ్యంగా సమవయస్కుడు. అందువల్ల నిన్ను చనువుగా, అమర్యాదగా పలకరించి ఉండవచ్చు అంటున్నాడు.

**ప్రసభం యదుక్తమ్** – ప్రసభం అంటే తొందరపాటుగా, అగౌరవంగా, అమర్యాదగా నిన్ను నేను పిలిచి ఉండవచ్చు.

**హే కృష్ణ! హే యాదవ! హే సఖేతి** – నిన్ను ఓ కృష్ణా, ఓ యాదవా, ఓ మిత్రమా అని పిలిచాను అంటున్నాడు. సంస్కృతంలో హే అంటే ఏకవచనంతో పిలిచినట్టు వస్తుంది. మనం ఎలాగైతే రారా, పోరా అంటామో ఆ అర్థం వస్తుంది. పేరుని పెట్టి పిలిచేటప్పుడు కూడా మొదటిపేరుతో పిలిస్తే చనువును సూచిస్తుంది. ఆ విధంగా అర్జునుడు కృష్ణపరమాత్మను చాలా చనువుగా పిలిచేవాడు. కాని ఇప్పుడు కృష్ణుణ్ణి పరమాత్మగా అర్థం చేసుకున్నాక, అలా పిలవటం అమర్యాద అని భావిస్తున్నాడు. అందువల్ల నేను అలా కావాలని నిన్ను పిలవలేదు అని క్షమాపణ వేడుతున్నాడు. అలా ఎందుకు చేశాడు?

**తవ ఇదం మహిమానమ్ అజానతా** – కృష్ణపరమాత్మయొక్క మహిమ తెలియక.

ఇక్కడ ఇదం మహిమానం అని ఉంది. నిజానికి వ్యాకరణపరంగా అది సరిపోదు. ఎందుకంటే మహిమానం పుల్లింగం, ఇదం నపుంసకలింగం; రెండూ కలిపి వాడలేము. కాని వ్యాసాచార్యులవారిని తప్పు పట్టేటంత గొప్పవారం కాదు మనము. అందువల్ల దాన్ని ఛాందస ప్రయోగంగా స్వీకరించి, మనం చదువుకునేటప్పుడు ఇమం మహిమానం అని చదువుకోవాలి. నీ అసలు మహిమ తెలియక అలా చనువుగా పిలిచాను అంటున్నాడు అర్జునుడు.

**మయా ప్రమాదాత్** – ఇంకొక కారణం కూడా కావచ్చు. ఏమిటది? అనుకోకుండా, పొరపాటుగా అలా పిలిచి ఉండవచ్చు. నీతో ఉన్న చనువుకొద్దీ ముందు, వెనకలు ఆలోచించి ఉండి ఉండకపోవచ్చు.

నిజం కూడా అంతేకదా! స్నేహితులతో చనువుగా కలిసి మెలిసి తిరిగేటప్పుడు వారిని ఇష్టం వచ్చినట్టు పిలుస్తాము కాని ఆచి తూచి మాట్లాడము కదా. అందువల్ల అనుకోకుండా నిన్ను ఏదైనా అని ఉండవచ్చు అంటున్నాడు అర్జునుడు. అంతేకాదు,

**ప్రణయేన వా అపి** – నీతో నాకున్న చనువు కూడా నన్ను ఆలోచించుకోనిచ్చి ఉండదు. స్నేహితుడిని చనువుగా రారా, పోరా అంటారు కాని గౌరవంగా సంబోధించరు కదా. అందువల్ల ఓ కృష్ణా, నా మాటలను నువ్వు పట్టించుకోవద్దు అని వేడుకుంటున్నాడు.

ఇంకా అర్జునుని క్షమాపణ కొనసాగుతున్నది. అంతేకాదు, నిన్ను అవమానం పాలు కూడా చేసి ఉండి ఉండవచ్చు అంటున్నాడు.

**అవ(ప)హాసార్థమ్** – పరిహాసంకోసం నిన్ను నేను ఏడిపించి ఉండవచ్చు. అపహాసార్థమ్ అన్నా ఇదే అర్థం.

**అసత్కృతః అసి** – నువ్వు చిన్నబుచ్చుకుని ఉండవచ్చు. వారిద్దరూ మంచి స్నేహితులు కాబట్టి ఎప్పుడూ కలిసి మెలిసి ఉండేవారు.

**విహారశయ్యాసనభోజనేషు** – విహార – ఆటపాటల్లో; శయ్యా – పడుకున్నప్పుడు; ఆసన – కూర్చున్నప్పుడు; భోజన – భోజనం చేసేటప్పుడు. ఈ సందర్భాలన్నింటిలోనూ కృష్ణుణ్ణి ఏడిపించి ఉండవచ్చు, అవమానపరచి ఉండవచ్చు.

**ఏకః** – వారిద్దరే ఉన్నప్పుడు కాని; **తత్సమక్షమ్** – తక్కిన మిత్రుల సమక్షంలో కూడా అవమానపరచి ఉండవచ్చు.

**తత్ క్షామయే త్వామహమ్** – నన్ను దయచేసి క్షమించు. నువ్వు నన్ను క్షమిస్తావని నాకు తెలుసు. ఎలా?

**అప్రమేయమ్** – నీకు నువ్వే సాటి. మామూలు మనుష్యులకు క్షమాగుణం ఉండకపోవచ్చు కాని, నువ్వు ప్రత్యేకమైనవాడివి.

శ్లో. 43 **పితాఽసి లోకస్య చరాచరస్య త్వమస్య పూజ్యశ్చ గురుర్గరీయాన్ ।**
**న త్వత్సమోఽస్త్యభ్యధికః కుతోఽన్యో లోకత్రయేఽప్యప్రతిమప్రభావ ॥**
పితా, అసి, లోకస్య, చరాచరస్య, త్వమ్, అస్య, పూజ్యః, చ, గురుః, గరీయాన్,
న, త్వత్సమః, అస్తి, అభ్యధికః, కుతః, అన్యః, లోకత్రయే, అపి, అప్రతిమప్రభావ ॥

| | | | |
|---|---|---|---|
| అప్రతిమప్రభావ! | = సాటిలేని ప్రభావముగలవాడా! | పూజ్యః, అసి | = పూజ్యుడవు |
| త్వమ్ | = నీవు | లోకత్రయే, అపి | = ముల్లోకములందును |
| అస్య, చరాచరస్య | = ఈ చరాచరప్రాణులతో గూడిన | త్వత్సమః | = నీతో సమానుడు |
| లోకస్య | = జగత్తునకు | అన్యః | = ఇంకొకడు |
| పితా | = తండ్రివి | న, అస్తి | = లేదు |
| చ | = ఇంకా | అభ్యధికః | = అధికుడు |
| గరీయాన్ | = సర్వశ్రేష్ఠుడవు | కుతః | = ఎలా ఉండును? |
| గురుః | = గురుడవు | | |

**హే అప్రతిమ-ప్రభావ! త్వమ్ అస్య చర-అచరస్య లోకస్య పితా, గరీయాన్ పూజ్యః గురుః చ అసి, లోక-త్రయే అపి త్వత్ సమః న అస్తి, కుతః, అభ్యధికః అన్యః ।**

తా: సాటిలేని ప్రభావముగలవాడా! నీవు ఈ చరాచరప్రాణులతో గూడిన జగత్తునకు తండ్రివి ఇంకా సర్వశ్రేష్ఠుడవు. గురుడవు, పూజ్యుడవు. ముల్లోకములందును నీతో సమానుడు ఇంకొకడు లేదు. అధికుడు ఎలా ఉండును?

**అస్య చరాచరస్య లోకస్య పితా అసి** – నువ్వు ఈ లోకానికి తండ్రివి. మొత్తం సృష్టికి కారణానివి. తండ్రి అంటే తల్లి కూడా వస్తుంది. శాస్త్రంలో తల్లిదండ్రులు విడదీయరాని జంట. శాస్త్రం ప్రకారం బ్రహ్మ, మాయ ఒకటే. మాయాశక్తితో బ్రహ్మ జగత్తును సృష్టించాడు.

పురాణాల పరంగా చూసినా కూడా త్రిమూర్తులు వారి భార్యలకు ప్రత్యేక స్థానాలు ఇచ్చారు. లక్ష్మీదేవిని తన వక్షస్థలంలో నిలుపుకున్నాడు విష్ణుమూర్తి. లక్ష్మీదేవికి అంత ప్రత్యేకస్థానం ఉంది. అందువల్ల పర్సును కాని, ధనాన్ని కాని ముందుజేబులో పెట్టుకోవాలి, వెనక పెట్టుకోకూడదు.

బ్రహ్మదేవుడు తన నాలికమీద పెట్టుకుంటే, శివుడు తన అర్ధభాగాన్నే ఇచ్చాడు పార్వతికి. అందువల్ల తండ్రి అన్నాకూడా, తల్లికూడా అందులో వస్తుంది. అందువల్ల తండ్రికి నమస్కారం పెడితే తల్లికి కూడా పెట్టినట్టే వస్తుంది.

అస్యలోకస్య అంటే ఈ లోకంయొక్క. ఎటువంటి లోకం? చరాచరస్య – చరాచరప్రపంచంయొక్క. అంటే చేతన, అచేతనప్రపంచం లేదా చైతన్య, జడవస్తువులతో కూడిన ప్రపంచం.

భగవంతుణ్ణి మూడు దశల్లో కొలుస్తాము అని అంతకుముందు కూడా చూశాము.

1. భగవంతుడు జగత్తును సృష్టి చేశాడు – నిమిత్తకారణ ఈశ్వరుడు లేదా ఏకరూప ఈశ్వరుడు.
2. భగవంతుడు తానే జగత్తు అయ్యాడు – ఉపాదానకారణ ఈశ్వరుడు లేదా అనేకరూప ఈశ్వరుడు.
3. భగవంతుడు మార్పు చెందకుండా తానే జగత్తు అయ్యాడు – వివర్త ఉపాదానకారణ ఈశ్వరుడు లేదా అరూప ఈశ్వరుడు.

నువ్వు జగత్తుయొక్క కారణానివి అంటున్నాడు అర్జునుడు. భగవంతుడు సృష్టికర్తే కాదు, ఆదిగురువు కూడా. శివభక్తుడు **సదాశివ సమారంభామ్** అంటే విష్ణుభక్తుడు **నారాయణ సమారంభామ్** అంటాడు. రెండూ ఒకటే. అందువల్ల నువ్వు పూజ్యగురుదేవుడవు.

**త్వమస్య పూజ్యశ్చ** – జగత్తులో ఉన్న అందరూ నిన్ను పూజించాలి.

**మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ**

తల్లిని, తండ్రిని, గురువును దైవంగా కొలిచే సంప్రదాయం మనది. అందువల్ల మనకు ఆ గౌరవం అందుకునే అర్హత ఉన్నా లేకపోయినా, ఆ స్థానాల్లో మనం ఉంటే మన పిల్లలు, మన శిష్యులు మనకు నమస్కారం పెడతారు. వారిని ఆపలేము మనము. అందువల్ల ఆ అర్హత ఉన్నా లేకపోయినా, ఆ నమస్కారాన్ని స్వీకరించి, నిశ్శబ్దంగా ఆ నమస్కారాన్ని భగవంతునికి ధారపోయాలి.

మనను గురువుగా భావించి నమస్కారం పెడితే, సదాశివునికి అందజేయాలి. గురుపరంపరలో ఆయనే ఆదిగురువు. సదాశివ సమారంభామ్.

మనను తల్లిదండ్రులుగా గౌరవించి నమస్కారం పెడితే, దాన్ని జగత్తుయొక్క మాతా, పితలకు అందజేయాలి. ఇటువంటి పూజలు అందుకునేందుకు అర్హత ఒక్కరికే ఉంది. త్వమేవ పూజ్యః. ఇలా భావించగలిగితే, మనకు ఎవరైనా నమస్కారం పెట్టినా, ఏమీ సమస్య ఉండదు. భగవంతునికి ఈ నమస్కారాన్ని అందజేయకపోతే, మనలో అహంభావం తలెత్తవచ్చు. అలా అహంభావం పొడచూపితే, అది మనను ఆధ్యాత్మికంగా ఎదగకుండా చేస్తుంది. అందువల్లనే చాలామంది తమకు నమస్కారాలు పెట్టటాన్ని అంగీకరించరు.

**గరీయాన్** – అంతేకాదు, నువ్వు గురువులలో సర్వశ్రేష్ఠుడవు. ఎందుకు? లౌకికప్రపంచంలో ఎంత గొప్ప గురువులు ఉన్నా కూడా ఒకప్పుడు వారు కూడా శిష్యులే. శంకరాచార్యులవారిని గొప్ప గురువుగా కీర్తిస్తాము, కాని ఆయనా ఒకప్పుడు శిష్యుడే. అలాగే గోవిందభగవత్పాదులు గొప్ప గురువు, కాని ఆయన కూడా ఒకప్పుడు శిష్యుడు. అలా ఇక్కడ మనకు తెలిసిన గురువులందరూ ఒకప్పుడు శిష్యులే. ఒక్క భగవంతుడే ఎవరి దగ్గరా శిష్యరికం చేయలేదు. ఆయన ఆదిగురువు; గురుతమః.

**న త్వత్సమోఽస్త్యభ్యధికః కుతోఽన్యః** – ఈ పాదాన్ని సరిగ్గా విడదీయాలి. త్వత్సమః న అస్తి అంటే నీతో సమానంగా ఎవరూ లేరు. నీకు నువ్వే సాటి. ఎవరూ నీతో సరితూగలేరు. నువ్వు పరిపూర్ణుడవు.

కుతః అభ్యధికః అన్యః – నీతో సమానంగా ఎవరూ లేరు అంటే నిన్ను మించిన వారు ఉండే అవకాశం ఎక్కడ ఉంటుంది?

**లోకత్రయే అపి అప్రతిమః** – మూడు లోకాలలోనూ నీతో సరితూగగలవాడు లేడు. ప్రతిమ అంటే ఉపమానం లేదా పోలిక; అప్రతిమః అంటే పోలిక లేనివాడు. అంతేకాదు,

**ప్రభావ** – ప్రభావ అంటే కీర్తి. నువ్వు సాటిలేని కీర్తి గలవాడవు. అప్రతిమః ప్రభావః యస్యసః – ఇది బహువ్రీహి సమాసం. సాటిలేని కీర్తి గలవాడు. ఇది సంబోధన ప్రథమా విభక్తి. అంటే ఓ సాటిలేని కీర్తి గలవాడా అని కృష్ణపరమాత్మను అర్జునుడు సంబోధించి ఈ విషయాలు చెప్పుకొచ్చాడు.

శ్లో. 44 **తస్మాత్ ప్రణమ్య ప్రణిధాయ కాయం ప్రసాదయే త్వామహమీశమీడ్యమ్ ।**
**పితేవ పుత్రస్య సఖేవ సఖ్యుః ప్రియః ప్రియాయార్హసి దేవ సోఢుమ్ ॥**

తస్మాత్, ప్రణమ్య, ప్రణిధాయ, కాయమ్, ప్రసాదయే, త్వామ్, అహమ్, ఈశమ్, ఈడ్యమ్, పితా, ఇవ, పుత్రస్య, సఖా, ఇవ, సఖ్యుః, ప్రియః, ప్రియాయాః, అర్హసి, దేవ, సోఢుమ్ ॥

| | | | |
|---|---|---|---|
| దేవ! | = ఓ దేవాదిదేవా! | ఈడ్యమ్ | = స్తవనీయుడవు |
| తస్మాత్ | = అందువల్ల | ఈశమ్ | = పరమేశ్వరుడవు అయిన |
| అహమ్ | = నేను | త్వామ్ | = నిన్ను |
| కాయమ్ | = శరీరమును | ప్రసాదయే | = నాయందు ప్రసన్నుడవగుటకై ప్రార్థించుచున్నాను |
| ప్రణిధాయ | = నీ పాదములచెంత ఉంచి | | |
| ప్రణమ్య | = నమస్కరించుచున్నాను | పుత్రస్య | = పుత్రుని తప్పును |

| | | | |
|---|---|---|---|
| పితా, ఇవ | = తండ్రివలె | త్వమ్ | = నీవు |
| సఖ్యుః | = సఖుని దోషమును | సోఢుమ్ | = నా అపరాధములను అన్నింటిని క్షమించుటకు |
| సఖా, ఇవ | = సఖునివలె | అర్హసి | = తగినవాడవు |
| ప్రియాయాః | = భార్య అపరాధమును | | |
| ప్రియః, ఇవ | = భర్తవలె | | |

**హే దేవ! తస్మాత్ కాయమ్ ప్రణిధాయ, ప్రణమ్య, అహమ్ ఈడ్యమ్ ఈశమ్ త్వామ్ ప్రసాదయే, పుత్రస్య (అపరాధం) పితా ఇవ, సఖ్యుః (అపరాధం) సఖా, ప్రియాయాః (అపరాధం) ప్రియః (ఇవ) (మమ అపరాధాన్) సోఢుమ్ అర్హసి ।**

తా: ఓ దేవాదిదేవా! అందువల్ల నేను శరీరమును నీ పాదములచెంత ఉంచి నమస్కరించుచున్నాను. స్తవనీయుడవు, పరమేశ్వరుడవు అయిన నిన్ను, నాయందు ప్రసన్నుడవగుటకై ప్రార్థించుచున్నాను. పుత్రుని తప్పును తండ్రివలె, సఖుని దోషమును సఖునివలె, భార్య అపరాధమును భర్తవలె నీవు నా అపరాధములను అన్నింటిని క్షమించుటకు తగినవాడవు.

అర్జునుడు అంతకుముందు పెద్దగా కృష్ణుణ్ణి అవమానించకపోయినా, అతనిలోని అపరాధభావన త్వరగా పోవటంలేదు. కృష్ణునితో చాలా చనువుగా, స్నేహితునిలా మసిలాడు. కృష్ణుణ్ణి అవమానపరచకపోయినా, బాధించక పోయినా, స్నేహితునిగా భావించటం కూడా పెద్ద అవమానంగా భావిస్తున్నాడు అర్జునుడు. నిజానికి భగవంతుణ్ణి స్నేహితునిగా భావించే సంప్రదాయం ఉంది మన భక్తిగ్రంథాలలో. దీన్ని సఖ్యభక్తి అంటారు.

**శ్రవణం కీర్తనం విష్ణోర్ స్మరణం పాదసేవనమ్ ।**
**అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనమ్ ॥**

నవవిధ భక్తులలో సఖ్యభక్తిని అంగీకరిస్తారు కాని అర్జునుడు దాన్ని పెద్ద అపరాధంగా భావిస్తున్నాడు.

**తస్మాత్ ప్రణమ్య** – అందువల్ల నీకు ప్రణామాలు. ఎందువల్ల? కృష్ణుణ్ణి అవమానపరచినందుకు, అగౌరవ పరచినందుకు, చిన్నచూపు చూసినందుకు; ప్రణమ్య అంటే ప్రత్యేకంగా ప్రాయశ్చిత్తనమస్కారాలు చేస్తున్నాను అంటున్నాడు. అది కూడా ఊరికే నమస్కారం పెట్టి ఊర్కోవటం కాదు.

**కాయం ప్రణిధాయ** – కాయం అంటే శరీరం; ప్రణిధాయ అంటే సాష్టాంగం. నీకు సాష్టాంగనమస్కారాలు చేస్తున్నాను.

**త్వామహం ప్రసాదయే** – నువ్వు నన్ను అనుగ్రహించు. భగవంతునికి నిజంగా కోపం రాలేదు, కాని అర్జునుడు భయపడుతున్నాడు. నేను నీకు సాష్టాంగ నమస్కారాలు చేస్తున్నాను కాబట్టి నువ్వు శాంతించి, నన్ను అనుగ్రహించు.

**ఈశమీడ్యమ్** – ఈశమ్ అంటే ఈ జగత్తుకు రాజువు నువ్వు.

**సర్వం జగత్ ఈశతే ఇతి ఈశః**

ఈశతే అంటే పరిపాలించేవాడు. ఈ త్వామహమీశమీడ్యమ్ పదాన్ని సరిగ్గా విడదీయాలి. త్వామ్ + అహమ్+ ఈశమ్+ఈడ్యమ్. ఈడ్యమ్ అంటే పూజ్యనీయుడు. నువ్వొక్కడివే పూజ్యనీయుడివి.

వేరే ఎవరికీ నమస్కారం అందుకునే అర్హత లేదు. ఎవరికైనా నమస్కారం పెట్టినా అతను భగవంతునికే అందజేయాలి అని చూశాము. ఓ భగవంతుడా, నా తప్పిదాలను మన్నించమని వేడుకుంటున్నాడు అర్జునుడు. పైగా ఎలా మన్నించాలో కూడా మూడు ఉదాహరణలతో వివరిస్తున్నాడు.

**పితేవ పుత్రస్య** – ఒక తండ్రి తన పుత్రుణ్ణి మన్నించినట్టుగా నువ్వు నన్ను మన్నించాలి.

ఈ ఉదాహరణద్వారా, పిల్లలు ఏదైనా తప్పుచేసినా మనం పెద్దమనస్సు చేసుకుని, వారి తప్పిదాన్ని మన్నించాలని నేర్చుకోవాలి. కొంతమంది తండ్రులకు పిల్లలమీద కోపం వస్తే, చాలాదూరం వెళతారు. నువ్వు నా గుమ్మం తొక్కటానికి వీలులేదు అనేస్తారు. పూర్వకాలంలో పిల్లలు పల్లెటూర్లలో ఉండేవారు, సాంప్రదాయాన్ని పాటించేవారు. ఇప్పుడు పిల్లలకు బయట ప్రపంచ పోకడలు చాలా తెలుసు, అనేక సంస్కృతులను చూస్తున్నారు; ఆ సంస్కృతులు మన పూజగదిలోకి, హాలులోకి కూడా చొరబడుతున్నాయి. వాటి ప్రభావంవల్ల పిల్లలు పొరపాట్లు చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వాటిని పెద్దమనస్సుతో మనం కూడా క్షమించాలి. ఇక్కడ తండ్రి పుత్రుణ్ణి క్షమించినట్టు, నన్ను నువ్వు క్షమించు అంటున్నాడు అర్జునుడు.

**ప్రియః ప్రియాయాః** – భర్త భార్యను క్షమించినట్టుగా. పూర్వకాలంలో భార్యాభర్తల మధ్య వయస్సులో వ్యత్యాసం చాలా ఉండేది; భార్య భర్తను గురువుగా భావించి గౌరవించేది. ప్రియా అంటే భార్య. ప్రియా అంటే అక్షరాలా భార్య అని కాదు, కాని భార్య ప్రియమైనది అనే ఉద్దేశంతో చెబుతున్నది శాస్త్రం.

**సఖేవ సఖ్యుః** – ఒక స్నేహితుడు తన స్నేహితుడు చేసిన అవమానాలను క్షమించినట్టుగా నన్ను క్షమించు. భక్తుడు తనను గోపికగానో, రాధగానో భావించుకుని భగవంతుణ్ణి పురుషునిగా భావించుకోవటం మధుర భక్తికింద వస్తుంది. ఇలా కూడా అర్థం తీసుకోవచ్చు. నువ్వు నాకు తండ్రిలాంటివాడివి, భర్తలాంటివాడివి, సఖుడివి. ఏ విధంగా చూసినా నీకు నేను ప్రీతికరమైనవాణ్ణి.

**అర్హసి సోఢుమ్ (అపరాధన్)** – అపరాధన్ పదాన్ని కలుపుకోవాలి. నా అపరాధాలను క్షమించే అర్హత నీకే ఉంది. కుమారుణ్ణి తండ్రి క్షమించినట్టుగా, భార్యను భర్త క్షమించినట్టుగా, స్నేహితుడిని స్నేహితుడు క్షమించినట్టుగా నా అపరాధాలను నువ్వు క్షమించు.

శ్లో. 45 **అదృష్టపూర్వం హృషితోఽస్మి దృష్ట్వా భయేన చ ప్రవ్యథితం మనో మే ।**
**తదేవ మే దర్శయ దేవరూపం ప్రసీద దేవేశ జగన్నివాస ॥**
అదృష్టపూర్వమ్, హృషితః, అస్మి, దృష్ట్వా, భయేన, చ, ప్రవ్యథితమ్, మనః, మే,
తత్, ఏవ, మే, దర్శయ, దేవరూపమ్, ప్రసీద, దేవేశ, జగన్నివాస ॥

| | | | |
|---|---|---|---|
| అదృష్టపూర్వమ్ | = ఇంతకు ముందెన్నడను చూడనట్టి నీ విశ్వరూపమును | తత్ | = ఆ |
| దృష్ట్వా | = చూచి | దేవరూపమ్, ఏవ | = చతుర్భుజశోభితమైన విష్ణురూపమునే |
| హృషితః, అస్మి | = సంతుష్టుడనైతిని | మే | = నాకు |
| చ | = ఇంకా | దర్శయ | = చూపుము |
| మే, మనః | = నా మనస్సు | దేవేశ! | = ఓ దేవాధిదేవా! |
| భయేన | = భయముతో | జగన్నివాస! | = ఓ జగన్నివాసా! |
| ప్రవ్యథితమ్ | = కలత చెందినది | ప్రసీద | = ప్రసన్నుడవు కమ్ము |

**హే దేవేశ! హే జగత్-నివాస! అదృష్ట-పూర్వమ్ (విశ్వరూపం త్వాం) దృష్ట్వా (అహం) హృషితః అస్మి, మే మనః భయేన ప్రవ్యథితమ్ (అస్తి, అతః) హే దేవ! (త్వం) ప్రసీద చ తత్ ఏవ (పూర్వం) రూపమ్ మే దర్శయ ।**

తా: ఇంతకు ముందెన్నడను చూడనట్టి నీ విశ్వరూపమును చూచి సంతుష్టుడనైతిని ఇంకా నా మనస్సు భయముతో కలత చెందినది. ఆ చతుర్భుజ శోభితమైన విష్ణురూపమునే నాకు చూపుము. ఓ దేవాధిదేవా! ఓ జగన్నివాసా! ప్రసన్నుడవు కమ్ము.

ఇక్కడ అర్జునుడు మిశ్రమభావాలను ప్రకటిస్తున్నాడు. మనస్సు ఒక పక్క తను చాలా అదృష్టవంతుడని మురిపిస్తోంది, ఇంకొకపక్క ఎర్రగా మండుతున్న నోళ్ళను చూపి భయపెడుతోంది.

ఎవరూ కనీవినీ ఎరుగని విశ్వరూపదర్శనభాగ్యం ఒక్క అర్జునునికే కలిగింది. అతనికి మాత్రమే దివ్యచక్షువులను ప్రసాదించాడు కృష్ణపరమాత్మ. అందరూ అతనిని చూసి ఈర్ష్యపడతారు. అంతటి అదృష్టం తనకే కలిగినందుకు మురిపెంగానే ఉంది, ఇంకా ఇంకా చూడాలనే ఉంది. కాని ఇంకొకపక్క భీకరంగా తెరిచివున్న నోళ్ళలో పరుగెత్తుకుంటూ వెళ్ళి పడిపోతున్న తనవారందరూ కనిపిస్తున్నారు. అది విపరీతమైన భయాన్ని కలుగజేస్తోంది. భగవంతుడు వారిని నిర్దాక్షిణ్యంగా నమిలి మింగేస్తున్నట్టు ఉంది.

మనస్సులో ఒక భాగం ఇటువంటి అరుదైన అవకాశాన్ని ఆనందించు, ఇంకా చూడు అంటుంటే, ఇంకొక భాగం అంత భీకరదృశ్యాన్ని చూసి తట్టుకోలేవు, కళ్ళుమూసుకో అంటున్నది. మింగాలేక, కక్కాలేక ఉన్నాడు అంటారు పెద్దవారు. గొంతులో పచ్చివెలక్కాయ పడితే అలా ఉంటుంది. మింగుదామంటే చేదుగా ఉంటుంది, కక్కుదామంటే తియ్యగా ఉంటుంది. అలా ద్వైధీభావంతో ఊగిసలాడుతున్నాడు అర్జునుడు. రెండు భావనలూ ఒక్కసారే కలిగినా, కొంచెము భయమే ఎక్కువగా ఉంది. ఎందుకు? ఈ దివ్యచక్షువులు తాత్కాలికంగా భగవంతుడు ఇచ్చినవి కాబట్టి. ఒకవేళ తగినంత కర్మయోగం సాధన చేసి రాగద్వేషాలను, అహంకార మమకారాలను తగ్గించుకోగలిగితే సహజంగా అలవడుతాయి ఈ దివ్యచక్షువులు. అలా సహజంగా ఏర్పడిన దివ్యచక్షువులతో విశ్వరూపాన్ని చూస్తే అప్పుడు ఇలా భయం కలగదు. కాని అర్జునునికి స్వతహాగా వచ్చినవి కావు కాబట్టి భయపడుతున్నాడు.

అందువల్ల ప్రపంచం తనను స్తుతిస్తుంది అని తెలిసినా, భగవంతుణ్ణి వేడుకుంటున్నాడు. ఏమని? 'దయజేసి, నీ విశ్వరూపాన్ని విరమించుకో,' నిజానికి విశ్వరూపాన్ని చూపించమని కోరినదీ అర్జునుడే, ఇప్పుడు దాన్ని విరమించుకోమని కోరుతున్నదీ అర్జునుడే. దీన్నిబట్టి ఏకరూపభక్తినుంచి అనేకరూపభక్తికి రావాలంటే రాగద్వేషాలను బాగా తగ్గించుకోవాలని అర్థమవుతున్నది. అర్జునుడు ఇంకా నిర్గుణభక్తి దాకా రావటం లేదు. అది అప్పుడే కాదు. ఏకరూపభక్తినుంచి అనేకరూపభక్తికి రావటానికే రాగద్వేషాలను చాలామటుకు తగ్గించుకోవాలి. ఇంకో విధంగా చెప్పాలంటే, అహంకారమమకారాలను తగ్గించుకోవాలి. నేను, నావారు అనే భావననుంచి బయటపడాలి. అప్పుడే విశ్వరూపదర్శనాన్ని ఆనందించగలము.

**అదృష్టపూర్వం దృష్ట్వా** – మునుపెన్నడూ చూసి ఎరుగని ఆశ్చర్యకరమైన రూపాన్ని చూశాను. అదృష్టపూర్వం అంటే అపూర్వం. ప్రత్యేకమైన దర్శనం కలిగింది.

**అస్మి హృషితః** – అటువంటి అపూర్వదర్శనాన్ని పొంది నేను చాలా మురిసిపోయాను అంటున్నాడు అర్జునుడు.

అది మానవసహజం. ఎవరికీ లేనిది మనకి ఉందంటేనే మనకు చాలా గొప్పగా అనిపిస్తుంది. ఎవరైనా ఈ డ్రెస్సు బాగుంది, ఎక్కడ కొన్నావు అని అడిగితే మోక్షం కలిగినంత ఆనందం వేస్తుంది. మనం కొన్న షాపుకి వెళ్ళి వారు కూడా ప్రయత్నం చేసినా, ఆ డ్రెస్సు ఒక్కటే వచ్చిందనీ, ఇంకొకటి లేదనీ వారు వెనక్కి వచ్చి చెపితే బ్రహ్మానందం కలుగుతుంది. అటువంటి బ్రహ్మానందం కలిగింది అర్జునునికి కూడా. కాని భయం కూడా వేస్తున్నది.

**భయేన చ ప్రవ్యథితం మనో మే** – నా మనస్సు భయంతో నిండిపోయింది.

ఇలాంటి ద్వైధీభావనను మనం కూడా అప్పుడప్పుడూ అనుభవిస్తాము. స్వామీజీ కూడా తనకు కలిగిన అటువంటి ఒక అనుభవాన్ని మనతో పంచుకుంటున్నారు. కేరళలో పల్లెటూరిలో పండుగలకు ఏనుగుమీద దేవుణ్ణి ఊరేగించేవారు. కేరళలో పండగ అంటే ఏనుగు ఉండితీరాలి. మూడు ఏనుగులను ఊరంతా ఊరేగించేవారు. మధ్య ఏనుగుమీద దేవుణ్ణి ఉంచి, తక్కిన రెండు ఏనుగులమీద ఎవరో ఒకరిని ఎక్కించి, దేవుని సామానులో, గొడుగో పట్టుకోమనేవారు. అలా ఎవరు ఎక్కగలిగితే, వారిని తక్కినవారు ఈర్ష్యగా చూసేవారు. ఆ అవకాశంకోసం బాగా తోసుకునేవారు ఆ ఊరివారు.

స్వామీజీ చిన్నప్పుడు, ఏనుగు ఎక్కే అవకాశం ఆయనకీ వచ్చింది ఒకసారి. మామూలుగా ఏనుగెక్కినంత సంబరం కలిగింది అంటారు. స్వామీజీ నిజంగానే ఏనుగును ఎక్కారు. ఏనుగెక్కి చుట్టూ చూస్తే ఈర్ష్య నిండిన కళ్ళతో తననే చూస్తున్న ఊరిజనం కనబడ్డారు. గాలిలో తేలిపోయినట్టుంది. కాని ఆ ఆనందం పట్టుమని పది నిముషాలు కూడా నిలవలేదు. ఎందుకు?

సినిమాలో అయితే ఏనుగుమీద అంబారీ వేసి, చిన్న బల్ల వేసి, మెత్తని దిండు వేసి చాలా ఆర్భాటాలు చేస్తారు. స్వామీజీ ఎక్కిన ఏనుగుమీద ఏమీ వెయ్యలేదు. ఏనుగు వెన్నెముక చాలా గట్టిగా ఉంటుంది. అసలు అంత గట్టివస్తువు ప్రపంచంలో ఇంకేదీ లేదేమో. వజ్రంకన్నా పదునుగా ఉండి, బాగా గుచ్చుకుంటుంది.

అదికాక, దాని వెంట్రుకలు సూదిలా చాలా పదునుగా, కసుక్కున గుచ్చుకుపోయేలా ఉంటాయి. అందువల్ల ఏనుగుమీద కూర్చుంటే సుఖం లేదు. అలాగని బయటికి బాధను ప్రదర్శించే ఆస్కారం లేదు. బయటికి చిరునవ్వులు చిందిస్తూ, ఎప్పుడవుతుందిరా బాబూ ఈ ఊరేగింపు అనే బాధను పళ్ళబిగువున దిగమింగుకుంటూ గడిపారు అప్పుడు. ఇప్పుడు అర్జునుడు అలా ఆనందాన్నీ పొందలేక, బాధనూ భరించలేక అవస్థ పడుతున్నాడు.

ఎర్రటి ఎండాకాలంలో కోటు వేసుకోవాల్సివచ్చిన వారి దురవస్థ కూడా అలాగే ఉంటుంది. కోటు వేసుకుని మీటింగులో నలుగురినీ పలకరిస్తూ, చిరునవ్వులు చిందించాల్సి ఉంటుంది. కాని మనస్సులో మాత్రం అసహనం నిండి ఉంటుంది, ఈ కోటుని విప్పి ఎప్పుడు అవతల పారేస్తానా అనిపిస్తూ ఉంటుంది.

అలా భగవంతుని విశ్వరూపం చూసి ఒకపక్క ఆనందంలో తేలిపోతున్నా, ఇంకొకపక్క భయంతో కిందకు లాగుతున్నది అర్జునుని మనస్సు. కిందకు లాగుతోందని ఎలా తెలుసు?

**తదేవ దేవరూపం మే దర్శయ** – ఓ భగవంతుడా, నాకు నా స్నేహితుని రూపం చూడాలని ఉంది.

**అధరం మధురం వదనం మధురం నయనం మధురం**

అటువంటి మధురమైన కృష్ణరూపం కావాలి. తదేవ అంటే ఏకరూప ఈశ్వరుడు. దీన్నిబట్టి ఏకరూప ఈశ్వరునినుంచి అనేకరూప ఈశ్వరభక్తిస్థాయికి ఎదగటం కూడా అంత తేలికైన పనికాదు అని చూశాము. అలాంటిది, అనేకరూప ఈశ్వరుడు లేదా విశ్వరూప ఈశ్వరునిలో చాలాకాలం నిలిస్తేనే, అరూప ఈశ్వరుణ్ణి అర్థం చేసుకోవటం తేలిక అవుతుంది. అలా కాకుండా ఏకరూప ఈశ్వరభక్తినుంచి అరూపఈశ్వరభక్తికి ఒక్కసారిగా గెంతితే, వేదాంతం అంత తేలిగ్గా వంటబట్టదు.

**అశబ్దమస్పర్శమరూపమవ్యయం**
**తథాఽ రసం నిత్యమగన్ధవచ్చ యత్।** – కఠ

బ్రహ్మ పంచేంద్రియాలకు అందదని వేదాంతం అంటే దాన్ని తొందరగా అర్థం చేసుకోలేము. అందువల్ల సాధనచతుష్టయసంపత్తి అంటే విశ్వరూప ఈశ్వరభక్తి ఉంటేనే అరూప ఈశ్వరుణ్ణి అర్థం చేసుకోగలము.

ఇప్పుడు అర్జునుడు ఈ విశ్వరూపదర్శనాన్ని చూసి భయపడి, ఉపశమించు అంటున్నాడు. భగవంతుడు, నువ్వే కోరావు కదా అని అతనితో వాదిస్తే, అర్జునుడు ఏమీ చెయ్యలేడు. అందువల్ల ముందే ప్రసీద అంటున్నాడు.

**ప్రసీద దేవేశ జగన్నివాస** – ప్రసీద అంటే నువ్వు ప్రసన్నుడవు కమ్ము అంటున్నాడు. దేవేశ అంటే దేవతలకు రాజు అంటే దేవాధిదేవుడు. జగన్నివాస అంటే విశ్వాధారుడు, అంటే విశ్వానికే ఆధారమైనవాడు.

జగన్నివాసుడు పదాన్ని రెండు రకాలుగా విడదీయవచ్చు.

**జగత్తుయొక్క నివాసుడు** – **షష్ఠీతత్పురుష సమాసం**
**జగత్తును నివాసంగా కలవాడు** – **బహువ్రీహి సమాసం**

రెండూ సరిపోతాయి కాని ఈ సందర్భంలో షష్ఠీతత్పురుష సమాసం ఇంకా బాగా సరిపోతుంది. జగత్తుకు ఆధారం భగవంతుడు. భగవంతుడు ఈ విశ్వానికి ఆధారం అనే భావనను యశోదాదేవికి చూపించాడు భగవంతుడు. ఆ కథ మనందరకూ తెలిసినదే. చిన్నికృష్ణుడు మన్ను తిన్నాడని అన్న బలరాముడు చెపితే, నోరు తెరవమంది యశోదాదేవి. చిన్నికృష్ణుడు అమాయకంగా నోరు తెరిచాడు. కాని ఆవిడకు ఆ చిన్నినోరులో అఖిలాండకోటి బ్రహ్మాండలోకాలు కనిపించాయి.

**కలయో వైష్ణవమాయయో ఇతర సంకల్పార్థమో**
**సత్యమో తలపన్నేరక యున్నదాననో యశోదాదేవిగానో**
**పరస్థలమో బాలకుండెంత ఈతని ముఖస్థంబై అజాండంబు**
**ప్రజ్వలమై యుండుటకేమి హేతువో మహాశ్చర్యంబు చింతింపగన్**

యశోదాదేవి కూడా తట్టుకోలేక, చిన్నికృష్ణుడు తెరచిన నోటిని మూసి ఉంచమన్నది. అంత చిన్న నోరులోకి పద్నాలుగు లోకాలు ఎలా వెళ్ళాయని ఆలోచించకూడదు. దీని అర్థం భగవానుడు విశ్వాధారం అని.

శ్లో. 46 **కిరీటినం గదినం చక్రహస్తమ్ ఇచ్ఛామి త్వాం ద్రష్టుమహం తథైవ ।**
**తేనైవ రూపేణ చతుర్భుజేన సహస్రబాహో! భవ విశ్వమూర్తే! ॥**
కిరీటినమ్, గదినమ్, చక్రహస్తమ్, ఇచ్ఛామి, త్వామ్, ద్రష్టుమ్, అహమ్, తథా, ఏవ, తేన, ఏవ, రూపేణ, చతుర్భుజేన, సహస్రబాహో, భవ, విశ్వమూర్తే ॥

| | | | |
|---|---|---|---|
| విశ్వమూర్తే! | = ఓ విశ్వరూపా! | ఇచ్ఛామి | = కోరుకొనుచున్నాను |
| అహమ్ | = నేను | (అతః) | = (అందువల్ల) |
| కిరీటినమ్ | = కిరీటముగలవాడవు | సహస్రబాహో! | = ఓ పరమాత్మా! |
| గదినమ్ | = గదను ధరించినవాడవు | తేన | = నీయొక్క |
| చక్రహస్తమ్ | = చక్రపాణియు అయిన | చతుర్భుజరూపేణ | = చతుర్భుజరూపము |
| త్వామ్ | = నిన్ను | ఏవ | = గలవాడవు |
| తథా, ఏవ | = అలాగే | భవ | = కమ్ము |
| ద్రష్టుమ్ | = చూడాలని | | |

**హే సహస్ర-బాహో! హే విశ్వ-మూర్తే! అహం త్వామ్ కిరీటినం గదినం (చ) తథా ఏవ చక్ర-హస్తం ద్రష్టుమ్ ఇచ్ఛామి, (తస్మాత్) తేన ఏవ చతుః-భుజేన రూపేణ (యుక్తః) భవ ।**

తా: ఓ విశ్వరూపా! నేను కిరీటముగలవాడవును, గదను ధరించినవాడవు, చక్రపాణియు అయిన నిన్ను అలాగే చూడాలని కోరుకొనుచున్నాను. అందువలన ఓ పరమాత్మా! నీయొక్క చతుర్భుజరూపము గలవాడవు కమ్ము.

ఈ శ్లోకంతో అర్జునుడు తన ప్రార్థనను ముగిస్తున్నాడు. అర్జునుని స్పందనను మూడు దశల్లో చూశాము. అవి– ఆశ్చర్యం, భయం, భక్తి. ఇప్పుడు ఆ మూడవదశ అయిన భక్తిని ప్రదర్శిస్తున్నాడు. భగవంతుణ్ణి శాంతింపజేసి, తన పూర్వరూపంలోకి రమ్మని వేడుకుంటున్నాడు.

**త్వామ్ అహం ద్రష్టుమ్ ఇచ్ఛామి** – నాకు నిన్ను చూడాలనివుంది. ఎలా?

**తేనైవ రూపేణ** – నీ అసలు రూపంలోనే అంటే ఏకరూపం ఉన్న కృష్ణుని రూపంలో చూడాలనివుంది. ఏమిటా పూర్వరూపం? కృష్ణునికి గుర్తు ఉందో లేదోనని అర్జునుడే గుర్తు చేస్తున్నాడు.

**కిరీటినం గదినం చక్రహస్తమ్** – కిరీటం, గద, చక్రాలను ధరించిన;

**చతుర్భుజేన** – నాలుగు చేతులతో కనిపించు. ఇప్పుడెలా కనబడుతున్నాడు?

**సహస్రబాహో** – వేలాది చేతులతో ఉన్నావు.

**భవ** – ఓ సహస్రబాహూ, నీ పూర్వరూపమైన చతుర్భుజరూపానివి కమ్ము.

**విశ్వమూర్తే** – ఓ విశ్వమూర్తీ అని సంబోధిస్తున్నాడు. ఓ విశ్వరూప ఈశ్వరా! తనకు విశ్వమూర్తి వద్దు, కృష్ణమూర్తి కావాలి అంటున్నాడు. అంటే తనకు విశ్వరూపదర్శనం వద్దు శ్రీకృష్ణరూపదర్శనం చాలని అర్థం.

ఇక్కడితో అర్జునుని స్పందన ముగిసింది. మూడవదశ అయిన భక్తిని 35–46 శ్లోకాల వరకూ చూశాము.

ముందే చూసినట్టుగా విశ్వరూప ఈశ్వరదర్శనం చేయాలంటే ద్వంద్వాలను స్వీకరించగలిగే ధైర్యం ఉండాలి. చావు–పుట్టుకలు, సుఖ–దుఃఖాలు, కష్ట–నష్టాలు అన్నీ వస్తాయి సృష్టిలో.పుట్టుకను భగవంతుని సృష్టిలో ఒక భాగంగా స్వీకరించగలిగితే, మరణాన్ని కూడా భగవంతునిలో ఒక భాగంగా స్వీకరించగలగాలి. అంటే ఆత్మీయులు ఎవరైనా మరణించినా కూడా దాన్ని చిరునవ్వుతో స్వీకరించగలగాలి. అందువల్ల సంధ్యావందనంలో యమధర్మరాజుని ప్రార్థిస్తారు. ఆయనను **సర్వభూతక్షయాయః** అంటారు. వృద్ధాప్యం, మృత్యువులను యమధర్మరాజు కలుగజేస్తాడు. ఆయనను గౌరవంగా చూడాలి. గౌరవంగా చూసే పరిపక్వత లేకపోయినా కనీసం విమర్శించకుండా, తిట్టకుండా ఉండాలి.

ఫ్రీవిల్ ఉంటే రాగద్వేషాలు ఉంటాయని చూశాము. రాగద్వేషాలు లేకుండా ఉండాలంటే ద్వంద్వాలన్నీ భగవంతునిలో భాగంగా చూసి భగవానుని అర్థం చేసుకోవాలి. అర్థం చేసుకోకపోతే ఇలాగే భయం కలుగుతుంది. అయితే పరిపక్వమైన మనస్సును పొందటమెలా? అనేకరూప ఈశ్వరుణ్ణి స్వీకరించే పరిపక్వత రానంతవరకూ ఏకరూప ఈశ్వరభక్తిలోనే ఉండాలి.

అందువల్లనే ముందు మన భక్తిని ఏకరూప ఈశ్వరునితో మొదలుపెట్టాలి. అంటే ఇష్టదేవత ప్రార్థన చేయాలి. ఆ ఇష్టదేవత గుండెలో కొలువై ఉన్నట్టుగా భావించుకోవాలి.

**అతిభీషణ కటుభాషణ యమకింకర పటలీ**
**కృతతాడన పరిపీడన మరణాగమసమయే**
**ఉమయా సహ మమ చేతసి యమశాసన నివసన్**
**శివశంకర శివశంకర హర మే హర దురితమ్** – శ్రీశివశంకర స్తోత్రమ్

శంకరాచార్యులవారు ఎంత అద్భుతంగా రచించారో చూడండి! అంత్యకాలం ఎలా వస్తుందో ఎవరికీ తెలియదు. కొంతమంది మరణకాలంలో యమదూతలు వచ్చారు, నన్ను తీసుకువెళ్ళటానికి అంటారు. చుట్టూ చాలామందే ఉంటారు కాని ఎవరికీ కనబడరు ఈ యమదూతలు లేదా యమకింకరులు. ఆ యమకింకరులు తిడుతున్నారు అంటారు. ఎందుకంటే మనిషికి త్వరగా పాశం పోదు. అప్పుడే పుట్టిన మునిమనవడిమీద కూడా ప్రేమ పొంగిపొరలుతుంది. అందువల్ల యమదూతలు మనిషిని బలవంతంగా తీసుకెళ్ళాల్సివుంటుంది.

ఈ స్తోత్రంలో భక్తుడు శివుణ్ణి వేడుకుంటున్నాడు. 'ఓ దేవా, యమదూతలు వచ్చి నన్ను హింసిస్తున్నప్పుడు నువ్వు పార్వతీ సమేతంగా వచ్చి, నా హృదయంలో శివతాండవం చేయాలి. నేను వేరే ఎవరినీ చూడను. నువ్వే నా మనసంతా నిండి ఉండాలి.' ఈ స్తోత్రాన్ని శంకరాచార్యులవారు మనకోసం రచించారు. ఆయనకు యమకింకరులు వస్తారనే భయం లేదు. ఆయన నిత్యముక్తుడు. ఈ స్తోత్రం అర్థం చూద్దాము.

**అతిభీషణ** – అతి భయంకరమైన; **కటుభాషణ** – కటువుగా మాట్లాడే; **యమకింకర పటలీ** – యమకింకరులు వచ్చినప్పుడు. వారు ప్రేమగా 'మాతో రా,' అంటే మనం వెళతామా? అందువల్లనే వారు మనతో కటువుగా మాట్లాడాల్సివుంటుంది. **కృతతాడన పరిపీడన మరణాగమసమయే** – నాకు మరణకాలం సమీపించినప్పుడు వారు నన్ను కొడతారు. శారీరకంగాను, మానసికంగా గాను హింసిస్తారు. అలాంటి మరణకాలం నాకు సమీపించినప్పుడు, ఓ శివా నువ్వేం చేయాలి?

**ఉమయా సహ** – పార్వతీదేవితో సహా; **మమ చేతసి** – నా హృదయంలో; **యమశాసన నివసన్** – యమధర్మరాజును కూడా శాసించే నువ్వు నివసించు. మార్కండేయ పురాణంలో ఈ విషయంలో చూస్తాము. సందర్భానికి తగ్గట్టుగా ఎలా సంబోధిస్తున్నాడో చూడండి.

**శివశంకర శివశంకర హర మే హర దురితమ్** – ఓ శివశంకరా, నా కష్టాన్ని తొలగించు.

అలా ఇష్టదేవత ప్రార్థన కొండంత బలాన్ని ఇస్తుంది. ఏదైనా కష్టం వచ్చినా, మన ఆత్మీయులు మరణించినా, మనకే అంత్యకాలం సమీపించినా, ఇష్టదేవతాభక్తి మన బాధను తొలగిస్తుంది. కాని అంత ప్రశాంతత అంత తేలికగా రాదు. అటువంటి భక్తి అభ్యాసంవల్లనే అబ్బుతుంది. ఎప్పుడో 93 సంవత్సరాలు వచ్చాక, ఈ స్తోత్రం చేస్తాను అనుకుంటే అప్పుడు చేయలేము కూడా. ఇప్పుడే, ఒక ఇష్టదేవతను ఎన్నుకుని, భక్తిగా ప్రార్థన చేయటం నేర్చుకోవాలి.

ఈ ఇష్టదేవతభక్తి, విశ్వరూపభక్తికి మారటానికి అవసరమైన శక్తిని ఇస్తుంది. విశ్వరూపభక్తికి ఎదిగితే, ఏకరూపభక్తి పోతుందని భయపడనవసరం లేదు. ఇష్టదేవతనే అంతటా చూసారు. మీరు శివభక్తులైతే కృష్ణాలయానికి

వెళ్ళినా, అక్కడా శివుడే కనిపిస్తాడు. అలాగే విష్ణుభక్తులైతే సర్వం విష్ణుమయం జగత్ అనిపిస్తుంది. ఇంకా విశ్వరూపభక్తికి ఎదిగే పరిపక్వత రాలేదని మీరు అనుకున్నా ఏం ఫర్వాలేదు. ఏకరూపభక్తి కూడా మీకు కావాల్సిన గుండె నిబ్బరాన్ని ఇస్తుంది. ఆ విధంగా అర్జునుడు కూడా అరూపభక్తి కాదు కదా, విశ్వరూపభక్తికే సిద్ధంగా లేడు. ఆ మాట ఒప్పుకున్నాడు కూడా. ఓ కృష్ణా నీ పూర్వరూపానికి రా అని వేడుకున్నాడు.

**శ్రీభగవాన్ ఉవాచ**

శ్లో. 47 **మయా ప్రసన్నేన తవార్జునేదం రూపం పరం దర్శితమాత్మయోగాత్ ।**
**తేజోమయం విశ్వమనంతమాద్యం యన్మే త్వదన్యేన న దృష్టపూర్వమ్ ॥**
మయా, ప్రసన్నేన, తవ, అర్జున, ఇదమ్, రూపమ్, పరమ్, దర్శితమ్, ఆత్మయోగాత్,
తేజోమయమ్, విశ్వమ్, అనంతమ్, ఆద్యమ్, యత్, మే, త్వదన్యేన, న, దృష్టపూర్వమ్ ॥

| | | | |
|---|---|---|---|
| అర్జున! | = ఓ అర్జునా! | అనంతమ్ | = అపరిమితమైన రూపము |
| ప్రసన్నేన | = నీయందు ప్రసన్నుడనైన | యత్ | = ఏదైతే ఉందో |
| మయా | = నాచేత | త్వదన్యేన | = నీవు తప్ప మరి ఎవ్వరిచేతను |
| ఆత్మయోగాత్ | = నా యోగశక్తి ప్రభావమున | న, దృష్టపూర్వమ్ | = ఇంతకుముందు చూడబడలేదో అటువంటి |
| ఇదమ్ | = ఈ | మే | = నాయొక్క |
| పరమ్ | = శ్రేష్ఠమైన | విశ్వమ్, రూపమ్ | = విశ్వరూపము |
| తేజోమయమ్ | = తేజోమయమైన | తవ | = నీకు |
| ఆద్యమ్ | = అన్నింటికిని ఆదియైన | దర్శితమ్ | = చూపబడినది |

**శ్రీభగవాన్ ఉవాచ**
**హే అర్జున! యత్ త్వత్ అన్యేన దృష్ట-పూర్వం న, (తత్) ఇదమ్ మే తేజోమయం విశ్వమ్ అనన్తమ్ ఆద్యమ్ పరం రూపం ప్రసన్నేన మయా ఆత్మ-యోగాత్ తవ దర్శితమ్ ।**

తా: ఓ అర్జునా! ఏదైతే నీవు తప్ప మరి ఎవ్వరిచేతను ఇంతకుముందు చూడబడలేదో అటువంటి నాయొక్క విశ్వరూపము నీయందు ప్రసన్నుడనైన నాచేత నా యోగశక్తి ప్రభావమున ఈ శ్రేష్ఠమైనది, తేజోమయమైనది, అన్నింటికిని ఆదియైనది, అపరిమితమైనది నీకు చూపబడినది.

### 7. ఉపసంహారం: శ్లోకాలు 47-55

అర్జునుడు కృష్ణపరమాత్మను శాంతించమని కోరితే, కృష్ణపరమాత్మ అర్జునుడు కోరాడు కాబట్టి తాను ప్రదర్శించానని, మళ్ళీ అర్జునుడే శాంతించమంటున్నాడు కాబట్టి ప్రసన్నుడవుతానని అంటున్నాడు.

**శ్రీభగవాన్ ఉవాచ** – భగవంతుడు జవాబు చెబుతున్నాడు.

**అర్జున తవ ఇదం రూపం దర్శితమ్** – ఓ అర్జునా, నీమీద ఉన్న అనుగ్రహం కొద్దీ నారూపాన్ని నీకు ప్రదర్శించాను. ఇదం రూపం అంటే ఈ విశ్వరూపం. ఎలా చూపించాడు?

**ఆత్మయోగాత్** – నా మాయాశక్తివల్ల. యోగః అంటే మాయ. యోగ పదానికి అనేక అర్థాలున్నాయి. సందర్భానుసారంగా దాని అర్థాన్ని గ్రహించాలి. ఇక్కడ యోగం అంటే ఒక సంయోగం. మాయను యోగః అని ఎందుకంటారంటే, మాయలో త్రిగుణాల సంయోగం ఉంది కాబట్టి.

**సత్త్వరజస్తమస్ గుణానాం సంయోజనే యోగః శబ్ద ఉచ్యతే**

అందువల్ల యోగః అంటే మాయ; మాయ అంటే భగవంతునియొక్క మాయాశక్తి. ఆత్మ అంటే సచ్చిదానంద ఆత్మ కాదు, 'నేను' అని అర్థం. కృష్ణపరమాత్మ నాయొక్క మాయాశక్తివల్ల చూపించాను అంటున్నాడు. ఎందుకు చూపించాడు?

**ప్రసన్నేన** – నీ భక్తికి మెచ్చి, నీ శ్రద్ధకు మెచ్చి చూపించాను నీకు అంటున్నాడు. ఎలా చూపించాడు? దివ్యచక్షువులను ప్రసాదించటంద్వారా. ఎటువంటి విశ్వరూపం ప్రదర్శించాడు?

విశ్వరూపం ఒకటే. కాని పరిపక్వత చెందిన మనస్సు ఉన్నవారు విశ్వరూపాన్ని అద్భుతంగా భావిస్తే, మనస్సు పరిపక్వత చెందనివారు అదే అద్భుతాన్ని చూసి భయపడతారు. అంటే ఒకరికి ఆనందం కలిగించేది ఇంకొకరికి భీతిని గొల్పుతుంది. దీనికి రోలర్ కోస్టర్ ఉదాహరణ చెప్పవచ్చు. కొంతమంది కేరింతలు కొడుతూ పదేపదే అందులో తిరుగుతుంటే, కొంతమంది అందులో ఉండి అది తిరిగే వంపులు చూస్తుంటేనే హడలిపోతారు. అంటే ఆ వస్తువులో లేదు ఆనందం కాని, భయం కాని.

ఇక్కడ కృష్ణపరమాత్మ విశ్వరూపంయొక్క అద్భుతాన్ని వివరిస్తున్నాడు.

**తేజోమయమ్** – విశ్వరూపం చాలా ప్రకాశవంతమైనది. అనేక వేల నక్షత్రాల కూటములకు ఉండేటంత కాంతి ఉంది.

**తేజోరాశిం సర్వతో దీప్తిమంతమ్** – 11.17

అర్జునుడు కూడా అంతకుముందు నువ్వు తేజోరాశిగా, దీప్తిమంతుడిగా ఉన్నావు అన్నాడు.

**విశ్వమ్** – విశ్వం అంటే అన్నీ కలిసినది.

**వివిధ ప్రత్యయ గమ్యం విశ్వమ్**

శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలన్ని రూపాల్లోనూ తెలుసుకోగలము.

**అనంతమ్** – దేశకాలపరిమితులు లేనిది.

**ఆద్యమ్** – మొట్టమొదట సృష్టించబడినది.

**తస్మాద్విరాడజాయత విరాజో అధి పూరుషః ।**
**స జాతో అత్యరిచ్యత పశ్చాద్భూమిమథో పురః ॥** పురుష సూక్తం– 5

ముందు విశ్వరూపం వచ్చింది, దాని తర్వాత తక్కినవన్నీ వచ్చాయి. ముందు విరాట్ పుట్టాడు.

**యన్మే త్వదన్యేన న దృష్టపూర్వమ్** – నన్ను నువ్వు తప్ప ఇంతకు ముందు ఎవరూ చూడలేదు. ఓ అర్జునా, నువ్వు చాలా అదృష్టవంతుడివి, ఎవరికీ దక్కని విశ్వరూపదర్శనం నీకు దక్కింది అంటున్నాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 48 **న వేదయజ్ఞాధ్యయనైర్న దానైః న, చ క్రియాభిర్న తపోభిరుగ్రైః ।**
**ఏవంరూపః శక్య అహం నృలోకే ద్రష్టుం త్వదన్యేన కురుప్రవీర ॥**
న, వేదయజ్ఞాధ్యయనైః, న, దానైః, న, చ, క్రియాభిః, న, తపోభిః, ఉగ్రైః,
ఏవం, రూపః, శక్యః, అహమ్, నృలోకే, ద్రష్టుమ్, త్వదన్యేన, కురుప్రవీర ॥

| | | | |
|---|---|---|---|
| కురుప్రవీర! | = కురువీరులలో శ్రేష్ఠుడవైన ఓ అర్జునా! | ద్రష్టుమ్ | = చూచుటకు |
| | | న, శక్యః | = శక్యముగాను |
| నృలోకే | = మానవలోకమున | దానైః | = దానములద్వారా |
| ఏవం, రూపః | = ఇటువంటి విశ్వరూపుడనైన | న(శక్యః) | = శక్యముకాను |
| అహమ్ | = నేను | క్రియాభిః, చ | = ఇతర క్రియలద్వారాను |
| త్వదన్యేన | = నీవు వినా మరియెవ్వరిచేతను | న (శక్యః) | = శక్యముగాను |
| వేద | = కేవల వేదపఠనములచే గాని | ఉగ్రైః, తపోభిః, చ | = తీవ్రతపశ్చర్యలద్వారా కూడ |
| యజ్ఞ అధ్యయనైః | = యజ్ఞాచరణములద్వారా గాని | న (శక్యః) | = శక్యముగాను |

**హే కురు–ప్రవీర! అహమ్ ఏవం రూపః నృ–లోకే న వేద–యజ్ఞ–అధ్యయనైః**
**న, దానైః న, క్రియాభిః న, ఉగ్రైః తపోభిః చ న త్వత్ అన్యేన ద్రష్టుం శక్యః ।**

తా: కురువీరులలో శ్రేష్ఠుడవైన ఓ అర్జునా! మానవలోకమున ఇట్టి విశ్వరూపుడనైన నేను నీవు వినా మరియెవ్వరిచేతను, కేవలవేదపఠనములచే గాని, యజ్ఞాచరణములద్వారా గాని చూచుటకు శక్యముగాను. దానములద్వారా శక్యముకాను. ఇతర క్రియలద్వారాను శక్యముగాను. తీవ్రతపశ్చర్యలద్వారా కూడ శక్యము గాను.

ఇక్కడ ఎవరికీ దక్కని అదృష్టం అర్జునునికి మాత్రమే ఎందుకు దక్కిందో వివరిస్తున్నాడు కృష్ణపరమాత్మ. దానికి అర్జునుని అనన్యభక్తే కారణం. విశ్వరూపదర్శనం చేయాలంటే, దానికి అనన్యభక్తి ముఖ్యమైన సాధన అని నిరూపించటానికి, తక్కిన సాధనలను తక్కువ చేసి మాట్లాడుతున్నాడు.

ఇటువంటి పద్ధతిని శాస్త్రంలో తరచు చూస్తాము. దీన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. ఆధ్యాత్మిక సాధనలన్నీ సమానమే. సత్యం, తపస్సు, యజ్ఞం, దానం, వేదాధ్యయనం – అన్నీ సమానమే. ఒక ప్రత్యేక సందర్భంలో ఒక ప్రత్యేక సాధనను మెచ్చుకుంటుంది శాస్త్రం. ఆ సందర్భంలో తక్కిన సాధనలను కించపరచినట్టు కనిపిస్తుంది.

కాని ఆ సందర్భాలలో మనం తక్కిన సాధనలను చిన్నచూపు చూడకూడదు. అక్కడ చెబుతున్న సాధనకు ప్రాముఖ్యతను ఇవ్వాలి.

ఇలా ఒక సాధనను మెచ్చుకుంటూ, తక్కిన సాధనలను చిన్నచూపు చూడటాన్ని శాస్త్రంలో న హి నిందా న్యాయం అంటారు. అంటే, తక్కిన సాధనలను నిందించటం లేదు, ఈ సాధనను మెచ్చుకుంటున్నాము అని దాని అర్థం.

**ఋతం చ స్వాధ్యాయ ప్రవచనే చ। సత్యం చ స్వాధ్యాయ ప్రవచనే చ** – తైత్తిరీయం

తైత్తిరీయోపనిషత్తులోని శీక్షావల్లిలో ఒక సందర్భంలో ఉపనిషత్తు కొన్ని విలువల గురించి ప్రసంగిస్తూ, వాటిల్లో స్వాధ్యాయం గొప్పది అని చెబుతుంది. అందులో వచ్చిన కొన్ని విలువలు తపస్సు, ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం, యజ్ఞాలు, అతిథిసేవ, మనుష్యయజ్ఞం, పితృయజ్ఞం. వీటన్నిటిలో ఏది గొప్పది అని ఉపనిషత్తే అడిగింది. సత్యమే పలికే రాథీతర అనే ఋషి సత్యమే ముఖ్యమైనది అని నిర్ధారించాడు. తపోనిష్ఠుడైన పౌరుశిష్ఠి అనే ఋషి తపస్సే ముఖ్యమైనది అన్నాడు. నాకమద్గల్యుడనే ఋషి స్వాధ్యాయ ప్రవచనాలే ముఖ్యమన్నాడు. శ్రుతి కూడా అవును స్వాధ్యాయ ప్రవచనాలే ముఖ్యం, స్వాధ్యాయ ప్రవచనాలే అతిముఖ్యం అని నొక్కి వక్కాణిస్తుంది.

**స్వాధ్యాయ ప్రవచనే ఏవేతి నాకో మౌద్గల్యః। తద్ధి తపస్తద్ధి తపః** – తైత్తిరీయం

అదే విధంగా ఇక్కడ కృష్ణపరమాత్మ తక్కిన సాధనలన్నీ అనవసరం, భక్తి మాత్రమే ముఖ్యం అంటున్నాడు. ఇలా ఒకచోట స్వాధ్యాయనాన్ని కీర్తించి, ఇంకొకచోట భక్తిని కీర్తిస్తే, ఏది ముఖ్యం? కొంతమంది తేలికగా 'అయితే ఏదీ ముఖ్యం కాదు,' అనేస్తారు. అలా భావించకూడదు. అన్నీ ముఖ్యమే. అన్నీ ముఖ్యమే కాని, ఒక్కో సందర్భంలో ఒక్కోదాని ప్రాధాన్యతను చూస్తాము. ఈ శ్లోకంలో కృష్ణపరమాత్మ భక్తిని స్తుతించటానికి తక్కినవి లాభంలేదు అంటున్నాడు.

**వేదాధ్యయనః** – వేదాధ్యయనం చేస్తే విశ్వరూపదర్శనం అవదు.

**న యజ్ఞ (అధ్యయనైః)** – యజ్ఞాలు చేసినా కూడా లాభం లేదు. వేదాధ్యయనానికీ, యజ్ఞాధ్యయనానికీ మధ్య భేదం ఏమిటి? వేదాధ్యయనం అంటే వేదాలను పారాయణం చేయటం, నేర్చుకోవటం. యజ్ఞాలు అంటే యజ్ఞాలు ఎలా చేయాలో నేర్చుకోవటం. ఈ రెండూ విశ్వరూపదర్శనాన్ని ఇవ్వలేవు అంటున్నాడు కృష్ణపరమాత్మ. అంతేకాదు, ఇంకా ఉన్నాయి. ఏమిటవి?

**న దానైః** – దానంవల్ల కూడా కాదు. ఇది చూసి కొందరు స్వార్థపరులు వారికి తగ్గట్టుగా దీనిని మలచుకుంటారు. అసలే చూస్తూ, చూస్తూ దానం చేయలేరు కొందరు. అలాంటివారికి ఈ పదం శ్రీరామరక్షలాంటిది. కాని శీక్షావల్లిలో ఏం చూస్తాము?

**శ్రద్ధయా దేయమ్। అశ్రద్ధయాఽదేయమ్। శ్రియా దేయమ్। హ్రియా దేయమ్।**
**భియా దేయమ్। సంవిదా దేయమ్**

దానం గురించి నొక్కి చెబుతున్నది అక్కడ. అది కూడా శ్రద్ధగా చేయాలనీ, అశ్రద్ధ చేయకూడదనీ, శక్తివంచన లేకుండా చేయాలనీ, వినయంగా చేయాలనీ, పాపభయంతో చేయాలనీ, మనస్ఫూర్తిగా చేయాలనీ చెబుతుంది. అలా శాస్త్రం ఒకచోట దానం చేసితీరాలని చెబుతున్నప్పుడు ఇక్కడ కృష్ణపరమాత్మ దానంవల్ల విశ్వరూపదర్శనం అవదు అంటున్నాడంటే, ముందే చూసినట్టుగా దీన్ని న హి నిందా న్యాయం అంటారు.

**న చ క్రియాభిః** – లౌకిక కర్మలు కూడా లాభం లేదు.

**న తపోభిరుగ్రైః** – ఘోరతపస్సు చేసినా కూడా లాభం లేదు. ఉపవాసం కూడా తపస్సు కిందికే వస్తుంది. మళ్ళీ కృష్ణపరమాత్మ ఉపవాసం చేయనవసరం లేదన్నాడు, నేను చేయను అనకూడదు. ఇవన్నీ దేనికి లాభం లేదన్నాడో చూడాలి.

**ఏవం రూపః న ద్రష్టుం శక్యః** – ఏవం రూపః అంటే విశ్వరూప ఈశ్వరుడు. ఈ విశ్వరూప ఈశ్వరుణ్ణి పైన చెప్పిన సాధకులలో ఎవరూ చూడలేరు. అంటే ఒక్కొక్కదానికీ ఏవం రూపం న ద్రష్టుం శక్యః కలుపుకోవాలి. **వేదయజ్ఞాధ్యయనైః ఏవం రూపః న ద్రష్టుం శక్యః; దానైః ఏవం రూపః న ద్రష్టుం శక్యః; క్రియాభిః ఏవం రూపః న ద్రష్టుం శక్యః; తపోభిరుగ్రైః ఏవం రూపః న ద్రష్టుం శక్యః.**

**నృలోకే** – మనుష్యలోకంలో;

**త్వదన్యేన కురుప్రవీర** – నువ్వు తప్ప వేరే ఎవరూ నా విశ్వరూపాన్ని చూడలేరు అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎందుకంటే అర్జునునికి మాత్రమే ప్రత్యేకమైన అర్హత ఉంది.

అర్జునునికి మాత్రమే ఉన్న ఆ ప్రత్యేక అర్హత ఏమిటో ఇప్పుడు చెప్పడు కృష్ణపరమాత్మ. అది భక్తి. అది కూడా ఎలాంటి భక్తి? ఏడవ అధ్యాయంలో నాలుగు రకాల భక్తుల గురించి చెప్పాడు కృష్ణపరమాత్మ. అవి ఆర్తభక్తి, అర్థార్థీభక్తి, జిజ్ఞాసుభక్తి, జ్ఞానభక్తి.

ఆర్తభక్తివల్ల కుదరదు. ఆర్తభక్తిలో భక్తుడు ఏదో సమస్య ఉన్నప్పుడే ప్రార్థన చేస్తాడు. నీటి సమస్యతో ఉండి, భక్తుడు ప్రార్థన చేస్తే, భగవంతుడు నీకు దర్శనమివ్వనా అని అడిగితే, నాకు నీ దర్శనం అప్పుడే వద్దు, ముందు నా నీటిసమస్యను తీర్చు అంటాడు. అలాంటిదే అర్థార్థీభక్తి కూడా. డబ్బు కావాలని పూజ చేసే భక్తునికి, భగవంతుని దర్శనంకన్నా కూడా, డబ్బే ప్రధానంగా ఉంటుంది. జిజ్ఞాసుభక్తునికి ఏకరూప ఈశ్వరదర్శనం కావాలని ఉంటుంది. కాని విశ్వరూపదర్శనం విలువ తెలిసిన భక్తునికి ఆ దర్శనం అవుతుంది.

కురుప్రవీర అంటే అర్జునుడు. ఓ అర్జునా, నువ్వు అడిగావు కాబట్టి నీకు చూపించాను. నీకు భయం వేస్తే నా మామూలు రూపానికి వచ్చేస్తాను అంటున్నాడు వచ్చే శ్లోకంలో.

శ్లో. 49 **మా తే వ్యథా మా చ విమూఢభావో దృష్ట్వా రూపం ఘోరమీదృఙ్మమేదమ్ ।**
**వ్యపేతభీః ప్రీతమనాః పునస్త్వం తదేవ మే రూపమిదం ప్రపశ్య ॥**

మా, తే, వ్యథా, మా, చ, విమూఢభావః, దృష్ట్వా, రూపమ్, ఘోరమ్, ఈదృక్, మమ, ఇదమ్, వ్యపేతభీః, ప్రీతమనాః, పునః, త్వమ్, తత్, ఏవ, మే, రూపమ్, ఇదమ్, ప్రపశ్య ॥

| | | | |
|---|---|---|---|
| మమ | = నాయొక్క | మా | = వద్దు |
| ఈదృక్ | = ఈ విధమైన | త్వమ్ | = నీవు |
| ఇదమ్, ఘోరమ్ | = ఈ భయంకర | వ్యపేతభీః | = భయరహితుడవై |
| రూపమ్ | = రూపమును | ప్రీతమనాః | = ప్రసన్నచిత్తుడవై |
| దృష్ట్వా | = చూచి | తత్ | = ఆ |
| తే | = నీకు | మే | = నాయొక్క |
| వ్యథా | = వ్యాకులపాటు | ఇదమ్, రూపమ్, ఏవ | = ఈ చతుర్భుజరూపమునే |
| మా | = వద్దు | పునః | = తిరిగి |
| చ | = ఇంకా | ప్రపశ్య | = దర్శింపుము |
| విమూఢభావః | = మోహము గూడ | | |

**మమ ఇదమ్ ఈదృక్ ఘోరం రూపం దృష్ట్వా తే వ్యథా మా (అస్తు), విమూఢ-భావః చ మా (అస్తు) త్వం వ్యపేత-భీః ప్రీత-మనాః (భూత్వా) పునః తత్ ఏవ ఇదం మే రూపం ప్రపశ్య ।**

తా: నాయొక్క ఈ విధమైన, ఈ భయంకరరూపమును చూచి నీకు వ్యాకులపాటు వద్దు ఇంకా మోహము గూడ వద్దు. నీవు భయరహితుడవై, ప్రసన్నచిత్తుడవై ఆ నాయొక్క ఈ చతుర్భుజరూపమునే తిరిగి దర్శింపుము.

అర్జునా, నువ్వు విశ్వరూపదర్శనానికి సిద్ధంగా లేకపోతే, నిన్ను బలవంతపెట్టను అంటున్నాడు కృష్ణపరమాత్మ. మన వేదాంతబోధయొక్క గొప్పతనమే అది. శాస్త్రం ఏదీ మనమీద బలవంతంగా రుద్దదు. చాలామంది తమకు మోక్షం వద్దనుకుంటారు. మోక్షం అంటే ఏమిటో సరిగ్గా అర్థంకాక కొందరూ, మోక్షం అంటే భయం వేసి మరికొందరూ వద్దనుకుంటారు. మోక్షం అంటే అద్వైతం అంటాము. అద్వైతం అంటే ఉన్నదొక్కటే అంటాము.

ఎవరూ లేకుండా ఒంటరిగా ఎలా ఉండాలని భయం కొందరికి. నలుగురూ కావాలి, వారితో గొడవలు పడ్డా సరే. మోక్షం అంటే వీరందరితో సంగత్వం ఉండదంటే, నాకు అలాంటి మోక్షం వద్దు అంటారు కొందరు. సంగత్వం ఉంటే సమస్యలు ఉంటాయి అన్నా ఫర్వాలేదు అంటారు. అందువల్ల మోక్షాన్ని అర్థం చేసుకోవటానికే చాలా పరిపక్వత కావాలి. అందువల్ల వేదం, మోక్షం వద్దనుకుంటే సరే, దానికోసం ప్రయత్నించకు, ధర్మార్థకామాలకోసమే ప్రయత్నించు అంటుంది.

ఒక స్త్రీ, 'నాకు మోక్షం వద్దు, నాకు గోపికగా పుట్టి, కృష్ణునితో రాసలీలలలో పాల్గొనాలని ఉంది అంటుంది. మోక్షం పొందితే మరుజన్మ ఉండదంటున్నారు కదా, మరుజన్మ ఉండకపోతే, నేను గోపికా శరీరాన్ని పొందలేను,' అంటుంది ఆమె. ఇంకొక సాధకుడు, 'నాకు అప్పుడే మోక్షం వద్దు; ఒక్కసారైనా స్వర్గలోకం వెళ్ళి, కొన్నిరోజులైనా అక్కడ స్వర్గసుఖాలను అనుభవించాలి; అమృతం తాగుతూ, రంభ, ఊర్వశుల నృత్యాలను చూస్తూ ఆనందించాలి. దాని తర్వాత చూద్దాం మోక్షం సంగతి,' అంటాడు.

అలా అప్పుడే మోక్షం వద్దు అనుకునేవారిని 'ఏం ఫర్వాలేదు, తీరికగానే రండి,' అంటుంది శాస్త్రం. అలాగే ఎవరైనా విశ్వరూపదర్శనం వద్దు అంటే 'సరే ఏకరూపభక్తిలో ఉండు, అర్థకామాలకోసమే ప్రయత్నించు, కాని వాటికోసం ధర్మపరంగా ప్రయత్నించు,' అని షరతు విధిస్తుంది. జ్ఞానకాండకు రాలేకపోయినా, కర్మలోనే ఉంటానన్నా ఫర్వాలేదు. కాని కర్మను కర్మయోగంగా భావించాలి. అంటే చేసే కర్మను ఈశ్వరార్పణబుద్ధితో చేసి, దానికి ఫలంగా వచ్చిన దానిని ఈశ్వరప్రసాదబుద్ధితో స్వీకరించాలి. అలా మొదలుపెడితే, అదే నిన్ను నెమ్మదిగా మోక్షానికి దారితీస్తుంది. అదెలాగో వచ్చే అధ్యాయంలో కృష్ణపరమాత్మే అద్భుతంగా చెబుతాడు. అప్పుడు చూద్దాం ఆ వివరాలు. భక్తిలోని మొట్టమొదటి దశనుంచీ మొదలుపెట్టి భక్తి పరాకాష్ఠకు తీసుకు వెళతాడు.

**మా తే వ్యథా** – నువ్వు భయపడకు. అర్జునుడు విశ్వరూపదర్శనంలో నోళ్ళు చూసి భయపడ్డాడు కదా. అందువల్ల భయపడకు అంటున్నాడు.

**మా చ విమూఢభావః** – విమూఢత్వం అంటే స్థబ్ధత, అంటే మానసికంగా మొద్దుబారిపోవటం. హఠాత్తుగా మీ ఎదురుగా ఒక పెద్ద ఏనుగు గర్జిస్తూ నిలబడిందనుకోండి. పక్కన చూస్తే మావటి కూడా లేడు. అప్పుడెలా ఉంటుంది మీ మానసికస్థితి? అరవటానికి కూడా గొంతు లేవదు. మనస్సు స్థబ్ధంగా అయిపోతుంది. శూన్యంగా అనిపిస్తుంది. అంటే చలనం లేకుండా ఉంటారు. ఇప్పుడు అర్జునుడు కూడా అలా స్థబ్ధీభావనలో ఉన్నాడు. కృష్ణపరమాత్మ అలా ఉండకు, నీకు సహాయం చేస్తాను అంటున్నాడు.

**దృష్ట్వా రూపమ్** – నా రూపాన్ని చూసి నువ్వలా అయ్యావు. ఎటువంటి రూపం?

**ఘోరమీదృఙ్మమేదమ్** – ఈ భయంకరరూపాన్ని చూసి భయపడుతున్నావు. ఇంతకు ముందే

**తేజోమయం విశ్వమనంతమాద్యం** – 11.47

అన్నాడు. ఇప్పుడేమో ఘోరరూపం అంటున్నాడు. ఎందుకు? తేజోమయం, విశ్వం, అనంతం, ఆద్యం వర్ణన పరిపక్వత చెందిన మనస్సు గలవారికి. అర్జునుడులాగా భయపడేవారికి అది ఉగ్రరూపమే.

ఉదాహరణకు కొంతమంది రక్తం చూస్తే కళ్ళు తిరిగి పడిపోతారు. ఒకవేళ డాక్టరు అలా కళ్ళు తిరిగి పడిపోతే, ఆపరేషను చేయగలడా? అంటే ఒకరికి ఘోరంగా కనిపించినది, ఇంకొకరికి అద్భుతంగా కనిపిస్తుంది. అర్జునునికి విశ్వరూపం ఘోరంగా కనిపించింది కాబట్టి, ఏం చేస్తున్నాడు?

**త్వం తదేవ మే రూపమిదం ప్రపశ్య** – నా మామూలు రూపం చూద్దువు గాని. ఎప్పుడు?

**పునః** – మళ్ళీ. అనేకరూప ఈశ్వరునినుంచి ఏకరూప ఈశ్వరుడికి వచ్చేద్దాము. ఏకరూప ఈశ్వరుణ్ణి ఎలా చూస్తావు?

**వ్యపేతభీః** – ఏమాత్రం భయం లేకుండా;

**ప్రీతమనాః** – ప్రసన్నచిత్తుడవై ఏకరూపాన్ని చూద్దువు గాని. పునః అంటే మళ్ళీ అని చూశాము. అంటే పదవ

అధ్యాయం వరకూ ఏకరూప ఈశ్వరుణ్ణే చూశాడు. ఇప్పుడు విశ్వరూపదర్శనం అయింది. మళ్ళీ ఛానెల్ మార్చి, పాతదానికే వెళ్ళిపోదాము.

**సంజయ ఉవాచ**

శ్లో. 50 **ఇత్యర్జునం వాసుదేవస్తథోక్త్వా స్వకం రూపం దర్శయామాస భూయః ।**
**ఆశ్వాసయామాస చ భీతమేనం భూత్వా పునః సౌమ్యవపుర్మహాత్మా ॥**

ఇతి, అర్జునమ్, వాసుదేవః, తథా, ఉక్త్వా, స్వకమ్, రూపమ్, దర్శయామాస, భూయః
ఆశ్వాసయామాస, చ, భీతమ్, ఏనమ్, భూత్వా, పునః, సౌమ్యవపుః, మహాత్మా ॥

| | | | |
|---|---|---|---|
| వాసుదేవః | = వాసుదేవుడు | పునః | = తర్వాత |
| అర్జునమ్ | = అర్జునునితో | మహాత్మా | = మహాత్ముడైన శ్రీకృష్ణుడు |
| ఇతి, ఉక్త్వా | = ఈ విధముగా పలికి | సౌమ్యవపుః | = సౌమ్యస్వరూపుడై |
| భూయః | = అనంతరము | భూత్వా | |
| తథా | = అదే విధముగా | భీతమ్, ఏనమ్ | = భయపడుచున్న ఈ అర్జునుని |
| స్వకమ్, రూపమ్ | = తన చతుర్భుజరూపమును | అశ్వాసయామాస | = ఓదార్చెను |
| దర్శయామాస | = దర్శింపజేసెను | | |
| చ | = ఇంకా | | |

**సంజయః ఉవాచ**
**మహాత్మా వాసుదేవః ఇతి తథా అర్జునమ్ ఉక్త్వా భూయః స్వకం రూపం దర్శయామాస ।**
**పునః చ సౌమ్య-వపుః భూత్వా, భీతమ్ ఏనమ్ ఆశ్వాసయామాస ।**

తా: వాసుదేవుడు అర్జునునితో ఈ విధముగా పలికి అనంతరము అదే విధముగా తన చతుర్భుజరూపమును దర్శింపజేసెను ఇంకా తర్వాత మహాత్ముడైన శ్రీకృష్ణుడు సౌమ్యస్వరూపుడై భయపడుచున్న ఈ అర్జునుని ఓదార్చెను.

అర్జునుడు నీ విశ్వరూపదర్శనాన్ని శాంతించు అని కోరాడు; కృష్ణపరమాత్మ కూడా అంగీకరించాడు. ఆ మార్పు జరుగుతుండగా నిశ్శబ్దం ఆవరించింది. ఇద్దరిలో ఎవరూ మాట్లాడటం లేదు. అందువల్ల మళ్ళీ సంజయుడు అందుకుని సన్నివేశాన్ని వివరిస్తున్నాడు.

**సంజయ ఉవాచ** – సంజయుడు వివరిస్తున్నాడు.

**వాసుదేవః అర్జునమ్ ఇతి ఉక్త్వా** – వాసుదేవుడు అర్జునునితో ఈ విధంగా చెప్పాక. ఇక్కడ కూడా వాసుదేవ పదాన్ని సందర్భానికి తగ్గట్టుగా వేశాడు. వాసుదేవుడు అంటే వసుదేవుని కుమారుడు.

**వసుదేవస్య పుత్రః వాసుదేవః**

వాసుదేవుడు ఏకరూపమా, అనేకరూపమా? ఏకరూపం. వసుదేవుని పుత్రుడైన కృష్ణపరమాత్మ.

**స్వకం రూపం దర్శయామాస భూయః** – మళ్ళీ తన పూర్వరూపాన్ని ప్రదర్శించాడు. స్వకం రూపం అంటే ఏకరూపం; కృష్ణరూపం. అనేకరూపంనుంచి ఏకరూపానికి వచ్చాడు.

**ఆశ్వాసయామాస చ భీతమేనం** – కృష్ణపరమాత్మ తన రూపాన్ని అనేకరూపంనుంచి ఏకరూపానికి మార్చినా కూడా, అర్జునునిలో ఉన్న భయం పూర్తిగా తొలగిపోలేదు.

ఒక చిన్నబాబు తల్లికోసం బెంగ పెట్టుకుని, చాలాసేపు ఏడ్చాడనుకోండి. తల్లి వచ్చి అతనిని ఎత్తుకుంటే పెదవులమీద చిరునవ్వు మెరుస్తుంది కాని, కొంతసేపటివరకూ కళ్ళనుంచి కారే కన్నీరు ఆగదు, ఎక్కిళ్ళు ఆగవు. తల్లి బుజ్జగిస్తుంది, 'నేను వచ్చేశాను కదా,' అంటూ. అలాగే రాత్రి ఒక భయంకరమైన పీడకల కన్నారనుకోండి. ఆ నిద్రలోంచి భయంతో ఉలిక్కిపడి లేస్తారు. లేచాక కూడా ఆ భయం పోదు. లేచాక కూడా ఒళ్ళంతా చెమటలు పట్టేస్తాయి, భయంతో గుండె ఎగసిపడుతుంది. నోటమాట రాదు. ఇప్పుడు అర్జునుని పరిస్థితీ అలాగే ఉంది. తల్లి భయపడ్డ పిల్లవాడిని ఓదార్చినట్టుగా, కృష్ణపరమాత్మ అర్జునున్ని ఓదారుస్తున్నాడు.

భీతమ్ ఏనమ్ – భయపడిన అర్జునున్ని;

ఆశ్వాసయామాస – కృష్ణపరమాత్మ ఓదార్చాడు. ఎలా?

**సౌమ్యవపుః భూత్వా** – సౌమ్యరూపం ధరించి. ముందు ఘోరరూపం అన్నాడు. ఇప్పుడు సౌమ్యరూపం దాల్చాడు.

**మహాత్మా** – అంటే అనేకరూప ఈశ్వరుడు. విశ్వరూపుడు.

ఇక్కడ కూడా ఒక విషయాన్ని జాగ్రత్తగా గమనించాలి మనం. విశ్వరూపాన్ని ఉపశమించి, తన పూర్వరూపం ధరించాడు అంటే నిజంగా విశ్వరూపాన్ని ఉపశమించినట్టు తీసుకోకూడదు. ఎందుకంటే, ఇంతకుముందు విశ్వరూపం అంటే ఏమన్నాం? ఈ విశ్వాన్ని శరీరంగా ధరించటం అన్నాము. అంటే విశ్వరూపదర్శనం అంటే ఈ విశ్వమంతటా భగవంతుణ్ణి దర్శించటం. విశ్వమే భగవంతుడు కాబట్టి, విశ్వరూప ఈశ్వరునికి రాక, పోకలు లేవు. విశ్వరూపదర్శనం పోయింది అంటే విశ్వం కూడా మాయమైపోయినట్టు అవుతుంది. అంటే ప్రళయం వచ్చినట్టు అవుతుంది. ప్రళయం వస్తే విశ్వం లేదు, కురుక్షేత్రం లేదు, అర్జునుడు లేడు, భీష్మద్రోణాదులు లేరు. నిజానికి గీత పన్నెండవ అధ్యాయం కూడా ఉండదు.

విశ్వరూపదర్శనాన్ని ఉపశమించాడు అంటే అర్జునునికి ప్రసాదించిన దివ్యచక్షువును తీసేసాడు. అంటే అర్జునుని మనస్సులో మార్పు తెచ్చాడు. దివ్యచక్షువులంటే ఏమిటో కూడా చూశాము. దివ్యచక్షువులు అంటే అహంకార మమకారాలకు లోనుగాని అంతరాత్మ. అహం మమ ఉచ్చులో ఇరుక్కుపోయిన మనస్సు విశ్వరూపదర్శనాన్ని చేయలేదు. మనస్సు పరిధి పరిమితంగా ఉంటుంది; సమష్టిదర్శనం చేయలేదు.

అంతకుముందు కూడా చూశాము. ఒక కొండ దగ్గర నిలుచున్న మనిషి ఫోటో తీయాలనుకున్నారు మీరు. కొండా–మనిషీ ఇద్దరూ రారు. మనిషిని దగ్గరగా తీయాలనుకుంటే, కొండ సరిగ్గా రాదు; కొండను బాగా

చూపించాలనుకుంటే మనిషి సరిగ్గా రాడు. అంటే అహంకారమమకారాలు రాజ్యమేలుతుంటే, కొండలు కూడా కనిపించవు. అవి మాయమయితేనే విశ్వరూపదర్శనం అవుతుంది.

అహంకారమమకారాలకు గొప్ప ఉదాహరణ పాఠశాల వార్షికోత్సవాలు. ఆ వార్షికోత్సవంలో తమ పిల్లలది ఏదైనా నాటకం ఉంటే, ఆ నాటకం జరుగుతుండగా కొంతమంది తల్లిదండ్రులు కెమెరా పట్టుకుని హడావుడిగా ముందుకు పరిగెడతారు. ఆ డ్రామా అయ్యేంతవరకూ అక్కడే తచ్చాడి, అనేక ఫోటోలను తీసుకుని, అది అవగానే ముందునుంచే కాదు, మొత్తం హాలునుంచే మాయమైపోతారు. వారి పిల్లలపాత్ర అయిపోగానే, వారికి ఆ వార్షికోత్సవంమీద ఉత్సాహం కూడా మటుమాయమైపోతుంది.

వారి పిల్లవాడు వేస్తున్న వేషం చాలా చిన్నదై ఉండవచ్చు. అది ద్వారపాలకుని వేషమే అయి ఉండవచ్చు. చేతిలో పెద్ద బల్లెం పట్టుకుని నిలబడతాడు తప్పితే, అతని పాత్రకేమీ సంభాషణ ఉండదు. రాజు దర్బారులోకి అడుగుపెట్టినప్పుడు ఆ బల్లెం ఎత్తి పట్టుకుంటాడు అంతే. అంటే అతని పాత్రపోషణ కాలం రెండు నిముషాలు. కాని ఆ రెండు నిముషాల కాలమే తల్లిదండ్రులకు అపురూపం. వారిది ద్వారపాలకదృష్టి మాత్రమే. రాజు మొహం కూడా చూడరు; కథ ఏమిటో పట్టించుకోరు. విశ్వరూపదర్శనం లేదు అంటే మొత్తం నాటకదర్శనం లేదు; కేవలం ఒక మూల నిలిచిన బాబు దర్శనమే ఉంటుంది. 'మా అబ్బాయి' డ్రామాలో వేశాడు. ఆ సంబరం చాలు. అంటే ద్వారపాలకదృష్టిలో పడి నాటకాన్ని కూడా త్యాగం చేస్తున్నారు.

ఒక చిన్న నాటకంలో నావాడు అనే మమేకంలో పడిపోయి, నాటకాన్ని చూడలేకపోతే మనకు జగన్నాటకంలో విశ్వరూపదర్శనం ఎలా జరుగుతుంది? మన పరిధి చాలా సంకుచితమైనది. మొత్తం విశ్వాన్ని దర్శించాలంటే దివ్యచక్షువులు ఉండాలి.

మనం ప్రకృతి ఒడిలో ఉన్నా, అంటే అనంతసాగరం ముందు నిలుచుని, ఎగసిపడుతున్న అలలను చూస్తున్నా లేదా ఆకాశంలో వెన్నెల కురిపిస్తున్న చంద్రుణ్ణి, మిలమిల మెరుస్తున్న నక్షత్రాలను చూస్తున్నా కూడా అహంకార మమకారాలలో కూరుకుపోతే, వాటి అందాలను ఆస్వాదించే పరిస్థితిలో ఉండము. అవన్నీ విశ్వరూపంలోకి వస్తాయి. దాన్ని చూడటానికి దివ్యచక్షువులు కావాలి.

ఇప్పుడు అర్జునునికి ఆ దివ్యచక్షువులను తీసేశాడు కృష్ణపరమాత్మ. దానితో అర్జునుడు మళ్ళీ నేను, నావారు అనే అహంకారమమకారాల్లో పడిపోయాడు.

**అర్జున ఉవాచ**

శ్లో. 51 **దృష్ట్వేదం మానుషం రూపం తవ సౌమ్యం జనార్దన ।**
**ఇదానీమస్మి సంవృత్తః సచేతాః ప్రకృతిం గతః ॥**
దృష్ట్వా, ఇదమ్, మానుషమ్, రూపమ్, తవ, సౌమ్యమ్, జనార్దన,
ఇదానీమ్, అస్మి, సంవృత్తః, సచేతాః, ప్రకృతిమ్, గతః ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| జనార్దన! | = | ఓ కృష్ణా! | దృష్ట్వా | = | చూచి |
| తవ | = | నీయొక్క | ఇదానీమ్ | = | ఇప్పుడు నేను |
| ఇదమ్, సౌమ్యమ్ | = | ఈ విధమైన సౌమ్యమైన | సచేతాః, సంవృత్తః అస్మి | = | కుదుటబడిన మనస్సు గలవాడనైతిని |
| మానుషమ్, రూపమ్ | = | మానవాకృతిని | ప్రకృతిమ్ | = | నా సహజస్థితిని |
| | | | గతః | = | పొందాను |

**అర్జున ఉవాచ**
**హే జనార్దన! తవ ఇదం మానుషం సౌమ్యం రూపం దృష్ట్వా**
**(అహం) ఇదానీం సచేతాః సంవృత్తః అస్మి ప్రకృతిం గతః (అస్మి) ।**

తా: ఓ కృష్ణా! నీయొక్క ఈ విధమైన సౌమ్యమైన మానవాకృతిని చూచి ఇప్పుడు నేను కుదుటబడిన మనస్సు గలవాడనైతిని ఇంకా నా సహజస్థితిని పొందాను.

అర్జునుడు మళ్ళీ కృష్ణపరమాత్మను తనకు తెలిసిన ఏకరూప ఈశ్వరునిగా చూసేసరికి ఆనందిస్తున్నాడు. అతనికి విశ్వరూపం చూస్తే భయం వేసిందని చూశాము. అనేకరూపభక్తినుంచి మళ్ళీ వెనక్కి ఏకరూపభక్తికి వస్తాడు.

దీన్నుంచి ఒక విషయం స్పష్టమవుతుందని చూశాము. అనేకరూపభక్తి చూపాలంటే మనస్సు పరిపక్వత చెందాలి; లేకపోతే అనేకరూపభక్తి భయం కలిగిస్తుంది. అసలు ఆనందించలేరు. అనేకరూపభక్తే భయం కలిగిస్తే, ఇంక అరూపభక్తికి ఎలా వస్తారు? నిర్గుణబ్రహ్మ నచ్చదు. ఉప్పు, కారం లేని చప్పిడి తిండి ఎలా తినలేరో, అలా కొందరికి శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు లేని నిర్గుణబ్రహ్మ ఆకర్షణీయంగా ఉండదు. అందువల్ల కొందరికి ఏకరూపభక్తే నచ్చుతుంది. అలాగే అర్జునుడు కూడా ఏకరూపభక్తినే ఇష్టపడుతున్నాడు.

**జనార్దన** – ఓ జనార్దనా అంటున్నాడు. నిజానికి జనార్దన అంటే భయం కలిగించేవాడు అని అర్థం.

**జనాన్ అర్దయతి ఇతి జనార్దనః**

ఇంతకుముందే అర్జునుడు అందరినీ తినేస్తున్న భీకరరూపం చూసి భయపడ్డాడు కాబట్టి జనార్దనా అని సంబోధిస్తున్నాడు.

**దృష్ట్వేదం మానుషం రూపం తవ సౌమ్యమ్** – ఇప్పుడు నీ అతిసౌమ్యమైన మానవరూపాన్ని చూసాను.

**ఇదానీమస్మి సంవృత్తః** – ఇప్పుడు నేను మామూలు స్థితికి వచ్చాను.

**సచేతాః** – నా మనస్సు కుదుటపడింది. అంతకుముందు చేష్టలు ఉడిగినవాడిలా, స్థబ్దుడైపోయాడని చూశాము. అంతకుముందు మాయమైన నా మనస్సు మళ్ళీ వెనక్కి వచ్చింది అంటున్నాడు.

**ప్రకృతిం గతః** – నేను నా సహజస్థితిని పొందాను.

**శ్రీభగవాన్ ఉవాచ**

శ్లో. 52 **సుదుర్దర్శమిదం రూపం దృష్టవానసి యన్మమ ।**
**దేవా అప్యస్య రూపస్య నిత్యం దర్శనకాంక్షిణః ॥**
సుదుర్దర్శమ్, ఇదమ్, రూపమ్, దృష్టవాన్, అసి, యత్, మమ,
దేవాః, అపి, అస్య, రూపస్య, నిత్యమ్, దర్శనకాంక్షిణః ॥

| | | | |
|---|---|---|---|
| మమ | = నాయొక్క | దేవాః, అపి | = దేవతలు గూడ |
| యత్, రూపమ్ | = ఏ విశ్వరూపాన్ని | నిత్యమ్ | = సదా |
| దృష్టవాన్, అసి | = నీవు చూచియుంటివో | అస్య, రూపస్య | = ఈ రూపముయొక్క |
| ఇదమ్ | = ఈ విశ్వరూపము | దర్శనకాంక్షిణః | = దర్శనకాంక్షతో నిరీక్షించుచుండువారే! |
| సుదుర్దర్శమ్ | = దర్శించుటకు దుర్లభమైనది | | |

**శ్రీభగవాన్ ఉవాచ**
**యత్ మమ సుదుర్దర్శమ్ ఇదమ్ రూపం దృష్టవాన్ అసి, అస్య రూపస్య దేవాః అపి నిత్యం దర్శన-కాంక్షిణః (సన్తి) ।**

తా: నాయొక్క ఏ విశ్వరూపమును నీవు చూచియుంటివో ఈ విశ్వరూపము దర్శించుటకు దుర్లభమైనది. దేవతలు గూడ సదా ఈ రూపముయొక్క దర్శనకాంక్షతో నిరీక్షించుచుండువారే!

కృష్ణపరమాత్మ విశ్వరూపదర్శన గొప్పదనం వర్ణించటంతో ముగిస్తున్నాడు ఈ అధ్యాయాన్ని. అర్జునుడు భయపడ్డా కూడా, ఇది చాలా అపురూపమైన వరం.

**ఇదం రూపం సుదుర్దర్శమ్** – ఈ రూపాన్ని అంటే విశ్వరూపాన్ని. ఈ విశ్వరూపాన్ని దర్శించటం చాలా అరుదైన విషయం.

**దృష్టవానసి యన్మమ** – ఏ రూపాన్ని నువ్వు చూశావో, అది దుర్లభం. అర్జునుడు చూడగలిగాడు అంటే అతనికి పూర్తి అర్హత ఉండి కాదు, అతని భక్తివల్ల. భగవంతునికి అతనిమీద ఉన్న కృపవల్ల. ఆ దర్శనం ఎందుకు కష్టమో కృష్ణపరమాత్మే వర్ణిస్తున్నాడు.

**దేవా అప్యస్య రూపస్య నిత్యం దర్శనకాంక్షిణః** – దేవతలు కూడా ఈ విశ్వరూపదర్శనం పొందాలని ఉత్సాహంతో ఎదురుచూస్తున్నారు. దేవతలకే కష్టమైతే ఇంక మానవమాత్రుల గురించి వేరే చెప్పాలా? దానికోసం వారు నిత్యం ప్రార్థిస్తున్నారు. అటువంటి అపురూపమైన దర్శనాన్ని అర్జునుడు పొందాడు.

శ్లో. 53 **నాహం వేదైర్న తపసా న దానేన న చేజ్యయా ।**
**శక్య ఏవంవిధో ద్రష్టుం దృష్టవానసి మాం యథా ॥**
న, అహమ్, వేదైః, న, తపసా, న, దానేన, న, చ, ఇజ్యయా,
శక్యః, ఏవంవిధః, ద్రష్టుమ్, దృష్టవాన్, అసి, మామ్, యథా ॥

| | | | |
|---|---|---|---|
| యథా | = ఏ విధముగా | న, శక్యః | = వీలుకాదు |
| మామ్ | = నా విశ్వరూపమును | తపసా | = తపస్సుచే |
| దృష్టవాన్, అసి | = చూశావో | న (శక్యః) | = వీలుకాదు |
| ఏవం విధః | = ఈ విధమైన విశ్వరూపముతో | దానేన | = దానముచేత |
| అహమ్ | = నేను | న(శక్యః) | = వీలుకాదు |
| వేదైః | = వేదపూర్వముద్వారా | ఇజ్యయా, చ | = యజ్ఞాచరణముద్వారా గూడ |
| ద్రష్టుమ్ | = చూచుటకు | న(శక్యః) | = వీలుకాదు |

**(త్వం) యథా మాం దృష్టవాన్ అసి, ఏవం విధః అహం న వేదైః,**
**న తపసా, న దానేన, న చ ఇజ్యయా ద్రష్టుం శక్యః (అస్మి)।**

తా: ఏ విధముగా నా విశ్వరూపమును చూశావో ఈ విధమైన విశ్వరూపముతో నన్ను వేదపూర్వముద్వారా చూచుటకు వీలుకాదు. తపస్సుచే వీలుకాదు. దానముచేతను వీలుకాదు. యజ్ఞాచరణముద్వారా గూడ వీలుకాదు.

ముందు శ్లోకంలో విశ్వరూపదర్శనం చాలా అరుదైన అవకాశం అని కృష్ణపరమాత్మ వివరించాడు. సహజంగా మనలో కుతూహలం కలుగుతుంది. అయితే ఆ దర్శనాన్ని పొందటానికి ఏం చేయాలి? దేవతలకు కూడా లభించని దర్శనభాగ్యం మనకు కలుగుతుందా? కలగాలంటే ఏం చేయాలి? ఏం చేయాలో ఈ శ్లోకంలోనూ, తర్వాత వచ్చే శ్లోకంలోనూ చెబుతున్నాడు కృష్ణపరమాత్మ.

దానికి ఒక్కటే మార్గముంది. అది భక్తి. అది కూడా ఆషామాషీ భక్తి కాదు. తీవ్రభక్తి అయివుండాలి. ఈ తీవ్రభక్తిని స్తుతించటానికి, తక్కిన సాధనలను నిందిస్తున్నాడు కృష్ణపరమాత్మ. ఇంతకుముందే చూసినట్టుగా, అవి తక్కువ సాధనలు కావు. అన్నీ సమానమే. కాని ఒక సందర్భానికి ఒక సాధన సరిపోతుంది, అందువల్ల ఆ సాధనను మెచ్చుకుంటూ తక్కిన వాటిని నిందిస్తారు. దీన్ని **న హి నిందా న్యాయం** అంటారని చూశాము. ఇప్పుడు మళ్ళీ కొన్ని సాధనలను విమర్శిస్తున్నాడు కృష్ణపరమాత్మ. ఏమిటవి?

**వేదైః** – వేదపండితుడైనా కూడా. వేదపండితులలో వారు పారాయణం చేసే పద్ధతులనుబట్టి క్రమవిత్తులనీ, జటావల్లభులనీ, ఘనపాఠీలనీ అంటారు. కాని ఎంత గొప్ప వేదపండితులైనా,

**ఏవం విధః అహం ద్రష్టుం న శక్యః** – నా ఈ రూపాన్ని (విశ్వరూపాన్ని) చూడలేరు. ఈ పాదాన్ని తక్కిన అన్ని సాధనలకూ కలుపుకోవాలి.

**న తపసా** – తపస్సువల్ల చూడలేరు.

**న దానేన** – దానం చేసినా చూడలేరు. తపస్సువల్ల ఈ విశ్వరూపాన్ని చూడలేరు; దానం చేసినా ఈ విశ్వరూపాన్ని చూడలేరు. ముందే చెప్పినట్టుగా వీటిని తీసుకుని అదుగో, కృష్ణపరమాత్మే దానం చేయనవసరం లేదన్నాడు; తపస్సు చేయనవసరం లేదన్నాడు; యజ్ఞం చేయనవసరం లేదన్నాడు అనకూడదు.

**న చ ఇజ్యయా** – ఇజ్యయా అంటే యజ్ఞంవల్ల. యజ్ఞాలు చేసినా కూడా విశ్వరూపదర్శనం కలగదు.

**తం వేదానువచనేన దానేన యజ్ఞేన తపసా** – బృహదారణ్యకం

వీటన్నిటినీ పొగిడింది బృహదారణ్యకం. అలాగే తైత్తిరీయంలో దానం ఎలా ఇవ్వాలో చెప్పిందని చూశాము. అందువల్ల వాటిని పూర్తిగా మానేయకూడదు.

వేదాభ్యాసం, తపస్సు, దానం, యజ్ఞం చేసినవారికి కూడా దక్కని విశ్వరూపదర్శనం అర్జునునికి కలిగింది. కాని బాధాకరమైన విషయం ఏమిటంటే అర్జునుడు ఆ రూపాన్ని చూసి భయపడ్డాడు.

**దృష్టవానసి మాం యథా** – నువ్వు కొన్ని నిముషాల క్రిందట చూసిన విశ్వరూపాన్ని తక్కిన సాధకులు చూడలేరు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

కాని ఏ సాధన ఉపయోగపడుతుందో ఇంకా చెప్పలేదు. అది వచ్చే శ్లోకంలో చెబుతాడు.

శ్లో. 54 **భక్త్యా త్వనన్యయా శక్య అహమేవంవిధోఽర్జున ।**
**జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుం చ పరంతప ॥**
భక్త్యా, తు, అనన్యయా, శక్యః, అహమ్, ఏవంవిధః, అర్జున,
జ్ఞాతుమ్, ద్రష్టుమ్, చ, తత్త్వేన, ప్రవేష్టుమ్, చ, పరంతప ॥

| | | | |
|---|---|---|---|
| తు | = అయితే | తత్త్వేన, జ్ఞాతుమ్ | = తత్త్వజ్ఞానముద్వారా తెలుసుకొనుటకును |
| పరంతప! | = ఓ పరంతపా! | చ | = అలాగే |
| అర్జున | = అర్జునా! | ప్రవేష్టుమ్, చ | = అందు ఏకీభావస్థితిని పొందుటకును |
| అనన్యయా, భక్త్యా | = అనన్యభక్తిద్వారా | శక్యః | = సాధ్యుడనగుదును |
| ఏవంవిధః | = ఇటివంటి విశ్వరూపుడనైన | | |
| అహమ్ | = నేను | | |
| ద్రష్టుమ్ | = దర్శించుటకు | | |

**హే పరన్తప అర్జున! అహమ్ ఏవమ్–విధః తత్త్వేన జ్ఞాతుం చ**
**ద్రష్టుం ప్రవేష్టుం చ అనన్యయా భక్త్యా తు శక్యః ।**

తా: అయితే ఓ పరంతపా! అర్జునా! విశ్వరూపుడనైన నన్ను దర్శించుటకు, తత్త్వజ్ఞానముద్వారా తెలుసుకొనుటకును అలాగే అందు ఏకీభావస్థితిని పొందుటకును అనన్యభక్తిద్వారా మాత్రమే సాధ్యమౌతుంది.

ఈ శ్లోకంలో విశ్వరూపదర్శనం చేసుకోగలిగే సాధనను వివరిస్తున్నాడు. అది భక్తి. ఎటువంటి భక్తి?

కృష్ణపరమాత్మ అనన్యభక్తి అంటున్నాడు. అనన్యభక్తి ఉన్న వ్యక్తి మాత్రమే విశ్వరూపదర్శనాన్ని చేసుకోగలడు.

అనన్యభక్తి అంటే ఏమిటి? ఏడవ అధ్యాయంలో నాలుగు రకాల భక్తులను వివరించాడని చూశాము. అవి

ఆర్తభక్తి, అర్థార్థీభక్తి, జిజ్ఞాసుభక్తి, జ్ఞానీభక్తి. ఈ నాలుగింటినీ మూడుగా తగ్గించవచ్చు. అంటే ఆర్తభక్తిని, అర్థార్థీభక్తిని కలిపి ఒకటిగా చూడవచ్చు.

**సకామభక్తి** – ఆర్తభక్తి, అర్థార్థీభక్తిని కలిపి సకామభక్తి అంటారు. లౌకిక విజయాలు పొందటానికి భగవంతుణ్ణి ఒక మార్గంగా వాడతారు ఈ భక్తులు. ఈ భక్తులు పూజ చేస్తారు. గుడికి వెళతారు, అన్నీ చేస్తారు కాని, కోరికతో చేస్తారు. నాకు ఫలానా కోరిక తీరితే, నీకు కొబ్బరికాయ కొడతాను అంటారు. అంటే వీరిది వ్యాపారభక్తి. అందులో కూడా భగవంతునికి వారు ఇద్దామని అనుకున్నది ముందే ఇవ్వరు. వారి కోరిక తీరితేనే ఇస్తామంటారు. అంటే భగవంతుణ్ణి నమ్మటానికి కూడా వారు సిద్ధంగా లేరన్నమాట. పోనీ అని వారు చెల్లిస్తామన్న ముడుపు అయినా ఖరీదైనదా అంటే అదీ కాదు. ఇది మొదటిరకం భక్తి, వ్యాపారభక్తి లేదా సకామభక్తి.

అసలు భక్తి లేకపోయేకన్నా, సకామభక్తి నయమే. ఈ భక్తివల్ల మనస్సు అంతకంతకూ శుద్ధం అవుతూ వస్తుంది. త్వరలోనే వీరు తమ మార్గాన్ని మార్చుకుంటారు. భగవంతుణ్ణి తమ లక్ష్యాలు తీర్చుకునేందుకు మార్గంగా చూడకూడదు; భగవంతుణ్ణే అంతిమలక్ష్యంగా చూడాలని అర్థం చేసుకుంటారు. ఎందుకంటే, ఏ కర్మఫలాన్ని చూసినా దానికి మూడు దోషాలుంటాయని గ్రహిస్తారు. వీటిని ఉపనిషత్తుల్లో నేర్చుకుంటాము. అవి – దుఃఖమిశ్రితత్వం, అతృప్తికరత్వం, బంధకత్వం.

దుఃఖమిశ్రితత్వం అంటే ఏది పొందినా కూడా అది ఆనందంతో పాటు, దుఃఖాన్ని కూడా తీసుకువస్తుంది. అతృప్తికరత్వం అంటే ఎంత ఉన్నా తృప్తి తీరదు; ఇంకా ఇంకా కావాలని అనిపిస్తుంది. కోరికలు అనంతం అంటారు. బంధకత్వం అంటే నావాడు, నా వస్తువులు అనే బంధం ఏర్పరచుకుని, వారు లేదా ఆ వస్తువులు లేకపోతే ఉండలేని పరిస్థితికి చేరుకుంటాము. ఆ విధంగా లౌకికవిషయాల్లో ఏ ఫలం పొందినా కూడా అవి నాకు శాశ్వతమైన ఫలాన్ని ఇవ్వలేవు; భగవంతుడొక్కడే ఇవ్వగలడని గ్రహించుకుంటారు.

> **శశ్వన్ నశ్వరమేవ విశ్వమఖిలం నిశ్చిత్య వాచా గురోర్**
> **నిత్యం బ్రహ్మ నిరంతరం విమృశతా నిర్వ్యాజ శాంతాత్మనా** – మనీషా పంచకమ్ 3

నిత్యానిత్యవస్తువివేకం కలుగుతుంది. జగత్తు అనిత్యం, ఈశ్వరుడు మాత్రమే శాశ్వతం. అందువల్ల ఈశ్వరునిమీదనే ఆధారపడాలని నేర్చుకుంటారు.

**జిజ్ఞాసుభక్తి** – ఎప్పుడైతే ఈ నిత్యానిత్యవస్తువివేకం కలుగుతుందో, అప్పుడే ఆ భక్తుని మార్గం మారుతుంది. అంతకుముందు జగత్తు లక్ష్యం, భగవంతుడు ఆ లక్ష్యాన్ని పొందేందుకు మార్గం అనుకున్న వ్యక్తి కాస్తా, ఇప్పుడు భగవంతుడు లక్ష్యం, జగత్తు ఆ భగవంతుణ్ణి పొందేందుకు మార్గమని అర్థం చేసుకుంటాడు. గృహస్థ ధర్మాలు, బంధువులు, వస్తువులు – అన్నీ అతనికి సాధన అంశాలు అవుతాయి. భగవంతుడు మాత్రమే సాధ్యం అవుతాడు. వేదాంతం భగవంతుణ్ణి బ్రహ్మ అంటే, పురాణాలు ఈశ్వరుడు అంటాయి.

భగవంతుణ్ణి సాధ్యంగా, జగత్తును సాధనంగా భావించే ఈ రెండవస్థాయి భక్తిని కృష్ణపరమాత్మ ముముక్షుత్వ భక్తి అన్నాడు. ఇక్కడ అనన్యభక్తి అంటున్నాడు. ఈ అనన్యభక్తి ఉంటే విశ్వరూపదర్శనం చెయ్యగలుగుతాడు. ఇది

నెమ్మదిగా మూడవస్థాయి భక్తికి తీసుకువెళుతుంది. అది ఇక్కడ చెప్పలేదు, కాని అంశం పూర్తిగా తెలియటంకోసం మనం చూద్దాము.

**జ్ఞానీభక్తి** – జ్ఞానీభక్తునికి భగవంతుడు సాధ్యవస్తువూ కాదు, సాధనా కాదు; సాధకుడు అయిన తనే బ్రహ్మ. భగవంతుడు సిద్ధవస్తువు. భగవంతుణ్ణి సాధనగా గానీ, సాధ్యంగా గానీ చూసినన్నాళ్ళూ అది ద్వైతభక్తి అవుతుంది. కాని జ్ఞాని ద్వైతంనుంచి అద్వైతంలోకి వస్తాడు. భగవంతుడు ప్రయాణం చేసి అందుకోవాల్సిన గమ్యం కాదు; ప్రయాణం చేసే సాధకుడే భగవంతుడు. అంటే అహం బ్రహ్మ అస్మి అని నేర్చుకుంటాడు. నేను అంటే చైతన్యస్వరూపుణ్ణి అయిన నేను. చైతన్యపరంగా నేనూ, బ్రహ్మ ఒక్కటే అనే అపరోక్షజ్ఞానాన్ని పొందుతాడు.

ఇది చివరిదశ, కాని ఇప్పుడు మనం మధ్యమదశను మాత్రమే చూస్తున్నాము. అంటే అనన్యభక్తిని మాత్రమే చూస్తున్నాము. అనన్యభక్తిలో భగవంతుడు సాధ్యం అని చూశాము.

**అనన్యయా భక్త్యా అహమ్ ఏవంవిధః ద్రష్టుం శక్యః** – అనన్యభక్తిద్వారా మాత్రమే నా విశ్వరూపదర్శనం సాధ్యమవుతుంది. అది ఎక్కడికి దారితీస్తుంది?

**తత్త్వేన జ్ఞాతుం (శక్యః)** – కాలక్రమేణా భగవంతునియొక్క స్వరూపజ్ఞానం కలుగుతుంది. భగవంతుని స్వరూపం అంటే బ్రహ్మ సాధనం కాదు, సాధ్యం కాదు, సాధకుడైన నేనే. అహం బ్రహ్మ అస్మి.

తత్త్వేన ద్రష్టుమ్ అంటే అద్వైతజ్ఞానం ప్రాప్తుమ్. అంటే అద్వైతజ్ఞానం పొందే స్థాయికి చేరతాడు.

**ప్రవేష్టుం చ (శక్యః)** – ఆ జ్ఞానంద్వారా భక్తుడు భగవంతునితో ఐక్యం పొందుతాడు. ఐక్యం పొందుతాడంటే ద్వైతభావం పోతుంది. అంటే అక్షరాలా ఐక్యం పొందదు, భావనలో మార్పు వస్తుంది. భక్తి ఉంటే ఇవన్నీ అవుతాయి. ఈ భావనను ఆఖరి శ్లోకంలో ముగిస్తున్నాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 55 **మత్కర్మకృన్మత్పరమో మద్భక్తస్సంగవర్జితః ।**
**నిర్వైరస్సర్వభూతేషు యస్స మామేతి పాండవ ॥**
మత్కర్మకృత్, మత్పరమః, మద్భక్తః, సంగవర్జితః,
నిర్వైరః, సర్వభూతేషు, యః, సః, మామ్, ఏతి, పాండవ ॥

| | | | |
|---|---|---|---|
| పాండవ! | = ఓ పాండవా! | సంగవర్జితః | = ప్రాపంచిక విషయములందు ఆసక్తిరహితుడగునో |
| యః | = ఎవరైతే | సర్వభూతేషు | = సమస్తప్రాణులందును |
| మత్కర్మకృత్ | = నాకోసం కర్తవ్యకర్మలను ఆచరించునో | నిర్వైరః | = వైరభావము లేనివాడగునో |
| మత్పరమః | = మత్పరాయణుడగునో | సః | = ఆ అనన్యభక్తియుక్తుడు |
| మద్భక్తః | = నాయందు భక్తిశ్రద్ధలు కలవాడగునో | మామ్ | = నన్ను |
| | | ఏతి | = పొందును |

**హే పాణ్డవ! యః మత్–కర్మ–కృత్, మత్–పరమః, సఙ్గ–వర్జితః**

**సర్వ–భూతేషు నిర్వైరః మత్–భక్తః (అస్తి) సః మామ్ ఏతి ।**

తా: ఓ పాండవా! ఎవరైతే నాకోసం కర్తవ్యకర్మలను ఆచరించునో, మత్పరాయణుడగునో, నాయందు భక్తిశ్రద్ధలు కలవాడగునో, ప్రాపంచికవిషయములందు ఆసక్తిరహితుడగునో, సమస్త ప్రాణులందును ద్వేషభావము లేనివాడగునో, అటువంటి అనన్యభక్తియుక్తుడు నన్ను పొందును.

ఈ శ్లోకాన్ని సూత్రభూతశ్లోకం అంటారు. ఇందులో భక్తియొక్క నిర్వచనాన్ని చూస్తాము. ఈ నిర్వచనాన్ని పన్నెండవ అధ్యాయంలో విస్తారంగా చూస్తాము. కాని ఇక్కడ మనం ఆ అంశంయొక్క విహంగవీక్షణం చేద్దాము.

కృష్ణపరమాత్మ పరిభాషలో చెప్పాలంటే, భక్తి అంటే ఏ ఒక్క సాధనో కాదు. అన్ని ఆధ్యాత్మిక సాధనలూ భక్తిలోకే వస్తాయి. ఈ సాధనలన్నీ కలిపి మోక్షానికి దారితీస్తాయి. ఈ సాధనలను వేదాలు మూడు సాధనలుగా విభజిస్తే, కృష్ణపరమాత్మ ఐదు సాధనలుగా వివరించబోతున్నాడు తర్వాత వచ్చే అధ్యాయంలో. ఐదు సాధనలుగా అప్పుడు చూద్దాము. ఇప్పుడు వేదాల ప్రకారం ఉన్న మూడు సాధనలను చూద్దాము. అవి కర్మలక్షణభక్తి, ఉపాసనలక్షణభక్తి, జ్ఞానలక్షణభక్తి.

1. **కర్మలక్షణభక్తి** – కర్మలక్షణభక్తి అంటే కర్మయోగరూపంలో ప్రకటితమయ్యే భక్తి. కర్మయోగాన్ని భక్తిగా ఎలా భావిస్తారు? కర్మయోగం అంటే ఒక విధమైన కర్మే కదా, అంటే దానికి జవాబు కర్మను కర్మయోగంగా మలుచుకోవటానికి, సాధకునికి భగవంతునిమీద అచంచలమైన భక్తి ఉండాలి. భక్తి లేకుండా కర్మయోగి కాలేడు. అందువల్ల కర్మయోగం ఒక విధమైన భక్తి.

కర్మయోగం భక్తి కిందకు ఎలా వస్తుందో అంతకుముందు కూడా చూశాము. ఇక్కడ భక్తి నిర్వచనంలో మళ్ళీ చూడబోతున్నాము అంతే.

కర్మలో రెండు దశలుంటాయి. కర్మచేసే వ్యక్తి కర్తా, భోక్తా అవుతాడు. కర్తగా అతను అనేక కర్మలను చేస్తాడు. అతను చేసిన కర్మలకు అనేక ఫలాలు వస్తాయి. వాటిని భోక్తగా అనుభవిస్తాడు. అంటే అతను ముందు కర్తా, ఆ తర్వాత భోక్తా. అతనికి వచ్చే ఫలం ఏదైనా కావచ్చు. అతనికి ఇష్టమైనది రావచ్చు, బాధాకరమైనది రావచ్చు. ఇది కర్మయొక్క పరిస్థితి. కేవలకర్మచేసే వ్యక్తి పరిస్థితి.

ఇప్పుడు కర్మయోగి ఎలా చేస్తాడో చూద్దాము. కర్మయోగి ఏ పని చేసినా ఈశ్వరార్పణభావనతో చేస్తాడు.

**మమోపాత్త సమస్త దురితక్షయద్వారా**

**శ్రీ పరమేశ్వరప్రీత్యర్థమ్ అహమ్ ఇదం కర్మ కరిష్యే ।**

ఏదైనా పూజ చేసేటప్పుడు ఇలా సంకల్పం చెబుతారు. కర్మయోగి ఈశ్వరార్పణభావనతో కర్మ చేస్తాడు. అంటే ప్రతిసారీ చేతులు జోడించి ఈ సంకల్పం చెప్పనవసరం లేదు. అది అతని మనస్సులో ఉంటే చాలు. ఇలా ఈశ్వరార్పణభావనతో చేయాలంటే దానికి అచంచలమైన భక్తి ఉండాలి. అంటే కర్తగా ఈశ్వరార్పణభక్తి.

చేసిన ప్రతిపనికీ ఫలం వస్తుందని చూశాము. మనకు వచ్చే ప్రతి ఒక్క ఫలం కూడా మనం చేసుకున్న కర్మయొక్క ప్రతిఫలమే. ఒక దోమ మనను కుట్టినా కూడా, దానికి మన కర్మే కారణం. కాని మనం చేసిన ఏ కర్మకు, ఏ ఫలం వస్తున్నదో మనకు తెలియదు. పూర్వజన్మకర్మలు కూడా వస్తాయి అందులో. ఈ కర్మఫలదాత ఈశ్వరుడు. అందువల్ల మనకు వచ్చిన ఫలాన్ని ఈశ్వరప్రసాదబుద్ధితో స్వీకరించాలి. అత్యంత ఆనందకర అనుభవంనుంచి, అత్యంత బాధాకర అనుభవందాకా అన్నీ ఈశ్వరప్రసాదమే అనుకుంటే ఏ బాధా ఉండదు. అంటే భోక్తగా ఈశ్వరప్రసాదబుద్ధి ఉంటుంది కర్మయోగికి.

**కర్మయోగం = కర్తగా ఈశ్వరార్పణభావన + భోక్తగా ఈశ్వరప్రసాదబుద్ధి**

2. **ఉపాసనలక్షణభక్తి** – కర్మయోగంనుంచి, ఉపాసన యోగానికి నెమ్మదిగా ఎదగాలి. ఉపాసన అంటే ధ్యానం. ధ్యానంలో భక్తి ఎందుకు? భగవంతునిమీద ధ్యానం చేస్తాడు కాబట్టి. కర్మయోగంనుంచి ఉపాసన యోగానికి ఎందుకు రావాలి? కర్మయోగి ఎంతసేపూ బాహ్యాముఖంగా ఉంటాడు. ఎందుకంటే అతను కర్తా, భోక్తలుగా బాహ్యప్రపంచంలో వ్యవహారం నడుపుతాడు. కాని వేదాంత విద్యార్థిగా, చివరికి అతను భగవంతుడు తనలోనే ఉన్నాడని నేర్చుకోవాలి.

**సత్యం జ్ఞానమ్ అనంతం బ్రహ్మ। యో వేద నిహితం గుహాయాం పరమే వ్యోమన్** – తైత్తిరీయం

సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మను నీ హృదయగుహలో తెలుసుకోవాలి అంటుంది శాస్త్రం. అందువల్ల బాహ్యాముఖంగా ఉన్న మనస్సును అంతర్ముఖంగా తిప్పాలి. అది ఉపాసనలో సాధ్యమవుతుంది. విష్ణుసహస్రనామ పారాయణ చేసేటప్పుడు ధ్యానశ్లోకాలను కూడా గబగబా చదివేయకుండా, భగవంతుని రూపాన్ని మనస్సులో ఊహించుకోవాలి. అందువల్ల ఉపాసనను కూడా భక్తి అనే అంటారు.

3. **జ్ఞానలక్షణభక్తి** – జ్ఞానలక్షణభక్తి అంటే శాస్త్ర అధ్యయనం చేయటం. ఈ భక్తిని వేదాంతవిచారణ అనీ, జ్ఞానయోగం అనీ అంటారు. ఇది కూడా ఒక రకమైన భక్తే. అందువల్ల జ్ఞానయజ్ఞం అంటారు. చిన్మయానందస్వామీజీ గీతాబోధను గీతాజ్ఞానయజ్ఞం అనేవారు. అంటే శాస్త్రం నేర్చుకోవటం కూడా ఒక విధమైన పూజలోకే వస్తుంది. ఇప్పుడు మీరు భగవద్గీత అధ్యయనం చేయటం కూడా భక్తే.

ఒక సాధకుడు కర్మలక్షణభక్తి, ఉపాసనలక్షణభక్తి, జ్ఞానలక్షణభక్తి చూపించి అద్వైతజ్ఞానం పొందాలి.

వీటినే ఐదుగా విభజించాడు కృష్ణపరమాత్మ. కర్మయోగాన్ని రెండుగా, ఉపాసనయోగాన్ని రెండుగా, జ్ఞానయోగాన్ని ఒకటిగా చూపించబోతున్నాడు. ఒకటిగా చూసినా, రెండుగా చూసినా –

కర్మయోగం + ఉపాసనయోగం + జ్ఞానయోగం = భక్తి.

అందువల్ల భక్తియోగం అంటే భక్తి మాత్రమే కాదు. ఈ మూడు యోగాల్లోనూ సమానంగా ఉన్న అంశం భక్తి. కర్మయోగంలో భక్తి కలగలపాలి; ఉపాసనాయోగంలో భక్తిలో మునగాలి; జ్ఞానయోగంలో భక్తిరసంలో తేలాలి.

ఈ నేపథ్యంతో ఈ శ్లోకాన్ని చూద్దాము.

**మత్కర్మకృత్ (భవ)** – ఓ అర్జునా, ముందు కర్మయోగివి కమ్ము. కర్తగా ఏ పని చేసినా ఈశ్వరార్పణబుద్ధితో చేయాలి.

**యద్యత్ కరోమి తత్తదఖిలం శంభో తవారాధనమ్**
**కాయేన వాచా మనసా ఇంద్రియైర్వా**
**బుద్ధ్యాత్మనా వా ప్రకృతేః స్వభావాత్।**
**కరోమి యద్యత్సకలం పరస్మై**
**నారాయణాయేతి సమర్పయామి॥**

దైవానికి చేసే పూజ మాత్రమే కాదు; ఏ లౌకిక పని చేసినా కూడా కర్తగా ఈశ్వరార్పణభావనతో చేసి, భోక్తగా ఈశ్వరప్రసాదబుద్ధితో స్వీకరించాలి. ఇవి వివరంగా రెండు, మూడు అధ్యాయాల్లో చూశాము. సమత్వం యోగ ఉచ్యతే అంటారని కూడా చూశాము.

**మద్భక్తః (భవ)** – (పదాలను శ్లోకంలో ఉన్న వరుసక్రమంలో చూడటం లేదు) నా భక్తుడివి కమ్ము.

నెమ్మదిగా మన లక్ష్యాన్ని భగవంతునిగా చేసుకోవాలి. భక్తి ఏర్పడిన కొత్తలో భగవంతుణ్ణి లక్ష్యంగా చేసుకోక పోవచ్చు; కొంతమంది అప్పుడే మోక్షం అవసరం లేదు. మోక్షం నిత్యం కాబట్టి దాని గురించి త్వరపడనవసరం లేదని కూడా సమర్థించుకుంటారు. భగవంతుడు ఓపిగ్గా వేచివుంటాడు. మీరు మీ కోరికలు తీర్చుకోండి, ఆనందం అనుభవించండి, తప్పులేదు; కాని వాటిని ధర్మబద్ధంగా అనుభవించండి. త్వరలోనే ఆ కర్మఫలాలకు ఉన్న మూడు దోషాలను గ్రహించండి. అర్థకామాలనుంచి మీ దృష్టిని మోక్షానికి మరల్చండి. ప్రేయోమార్గంనుంచి శ్రేయోమార్గానికి రండి అంటున్నాడు. మద్భక్తః భవః అంటే అర్థం అదీ.

తీవ్రముముక్షుత్వం రావాలి. శాశ్వతమైన ఫలాన్ని కోరాలి కాని అశాశ్వతమైన ఫలాల వెంట పరుగులు తీయకూడదు. కార్డుబోర్డు ఛెయిర్ ఉదాహరణ ఎన్నడూ మర్చిపోకూడదు. ఆ కుర్చీ చూడటానికి అందంగా ఉంటుంది, ఆకర్షణీయంగా ఉంటుంది, కాని కూర్చునేందుకు పనికిరాదు. అలాగే ఈ జగత్తు చూడటానికి అందంగా, ఆకర్షణీయంగా ఉంటుంది కాని దానిమీద ఆధారపడటానికి కుదరదు. ఎందుకంటే అది శాశ్వతం కాదు. శాశ్వతం కానిది, శాశ్వతమైన ఫలాన్ని ఇవ్వలేదు. ఎవరిమీదో ఆధారపడక తప్పదు అనుకుంటే అశాశ్వతమైన జగత్తుమీద ఆధారపడటం మానేసి, శాశ్వతమైన భగవంతునిమీద ఆధారపడటం నేర్చుకోవాలి. నీకు భద్రత ఎవరు అంటే, భగవంతుడే అని చెప్పగలగాలి.

**అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే ।**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥** – 9.22

తోటి మనుష్యులతో సంబంధబాంధవ్యాలు పెంచుకోవాలి, వారికి అవసరమైతే సహాయం చేయాలి కాని, శాంతి భద్రతలకోసం భగవంతునిమీదే ఆధారపడాలి.

**మత్పరమః (భవ)** – నెమ్మదిగా తీవ్రముముక్షువు కమ్ము. మోక్షం మాత్రమే లక్ష్యం అవాలి, అనేక లక్ష్యాలలో మోక్షం ఒక లక్ష్యం కాకూడదు. మోక్షమే లక్ష్యం అవాలి. ఇంక వేరే ఏ లక్ష్యాలు పాటించినా కూడా, అంటే డబ్బు సంపాదించినా, ఉద్యోగం చేసినా – అవన్నీ కూడా మోక్షానికి మార్గాలే కావాలి. ఇంకోవిధంగా చెప్పాలంటే సాధనచతుష్టయసంపన్నుడవు కావాలి.

**సంగవర్జితః** – ఉన్నత విషయాలమీద ఆధారపడటం నేర్చుకున్నకొద్దీ, తక్కిన చిన్న విషయాలమీద ఆధారపడటం దానంతట అదే క్రమేపీ తగ్గుతూ వస్తుంది. మనం చిన్నపిల్లలుగా ఉన్నప్పుడు ఎవరైనా మన బంతినో, బొమ్మనో తీసుకుంటే ఏడ్చి ఉంటాము. కాని ఇప్పుడు అవి మనకు ముఖ్యమైనవిగా అనిపించవు. ఎందుకు? ఇప్పుడు మన మమకారం వేరే దానిమీద మారింది. చిన్నప్పుడు తినే బిస్కెటుమీద మమకారం ఉంటే, ఇప్పుడు గోల్డ్‌బిస్కెట్టుమీద మమకారం ఉంటుంది. అంటే ఒకదానిమీద రాగం, ఇంకోదానిమీద రాగాన్ని తగ్గిస్తుంది. ఇప్పుడు ఎవరైనా మన పుట్టినరోజు కానుకగా మనకు బుడగ ఇస్తే మనమేమీ పొంగిపోము. ఎందుకంటే దానిమీద రాగం మనకు తగ్గింది కాబట్టి. ఆ విధంగా మోక్షంమీద తీవ్రమైన ఇచ్ఛ ఉంటే, అది తక్కిన కోరికలను కబళించి వేస్తుంది. అందువల్ల నెమ్మదిగా సంగత్వం తగ్గుతూ వస్తుంది. అంటే రాగరహితులము అవుతాము.

**నిర్వైరః సర్వభూతేషు** – ద్వేషంనుంచి దూరంగా జరుగు. కృష్ణపరమాత్మ ఇక్కడ మనను హెచ్చరిస్తున్నాడు. ఏమని? రాగం తగ్గించుకోమని చెపితే, ద్వేషం పెంచుకోమని కాదు దాని అర్థం. కుటుంబసభ్యులమీద, ప్రపంచంమీద రాగం తగ్గించుకోమంటే, వారిమీద ద్వేషం పెంచుకోకూడదు. సర్వభూతేషు అంటే సమస్తప్రాణులందు. మనుష్యులమీద, జంతువులమీద, చెట్లమీద కూడా ద్వేషం పెంచుకోకూడదు. రాగద్వేషాలు రెండూ ఉండకూడదు. దీన్ని ఉదాసీనభావన అంటారు.

రాగద్వేషాలు పోయాయని ఎలా తెలుస్తుంది? ఒక వ్యక్తి మన దగ్గర ఉన్నా, లేకపోయినా మనకు ఏ విధమైన భావనా రాకూడదు. దీన్ని రాగద్వేష అతీతభావన అంటారు. దీన్నే వైరాగ్యం అని కూడా అంటారు. ఒక్కమాటలో చెప్పాలంటే వివేకం పెంచుకోవాలి, వైరాగ్యం పెంచుకోవాలి, ముముక్షుత్వం పెంచుకోవాలి. అదే నిజమైన భక్తి. ఈ మూడూ ఉంటే ఏమవుతుంది.?

**సః మామేతి పాండవ** – అటువంటి వ్యక్తి నన్ను ఖచ్చితంగా పొందుతాడు. ఎందుకంటే అతను మోక్షం పొందటానికి కావాల్సిన పరిస్థితులను నేను ఏర్పాటు చేస్తాను అంటున్నాడు కృష్ణపరమాత్మ.

సాధనచతుష్టయసంపత్తిని పెంపొందించుకోవటం వరకే సాధకుని బాధ్యత; తక్కినదంతా ఈశ్వరకృపవల్ల జరుగుతుంది. ఎందుకంటే జ్ఞానం పొందటానికి గురువు కావాలి. ఆ గురువుకు జ్ఞానం ఉందో లేదో సాధకునికి ఎలా తెలుస్తుంది? గుడ్డివానికి, ఎదుటివ్యక్తి గుడ్డివాడో కాదో తెలియనట్టే, అజ్ఞానికి ఎదుటివ్యక్తి జ్ఞానో, కాదో తెలియదు.

ఒక సాధకుడు సాధనచతుష్టయసంపత్తిని పెంచుకుంటే, భగవంతుడు గురువును పంపిస్తాడు. జ్ఞానయోగ్యతా ప్రాప్తి పొందిన సాధకునికి భగవంతుని కృపవల్ల గురువు దొరికి, జ్ఞానం పొంది, మోక్షం పొందుతాడు. సః మామేతి పాండవ అంటే అతను నన్ను పొందుతాడు అని అర్థం. అంటే జ్ఞానం పొంది, మోక్షం పొందుతాడని అర్థం.

ఇది సూత్రభూత శ్లోకం అనీ, దీని భావనను పన్నెండవ అధ్యాయంలో వివరిస్తాడనీ చూశాము. ఆ అధ్యాయం పేరు భక్తియోగం.

**ఓం తత్సదితి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే**
**శ్రీకృష్ణార్జునసంవాదే విశ్వరూపదర్శనయోగోనామ ఏకాదశోఽధ్యాయః**

హరి ఓం తత్సత్

ఇది శ్రీ మద్భగవద్గీతయందు, ఉపనిషత్తులయందు, బ్రహ్మవిద్యయందు, యోగశాస్త్రమందు, శ్రీకృష్ణార్జున సంవాదమునందు విశ్వరూపదర్శనయోగము అనే పదకొండవ అధ్యాయము.

## స్వామీజీ ఆణిముత్యాలు

**భీష్మో ద్రోణః సూతపుత్రస్తథాసౌ సహాస్మదీయైరపి యోధముఖ్యైః** – 11.26
**వక్త్రాణి తే త్వరమాణా విశంతి దంష్ట్రాకరాళాని భయానకాని** – 11.27

భీష్మ, ద్రోణ, కర్ణులు అందరూ భగవంతుని నోట్లోకి వేగంగా వెళ్ళి అక్కడ నుగ్గునుగ్గై పోతున్నట్టుగా అర్జునుడు చూస్తున్న ఈ సన్నివేశం నిజమా, కవితాధోరణా? అక్షరాలా భీష్మద్రోణాదులు విష్ణుమూర్తి నోట్లో నుగ్గునుగ్గైపోతే, అర్జునుడు వారిని తర్వాత ఎలా చంపగలడు? మనకు కురుక్షేత్రయుద్ధం గురించి తెలుసు; అర్జునుడే వీరందరినీ చంపాడనీ తెలుసు. అందువల్ల వారంతా విశ్వరూప ఈశ్వరునిలోకి ప్రవేశించటం అనేది కవియొక్క కవితాశైలి. అలాగే అర్జునుడు అన్ని లోకాలను చూశాడు అంటే, అర్జునుడు ఈ లోకాన్ని ఈశ్వరశరీరంగా చూశాడు అని అర్థం చెప్పవచ్చు.

# అధ్యాయము 11 - విశ్వరూపదర్శనయోగము సారాంశము

విశ్వరూపదర్శనయోగము అధ్యాయముయొక్క సారాంశాన్ని చూద్దాము. కాని సారాంశం చూసేముందు, ఇంతకుముందు అయిన అధ్యాయాలు ముఖ్యంగా 7-10 అధ్యాయాల సారాంశం గుర్తుకు తెచ్చుకోవాలి. ఈ అధ్యాయం ఆ నాలుగు అధ్యాయాల్లో వేసిన పునాదిమీద వచ్చిన వివరణ.

ఏడవ అధ్యాయంనుంచి కృష్ణపరమాత్మ ఈశ్వరస్వరూపాన్ని వర్ణించుకు వస్తున్నాడు. ఈశ్వరుని నిర్వచనం-జగత్కారణం. జగత్కారణం అనగానే ఏ కారణం అనే ప్రశ్న వస్తుంది. ఎందుకంటే ఒక కార్యం వెనక నిమిత్తకారణం, ఉపాదానకారణం అని రెండు కారణాలు ఉంటాయి. కుండకు నిమిత్తకారణం కుమ్మరి, ఉపాదానకారణం మట్టి. అందువల్ల భగవంతుడు ఈ రెండింటిలో ఏ కారణం? కృష్ణపరమాత్మ నిమిత్తకారణమూ, ఉపాదానకారణమూ కూడా ఈశ్వరుడే అని చెప్పాడు. సంస్కృతంలో ఈ నిర్వచనాన్ని ఇలా చెబుతారు -

**అభిన్న-నిమిత్త-ఉపాదానకారణమ్ ఈశ్వరః**

ఈశ్వరుడు అభిన్ననిమిత్త ఉపాదానకారణం అయినా, ఈ నాలుగు అధ్యాయాల్లో ఈశ్వరునియొక్క ఉపాదానకారణ అంశానికి ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వటం జరిగింది. ఉపాదానకారణమే అనేక వస్తువులుగా మారుతుంది. దానివెనక నిమిత్తకారణం కూడా ఉంటుంది. మట్టి అనేక వస్తువులుగా రూపుదిద్దుకుంటుంది. వాటి వెనక కుమ్మరి చేయి ఉంటుంది; అలాగే బంగారం అనేక ఆభరణాలుగా మెరిసిపోతుంది. ఆ విధంగా ఉపాదానకారణం, కార్యం అంతటా ఉంటుంది. నిజానికి ఉపాదానకారణానికి భిన్నంగా ఏ కార్యమూ ఉండలేదు.

**స్వర్ణ వ్యతిరిక్త ఆభరణానాం మూల్యం నాస్తి।**

బంగారం లేకుండా ఆభరణానికి ఉనికి లేదు. అంటే కార్యంయొక్క అనేక నామరూపాల వెనక ఒకటే ఉపాదానకారణం ఉంది. అంటే గాజు నామరూపాల వెనక, ఉంగరం నామరూపాల వెనక, గొలుసు నామ రూపాల వెనక, మనం అనుభవిస్తున్నది వాటి ఉపాదానకారణమైన బంగారాన్ని మాత్రమే. దీని అర్థం మనకు బంగారం దర్శనం అవాలంటే, బంగారంకోసం ఎక్కడో వెతకనవసరం లేదు. మనం ఆభరణాన్ని చూస్తున్నా, మనం చూస్తున్నది బంగారాన్నే. నాకు ఆభరణాలు వద్దు, ఆభరణాలను చూసిచూసి విసుగు పుట్టింది, నాకు బంగారం దర్శనం కావాలనుకుని, ఆభరణాలు కనబడకుండా కళ్ళు మూసుకుని స్వర్ణదర్శనంకోసం ధ్యానం చేసామనుకోండి! ఏమవుతుంది అప్పుడు? అది అర్థం లేని పని. ఆభరణాలు చూస్తున్నప్పుడే, ప్రత్యక్షంగా అనేక నామరూపాల వెనకనున్న బంగారాన్ని చూస్తున్నాము.

**కారణమ్ ఏకమ్, కార్యమ్ అనేకమ్**

అందువల్ల కార్యదర్శనం అంటే ఉపాదానకారణదర్శనమే. ఇది చాలా ముఖ్యమైన అంశం. దీన్ని ఎన్నడూ మర్చిపోకూడదు. ఈ నాలుగు అధ్యాయాల్లోనూ కృష్ణపరమాత్మ ఈ విషయాన్నే నొక్కివక్కాణించాడు. ఈశ్వరుడు కొన్ని ఆభరణాలకో, కొన్ని కుండలకో మాత్రమే ఉపాదానకారణం కాదు; మొత్తం జగత్తుకే ఉపాదానకారణం.

పరాప్రకృతి, అపరాప్రకృతి రెండూ నేనే అన్నాడు. అంటే జగత్తు భిన్ననామరూపాలతో వ్యక్తమవుతున్నది ఈశ్వరుడు మాత్రమే.

**ఈశ్వరస్య అవస్థాభేదః ఏవ ప్రపంచః**

కారణావస్థలో బంగారం అంటే, కార్యావస్థలో ఆభరణాలు అంటున్నాము. అంటే కారణం, కార్యం – రెండూ ఒకటే. ఒకటి అవ్యక్తనామరూపాలతో ఉంటే, ఇంకొకటి వ్యక్తనామరూపాలతో ఉంది. అలాగే ఈశ్వరుడు, జగత్తు ఒకటే. అవ్యక్తనామరూపాలతో ఉంటే ఈశ్వరుడు అంటాము, వ్యక్తనామరూపాలతో ఉంటే జగత్తు అంటాము.

**ఈశ్వరః ఏవ ప్రపంచః, ప్రపంచః ఏవ ఈశ్వరః**

అంటే ఈశ్వరదర్శనానికీ, ప్రపంచదర్శనానికీ మధ్య భేదం లేదు. అందువల్ల మనం ప్రపంచాన్ని చూస్తున్నా కూడా, అనేక నామరూపాలతో ఉన్న భగవంతుణ్ణే చూస్తున్నాము. భగవంతునియొక్క వ్యక్తరూపం జగత్తు.

**జగత్తును సరిగ్గా అర్థం చేసుకుంటే అది ఈశ్వరుడు**
**ఈశ్వరుణ్ణి సరిగ్గా అర్థం చేసుకోకపోతే అది జగత్తు**

జగత్తును ఈశ్వరునియొక్క వ్యక్తరూపంగా అర్థం చేసుకుంటే అది విశ్వరూపదర్శనం. జగత్తు కొత్తగా మారదు; జగత్తు అసాధారణంగా మారదు. కాని మనం జగత్తును అర్థం చేసుకోవటంలో మార్పు వస్తే, మామూలు జగత్తును మనం ఈశ్వరరూపంగా చూస్తే, ఆ మారిన దృష్టిని **దివ్యచక్షువులు** అంటారు. జగత్తు మామూలు జగత్తే; కాని మన దృక్పథం అసాధారణంగా ఉంది. అది మనం పెంచుకున్న జ్ఞానంవల్ల ఏర్పడింది. ఏమిటా జ్ఞానం? మనం చూస్తున్న ఈ జగత్తు మామూలు జగత్తు కాదు, ఇది ఈశ్వరుని శరీరం. విశ్వ ఏవ రూపం శరీరం యస్య. అందువల్ల విశ్వరూపం అంటే అసాధారణ దర్శనం కాదు; అందుబాటులో ఉన్న సాధారణ జగత్తును అసాధారణ భక్తితో చూడగలగటం.

ఇలా సాధారణవస్తువుకు, అసాధారణవిలువను ఇవ్వటం మనకు కొత్తేమీ కాదు. ఈ ఉదాహరణ కూడా మనం చాలాసార్లు చూశాము. ఎవరైనా మనకు లడ్డూ ఇస్తే, మర్యాదగా తిరస్కరిస్తాము; 'నాకు చక్కెరవ్యాధి ఉందండి, తినకూడదు,' అని చెబుతాము. కాని అదే లడ్డూ తిరుపతి ప్రసాదం అని చెప్పగానే, మన దృక్పథం మారిపోతుంది. అందులోంచి కొంచెమన్నా తీసుకుని, భక్తిగా కళ్ళకద్దుకుని, నోట్లో వేసుకుంటాము. కాకపోతే అలా చెయ్యటానికి మనం వేంకటేశ్వరస్వామి భక్తులమై ఉండాలి. ఏ ఆఫ్రికాలోనో ఉన్న ఆటవికుడిని పిలిచి ఇది తిరుపతి ప్రసాదం అంటే అతను ఏ పతి అని మనకేసి ఎగాదిగా చూస్తాడు. అతనికి ఆ లడ్డూమీద మనకొచ్చిన పూజ్యభావన రాదు.

కాని మనం అదే లడ్డూను భక్తిగా కళ్ళకద్దుకుంటాము. అంటే లడ్డూ ఒక్కటే. లడ్డులో భౌతికంగా ఏమీ మార్పులేదు; దాన్ని రసాయనికంగా పరీక్ష చేయిస్తే మామూలు లడ్డూకూ, తిరుపతి లడ్డూకూ ఏమీ భేదముండదు.

మరి భేదం ఎక్కడ ఉంది? మనం దాన్ని చూసే దృష్టిలో ఉంది. ఆ దృష్టి వేంకటేశ్వరస్వామి గురించి తెలిసిన జ్ఞానంవల్ల ఏర్పడుతుంది. ఆ దృష్టినే దివ్యచక్షువులు అంటారు.

ఎవరో మిమ్మల్ని పిలిచి, 'నీకొక అపురూపమైన వస్తువును చూపిస్తాను, రా,' అని ఎంతో మురిసిపోతూ వారింటికి తీసుకువెళ్ళారనుకుందాము. అతను లోపలినుంచి ఎంతో భక్తిగా ఒక వస్తువును తీసుకువచ్చాడు. దాన్ని భద్రంగా దాచిపెట్టాడు. అనేక వస్త్రాలతో దాన్ని భద్రంగా చుట్టి ఉంచాడు. ఒక్కొక్క వస్త్రం విప్పుతున్నకొద్దీ, అదేమైవుంటుందా అనే మీ కుతూహలం పెరిగిపోతూ ఉంటుంది. అలా మీ ఉత్సుకత బాగా పెరిగాక, చివరికి ఆ వస్తువును అపురూపంగా బయటకి తీసి చూపించాడు. ఏమిటది? ఒక పక్క విరిగిపోయిన గిటార్!

ఇదా ఇతను ఇంత అబ్బురంగా చూపిస్తున్న వస్తువు అని మీరు ఆశ్చర్యపోతుండగా, ఇంకో పిడుగులాంటి వార్త చెబుతాడు. 'దీన్ని ఐదు లక్షలకు కొన్నాను తెలుసా?' ఎందుకంటే, 'ఇది ఎవరిదనుకున్నావు, హారిసన్ గిటార్,' అన్నాడు గర్వంగా. మీకు ఆ హారిసన్ ఎవరో తెలియకపోతే దాని విలువను మీరు ఆనందించలేరు. ఒక విరిగిపోయిన గిటార్‌ను ఐదులక్షలు పోసి కొన్నాడా అని ఆశ్చర్యపోతారు. అది మీ దృష్టిలో ఐదురూపాయల విలువ కూడా చెయ్యదు. కాని హారిసన్ గొప్ప విద్వాంసుడు. బీటిల్‌లో ప్రథమశ్రేణి విద్వాంసుడు. అది తెలియకపోతే అతని చర్య వింతగానే అనిపిస్తుంది.

ఇప్పుడు చెప్పండి, ఒక మామూలు గిటార్‌కు అంత విలువ ఎందుకు వచ్చింది? అతను ఆ గిటార్‌ను పట్టుకున్న, ప్రపంచాన్ని తన సంగీతంతో ఉర్రూతలూగించిన గొప్ప కళాకారుణ్ణి చూస్తున్నాడు. ఇప్పుడు యువతకు సినిమా హీరోలమీద అంత పిచ్చి అభిమానం ఉంది. నీకు భగవద్దర్శనం కావాలా, నీ అభిమానహీరో దర్శనం కావాలా అంటే చాలామంది అభిమానహీరో దర్శనమే కావాలన్నా ఆశ్చర్యపోనవసరం లేదు. వారు చూసే దృష్టి వేరు, మీరు చూసే దృష్టి వేరు. సాధారణవస్తువుకు మీ స్నేహితుడు అసాధారణ విలువను ఇచ్చాడు. అది దివ్యచక్షువుతో చూడటంలాంటిది. నిజానికి ఈ పదాన్ని అలాంటి చిన్న విషయానికి వాడకూడదు. విషయం అర్థం కావటానికి చెప్పటం జరిగింది అంతే.

అలా చాలా సందర్భాలలో మామూలు వస్తువులకు అసాధారణ విలువలను ఇచ్చి, ప్రదర్శనలలో పెట్టటం చూస్తూ ఉంటాము. ఎవరిదో క్రికెట్ బ్యాట్, మరెవరిదో చెప్పులు, ఎవరిదో వెంట్రుకలు – అలా ఎన్నో దాస్తూ ఉంటారు.

అందువల్ల ఒక వస్తువును మెచ్చుకోవటం అనేది రెండు విధాలుగా చేయవచ్చు. ఒకటి వస్తుపరంగా, ఇంకొకటి భావపరంగా. భావపరమైన ఆరాధన ఆ విషయం గురించిన జ్ఞానాన్నిబట్టి వస్తుంది. టెండూల్కర్ బ్యాటు విలువ తెలియాలంటే టెండూల్కర్‌యొక్క వీరాభిమానై ఉండాలి మనం. అతని గురించిన వివరాలన్నీ తెలియాలి; ఎన్ని సెంచరీలు కొట్టాడు, ఎన్ని పరుగులు తీసాడు, ఎన్ని క్యాచ్‌లు పట్టాడులాంటి విషయాలు పూర్తిగా తెలిస్తే అతనిమీద మనకు అభిమానం పెరిగిపోయి, అతను వాడిన వస్తువులమీద కూడా ఆ అభిమానం పెరుగుతుంది. అంటే మామూలు వస్తువులకు అసాధారణ విలువను ఆపాదిస్తాము.

ఇదే సూత్రం జగత్తుకు కూడా వర్తిస్తుంది. జగత్తు చూడటానికి మామూలుగానే ఉంటుంది. మనం ప్రతిరోజూ దానితో వ్యవహారం నడుపుతూనే ఉంటాము కాబట్టి దానిలో ఏమీ ప్రత్యేకత కనిపించదు. జగత్తును ప్రత్యేకంగా చూడాలంటే ముందు మనకు ఈశ్వరభక్తి ఉండాలి. ఈశ్వరభక్తి ఉండాలంటే ఈశ్వరజ్ఞానం ఉండాలి. అంటే ఈశ్వరుడు ఉపాదానకారణమని, జగత్తు అనే కార్యం అంతా ఈశ్వరుడు కారణంగా ఉన్నాడనీ మనకు అర్థం కావాలి. అర్థం అవగానే సరిపోదు, ఈశ్వరునిమీద అనన్యభక్తి ఉండాలి. ఈశ్వరుడు వేరు, జగత్తు వేరు కాదని బాగా జీర్ణించుకోవాలి. అప్పుడు జగత్తు ఒక వెలలేని, అమూల్యమైన వస్తువు అనే ఆరాధనాభావన కలుగుతుంది.

అలాంటి ఆరాధనాభావన కలగటానికి దాని గురించిన జ్ఞానం బాగా పొందాలి. దాన్ని బుద్ధిలో నిలుపుకోవాలి. ఎందుకంటే మనం చూస్తున్న వస్తువు ఏమీ బాహ్యంగా మారదు; కాని అదే వస్తువును మనం పొందిన జ్ఞానంతో కొత్తకోణంలో చూస్తున్నాము. పాతవస్తువును కొత్త దృక్పథంతో చూస్తున్నాము. అప్పుడే విశ్వరూపదర్శనం అర్థమవుతుంది. అలా అర్థమవటానికే కృష్ణపరమాత్మ నాలుగు అధ్యాయాల్లో వివరించి, ఇప్పుడు ఈ పదకొండవ అధ్యాయంలో ఈ విశ్వరూపదర్శనాన్ని చూపించాడు.

ఈ నేపథ్యంతో అసలు అధ్యాయంలోకి అడుగుపెడదాము.

పదకొండవ అధ్యాయాన్ని ప్రధానంగా ఏడు భాగాలుగా విభజించవచ్చు. అవి –

| | |
|---|---|
| **1. ఉపోద్ఘాతం** | **: శ్లోకాలు 1–8** |
| **2. సంజయుని వివరణ** | **: శ్లోకాలు 9–14** |
| **3. విస్మయం లేదా ఆశ్చర్యం** | **: శ్లోకాలు 15–22** |
| **4. భయం** | **: శ్లోకాలు 23–30** |
| **5. అర్జునుని ప్రశ్న, కృష్ణపరమాత్మ జవాబు** | **: శ్లోకాలు 31–34** |
| **6. శరణాగతి లేదా భక్తి** | **: శ్లోకాలు 36–46** |
| **7. ఉపసంహారం** | **: శ్లోకాలు 47–55** |

## 1. ఉపోద్ఘాతం: శ్లోకాలు 1–8

అర్జునుడు తనకు విశ్వరూపదర్శనం ఎలా కలుగుతుందని అడిగాడు. దానికి కృష్ణపరమాత్మ జవాబు చెప్పాడు– విశ్వరూపదర్శనం అంటే భగవంతుని ఇంకొక అవతారం కాదు. అలా ఇంకొక అవతారం అయితే చూపించటం కూడా చాలా తేలిక. ఒక్కక్షణం మెరుపులా మెరిసి, అభయహస్తం చూపించి, దీవించి, మళ్ళీ అంతర్ధానమైపోవచ్చు. కాని జగత్తును ఈశ్వరునిగా చూడాలంటే దానికి దృక్పథంలో మార్పు రావాలి. అందువల్ల విశ్వరూపదర్శనం చేయాలంటే దానికి ప్రత్యేకమైన జ్ఞానం కావాలనీ, దానినే దివ్యచక్షువులు అంటారనీ చెప్పాడు కృష్ణపరమాత్మ.

'నేను నీకు ఆ దివ్యచక్షువులను ప్రసాదిస్తాను,' అన్నాడు కృష్ణపరమాత్మ. దీన్నే సాంకేతిక పదజాలంలో వివరించాలంటే, అహంకారమమకారాలు లేని మనస్సే ఉండాలి. అహంకారమమకారాలంటే నేను, నావారు అనుకుంటారు. విశ్వరూపదర్శనం కావాలంటే నాదంటూ ఏమీ లేదు, అంతా భగవంతునిదే అనుకోవాలి. ఇల్లు మన పేర ఉండవచ్చు గాక, కానీ అది కూడా భగవంతునిదే. శరీరం మన శరీరం అవచ్చుగాక, కానీ అది కూడా భగవంతునిదే, తన్ మన్ ధన్ సబ్ కుచ్ తేరా అనగలగాలి. అందువల్ల ఒక్కముక్కలో చెప్పాలంటే –

**అహంకారమమకారరహితం మనః దివ్యచక్షుః**

అటువంటి దివ్యచక్షువులను కృష్ణపరమాత్మ ఏర్పాటు చేశాడు అర్జునునికి. అప్పుడు అర్జునుడు నోటమాట రాక, స్థబ్ధంగా నిలుచుండిపోయాడు. అప్పుడు సంజయుడు అందుకుని విశ్వరూపాన్ని వివరిస్తాడు.

**2. సంజయుని వివరణ: శ్లోకాలు 9–14**

సంజయుడు విశ్వరూపాన్ని వర్ణించాడంటే, సంజయునికి కూడా దివ్యచక్షువులు ఉన్నాయన్నమాట. సంజయుడు అంటేనే అహంకారమమకారాలను జయించినవాడు అంటారు.

కృష్ణపరమాత్మను వేలాది చేతులతో, వేలాది కాళ్ళతో, వేలాది తలలతో ఉన్నట్టుగా వర్ణించాడు. కాని మనం ముందు చూసినట్టుగా అక్షరాలా కృష్ణపరమాత్మ అలా నిలుచున్నట్టుగా తీసుకోకూడదు. అందరి చేతులూ, కాళ్ళూ భగవంతునివే అని అర్థం చేసుకోవాలి.

**అయం మే హస్తో భగవాన్ అయం మే భగవత్తరః**
**అయం మే విశ్వభేషజోఽయగ్ం శివాభిమర్శనః** – రుద్రం

**అయం మే హస్తః భగవాన్** – అంటే నా చేతులను చూసుకుంటే, అవి కూడా భగవంతుని చేతులే. నా చేతులు భగవంతునివి అంటే తక్కినవారి చేతుల మాటేమిటి? నిస్సందేహంగా అవి కూడా భగవంతునివే.

**సహస్రశీర్షా పురుషః సహస్రాక్షః సహస్రపాత్** – పురుషసూక్తం

సంజయుడు ఇలాంటి వర్ణన చేశాడు ముందు. తర్వాత అర్జునుడు వివరించాడు.

## మూడు దశల్లో అర్జునుని స్పందన

**3. విస్మయం లేదా ఆశ్చర్యం: శ్లోకాలు 15–22**

ఈ శ్లోకాల్లో అర్జునునియొక్క ఆశ్చర్యం చూశాము. నిజానికి సృష్టి ఎంతో అద్భుతంగా ఉంటుంది, దాన్ని సరిగ్గా ఆస్వాదించగలిగితే మనం కూడా ఆశ్చర్యంగా చూస్తాము. కాని మనం జగత్తుయొక్క అందాలను ఆస్వాదించలేము. ఎందుకంటే ఎంతసేపూ మనం అహం, మమ అనుకోవటమే సరిపోతుంది.

**వాట్ ఈజ్ దిస్ లైఫ్, ఇఫ్ ఫుల్ ఆఫ్ కేర్,**
**వుయ్ హావ్ నో టైమ్ టు స్టాండ్ అండ్ స్టేర్**

ఏమిటీ జీవితం, బెంగలతో నిండిపోయివుంటే, మనకు నిల్చుని జగత్తులోని అందాలను ఆస్వాదించే తీరికే లేదని వాపోతాడు ఆంగ్లకవి దేవిస్. ఒక చేప, ఒక జంతువు, ఒక చీమ, ఒక తేనెటీగయొక్క జీవితాన్ని, దాని కదలికలను గమనిస్తేనే ఎంతో అద్భుతంగా అనిపిస్తుంది. డిస్కవరీ ఛానెల్ గాని, నేషనల్ జియోగ్రఫీ ఛానెల్ గాని చూస్తే ఈ అద్భుతాలు తెలుస్తాయి.

ఏ శాస్త్రజ్ఞుడు ఏ అంశంలో పరిశోధన చేసినా భగవంతుని సృష్టిని చూసి అచ్చెరువొందక తప్పదు! ఒక చిన్న క్రిమియొక్క వివరాలను అధ్యయనం చేసినా కూడా సృష్టియొక్క సూక్ష్మమైన మెలకువలకు ఆశ్చర్యపోకుండా ఉండలేము. ఇవన్నీ ఏమిటి? ఈశ్వరవిభూతి. సాలెపురుగు అల్లే సాలెగూడుమీద గొప్ప పరిశోధనలు జరుగుతున్నాయి. మనకు ఆ సాలెగూడును చూస్తే చిరాకు కాని, అది అల్లిన సాలెగూడును అర్థం చేసుకోవటానికి వైజ్ఞానికులు ఎంతో కృషి చేస్తున్నారు. అలా సృష్టిలో ఏ అంశాన్ని చూసినా అద్భుతమే, అద్భుతం! ఒకవేళ మీరు ఈశ్వరభక్తులు అయితే దాన్ని ఈశ్వరవిభూతిగా గుర్తిస్తారు.

ఆస్ట్రేలియాలో కొన్ని చీమలు ఉన్నాయట. అవి కట్టుకునే చీమలపుట్టలు ఒక అద్భుతం! ఎందుకు? బయట వాతావరణం వేడిగా ఉన్నా, చల్లగా ఉన్నా కూడా వాటి పుట్ట ఆ వాతావరణాన్ని అదుపులో పెడుతుందిట. ఎవరు నేర్పారు వాటికి ఈ విద్యను? అలా వాతావరణాన్ని అదుపులో పెట్టవచ్చు అని నేర్చుకోలేదు, ఇంజనీరింగ్ కోర్సులు చేయలేదు కాని వాటికి స్వతఃసిద్ధంగా ఉంది ఆ శక్తి. ఇలాంటివి చూస్తే ఆశ్చరపోకుండా ఎలా ఉండగలము? ఇలాంటివాటిని విజ్ఞానశాస్త్రజ్ఞులు ప్రకృతిలోని అద్భుతాలు అంటే, భక్తుడు ఈశ్వరుని విభూతులు అంటాడు.

అందువల్లనే వేదాంతశిష్యుడు అన్ని రకాల విజ్ఞానశాస్త్రాలమీదా ఆసక్తి చూపిస్తాడు. అది అస్ట్రానమీ అవనీ, జువాలజీ అవనీ, బోటనీ అవనీ, థర్మోడైనమిక్స్ అవనీ – ఏదైనా భగవంతుని సృష్టిలోని అద్భుతాలను వివరిస్తుంది. ఈ ఆశ్చర్యాన్నే అద్భుతంగా వర్ణించాడు అర్జునుడు 15–22 వరకు.

**4. భయం: శ్లోకాలు 23–30**

అర్జునుడు ఆశ్చర్యంనుంచి భయంలోకి వెళ్ళాడు. భగవంతుని నోళ్ళను చూసి భయపడ్డాడు. ఇక్కడ కూడా నోరుని అక్షరాలా తీసుకోకూడదు. అది కాలతత్వానికి ప్రతీక. ఇరుపక్షాల సైనికులూ కురుక్షేత్రయుద్ధంలో మరణించబోతున్నారు. దాన్ని వ్యాసాచార్యులవారు భగవంతుని నోళ్ళలోకి వీరు వెళ్ళిపోతున్నట్టుగా వర్ణించారు. కాలం అంటే సృష్టికారణం, స్థితికారణం, లయకారణం కూడా. కాలం కూడా విశ్వరూపంలో ఒక అంశం. మృత్యుదేవతని చూసి భయపడకూడదు. మరణం కూడా మంగళమే. ఈ తరం ఈ భూమిని వదిలివెళితేనే, వచ్చే తరానికి భూమ్మీద నిలువ నీడ ఉంటుంది.

అర్జునుడు కూడా మరణాన్ని మంగళంగా చూసి ఉండగలిగేవాడు. ఎప్పుడు? అందులో భీష్మద్రోణాదులు లేకపోయివుంటే. అతను అహంకారమమకారాలకు అతీతంగా ఉండివుంటే, మరణం అతనిని బాధించి

ఉండేది కాదు. కాని అర్జునుడు స్వయంగా అహంకారమమకారాలకు అతీతంగా ఎదగలేదు. అతనికి కృష్ణపరమాత్మ తాత్కాలికంగా దివ్యచక్షువులు ఇచ్చాడు. అరువు తెచ్చుకున్నది శాశ్వతంగా ఉండదు.

కృత్రిమంగా పండించిన పండు ఎలా రుచికరంగా ఉండదో, అలాగే కృత్రిమంగా అరువు తెచ్చుకున్న దివ్యచక్షువులు అహంకారమమకారాలను పూర్తిగా పారద్రోలలేకపోయాయి. అందువల్ల అతను కూడా సగటు మనిషిలానే ప్రవర్తించాడు. పుట్టిన ప్రతివారు మరణించక తప్పదని అందరూ చిలకలా వల్లిస్తారు; కాని ఆ సూత్రం తనవారికి మాత్రం వర్తించకూడదు అనుకుంటారు. మేమిద్దరం, మాకిద్దరు అనే చిన్ని ప్రపంచంలో మేము మాత్రం బాగుండాలి అనుకుంటారు. అర్జునుడు కూడా ఈ అహంకార మమకారాలకి ఏమీ అతీతుడు కాలేదు.

అందువల్ల అందరూ మరణించే అంశాన్ని చూసి బాగా భయపడిపోయాడు. వ్యాసాచార్యులవారు వారి మరణాన్ని కళ్ళకు కట్టినట్టుగా, చాలా వివరంగా వర్ణించారు. అందరూ పరుగులు పెడుతూ భగవంతుని నోళ్ళలోకి వెళ్ళిపోతున్నారనీ, భగవంతుడు వారిని నమిలివేస్తున్నాడనీ అన్నాడు. పైగా భగవంతుడు తను భక్షిస్తున్న జీవులను ఆస్వాదిస్తున్నాడుట –

**లేలిహ్యసే గ్రసమానః సమంతాత్ లోకాన్ సమగ్రాన్ వదనైర్జ్వలద్భిః ।**
**తేజోఽభిరాపూర్య జగత్ సమగ్రం భాసస్తవోగ్రాః ప్రతపంతి విష్ణో ॥** – 11.30

నువ్వు మాటిమాటికీ చప్పరిస్తున్నావు అన్నాడు అర్జునుడు. నీ నోళ్ళలోని అగ్నిజ్వాలలు నీ లోపలికి ప్రవేశించిన వారినే కాదు, జగత్తంతా కూడా వ్యాపించినట్టుగా ఉంది అన్నాడు అర్జునుడు.

మనకు అహంకారమమకారాలు తీవ్రంగా ఉంటే, భగవంతునిమీద కోపం తెచ్చుకోవటం సహజం. భగవంతుడు దయాసాగరుడు కాదని నిందిస్తాము. కొంతమంది నాస్తికులుగా మారినా ఆశ్చర్యపోనవసరం లేదు.

అర్జునుడు కూడా ఈ అహంకారమమకారాలకు లోనయ్యాడని చూశాము. అందువల్ల అతను కృష్ణపరమాత్మను నీ స్వరూపమేమిటో చెప్పు అని అడిగాడు.

## 5. అర్జునుని ప్రశ్న, కృష్ణపరమాత్మ జవాబు: శ్లోకాలు 31–34

'ఓ కృష్ణా! ఎవరు నువ్వు? నీ ప్రవృత్తి ఏమిటి?' అన్నాడు. కృష్ణపరమాత్మ 'నేను కాలతత్త్వాన్ని,' అని చెప్పాడు. ముఖ్యంగా లయకారకుణ్ణి అని చెప్పాడు. కృష్ణార్జునులు ఉన్నది యుద్ధభూమిలో. అందువల్ల సృష్టికర్తను అనకుండా లయకారకుడను అన్నాడు.

విశ్వరూపదర్శనం చేయాలనుకుంటే భగవంతుణ్ణి సృష్టి, స్థితి, లయకారకుడిగా స్వీకరించగలగాలి.

**నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్** – 11.33

అంతేకాదు, 'ఓ అర్జునా, నువ్వు నిమిత్తమాత్రుడివి,' అన్నాడు. ఎప్పుడైతే సమష్టిప్రపంచాన్ని చూడటం నేర్చుకుంటామో, ఎప్పుడైతే జగత్తులో ఉన్న సమతుల్యతను, ప్రకృతిసూత్రాలను భగవంతుని సృష్టిగా అర్థం చేసుకుంటామో, అప్పుడే మన ఫ్రీవిల్‌ను ధర్మాచరణకోసమే వాడతాము. ఫ్రీవిల్‌ను ప్రకృతి ధర్మానికి అనుగుణంగా ఉపయోగిస్తే, అప్పుడు అది శరణాగతి అవుతుంది.

ఒక సంగీతకచేరీలో ఇరవైమంది ఫిడేలు వాయిస్తుంటే, అందరూ ఏకత్రాటిమీద నడవాలి. అందరూ ఒకే శ్రుతిలో, తాళంలో ఫిడేలును వాయించాలి. నేను ప్రత్యేకవ్యక్తిని, నేను నా ఇష్టం వచ్చినట్టు వాయిస్తాను అనుకుంటే, ఆ సంగీతకచేరీ కర్ణకఠోరంగా ఉంటుంది. అటువంటిదే సమష్టిలో వ్యష్టి స్థానం. సమష్టిలో ఉన్న శ్రుతిని పాటించాలంటే, వ్యష్టిగా మన శ్రుతిని సమష్టితో కలపాలి. దాన్నే శరణాగతి అంటారు. అది జ్ఞానం పొందితే వస్తుంది. దానికి చాలా పరిపక్వత కావాలి. పరిపక్వత పొందితే, శరణాగతి దానంతట అదే వస్తుంది. నలుగురితో కలిసి గీతాపారాయణం చేయాలనుకుంటే అందరూ ఏకశ్రుతిలో పారాయణం చేయాలి. అది ధర్మం. నేను ధర్మాన్ని పాటించను, నా ఫ్రీవిల్ చెప్పినట్టు చేస్తాను అంటే అది అపశ్రుతి అవుతుంది.

'అర్జునా, నువ్వు ధర్మాన్ని పాటించు, శరణాగతి పొందు,' అన్నాడు కృష్ణపరమాత్మ. ధర్మాన్ని పాటించాలంటే అతను తనవారిని యుద్ధంలో హతమార్చాలి. ధర్మం అంటే ఏమిటో అర్థమయ్యాక అర్జునుడు జ్ఞానం పొంది, శరణాగతి పొందుతాడు.

### 6. శరణాగతి లేదా భక్తి: శ్లోకాలు 36–46

విశ్వరూపదర్శనాన్ని కాలతత్త్వంగా అర్థం చేసుకున్నాక అర్జునుడు శరణాగతి చూపించాడు. తన ఫ్రీవిల్‌ను ధర్మాచరణతో శ్రుతి చేయాలని తెలుసుకున్నాడు. మనస్సులో భావాల్ని, చేతలతో చూపుతాము. అలాగే అర్జునుడు తన ఆనందాన్ని వేలవేల నమస్కారాలతో చూపించాడు.

**నమః పురస్తాదథ పృష్ఠతస్తే నమోఽస్తు తే సర్వత ఏవ సర్వ** – 11.40

నీకు ముందునుంచి, వెనకనుంచి నమస్కారాలు పెడుతున్నాను అన్నాడు. ఎందుకంటే జగత్తంతా ఈ ధర్మం ఉంది. భగవద్గీతపారాయణం, అమెరికాలో చేసినా కూడా ఒకే శ్రుతిలో జరుగుతుంది. అందువల్ల నీకు అన్నివైపులా నమస్కారం అంటే, నువ్వు ధర్మంగా అన్నివైపులా ఉన్నావు.

**ధర్మో విశ్వస్య జగతః ప్రతిష్ఠా। లోకే ధర్మిష్ఠం ప్రజా ఉపసర్పంతి, ధర్మేణ పాపమ్ అపనుదతి**
**ధర్మే సర్వం ప్రతిష్ఠితమ్, తస్మాత్ ధర్మం పరమం వదంతి**

ఈ ధర్మంమీద అర్జునుడు తన భక్తిని చూపాడు. ఈ విధంగా అర్జునుడు మూడు రకాల స్పందనలను చూపాడు. అవి – ఆశ్చర్యం, భయం, భక్తి. మూడు రకాల స్పందనలను చూపినా, ఒక్కటే ప్రముఖంగా ఉంది. ఆశ్చర్యం వెనక్కి వెళ్ళిపోయింది, భక్తి కూడా ముందుకు రాలేకపోతోంది. భయం మాత్రమే మిగిలింది.

అహంకారమమకారాలు మనలో రాజ్యమేలుతున్నంతసేపూ ఈ భయం మనను వదలదు. మరణం అంటే భయం; వృద్ధాప్యం అంటే భయం; విడిపోవటం అంటే భయం. అదే అహంకారమమకారాలు లేకపోతే ఇవన్నీ భగవంతుని లీలలుగా అనిపిస్తాయి. ఒకరితో బంధం ఏర్పడితే అది భగవంతుని లీల, వారితో బంధం విడిపోతే అది భగవంతుని లీల, వృద్ధాప్యం పైనబడితే అది భగవంతుని లీల.

కాని భయంతో నిండిన అర్జునుడు 'ఓ కృష్ణా, నీ విశ్వరూపదర్శనాన్ని చూపమని నేనే అడిగాను. నిజమే, కాని ఇప్పుడు నువ్వు దాన్ని ఉపసంహరించు,' అన్నాడు. జీవితంలో కూడా అంతే. ఎంతో మోజుపడి కొనుక్కున్న వస్తువును కూడా, ఇంటికి తీసుకువెళ్ళాక నచ్చకపోతే, మర్నాడు తీసుకువెళ్ళి దాన్ని తిరిగి ఇచ్చేస్తాము. కృష్ణపరమాత్మ కూడా అర్జునుని కోరికను అంగీకరించాడు.

భక్తి మూడు దశల్లో ఉంటుందని చూశాము. అది ఏకరూపభక్తి, అనేకరూపభక్తి, అరూపభక్తి. అనేకరూప భక్తినే విశ్వరూప ఈశ్వరభక్తి అంటారు. విశ్వరూప ఈశ్వరభక్తికి మన మనస్సు ఇంకా పరిపక్వత చెందకపోతే ఏమీ ఫర్వాలేదు, ఏకరూపభక్తిలో కొనసాగవచ్చు. భగవంతుణ్ణి ఆలయంలోనో, పూజాగదిలోనో కొలవవచ్చు. నెమ్మదిగా అహంకారమమకారాలు తగ్గించుకు రావాలి.

నిజానికి మన సంస్కృతి దానికి చక్కగా బాట వేసింది. మనం నూతనగృహప్రవేశం చేసేటప్పుడు దేవుని ఫోటోతో లోపలకు అడుగుపెట్టి, ఆ దేవుణ్ణి పూజామందిరంలో పెడతాము. ఎందుకు? దాని అర్థం 'ఓ దేవా, ఈ ఇల్లు నాది కాదు, నీదే. నేను ఈ ఇంటిలో ఉండటానికి నాకు అనుమతి ఇవ్వు,' ఎప్పుడైతే అలా ప్రార్థిస్తామో, అప్పుడు ఈ ఇల్లు భగవంతునిది అవుతుంది. అంటే ఇల్లు ఆలయం అవుతుంది.

తర్వాత భగవంతుణ్ణి బాహ్యంగా చూడటమే కాక, ఆంతరంలో కూడా చూడటం నేర్చుకోవాలి. అప్పుడు శరీరం కూడా భగవంతునికే చెందినది అవుతుంది.

**దేహో దేవాలయః ప్రోక్తః**

మనలో దేవుడు ఉంటే, మన శరీరం కూడా దేవాలయం అవుతుంది. అంతేకాదు, శరీరం కూడా భగవంతునికే చెందుతుంది. ఆ భావన పెంపొందించుకోగలిగితే, దేహాభిమానం తగ్గుతుంది. **తన్‌మన్‌ధన్ సబ్‌కుచ్ తేరా** అని పైపై మాటలుగా కాకుండా, మనస్ఫూర్తిగా అనగలుగుతాము.

ఒకసారి తన్‌మన్‌ధన్ సబ్‌కుచ్ తేరా అని భగవంతునికి సమర్పించేశాక, మళ్ళీ మర్నాడు అదే పాట పాడితే భగవంతుడు ఆశ్చర్యపోతాడని హాస్యం చేస్తారు పూజ్యస్వామీజీ. అంటే రోజూ పాడుతున్నామంటే అవి పైపై మాటలు. కాని అలా పాడగా పాడగా, నిజంగా ఒకరోజు ఆ భావన రావాలని దాని అర్థం.

### 7. ఉపసంహారం: శ్లోకాలు 47–55

అర్జునుడు నీ విశ్వరూపాన్ని ఉపసంహరించుకో, నీ మామూలు రూపానికి రా అంటే కృష్ణపరమాత్మ ఏకరూపానికి వచ్చేశాడు. అంటే దాని అర్థం, అర్జునునికి ఇచ్చిన దివ్యచక్షువులు తీసేసుకున్నాడు, అంటే

ఇంక జగత్తు ఈశ్వరశరీరం కాదు, జగత్తు జగత్తు మాత్రమే. లడ్డు తిరుపతి లడ్డు కాదు, మామూలు లడ్డూ మాత్రమే.

ఈ శ్లోకాల్లో కృష్ణపరమాత్మ తన బోధను ముగించాడు. 'అర్జునా, ఎవరికీ కలగని అరుదైన అవకాశం నీకు మాత్రమే కలిగింది,' అన్నాడు. ఎందుకు? అర్జునునికి ఉన్న భక్తి దానికి కారణం. ఇందాక చూసిన మూడు స్థాయిల భక్తికి ఎదగాలంటే దానికి కావాల్సింది ప్రాథమికంగా భక్తి. భగవంతుణ్ణి తనకు కావాల్సిన లక్ష్యాలు పొందే మార్గంగా కాక, భగవంతుణ్ణి లక్ష్యంగా చూడాలి. అలా భగవంతుణ్ణి లక్ష్యంగా చూడాలంటే వైరాగ్యం కలగాలి. ఐహిక లక్ష్యాలమీద వైరాగ్యం కలిగితే, అప్పుడు అది అనన్యభక్తి లేదా అవ్యభిచారిణి భక్తి అవుతుంది. దాన్ని కృష్ణపరమాత్మ ఈ శ్లోకంలో చెప్పాడు.

**భక్త్యా త్వనన్యయా శక్య అహమేవంవిధోఽర్జున ।**
**జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుం చ పరంతప ॥** – 11.54

అంతేకాదు, ఈ అద్భుతమైన శ్లోకంతో తన బోధను ముగించాడు.

**మత్కర్మకృన్మత్పరమో మద్భక్తస్సంగవర్జితః ।**
**నిర్వైరస్సర్వభూతేషు యస్స మామేతి పాండవ ॥** – 11.55

ముందు ఏకరూపభక్తితో మొదలుపెట్టినా ఫర్వాలేదు. అసలు భక్తి లేకపోయే దానికన్నా నయమే అది. ముందు సకామభక్తిగా మొదలవుతుంది. అంటే ప్రాపంచిక లక్ష్యాలు పొందటానికి భగవంతుణ్ణి మార్గంగా ఉపయోగించుకుంటారు. దానికి ఒక ఇష్టదేవతను ఎన్నుకుంటారు. నెమ్మదిగా దాన్నించి అనేకరూపభక్తికి ఎదిగి, చివరకి తననే పొందుతారు అన్నాడు కృష్ణపరమాత్మ.

ఆ విధంగా భక్తిని స్తుతించటంద్వారా కృష్ణపరమాత్మ తన బోధను ముగించాడు. విశ్వరూపదర్శనంవల్ల అనేక ఫలాలు పొందుతాము. వాటిలో కొన్ని ఫలాలను ఇప్పుడు చూద్దాము. ఈ ఫలాలు విభూతియోగానికి, విశ్వరూపదర్శనానికి కూడా వర్తిస్తాయి.

ఎ) **ద్వేషపరిహారః** – విశ్వరూపదర్శనం చేయగలిగితే, ఈ విశ్వంలో దేన్నీ ద్వేషించము. ఎందుకంటే ఈ విశ్వంలో ప్రతిదీ భగవంతునిలో ఒక భాగమే. అప్పుడు జగత్తును రెండుగా విభజించము. రాగవిషయం, ద్వేషవిషయం అనే బిరుదులు వాటికి ఆపాదించము. ప్రతిదానికీ ఒక స్థానం ఉంటుంది. దోమకు, బొద్దింకకు, చివరికి విషానికి కూడా వాటి పాత్ర వాటికి ఉంటుంది. దానివల్ల మనలో ఉండే ద్వేషభావన తగ్గుతూ వస్తుంది.

బి) **అమానిత్వమ్** – ఉన్నదంతా భగవంతుడే, జగత్తులో ఉన్న గొప్ప అంశాలన్నీ భగవంతునికే చెందుతాయని తెలిశాక, మనలో ఏదైనా గొప్పతనం ఉన్నా, దాన్ని కూడా భగవంతునికే ఆపాదిస్తాము. మనం సంగీతంలో ఆరితేరినా, గొప్పగా నాట్యం చేయగలిగినా, అమోఘమైన తెలివితేటలున్నా, అపురూపమైన సౌందర్యం ఉన్నా

అది మన గొప్పతనంగా విర్రవీగకుండా, అణుకువతో అది భగవంతుని విభూతిగా భావించగలుగుతాము. అంటే గర్వం ఉండదు.

సి) **సర్వత్ర పూజ్యత్వ భావన** – మనం చూసే ప్రతిదానిలోనూ దైవత్వము ఆపాదిస్తాము. అది మామూలు విషయంగా అనిపించదు. పొద్దున్న లేస్తూనే ఈ ప్రార్థన చేస్తాము

**సముద్ర వసనే దేవి పర్వతస్తన మండలే ।**
**విష్ణుపత్నీ నమస్తుభ్యం పాదస్పర్శక్షమస్వ మే ॥**

భూదేవిమీద పాదం మోపుతున్నందుకు క్షమాపణ కోరుకుంటాము.

అలాగే నీటిని పూజిస్తాము –

**ఆపో వా ఇదగ్ం సర్వం విశ్వభూతాన్యాపః ప్రాణా వా ఆపః పశవ ఆపః**

అందరు దేవతలకూ నమస్కారం చేస్తాము –

**నమో బ్రహ్మణే నమస్తే వాయో**

అలాగే దిక్కులన్నిటికీ నమస్కారం చేస్తాము –

**ప్రాచ్యై దిశే నమః దక్షిణాయై దిశే నమః ప్రతీచ్యై దిశే నమః ఉదీచ్యై దిశే నమః ఊర్ధ్వాయ నమః**
**అధరాయ నమః అంతరిక్షాయ నమః భూమ్యై నమః ।**

అంటే ప్రకృతిని ఆరాధిస్తాము. సర్వత్ర పూజ్యత్వభావన కలుగుతుంది.

డి) **సర్వమత సమభావః** – మనకంటూ ఒక ఇష్టదేవత ఉన్నా కూడా అందరు దేవుళ్ళనూ సమానంగా చూస్తాము. మనం విష్ణుభక్తులమైనా కూడా శివభక్తులను ఏమీ అనము.

ఇ) **చిత్త విశాలత** – మనస్సు విశాలంగా అవుతుంది. సమష్టిని చూడటం నేర్చుకోవటంవల్ల సంకుచిత భావన పోతుంది.

**ఆదిత్యం తర్పయామి, సోమం తర్పయామి, అంగారకం తర్పయామి, బుధం తర్పయామి ।** – సంధ్యావందనం

ఇవి విశ్వరూపదర్శనంయొక్క ఫలాలు.